


రూ. 3.
మే '78


చూడండి!
(కలర్)
విశ్వేశ్వరరావు
మరో
సంచలన ప్రయోగం

రీటా "నాటినుండి నేటివరకు కేశాలంకరణ"


పోటీలో పాల్గొని బహుమతులు పొందండి.




1. మొదటి బహుమతి
ఆల్విన్ స్నో క్యాప్ రిఫ్రిజిరేటరు
(200 లీటర్లు)

మొత్తం 281 బహుమతులు ఇవ్వబడును


2. రెండో బహుమతి
గోద్రేజ్ స్టీలు బీరువా స్టోర్‌వెల్
(రెండు బహుమతులు)




3. మూడో బహుమతి
గోద్రేజ్ స్టోర్‌వెల్ స్టీలు బీరువా మైనరు
(మూడు బహుమతులు)



4. నాలుగో బహుమతి
స్టీల్ టిఫెను కేరియర్
3 గిన్నెలున్నవి
(25 బహుమతులు)



5. అయిదో బహుమతి
స్టెయిన్‌లెస్ స్టీలు రౌండ్ డబ్బాలు
(50 బహుమతులు)



ప్రతీ రీటా పెట్టెలోను ఎంట్రీ కూపను కలదు.

200 బహుమతులు
6 మొదటి 200 ల
ఆల్‌కరెక్టు సమాధానములు పంపినవారికి 1 డజన్ రీటా (రెగ్యులర్ సైజు 20 ఎమ్ఎల్) బహుమతి ఇవ్వబడును




మీ ఎంట్రీలు మాకు చేరవలసిన ఆఖరు తేదీ 31-7-78.

వీటో కంపెని, బొంబాయి, కలకత్తా, మద్రాసు

Suvega

సువేగా పెట్రోల్ బంక్‌లకి మంచి వ్యాపారం అంద చేయడం లేదు. దానికి బదులు లీటర్‌కి 70 కిలోమీటర్ల పైగా మీకు ఇస్తూ!




సరికొత్తది, ప్రత్యేకంగా రూపొందించబడిన యస్ యస్ సర్వీస్ కార్బ్యురేటర్ ఇప్పుడు మిమ్మల్ని లీటర్‌కి 70 కిలో మీటర్లకు పైగా తీసుకు వెళ్లగల ఒకే ఒక మోపెడ్ గా సువేగాని తీర్చిదిద్దుతోంది. ఊహించండి! కేవలం ఒక లీటర్ 70 కిలోమీటర్లు వస్తుంది.

అంతేకాదు. మెయింటెనెన్స్ విషయంలోనూ సువేగా సులభమయినది. హార్డ్-క్రోమ్డ్ అల్యూమినియం సిలిండర్లు వున్న ఒకే ఒక మోపెడ్ కావడంతో అది నిరంతరాయంగా కదులుతుంది. వీటికి తోడు క్విక్ పిక్-అప్, దృఢంగా ప్రెస్ చేయబడిన స్టీల్ బాడీ మరియు చైన్-డ్రైవ్ శ్రేష్ఠమయిన రోడ్ గ్రిప్ మరియు వేగం అందచేస్తాయి. ఇంతకంటె ముఖ్యం, సువేగా ఇద్దర్ని తీసుకు వెళ్తుంది. సువేగా పొదుపుకి మరేదీ సాటిరాదు.

కదలండి సువేగా సంపాదించండి. లీటర్‌కి 70 కిలోమీటర్లతో. అది మంచిబేరం.

ఆశ్చర్యం లేదు, భారతదేశపు అత్యధికంగా అమ్ముడవుతోన్న మోపెడ్ సువేగా



SAA/MIL/2816/TEL

సంస్థాపకులు
కీ॥ శే॥ వి.వి. రాఘవయ్య

మేనేజింగ్ ఎడిటర్
శ్రీమతి వి. లీలావతి రాఘవయ్య

జ్యోతి

సచిత్ర మాసపత్రిక
మే 1978

సహకార సంపాదకుడు : వేమూరి సత్యనారాయణ

సంపుటి 16 విషయసూచిక సంచిక

ఇంకా మినీ కథలూ, కవితలూ, కార్టూన్లూ మరియూ కొత్తగా
ప్రారంభించిన '(వి)చిత్ర విజ్ఞానం'

నవలానుబంధం

వెలిగే దీపం—హజరా

ముఖచిత్రం: 'విచిత్ర జీవితం'లో నాగేశ్వరరావు, వాణిశ్రీ

జ్యోతి, 17-B రాజారాం కాలనీ, P B. నెం. 2650, మద్రాసు-600 024.
ఫోన్: 423123. సంవత్సర చందా (ప్రత్యేక సంచికతో) రు. 42/

పాపాయిని ఫారెక్స్‌తో పెంచుతున్నందుకు నిజంగా నేను గర్విస్తున్నాను.



"మా డాక్టర్ అన్నారు: పాపాయికి 3 నెలలు వచ్చాక కేవలం పాలు మాత్రమే ఇస్తే చాలదు. వానికి కావాలి ఫారెక్స్."

డాక్టర్లు ఫారెక్స్ ఎందుకు సిఫార్సు చేస్తారు?
అందుకు రెండు కారణాలున్నాయి. పెరిగే మీ పాపాయికి కావలసిన మొట్టమొదటి సంతులిత ఘన ఆహారాన్ని ఇది పూర్తిగా సమకూరుస్తుంది. సున్నితమైన పాపాయి జీర్ణకోశానికి ఇది సరిగ్గా సరిపోతుంది కూడా.

ఫారెక్స్ ఏ విధంగా పాపాయికి తగిన సంతులిత ఆహారం?
పాపాయి మెదడు, శరీరం పెరుగుదల కోసం ఫారెక్స్ సులభంగా జీర్ణమయ్యే ప్రొటీన్లను తగినంతగా అందిస్తుంది. పాపాయికి శక్తినిచ్చేందుకు కార్బోహైడ్రేట్లను కూడా సమకూరుస్తుంది. ఫారెక్స్‌లో పాపాయి రక్తాన్ని ఆరోగ్యంగా ఉంచేందుకు తగినంత ఐరన్ ఉంది. మరో విషయం. ఫారెక్స్‌లో మీ పాపాయికి దృఢమైన ఎముకలు, గట్టి పళ్ళు పెరిగేందుకు తోడ్పడే కాల్షియం, ఫాస్ఫరస్, విటమిన్ D_2 తగినంతగా ఉన్నాయి.

3 నెలలు వచ్చాకనే ఎందుకు?
ఈ వయస్సులో పాపాయికి నమలడం అలవాటు కావాలి. ఇప్పటినుంచే ఫారెక్స్ ఇచ్చినట్లయితే పెద్దవాడయ్యాక తినే ఆహారాన్ని సరిగ్గా నమిలి చక్కగా జీర్ణం చేసుకోగలడు.

బంగాళ దుంపలు ఉడికించి మెత్తగాచేసి ఇస్తే కాదా?
మీ పాపాయికి ఏదైనా ఘన ఆహారం పెట్టే ముందు పాపాయి జీర్ణశక్తి గురించి కూడా కొంచెం ఆలోచించండి. 3 నెలలప్పుడు పాపాయి జీర్ణకోశం ఇంకా సున్నితంగా ఉంటుంది. అందుచేత, అతడు సులభంగా జీర్ణం చేసుకోగలిగే ఘన ఆహారమే ఇవ్వాలి. పైగా, మామూలుగా ఇచ్చే ఆహారాలు సంతులితమైనవి కావు. మీ పాపాయికి అతి ముఖ్యంగా కావలసిన ఐరన్, కాల్షియం, ఫాస్ఫరస్, విటమిన్ D_2 మొదలైన వన్నీ అవి సమకూర్చలేవు. అందుకే 3 నెలలు వచ్చాక మీ పాపాయికి ఫారెక్స్ తప్పనిసరిగా ఇవ్వాలని డాక్టర్లు చెప్పడంలో ఆశ్చర్యం లేదు.

"పెద్దలు తినే ఆహారాన్ని ఎప్పటి నుంచి ఇవ్వవచ్చు"
మొదటిసారిగా పాపాయి తప్పటడుగులు వేసినప్పుడు అతడికి పళ్ళు, కూరగాయలు, పప్పు, గుడ్లు ఇవ్వండి. అయితే ఫారెక్స్‌ను మాన్పించకండి. మీ పాపాయికి మూడేళ్ళు వచ్చేవరకు, కొంచెం ఆలోచించి అతడు తినేవాటన్నిటిలో ఫారెక్స్ కలిపి పెట్టండి.



పత్యరమైన, సంపూర్ణమైన పెరుగుదలకోసం పాపాయి మొట్ట మొదటి ఘన ఆహారం.

గ్లాక్సో

లింటాస్-GF.57-1710 TL (R)

తొలిమాట

ఈ సంచికనుంచీ జ్యోతి కొత్తరూపంతో వస్తోంది. పేజీలు తిరగవేస్తే ఆ మార్పు మీకు స్పష్టంగా కనిపిస్తుంది. ఇకనుంచి నెల నెలా జ్యోతి మీకు ఇదివరకటి కంటే ఎక్కువ సంఖ్యలో కథల నందించగలుగుతుంది.

*   *   *

ఈ సంచికనుంచీ ప్రారంభమౌతున్న 'పడమట సంధ్యారాగం' సీరియల్ మల్లాది వెంకటకృష్ణమూర్తి రచన. జ్యోతి పాఠకులకు ఈ రచయిత సుపరిచితులు. జ్యోతిలో ఈ రచయితవి కథలేగాక, జ్యోతి సప్లిమెంట్‌లో 'మేఘమాల' (సీరియల్)గా నవల, జ్యోతిలో 'మూడు రాత్రులు' (మినీ సీరియల్)గా చిన్న నవల మరియు జ్యోతి నవలల పోటీలో మూడవ బహుమతి పొందిన నవల 'ఒకటి ఒంటరి అంకె' ప్రచురించబడ్డాయి. పడమట సంధ్యారాగం సీరియల్‌గా పాఠకుల మన్ననలను పొందగలదని ఆశిస్తున్నాము.

*   *   *

ఏప్రిల్ 1977 - మార్చి 1978 మధ్య జ్యోతి నిర్వహించిన రచయితలకు ప్రత్యేక పారితోషికాల పథకంలో 24 కథలలోనూ మూడు ఎన్నికయిన కథలకు బహుమతులు ప్రకటించి ఉన్నాము. ఆ బహుమతులు పొందిన కథల వివరాలు క్రింద ఇస్తున్నాము.

ప్రథమ బహుమతి: రు. 500/-

సగటు తండ్రి—రచన దేవరకొండ మురళి

ద్వితీయ బహుమతి రు. 250/-

చీకటి కిరణాలు—రచన. నాగభైరవ ఆంజనేయులు

తృతీయ బహుమతి: రు. 116/-

చేరువ—రచన: వి. రాజారామమోహనరావు

ఈ బహుమతుల ఎన్నిక జరపడంలో జరిగిన ఆలస్యం కారణంగా ఈ బహుమతులు పొందిన రచయితల వివరాలు ఈ సంచికలో ఇవ్వలేకపోతున్నాము. వచ్చే సంచికలో ఆ వివరాలు ప్రకటిస్తాము.

ఈ సంచికనుంచీ కొత్తరకం శీర్షిక (వి)చిత్ర విజ్ఞానం ప్రారంభమయింది.



బ్రాంచీలు హైదరాబాద్, సికింద్రాబాద్, ఏలూరు, కాకినాడ, గుడివాడ, విజయవాడ

ఉత్తరాలు

ఏప్రిల్ నెల "జ్యోతి" చదివాము. అందులో సీరియల్ "మనిషికి ఏం కావాలి" ముగింపు మాకు నచ్చలేదు. విశ్వం, శ్రీకాంత్, సునీతి, ముగ్గురు వచ్చిన, ముగ్గురు బ్రతికిన బాగుండేది. అలా కాకుండా విశ్వాన్ని, శ్రీకాంత్‌ని మాత్రం చంపడం బాగాలేదు. సీరియల్ మొదట ఎంతో ఆశక్తి కనపరచినారు రచయిత కొమ్మూరి వేణుగోపాలరావు. చివర మాత్రం అందరు రచయిత(తు)లు మాదిరిగానే చేశారు. "భ్రమ, సుధ నిద్రలేచింది" కథలు బాగున్నాయి. "సుధ నిద్రలేచింది" చాలా బాగుంది. తృప్తి లేనివారు ఎన్నివున్నా సుఖపడలేరు. ఇంకొకరి సుఖానికి సహాయపడలేరు. చిన్న సంఘటన ఆధారంగా కథ నడిపిన తీరు బాగుంది. "సుధ నిద్ర లేచింది" కథ వ్రాసిన కె. మాదురిగారికి అభినందనలు.

—యాడికి ప్రేమలత, యాడికి లావణ్యలత, అనసూయాదేవి, రాజేశ్వరి, పెండేకల్ R. S.

"వచ్చీరాని వయసు" ఏప్రియల్ జ్యోతిలో చదివాను. చాలా నేచురల్‌గా ఉంది. రచయిత్రికి నా ధన్యవాదాలు. మా చుట్టాలలోనే ఇద్దరు "కృష్ణ" లున్నారు. వారెప్పుడూ మారటంలేదు. మంచీ, చెడూ తెలిసీ తెలియని వయస్సులో "ఏదో" చెయ్యడం తప్పుకాదు—వయస్సు—అనుభవం ఉండీకూడా "కృష్ణ"లాగే బ్రతుకుతూన్నవాళ్ళు, వాళ్ళని చూస్తూ భరిస్తూన్నవాళ్ళూ ప్రపంచం ఉన్నన్నాళ్ళూ ఉండకుండా ఉండరేమో ననిపిస్తూంది. పగలు రాత్రిలా రచయిత ఊహించి రాశాదేమో ననుకోడానికి వీల్లేదు. జరుగుతూంది వ్రాశారు. శ్రీరామచంద్రం గార్కి మరోసారి ధన్యవాదాలు.

కామర్సు మల్లిఖార్జునరావు, మచిలీపట్నం-

ఏప్రిల్ నెల "జ్యోతి" విప్పగానే "మయసభ"లో చొరబడ్డాను. మనదేశపు మూగో- ప్రథాసంగా నా రక్తం వేడెక్కింది. అది లైబ్రరి అని తెల్సి చల్లబడింది. అప్పుడు నా కనిపించింది మన శరీరాల్లో ప్రవహించింది నీరుకాక రక్తమా' మన గ్రామాల బాగు ఈ యుగాంతంలో కాదు. వచ్చేయుగానికైతే వారైనా సుఖపడనిద్దాము. రామసంజీవిగారికి నా నమస్కారములు.

నెలనెల రసవద్గీత చాలా రసవంతంగా ఆలపిస్తున్నారు. రామకృష్ణారావుగారికి అభినందనలు.

—యం. రమేశ్‌రావు, మెట్టుపల్లి.


ఏప్రిల్ సంచిక "జ్యోతి" చదివాను. "మనిషికి ఏం కావాలి?" చక్కటి సీరియల్. ఏకాకిగా నిల్చిన మనిషి తనలోటివారి దుఃఖంలోనూ బాధలోనూ పాలుపంచుకోటంకంటే కావల్సిందేముంది? కొమ్మూరి వేణుగోపాలరావుగారు చక్కటి సీరియల్ అందించారు. ఈ నెల నవల "వచ్చీరాని వయసు" అది నవల కాదు. నేడు మనదేశంలోని ప్రతీ తల్లితండ్రుల సమస్య పండీ పండని కసురుగాయల భవిష్యత్తు యెలా నాశనమవుతోందీ వివరించారు. కృష్ణలాంటి బాలురు, బాలికలుకూడా ప్రతీ యింట్లో ఒకరూ, యిద్దరూ వున్నారంటే అబద్ధం కాదు.

—కె. సత్యవతి, సికింద్రాబాద్.

గౌరవనీయులైన శ్రీరామచంద్రంగారికి మీ ఎడ్రసు తెలియని కారణంగా ఈ ఉత్తరాన్ని పత్రికాముఖంగా మీకు వ్రాస్తున్నాను. మీరు వ్రాసిన ఏప్రిల్ నెల నవలానుబంధానికి "వచ్చీరాని వయసు" కథ చదివి ఈ ఉత్తరం వ్రాయకుండా ఉండలేకపోతున్నాను. కారణం మీ కథ

KayGeeLene

FABRICS



Agents :
ANIL CORPORATION
VIJAYAWADA-1

Dealers :

1. SAROJA ENTERPRISES
   80A, VASHTRALATHA
   VIJAYAWADA-1

2. JAGADEESWARI SILKS
   191, VASHTRALATHA
   VIJAYAWADA-1

BANKIMCHANDRA & CO.

BOMBAY-400 002.

SAMATA

నా హృదయాన్ని కదిలించి ఏదో తెలియని అనిర్వచనీయమైన బాధను కల్గించింది. నిజంగా ఆ కథ చదువుతున్నంతసేపూ యశోదమ్మపడే బాధకు నా హృదయం కదిలి కన్నీరయి ప్రవహించింది. నిజంగా ఇదంతా వ్రాస్తుంటే మీకు హాస్యాస్పదంగా తోచవచ్చు గాని ఇది నా హృదయంలోంచి వచ్చిన భావన అంటే మీరు నమ్ముతారా? మీ కథ కదిలించినంతగా ఇంతవరకునన్నే కథ కదిలించలేదంటే నమ్మండి. అందువలనే ఆ బాధను ఇక నిగ్రహించుకోలేక తొలిసారిగా (నా జీవితంలోనే) ఈ ఉత్తరాన్ని వ్రాస్తున్నాను. మీ కథ ఇంతగా కదిలించటానికి కారణము మీ కథలోని కృష్ణ పాత్రధారి మా కుటుంబంలోనూ ఉన్నాడు. కృష్ణకులాగానే అతను జీవితపు చరమాంకములో నుండి మమ్మల్నందర్ని యింకా శారీరకంగాను మానసికంగానూ బాధిస్తున్నాడు. కథ చివర్లో మీరు వ్రాసిన మాటలు మరపురానివి. కథాంతములో కృష్ణ మాటలు ఎంతో దుఃఖాన్ని కల్గించాయి. ఏమైనా ఇంత మంచి కథను అందించిన మీకు నా హృదయపూర్వక అభినందనలు. నమస్తే.

—యస్. జయశ్రీ, సికింద్రాబాద్-25

జ్యోతి ఏప్రిల్ నెల జయ (ముఖ)చిత్రం ముచ్చటగా వుంది. రసవద్గీత, మయసభ బాగున్నాయ్. కథలు చాలా బాగున్నాయ్. ఎన్.ఆర్. నందిగారి 'తారాపథం', అరిగే రామారావుగారి "మాకూ ప్రేమలున్నాయి" నా కెంతగానో నచ్చాయి. రచయితలకు నా ధన్యవాదాలు. నవలానుబంధంలో ఇచ్ఛాపురపు రామచంద్రం గారి రచన "వచ్చీరాని వయసు" ఇంట్రెస్టింగ్‌గా వుంది. రచనశైలి ఆకర్షణీయము.

—యం. సుధాకర్‌గుప్త.
తిరుపతి-517 501.

ఏప్రిల్ సంచిక జ్యోతి నవలానుబంధంలో ప్రచురింపబడిన "వచ్చీరాని వయసు" నవల చదివాక ఈ ఉత్తరము వ్రాయకుండా ఉండలేకపోతున్నాను. అమోఘము. అవును ఆ వయసులో వేడివేడి కస్రాళ్ళు చెడిపోవటానికి ఆ మాత్రం ఆకర్షణలు చాలవు. నవల చదువుతున్నంతసేపు అందులో పాత్రలు మా కళ్ళ ముందు కదులుతున్నట్లు మేమే అందులో పాత్రలమైనట్లు అనుభూతి కలిగిందంటే అతిశయోక్తిగాదు. "కృష్ణ"లాంటివాళ్ళు సాధారణంగా ప్రతి యింటిలోనూ ఉంటారు. ఆ నవల చదువుతూంటే బుజాలు తడుముకోవలసి వస్తుంది. ప్రచురించిన మీకు రచయితకు నా అభినందనలు.

—యం. శ్రీనివాసరావు, అమలాపురం.

ప్రత్యేకించి మహిళాజ్యోతిలో ప్రచురించిన శ్రీ శైలకుమార్‌గారి "ఎవరు" గేయం చదివి నిశ్చేష్టున్నై ఈ ఉత్తరం వ్రాస్తున్నాను. స్త్రీల జీవితాలలోని అగాధ విషాదాలకు అద్దం పట్టిన అపురూపగీతం ఇది. ఇంత మంచిగేయం ప్రచురించినందుకు మీకు నా ధన్యవాదాలు.

—కె. రెడ్డెప్పచెట్టి, నెరబాయిలు.

శ్రీశ్రీ పదబంధ ప్రహేళిక సాహితీ రంగంలో ఏనెల కానెల "జరిగిన కథ" లేని సరికొత్త సీరియల్. మిగతా పజిల్స్‌కు, శ్రీశ్రీ చైపుకు తేడా గమనించాను. అర్థంకాని రీతిలో ఇచ్చి, మెదడుకు మేత కల్గించడమే "పజిల్"కి నిర్వచనం. అందులోను శ్రీశ్రీ నిర్వహించేది కదా. ఏమైన Sri Sri is Scintillant అని ఖచ్చితంగా చెప్పవచ్చు.

ఇంతటి శ్రద్ధతో నిర్వహించే(ఈ ప్రహేళిక) శ్రీశ్రీగారికి, జ్యోతి పత్రికకు మా హార్దికాభినందనలు. ఈ శీర్షికను మాత్రం దయచేసి ఆపివేయవద్దని మనవి.

—కెబియన్ శర్మ, హైదరాబాదు-28.

"మనిషికి ఏం కావాలి" సీరియల్‌లోని ప్రతి 'కారెక్టర్' ఎంతో ఉన్నతంగా కనిపించింది. మనిషికి కావలసినవన్నీ వున్నా ముఖ్యంగా కావలసింది "తృప్తి" అని ప్రతి ఒక్కరికీ తెలుసు. కాని అది యెలా లభిస్తుందీ అనీ "తోడు" లేనిదే తృప్తి లేదు అనీ కొమ్మూరి వేణుగోపాలరావుగారు పాత్రలద్వారా చెప్పించిన తీరు నాకు యెంతో నచ్చింది. ఆ జవాబు నన్నెంతో కదిలించింది.

కాని ముగింపు మాత్రం అస్సలు నచ్చలేదు ఏదో ఈమధ్య తుఫాన్ వచ్చింది కదాని అంత మంచి సీరియల్ అలా తుఫాన్‌లో ఇరుక్కుపోవడం నాకేం నచ్చలేదు. ఆయన గారికంత 'సైక్లోన్' గురించి వ్రాయాలని వుంటే ఇంకేవో పాత్రలద్వారా చెప్పివుండవలసింది. అసలు సీరియల్ బాగుందా లేదా అంటే బాగుంది అంటే మేము కూడ తుఫాన్‌లో చిక్కుకున్నవాళ్ళ 'ఫీల్' అయినట్లు 'ఫీల్' అవాల్సి వస్తుంది, రచయితగారు విమర్శను సహృదయంతో మన్నిస్తారని తలుస్తూ

—ప్రమీలా సోమలింగారెడ్డి సి.
—పోచంపాడు ప్రాజెక్ట్.

ఈనెల (ఏప్రిల్) జ్యోతి చదివాం. అందులో 'వీనాదేవి'గారి సీరియల్ "భూమి గుండ్రంగా వుంది" చదివాక కడుపుబ్బినట్లు అరగంటసేపు నవ్వించి అరగ్లాసుడు నీళ్ళు త్రాగించింది. ప్రతి వాక్యం హాస్యం పుట్టించి నవ్వించేలా ఉంది. ఉదా "ఆడ, ఇరవైఏళ్ళు, 200 పౌన్ల బరువు, 5 అడుగుల పొడవు, కసరత్తుచేసినట్టు కండలు గల శరీరంతో వున్న ఖడ్గమృగంలా ఉంది. మొగ, ముప్పైఏళ్ళు, మూరెడు లోతు చొప్పి దవడలు, 100 పౌన్ల బరువు, 5 అడుగుల పొడవుగల టి. బి. వచ్చిన గుంటనక్కలా వున్నాడు." ఇంత చక్కటి సీరియల్‌ని అందిస్తున్న రచయిత్రిగారికీ, ప్రచురిస్తున్న మీకు మా హృదయపూర్వక అభినందనలు.

కథల్లో ఎన్. ఆర్. నందిగారి "తారాపథం" హాస్యపుజల్లుని కురిపించింది. మిగతా కథలు పర్వాలేదు. అవసరాల రామకృష్ణారావుగారు అందిస్తున్న "రసవద్గీతలోని—'మా జాతికి తొలి ప్రార్థన' 'మూత్ర దేవోభవ!' చదివి నవ్వకుండా ఉండలేకపోయేం.

—సి. వి. రామకృష్ణారెడ్డి, డాక్టర్ శకుంతలాదేవి. హరదోయి (యు.పి.).

గత సంచికలోని ఉత్తరాల శీర్షికలో శ్రీ వల్లూరు సాంబశివప్రసాద్ "పెళ్ళిచేసి చూడు"పై చేసినవిమర్శ చాలా అసమంజసంగా ఉంది "జ్యోతి స్టాండర్డు"కు తగినదిగా లేదు. వివాహ వ్యవస్థ తొలినుండి ఆచారంగా వస్తున్న ఈ పెళ్ళి తంతునుగూర్చి ఈనాడు మెదడు చించుకొని (సారీ' కాగితాలు చించేసి) రచయిత్రి ఏం చెప్పాలనుకొన్నారు? నవల చదివే వయసున్న ప్రతి పాఠకుడిగా ఇదేం క్రొత్తకాదు" అంటూ విమర్శించారా పాఠకులు.

విమర్శ వ్యంగ్యంగా ఉండకూడదు. ప్రతి విమర్శలో వ్యంగ్యం ఉండటంలో తప్పులేదు. ఇంటికీ మనం రోజూ చూస్తున్న ప్రకృతి దృశ్యాలు మనకివి తెలియవనేనా ఎందరో చిత్రకారులు చిత్రాలుగా చిత్రించేది. అవి బాగున్నాయనీ, అద్భుతంగా చిత్రీకరించారనీ మెచ్చుకొనేది ప్రకృతి దృశ్యాలు చూడనివాళ్ళు' కాకపోతే మన సాహిత్యంలో వస్తున్న కథలూ, సంఘటనలూ అన్నీ కల్పితాలేనా? జరుగుతున్నవి కావా?—ఎలా రాశారన్నది ముఖ్యం! పాఠకుల నాకట్టుకోగలిగారా అన్నది ప్రధానం! అంతేకాని మీకు తెలిసిన విషయాన్నే రాశారనడం సబబుకాదు. 'వసుంధర' పెళ్ళిచేసి చూడు"లో పెళ్ళితంతు వ్యవహారాన్ని కథగా మలచడంలో కృతకృత్యులు కాలేకపోయారని శ్రీ సాంబశివప్రసాద్ భావిస్తే అలా విమర్శించవచ్చు. కాని ఇలా కాదు. ఆయన వ్యంగ్యంగా రాశారు పాపం "పెళ్ళాడిచూడు" నవల మీరు త్వరలో అందిస్తారని ఎదురు చూస్తా(స్తాం) అని. నేను, వ్యంగ్యరహితంగా రాస్తున్నాను "పెళ్ళయ్యాక చూడు', "పెళ్ళి చేసి చూడు" రచనలద్వారా అద్భుతానుభూతి నందించిన వసుంధర కలంనుంచి "పెళ్ళాడి చూడు" రావాలనే, జ్యోతి ప్రచురించాలనే కోరుకొంటున్నాను. అవును ఆ రచనలలో హిపోక్రసీ, గాలిలో సాలో, కలల్లో విహారం, అసహజత్వం లేనేలేవు. "దోస్ ఆర్ ప్లెజెంట్ రిఫ్లెక్షన్స్ ఆఫ్ ఎ పార్ట్ ఆఫ్ అవర్ లైఫ్స్" అటువంటి రచన లందించి జ్యోతి ఏనాడున్న స్టాండర్డును పెంచుకొంది. శ్రీ సాంబశివప్రసాద్ నా ఉత్తరాన్ని అపార్థం చేసుకుండా అర్థంచేసుకొంటారని ఆశిస్తాను.

—కె. వి. రామారావు, విశాఖ-1.

ఉచితంగా మీ కో మాసపత్రిక

సచిత్ర మాస పత్రిక

తెలుగు పాఠకులకు అందిస్తున్న

ఒక మాసపత్రికకు సంవత్సర చందా కడితే ఆ పత్రిక మీకు అందటం సాధారణం! అయితే ఒక మాసపత్రికకు కట్టే చందాతోనే ఆ పత్రికతోపాటు సంవత్సరం పొడవూ మరో మాసపత్రిక కూడా లభించడం అసాధారణం. ఆ అసాధారణమైనదీ, మీకు లాభసాటి అయినదీ ఈ అవకాశం.

మీరేం చెయ్యాలి ?

చాలా సులభం! జ్యోతి మాసపత్రిక సం॥ సందా ప్రత్యేక సంచికతో సహా రూ. 42/-దానితో మరో మాసపత్రిక ప్రమోద (ఇది మీ పిల్లలకోసం). ప్రమోద పిల్లల మాసపత్రిక (విడిప్రతి వెల: రు 1-25) మీకు ఉచితంగా లభించేందుకు కేవలం రెండు రూపాయలు ఎక్కువగా (పోస్ట్ ఖర్చులకోసం) అంటే రూ. 44/- మీరు చెల్లిస్తే సంవత్సరంపాటు 12 సంచికలు జ్యోతి మాసపత్రికా, 12 సంచికలు ప్రమోద పిల్లల మాసపత్రికా, జ్యోతి దీపావళి ప్రత్యేకసంచికా మీకు అందుతాయి. చంధాలు మనియార్డరుద్వారాగాని, డ్రాఫ్టుద్వారాగాని చెల్లించవచ్చును. చెక్కులు అంగీకరించబడవు. క్రింద ఇవ్వబడిన ఫారంపైగానీ, తెల్లకాగితంపై దాని నమూనాపైగానీ వివరాలు తెలుపుతూ రాయండి.

మే, 31, 1978 లోపు మాకుచేరిన చందాలవరకే ఈ పథకం అమలౌతుంది

చందాలు ఈ చిరునామాకు పంపండి :

జ్యోతి, సచిత్ర మాసపత్రిక, 17B రాజారాం కాలనీ, మద్రాసు - 600 024

ఒక్క సంవత్సర చందాతో

ముందుగా చందాకడితే బహుమతి

ప్రమోద
పిల్లల మాస పత్రిక

అపూర్వ అవకాశం

లాభం కొనసాగుతుంది :

ఈ పథకం మేం కొనసాగించినంతకాలమూ ఇప్పుడుచేరిన, చందాదారులు తమ చందాలను ఇదే పద్ధతిన కొనసాగించుకొని లాభం పొందవచ్చు.

ఆలోచించండి! చిరకాలం లాభపడే అవకాశం ఇది!

* బహుమతిపొందే అవకాశంకూడా ఉంది : ఈ పథకంలో మునుముందుగా చందాదారులయ్యేవారికే ఈ అవకాశం. మాకు ముందుగా చేరిన నూరు చందాలలో లాటరీవేసి అదృష్టవంతులైన ఇద్దరు చందాదారులకు ఒక్కొక్కరికీ రూ. 50/- విలువైన బహుమతి ఇవ్వబడుతుంది.

జ్యోతి, ప్రమోద ప్రత్యేక చందా పథకంలో మీ నిబంధనలకు లోబడి, చందాదారుడిగా చేరేందుకు ఇష్టపడుతున్నాను.

పేరు

చిరునామా

పిన్ కోడ్


సంతకం

Cancelled

చందాపంపిన విధానం

[డ్రాఫ్టు నెంబరు లేదా మనియార్డరు రసీదు నెం. తెలుపవలెను.]

రెండు పత్రికలు పొందండి!



మయసభ

"The world is too much with us"—అన్నాడు ఆంగ్లకవి వర్డ్స్‌వర్త్ అంటే కోరికలు, ఆశలు, ఆశయాలు, సంపదలూ వగైరా ఊరవంతా చాల అతిగా పూసుకుంటున్నామూ అని అర్థం.

ఓ సూర్యోదయం చూడ్డానికిగాని, ఓ నది పక్కన కూర్చోవడానికిగాని, నక్షత్రాల సొగసులు ఆనందించడానికి మనకు కాలం లేకుండా పోతోంది అని కూడా ఆయన భావం. (అందుకనే గుండెపోటులు, సెరిబ్రల్ హెమొరేజ్‌లు ఎక్కువవుతున్నాయన్నది వేరే విషయం)

జీవితం అనేసరికి ఇష్టమున్నా లేకపోయినా కొంత బురదలో కాలు వేయకతప్పదు. కాని బొత్తిగా అదుసే అమరలోకమని, బురదే బృందావనమని అక్కడే వుండిపోతే-మనకూ పందులకూ తేడా వుండదు కద!

కోరికలుండడం, వాటిని సాధించడం వేరు; కోరికలకు బానిసలవడం వేరూను!

ఆశయ సాధనకు కృషిచేయడం వేరు. ఆశయాల పేరిట ఎండమావుల వెంబడి పరుగెత్తడం వేరూను.

డబ్బు ఆర్జించడం, డబ్బు ఇవ్వగలిగిన సుఖాలను సంతోషంగా సంతృప్తిగా అనుభవించడం వేరు; డబ్బే ప్రాణంగా, ఊపిరిగా జీవచ్ఛవాలుగా పూరేగడం వేరూను.

కాని ఈ డబ్బు పల్లకిని మోసే బోయీలు మనదేశంలో కోట్లకొలదీ పెరిగిపోతున్నారు. ఈ డబ్బు దాస్యానికి కులాలుగాని, మతాలుగాని, రాజకీయాలుగాని so-called ప్రజలుగాని అడ్డు రావడంలేదు. ఏది చేపట్టినా 'ఎంత డబ్బు నాకు వస్తుంది?" అనేది ultimate కొలత అయిపోయింది. ఈ రోగానికి ఆయుర్వేదంలోనో అల్లోపతిలోనో చికిత్స జరుగుతుందో, లేక శస్త్రచికిత్సతో రోగం కుదురుతుందో కాలం చెప్పాలి.

ప్రస్తుతానికి మాత్రం రాజకీయాలు, విద్య, కళలు, న్యాయం, పరిపాలన, ప్రజాసౌకర్యాలు, వైద్యం- ఏ రంగం తీసుకున్నా డబ్బే ఆది, డబ్బే మధ్యం, డబ్బే అంతా! అలాంటి కమ్మెర్లు కమ్మిన వాతావరణంలో డబ్బు ప్రాణంగా బ్రతికి బట్టకట్టే వ్యాపార రంగంలో విలయతాండవం చేయడం సహజమే కదా... ఆ రంగానికి నలుపు ప్రధాన లక్షణం అవడంలోనూ ఆశ్చర్యం లేదు.

అయితే ఈ వ్యాపారం అన్నది పుస్తకాల ప్రచురణలో, ముఖ్యంగా సృజనాత్మక సాహిత్య ప్రచురణ విషయంలో వేస్తున్న వెర్రితలలు ఇన్నీఅన్నీ కావు.

ఒక నవలకాని కథాసంకలనంకాని వ్రాయను పొంది దానికి ఒక చివర రచయిత అనే ఆ వెర్రివాగులవాడుంటాడు; ఈ చివర వుందా

ఏ. రామసంజీవి




KESAVARDHINI
KESAVARDHINI PRODUCTS
MADRAS

యాభై పేజీల ఆ పుస్తకాన్ని ఏ ఆరు రూపా యలో పెట్టి కొనే మీరుంటారు. ఈ రెండు చివరల మధ్య బోలెడంత దగుల్బాజీతనం ధగ ధ్ధగాయమానంగా వెలిగిపోతూ మేడలు కట్టు కుంటూ సాహిత్యాన్ని వుద్ధరిస్తున్నట్టు పోజులు పెడుతూంది. ఇది రచయితలందరికి తెలుసు; కాని వాళ్ళేమీ చేయలేరు. మీకు, పాఠకులకు తెలియదు, తెలిస్తే ఏదన్నా చేయవచ్చు; చేయకపోతే చివరికి సహజమే నష్టపోతుంది!

నూటయాభై పేజీల పుస్తకానికి మీరు చెల్లించే ఆరు రూపాయలలో అర్ధంటే అర్ధ రూపాయి రచయితకు చేరితే అది చాల గొప్పవిషయం! ఇంక ఖర్చు అంటారా! వంద యాభై పేజీల పుస్తకాన్ని శుభ్రమైన కాగితం మీద రెండు రంగుల అట్టతో రూపాయన్నరకు ముద్రించవచ్చును.

అంటే ఏమిటన్నమాట?

రూపాయిన్నర అసలు ఖర్చు, అర్ధ రూపాయి రచయితకు ప్రతిఫలం, మరి కష్టించి అచ్చేసి అమ్మినవాడికి రూపాయి - మొత్తం మూడు రూపాయలకు ఆ పుస్తకాన్ని అమ్మ వచ్చును. కాని ఆ పుస్తకం ఆరు రూపాయలకు అమ్ముతున్నారు. ఆరు రూపాయలు పెట్టి ఒక పుస్తకం కొనేవాళ్ళు తెలుగుదేశంలో చాల మంది లేరు. అందుకే పుస్తకం అమ్ముడుపోదు, అయిదేళ్ళ తర్వాత అచ్చేసిన వెయ్యింట అయిదువందల ప్రతులు వుండిపోతున్నాయి అని ఆ వేసినవాడి గోల. అమ్ముడుపోలేదు గనుక ఆ రచయిత కాళిదాసంతవాడయినా వాడి రచనలను ఆ ప్రచురణకర్త పట్టకారుతోనయినా ముట్టుకోడు చివరకు ఉత్తమ రచనలు చీక టిలో, ఉత్తమ రచయితలు నిరాశా నిస్పృహ లలో వుండిపోతారు; ప్రచురణకర్తకేమీ లోటు వుండదు; పెట్టిన పెట్టుబడిమీద లాభం ఎలా తెచ్చుకోవాలో తెలియనివాడు ఆ వ్యాపారంలో వుండడు! ఆత్మరక్షణ తెలిసినవాడు వ్యాపారి? తెలియనివాడు రచయిత!"

ఈ విషవలయంలో పెద్ద పాత్ర గ్రంథా లయాలు అనబడేవాటికి చెందుతుంది; రాష్ట్ర మంతా విస్తరించిన ఈ పుస్తకాల మార్కెటు యొక్క నాడీ కేంద్రం భాగ్యనగరంలో వుంటుంది. అక్కడ మరి ప్రభుత్వంవారు ఏటా లక్షలు లక్షలు ఖర్చుపెట్టి కొనే జాబితాలోకి పుస్తకాలను ఏ ఏ విలువను బట్టి నిర్ణయిస్తారో మనకు తెలియదు; అకాడమీల బహుమతుల నిర్ణయాలలాగే ఈ భారీ ఎత్తు పుస్తకాల కొను గోళ్ళూ పరమ రహస్యాలు; పామరునికి అవి అనూహ్యాలు మనకు తెలిసిందల్లా అక్కడ తమ పుస్తకాలు జాబితాలోకి ఎక్కడానికి తాము ఎంత "జమ" వదాలో ప్రచురణకర్తలు చెప్పగా విన్న 'కథలు'!

ఆ శ్రమ వల్లనే మూడు రూపాయల పుస్తకం ఆరు రూపాయలు అవుతుందని ప్రచు రణకర్త వాదన.

ఏది ఏమయితేనేమి తిరుపతిలో వేంకటేశ్వ రుడి దర్శనానికి వలె, ఏదన్నా చిన్న విషయా నికి ప్రభుత్వంవారి అనుమతికివలె ఈ పుస్త కాల విషయాన్ని బాగా క్లిష్టతరంచేసివుంచారు, అటు రచయితనూ ఇటు పుస్తకం కొనేవాడినీ దోచుకుంటున్నారు; అన్నిరకాల దోపిడి గురించి కుప్పలు తెప్పలుగా కథలు, నవలలు, నాటకాలు వర్ణించే "సామాజిక అవగాహన","స్పృహ", "చైతన్యం" గల తెలుగు రచయితలు తమమీద జరిగే ఈ దోపిడీ గురించి ఏమీ రాయలేదు, ఏమీ కలిసి కట్టుగా చేయడంలేదు - అంటే వారు ఈ రకం దోపిడీకి ఎంత అలవాటుపడి పోయారో తెలిసివస్తుంది.

ఈ పద్మవ్యూహాన్ని ఛేదించడం ఎలా అంటే?

ప్రభుత్వంవారు ఏఏ పుస్తకాలు కొనాలి అని నిర్దేశిస్తారో ఆ నిర్ణాయక సంఘంలో సగా నికి సగం రచయితలుండాలి! ఆ సంఘం రెండేళ్ళకోసారి మారాలి. ఆ సంఘంకూడా ఎప్పటికప్పుడు మార్కెటు రీతినిబట్టి ఒక రూపాయకి ఎన్ని అచ్చుపేజీలుంటుందో ఒక ప్రమాణం నిర్ణయించాలి; దాని ప్రకారమే ధర చెల్లించి కొనాలి, అర్ధంపర్ధంలేని డిస్కౌంట్లుకు గాని,దాని "నానార్థాల"కు గాని పోరాదు; ఇలా

చేస్తే పుస్తకాల ధర నిర్ణయించడంలో ప్రస్తుతం వున్న అతిభయంకరమైన, అసహజమైన వ్యత్యాసం, Distortion పోతుంది.

ఆ సంఘంవారు చేయాల్సిన రెండవ పని-తాము ఏటా కొనే పుస్తకాలలో, కొనమని సిఫారసు చేసేవాటిలో నూటికి యాభై పుస్తకాలు రచయితలు స్వయంగా ప్రచురించినవయి వుండాలి అని నిర్ణయించాలి.

మూడవ పని! సాహిత్య అకాడమీల బహుమతి పొందిన రచయితల పుస్తకాలు తప్పని సరిగా కొని తీరాలి అని నిర్ణయించాలి. అంతకు కాస్త ముందుగా సాహిత్య అకాడమీలను ఏక పక్ష నియంతృత్వంనుండి తప్పించాలి. ఎవరన్నా సరే అకాడమీ అధ్యక్షులుగా గాని కార్యదర్శిగా గాని మూడేళ్ళకన్న ఎక్కువ కొనసాగరాదు. అని చట్టం చేయాలి! ఇప్పుడున్న దారుణ పరిస్థితి ఏమిటంటే తప్పుగానీ, రైటుగానీ ఆకుర్చీలను ఎవరయిన ఆక్రమిస్తే —ఇక ఆకుర్చీఅన్నా పోవాలి, లేదా వాళ్ళన్నా పోవాలి. అందాక వారిది "జన్మ జన్మల బంధం'గా వుంటూంది, జార్జి ఫెర్నాండెజ్ గారు కోకాకోలా డేరా నెత్తించ గలిగారుగాని మన రాష్ట్ర ప్రభుత్వం ఈ సాహిత్యపు గుత్త స్వామ్యాన్ని మాపలేకున్నారు! అంచేత ముందర అకాడమీకి మరమ్మత్తులుచేసి, అటు పిమ్మట దానిచేత ఆధునిక సాహిత్యానికి చేయించాల్సిన సాయం చేయించాలి' (ఈ విషయంలో మీకు తెలిసిన శాసన సభ్యుడు గాని మంత్రిగాని ఏమి చేయగలడు కనుక్కోండి! రచయితలారా మీ మధ్యకు మంత్రి గారిని తీసుకొచ్చి మాలలువేసి కూర్చొ పెట్టుకుంటారు కదా—అదీ అదను! అప్పుడు అడగండి)

ఇటు ప్రభుత్వ పరంగా పుస్తకాల కొనుగోళ్ళలో మార్పులు తీసుకురావాలి, అటు పాఠకులు, ఉత్తమ అభిరుచిగల పాఠకులు, రాష్ట్రంలోను బయటావున్న తెలుగు పుస్తకాభిమానులూ కలిసి ఒక **Book Lovers Club** లాటిది ఏర్పాటు చేయాలి. వారు మంచి సాహిత్యాన్ని ఎన్నుకోవాలి, టోకుగా కొనాలి, ప్రోత్సహించాలి, కొన్నాళ్ళకు విదేశాలలో వలె—"ఈనెల **Book Club**వారే పుస్తకం ఎన్నిక చేశారు"—అన్నది సాహిత్య ప్రమాణంగా రూపొందాలి. అప్పుడు పుస్తకాల ప్రచురణలో పదివేలు పెట్టుబడి పెట్టినవాడి ఇష్టాయిష్టాలు సాహిత్య ప్రమాణాలుగా చలా మణి అయే వైపరీత్యం తొలగిపోతుంది.

ఇంక రచయితలు. దేశమంతా కలిపి వాళ్ళు ఒక నలభైమంది (కావాలంటే సాహిత్యాభిమానులతో కలిపి) ఒక సంఘంగా ఏర్పడాలి. ఒక్కొక్క సభ్యుడు పాతికమంది పుస్తకాభిమానులను (వ్యక్తిగతంగా తెలిసినవారిని) సభ్యులుగా చేర్పించాలి. వారినుండి వార్షిక చందా పది రూపాయలు వసూలుచేసి కేంద్ర సంఘానికి పంపాలి. అంటే ఇదంతా నిర్ణీత కాలంలో చేస్తే ఏ మూడు నెలలలోనో $10 \times 25 \times 40 = 10,000$ రూ. వసూలవుతుంది, ఈ మొత్తంలో 7,500 తో దర్జాగా 150, 160 పేజీల పుస్తకాలు నాలుగు అచ్చువేయించాలి ఆ సంఘం ప్రతీ రచయితకు 500 రూ. కన్న తక్కువ లేకుండా ప్రతిఫలం ఇవ్వవచ్చు, ఒక పుస్తకం 2-50 కు పాఠకుడికి అందించవచ్చు. ఏ పుస్తకం అచ్చు వేయాలి అన్న దానిని సంఘంలో కొందరు కలిసి తేల్చవచ్చు.

ఇలా చేస్తే ముందుగా మంచి కథలు, మంచి నవలలు అచ్చవుతాయి. సాహిత్య ప్రమాణాలు పెరుగుతాయి.

ఆ పుస్తకాలు చవకగా పాఠకులకు అందుతాయి, పఠితల అభిరుచి పెంపొందుతుంది.

రచయితకు తగు గుర్తింపు, ప్రతిఫలం వస్తాయి. మంచి రచయితలకు ప్రోత్సాహం వుంటుంది.

మధ్యనున్న 'మల్టి—నేషనల్స్' గొడవ తప్పుతుంది.

ఇదీ దారి! ప్రయత్నం మొదలు పెడదామా లేక మన భారతీయుల ప్రత్యేకత అయిన కర్మ సిద్ధాంతానికి దాసోహం అందామా?

రైటర్స్ & రీడర్స్: కాస్త ఆలోచించండి! □



జరిగిన కథ :

జగన్నాధం ఇంట్లోవుండి 'ఇల్లు' కాపాడుతున్న ప్రకాశరావు, జగన్నాధం రాకవిని మరో ఊరు చెక్కేశాడు 'అతనెళ్ళాక నాక్కబురు పెట్టమని' పెళ్ళాంతో చెప్పి. 'అతను లేడుగా ఏం చేస్తాం' అన్న జగన్నాధాన్ని కోప్పడి అతని ఇంటివైపు బయల్దేర తీశాడు రాజేశ్వరరావు. గోడలపై మొక్కలు మొలచీ, కిటికీలూ, దర్వాజాలూ చెదలుతినీ జీర్ణమైవున్న ఇంటినిచూసి కృంగిపోయారు దంపతులు. ప్రకాశరావుని ఇంట్లోంచి పంపించేందుకూ, ఇల్లు బాగుచేయించేందుకూ ప్రయత్నం మొదలయింది. జానకి దగ్గరుండి ఇల్లు బాగుచేయించే పనిలో, కూలీల జీవితాలను దగ్గరగా చూడగలిగింది. పని జరగడం మాటెలావున్నా తెచ్చినడబ్బు రిపేరు మొదలుపెట్టిన వెంటనే 'హూష్‌కాకీ' అయిపోయింది. ఇష్టం లేకున్నా తప్పనిస్థితిలో లాయరు విశ్వనాధం దగ్గరకు అప్పుకు బయల్దేరాడు జగన్నాధం. ఎంతకీ పూర్తికాని ఇల్లు రిపేరు పనిని జానకికి పూర్తిగా అప్పగించి తిరిగి వెళ్ళిపోయాడు జగన్నాధం.

అయితే ఊళ్లో ఇళ్లకి డిమేండు బాగానే ఉందన్నమాట. ఫరవాలేదు. బాగు చేయించియిస్తే అద్దె బాగానే రావచ్చు. కాని యీ బాగు ఎప్పటికౌతుందో?

జానకి మనసులోని ఆశల్ని ఆపుతూ, యీలోగా వీధిలో ఒక జట్కా ఆగింది. జట్కాలోంచి జరీచీర కప్పిన ఒక ఆడపాదం బయటకు వచ్చింది.

ఆ తరువాత చీర జట్కా అంచునే నిలిబడిపోయి పాదం తాలూకు కాలు రమా రమి తొడవరకు బయటకు వచ్చింది.

కాలు బహు తెల్లగావుంది.

తొడ తపతపలాడుతూ జున్నుముక్కలావుంది. అమెరికాలోవుంటే ఆ కాలుకి కలర్ ఫొటోలు తీసుకొని వేలాడగట్టుకుంటారు. ఆ కాలు పైలా పచ్చీసులోవుంది.

దాని ముత్యాల మట్టెలు బహు నాజూగ్గా ఉన్నాయి.

తరవాత జట్కాలోంచి రెండోకాలూ, తొడా వచ్చేయి. అవికూడా పైలా పచ్చీసులోనే ఉండి ఉండాలి కాని మొదటివాటికి మూడింతలు ఉన్నాయి. వాటి మట్టెలు మురుగుల సైజులో వున్నాయి. ఆ కాలుకి కందపిలకల్లాటి పిలకలుకూడా ఉన్నాయి.

తొడలు బయటపెట్టినమ్మ ఒడలు బయటపెట్టలేదు. అలా జట్కాలో కూర్చునే తిట్లలెక్చర్ ప్రారంభించింది.

"ఏఁవిఁటీ ఇసక్కుప్పలూ, పేడకుప్పలూనూ. ఆ వెధవ ఇటికలూ, కిటికీలూ ఏఁవిఁటి? నేనూర్లోలేనప్పుడు వరదొచ్చిందా? భూకంపంవచ్చిందా? రెండూవచ్చేయా? ఇది మా ఇల్లేనా? మరో వీధి తీసుకొచ్చేవా?" అని ఆగింది.

"యీదీ మీదే, ఇల్లూ మీదేనండి" జట్కావాడు అన్నాడో, గుర్రం అన్నాదో చెప్పడం కష్టం.

యీలోగా పిల్లలసైన్యం జట్కాచుట్టూచేరి "అత్తయ్యొచ్చింది. అత్తయ్యొ చ్చింది" అని వచ్చింది మామయ్యకాదు అన్నట్లు పదిసార్లు అన్నారు.

"ఆపండొరేగోల ఎవరిగోరీకర్రా యీ ఇటికలు, అవీ వచ్చేయి?" అత్త అడిగింది.

"ఇంటివాళ్లొచ్చేరు" పిల్లలు జవాబిచ్చేరు.

"ఒక కారుగదికీ, రెండు కంపుకొట్లకీ అరవై రూపాయలు పుచ్చుకున్న మహానుభావులు వచ్చేరూ. ఇంకా నేనే వెళ్ళి ఫొటో ఒకటి వాళ్లది అడిగి పూజ గదిలో పెట్టుకుందామనుకుంటున్నాను. వాళ్లకి ఇల్లంటే లక్ష్యంలేదనే అంతా అంటారుకాని, ఇల్లు దిబ్బచేరిపోతున్నా, అద్దె వస్తూలెపోతూవుంటే వాళ్లెందుకురావాలి? ఎందుకు రిపేరు చేయించాలి? యీ గడుసుదనం ప్రపంచానికి తెలీదు, హమ్మయ్య" అని ఒక గెంతు గెంతింది.

— ఆమె కాలుకి పిలకలువుంటే మనిషి కందదుంపలావుంది. జట్కాదిగేక ఆమె ముగ్గురు పిల్లల్నీ, ఆరు బుట్టల్నీ, ఒక మొగుడ్నీ జెట్కాలోంచి ఊడబీకి పడేసింది.

పిల్లలు తలోబుట్టా, మొగుడు మిగతా బుట్టలూ, ఆవిడ బోద మోసుకుంటూ వరండా ఎక్కేరు. అంతవరకూ వాళ్ళెవరూ జానకిని చూడలేదు.

ఆవిడే అడిగింది "ఎవరు మీరు?"

"నువ్వు ఫొటో అడుగుదామనుకుంటున్న మనిషి" పిల్లల్లో ఎవరో అన్నారు.

"నిజంగా ఫొటో అడగాల్సినట్టే ఉన్నారు. వీధిలో కూర్చొండిపోయేరేం? రండి లోపలికి, ఎక్కడ ఉంటున్నారు? ఆ ఖాళీ వాటానే మాది" అంటూ జానకి సమాధానంకోసం ఎదురుచూడకుండా మాటాడేస్తూ ఆవిడ జానకిని లోపలికి లాక్కెళ్ళిపోయింది. తరవాత పెళ్ళిడుకువచ్చిన పిల్లని నీళ్ళుతెమ్మని, పెళ్ళీడు దాటిపోయినదాన్ని వండమని ఆర్డర్లువేసి "మీరు మా యింట్లోనే భోంచెయ్యాలి యీపూట" అని జానకిని బలవంతంచేసింది. మరోనాడు చేస్తానని తప్పించుకుంది జానకి.

ఆవిడపేరు కమలట. ఆవిడకి రెండో పెళ్ళట. మొగుడుపోయేక మరదినే చేసుకుందిట. అది వాళ్లాయన (మొదటి) ఆర్డరుట.

"ఒట్టి భోళామనిషి" అనుకుంది జానకి.

18

ఆవేళ మధ్యాహ్నం భోజనాల దగ్గర, తనని ప్లీడరు గుమస్తా పెట్టిన పేచీ అంతా చెప్పింది జానకి రాజేశ్వర్రావుతో.

"వాడెవడు మధ్య కౌన్ కిస్కాగాడు. మీ గోడా, మీ కిటికీ, మీ ఇష్టం."

"ఆడది. పైగా ఒంటరిది. ఇదేం చేస్తుందనుకున్నాడేమో?"

"వెధవని ఎముకలు పీకేసి కిటికీ గజాలుగా వేసేస్తాను. ఏమనుకుంటున్నాడో, వాడి సంగతి నాకొదిలెయ్యండి. కాని ఆ లార్డులు ఏమంటున్నారు? ఖాళీచేసే వుద్దేశ్యం ఏమైనా ఉందా?"

"ఆ కొత్తగా చేరినవాళ్ళు మాత్రం రేపు వెళ్ళిపోతామన్నారు. రిపేరు పూర్తయ్యేక పిలుంటే మళ్ళీ వాళ్ళకి యివ్వమన్నారు. ప్రకాశరావు వాళ్ళు మాత్రం ఏమీ అన్లేదు. పొరుగూరిది. ఎన్నాళ్ళుంటుంది అని ధీమా."

"ఎన్నాళ్ళేమిటి? అవసరమైతే సంవత్సరమైనాసరే వాళ్ళు కదిల్తేనే మీరు కదుల్తారు. మొండివాడు మహారాజుకంటె బలవంతుడు. వాళ్ళందరూ పోగానే ఇల్లంతా డెట్టాల్‌తో కడిగి, పసుపునీళ్ళు జల్లి సంప్రోక్షణ చేయించిగాని మరొకరికి యివ్వద్దు."

"పొద్దున్న సామాను కొంచెం తియ్యండి, కూలీలు పని చేస్తారంటే నన్నే తీయించుకోమన్నారు."

"అంటారు. అంటారు. వీధిలోకి విసిరేసి అగ్గిపుల్ల గీసేయవలసింది. వీళ్ళకీ, వీళ్ళకి మద్దతు యిస్తున్నవాళ్ళకీ కూడా ఎలా బుద్ధి చెప్పాలో నాకు తెలుసు. అన్నట్టు ఓ శుభవార్త. ఎవరో కావేశంట. పది బస్తాల సిమెంటు పంపేడు. కంగ్రాట్స్.

నేనూ, జగన్నాథం కలిసి చెయ్యలేనిది మీరు సాధించేరు.''

''నాకూ తెలీదు కావేశం అంత పవర్‌ఫుల్ అని.''

పై సంభాషణ జరిగిన సాయంత్రం హాల్లో సోఫాలో కూర్చుని ఏదో పుస్తకం చదువుకుంటోంది జానకి. అప్పుడు వచ్చేరు ముందు రాజేశ్వర్రావు, వెనక ఒకతను.

''ఇదుగో యీవిడే ఆ యింటి ఓనరు. యితను రెవిన్యూ ఇనస్పెక్టరు '' అని జానక్కి అతన్ని పరిచయం చేసి ''మీరు ఆవిడతోనే మాట్లాడవచ్చు'' అని అతనితో చెప్పి పక్కనున్న సోఫాలో కూర్చున్నాడు పేపరు చూస్తూ.

జానకి కూర్చోమన్నా అతను కూర్చోలేదు. రాజేశ్వర్రావు కూడా ''ఫరవా లేదు కూర్చోండి'' అని భరోసా యిచ్చేక ఎదురుగా నున్న కుర్చీలో అంచు మీద కుర్చీకి నొప్పెడుతుందేమో అన్నంత భయం భయంగా కూర్చున్నాడు.

అతను—పదిహేనేళ్ళవరకు ఎదిగి, యింక ఎదగడం మానేసి ముసిలైపోయిన ఆడదాన్లా వున్నాడు. గెడ్డం, మీసం, ఏఁవీఁలేకుండా, నున్నగా, తెల్లగా ఉప్పు చింత పండుతో తెల్లిగా తోఁవిఁన కళ్ళు, ముక్కు పెట్టిన గుండు చెంబులా వుంది అతని మొహం.

జుత్తు నల్లగా లేదు.

నలుపుపోయి తెలుపు అవుదామా వద్దా అని ఆలోచించి ఎటూ తేలక చివరికి నల్లబడ్డ అల్యూమినియం గిన్నె రంగులో వుండిపోయింది. ఆల్‌టుగెదర్ అతని మొహం ఇత్తడి చెంబు మీద అల్యూమినియం గిన్నె బోర్లించినట్లుంది.

అతను ఎందుకొచ్చేడో తెలీని జానకి ఏం మాట్లాడాలో తెలీక ఫూరుకుంది.

''మీ ఇంట్లో ఒక పోర్షను నాకివ్వాలండి'' అన్నాడతను ఆయుర్వేదవైద్యుడు పసరు నలిపినట్లు చేతులు నలుపుతూ.

ఇల్లు అడగడానికి వచ్చినవాడికి అంత పిరికితనం ఎందుకో! నవ్వొచ్చింది జానక్కి. సభ్యత కోసం నవ్వలేదు. రాజేశ్వర్రావు మాత్రం నవ్వేడు. అతని సభ్యతకి పేపరు అడ్డుంది.

''ఏదండీ! యింకా రిపేర్లే అవలేదు. అన్నీ పూర్తి అయేసరికి చాలా రోజులు అవుతుంది'' అంది జానకి డిప్లమాటిగ్గా.

అసలే చివర కూర్చున్న అతను బతిమాలడానికన్నట్లు యింకా చివరికి వచ్చేసి, ''అమ్మమ్మ, తమరలా అంటే కుదరదు. ఇప్పుడీ ఊళ్ళో యజ్ఞమైనా చెయ్యగలమేమో కాని ఇల్లు వెదకలేం. మరంచేత మీరు నాకు యివ్వక తప్పదు. అద్దె విషయం మీరు భయపడకండి. నా సంగతి డాక్టరుగారికి తెలుసు. ఇప్పుడు మాత్రం ఇల్లు యిప్పించండి. లేకపోతే నడి బజార్లో నిలబడాలి'' అన్నాడు పసరు యింకా స్పీడుగా పిడుస్తూ.

''బజార్లోనా?'' ఆశ్చర్యపోయింది జానకి.

''మీరు కాదు-మేము'' ఎక్స్‌ప్లెయిన్ చేశేడు గుండుచెంబు.

ఇతని మాటలకంటె ఆలోచనలు వేగం అనుకుంది జానక్క.

తన ఎక్స్‌ప్లనేషన్‌కి తను ఆనందపడ్డాక ''లేకపోతే కోర్టుకి వెళ్ళాల్సి వస్తుంది'' అని కలిపేడు.

''కోర్టుకా?'' భయపడింది జానకి.

చదువుతున్న పేపరు టేబిలు మీద పెట్టి కళ్ళజోడు తీసి ఆర్. ఐ. వేపు చూసేడు డాక్టరు.

''మీరు కాదమ్మా! మేము'' మరో ఎక్స్‌ప్లనేషను చెప్పేడు ఆర్. ఐ.


''ఏం?'' జానకీ, డాక్టరూ ఒక్కసారే అడిగేరు.

''నేనా ఇల్లాల్ని చంపేక తప్పదు'' (దయగల హెడ్డు దొంగతో అన్నట్టు) అతి ఫిలాసఫిక్‌గా అన్నాడు.

''ఇల్లాల్నా?'' డాక్టరే అడిగేడు.

పొద్దుటి నుంచి చచ్చి చచ్చి వచ్చిన జానక్కి యీ కోర్టులూ, ఖూనీల సంభాషణతో మొహం తిరిగినంతపనై మాట రాలేదు.

''మా యిల్లాల్ని కాదు. యింటిగలావిడ్ని'' మళ్ళీ అతని ఎక్స్‌ప్లనేషన్. ఈ కాబోయే ఖూనీకోర్ని ఎంత వేగం వదిలించుకుంటే అంత మంచిది అనుకున్నాడో



ఏమో డాక్టరు ''మీకు మరేవీఁ అభ్యంతరం లేకపోతే యితనికొక పోర్షనివ్వండి'' అని యింక తన రికమెండేషను అయిపోయినట్లు మళ్ళీ పేపరు తీసేడు.

రాజేశ్వర్రావుని బాగా తెలిసిన జానక్కి, అతని గొంతుక ''ఐ డోంట్ మైండ్ వెదర్ యు గివిట్ ఆర్ నాట్'' ధ్వనించింది. అంచేత అతన్ని యింటర్వ్యూ ప్రారంభించింది.

''ఈ ఊరు కొత్తగా వచ్చేరా?''

''లేదు. రెండేళ్ళయింది.''

''మరిన్నాళ్లు ఎక్కడుంటున్నారు?''

''నరకంలో.''

''అంటే ''

''మరిప్పుడవేఁవీఁ నా చేత చెప్పించకండి. మా ఇంటివాళ్లు లంకలో వుండాల్సినవాళ్లు ''

''భేష్. కధ తిరగబడిందన్నమాట'' పేపరు చాటున నవ్వుకున్నాడు డాక్టరు.

''ఇల్లు తరవాత యివ్వొచ్చు. ముందు అద్దె ఎంతో చెప్పెయ్యండి. ప్లాను లేనిదే ఏ పనీ చెయ్యను నేను. పెళ్ళికి ముందే పిల్లల పేర్లు నిర్ణయించే రకం నేను'' ఆగేడు ఆర్. ఐ.

''పిల్లల్ని స్కూల్లో వేసేటప్పుడే పేర్లు పెట్టే రకం యీవిడ. అద్దె భయం మాకేం లేదు. వెళ్ళిరండి. గవర్నమెంటు దివాలా కొట్టినా మీ రెవిన్యూ ఇన్‌స్పెక్టర్లకేం ధోకా వుండదు'' అన్నాడు రాజేశ్వర్రావు. ఆఖరి వాక్యం మాత్రం పైకన్లేదు.

''మరింక నేను వెళ్తానండి. మళ్ళీ కలుస్తాను'' అని యిద్దరికీ ఒకసారే నమస్కారం పెట్టి వెళ్ళిపోయేడు ఆర్. ఐ.

''ఈ ఇల్లంటూ తయారవ్వాలేగాని అద్దెకొచ్చేవాళ్లకేం కొదవలేదు. అమ్మయ్య'' అనుకున్న జానక్కి కొంచెం హుషారొచ్చింది.

19

మర్నాడుదయం—

''ఎవరొస్తారో చూస్తాను'' అన్నట్టు నిల్చున్నాడు ప్లీడరుగుమస్తా కిటికీ అవతల. అతన్నక్కడ చూసిన జానక్కి వెంటనే అర్థమైపోయింది, ఇవేళ తను సత్యభామై యీ నరకాసురుడితో యుద్ధం చెయ్యక తప్పదని.

కాని తన కృష్ణుడు నామకకైనా పక్కనలేడే!

అయినా నిబ్బరంగా నిల్చుని ''ఇవాళైనా పనులు చకచకా కానీయండోయ్. పనులు నాలుగురోజుల్లో అయిపోవాలి మంది ఎక్కువైతే కూలి దండుగే కాని పనవడంలేదు. రేపటినుంచి యింతమంది అక్కర్లేదు సైన్యంలాగ. ఆరుగురో, ఏడుగురో చాలు ముందా కిటికీపని కానివ్వండి'' అంటూ పనులు ప్రారంభించింది.

మళ్ళీ మోసికెళ్ళేరు మేస్త్రీలు కిటికీని.

నాలుగు నిమషాలు గడిచేయి. అమ్మయ్య అనుకుంది జానకి.

అయిదో నిమషం సగం గడిచింది.

శబ్దంకంటె కాంతివేగం ఎక్కువ.

మనిషికంటె మాటవేగం ఎక్కువ.

''ఎన్నిసార్లు చెప్పాల్రా మీకు, ఆ కిటికీ పెట్టడానికి వీల్లేదని. ఒకసారి చెప్తే వినడానికి మనుషులు కారేవిట్రా?'' అన్న ఆల్సేషియన్ అరుపులు ముందు వినిపించేయి.

ఆ తరవాత కిటికీని మోసుకొస్తున్న కూలీలు కనిపించేరు.

ఎవరు మనుషులు కానిది?

తనా? కూలీలా?

''స్సి! స్సి!! పెద్దా, సిన్నాలేకుండా మిరపకాయతిన్న మాలకాకిలా ఏటా దాబు అరుపులు? తమరేవన్నా అంటారనిగాని మావైతే అటో యిటో తేల్చేద్దుం'' అంటూ తేల్చేయడానికే అన్నట్టు వెళ్ళబోయేడు ఒకమేస్త్రీ.

''నువ్వేం తేల్చక్కర్లేదు కాని ఒక్కసారి వెళ్లి డాక్టరు రాజేశ్వర్రావుగార్ని నేను రమ్మంటున్నానని చెప్పిపిల్చుకురా'' అంటున్న జానకి కంటినీరు కిందపడలేదు.

ఆ ఊరివారి ఆలోచనాశక్తి అమోఘం. అక్కడేదో జరుగుతుందని ముందే ఊహించిన చాలామంది వీధిలో అక్కడికక్కడే తిరుగుతున్నారు. పెరట్లో నూతి

దగ్గర స్నానాలవాళ్లు తమ స్నానాన్ని మరో అరగంట పొడిగించేరు.

తలొంచుకొని కుర్చీలో కూర్చున్న జానక్కి ఆ గుమస్తా పొలికేకలు వినిపిస్తూనే ఉన్నాయి.

''బాబోయ్. నాకీ ఇల్లూవద్దు. డబ్బూవద్దు. పారిపోదాం'' అనిపిస్తోంది ఆవిడకి.

వేగం రాజేశ్వర్రావువ స్తే బావుణ్ను.

రాజేశ్వర్రావు రాలేదుకాని, అతని కాంపౌండరు వచ్చేడు ''డాక్టరుగారు ఆపరేషను మధ్యలో ఉన్నారు. 'అవగానే వస్తానన్నారు'' అంటూ. కాంపౌండరుకేం చెప్పడులేదు. అంచేత ఆ గుమాస్తా కేకలు అతనికూడా వినిపిస్తున్నాయి.

మాట్లాడే ఓపిక చచ్చిపోయింది జానక్కి. అంచేత అదేవిటో చూడ మన్నట్టు సంజ్ఞచేసింది.

గజేంద్రుడ్ని రక్షించడానికొచ్చిన విష్ణుమూర్తిలా కాంపౌండరు ముందు, ''తనవెంటసిరి'' అన్నట్లు అతనివెనక మేస్త్రీలు బయల్దేరేరు.

''పని చేసేయండ్రా. అలా నిల్చుంటారేం దిష్టిబొమ్మల్లా'' అర్డరేశేడు విష్ణుమూర్తి.

''వీల్లేదంటూవుంటే ఏవిటీగోల?'' గుమాస్తా, పీనుగులావున్నా ఏనుగులా గర్జించేడు.

''ఏవిటి వీల్లేదు?''

''ఆ కిటికీ పెట్టడం''

''యీ ఇల్లు నీదా?''

''కాదు.''

''యీ కిటికీ నీదా?''

''కాదు.''

''మరి నీ బోడి యిష్టం ఎవడిక్కావాలి?''

''ఇది యిన్నాళ్లూ బ్రాహ్మలవీధేనా?''

''నాకు తెలీదు.''

''మరిప్పుడు యీ యింట్లో శూద్రులెవరైనా దిగుతే?''

''దిగుతారు''

''వాళ్ళు మాంసం అవీ వండుకుంటే?''

''చేపలుకూడా వండుకుంటారు.''

''మరి ఆ వాసనంతా యీ కిటికీలోంచి మాకు రాదా?''

''ఒక్క కిటికీలోంచేకాదు, పెంకుల్లోంచి, పెరట్లోంచి అన్నింటిలోంచి వస్తుంది.''

''మరి మేమేం చెయ్యాలి?''

"కూరొండుకోకుండా అన్నం తినెయ్యొచ్చు."

"మేం తినం"

"అయితే మానేయ్యొచ్చు."

"ఆవిడ ఆ కిటికీ పెట్టడంకూడా మానెయొచ్చు."

"ఒచ్చు. కాని ఆవిడ మానరు. అడ్డొచ్చిన వెధవని పీకపడక పాతెయ్యకుండా నేనుండలేను. తరవాత ఆ పీక తీసేకుండా మా డాక్టరుగారు ఉండలేరు చూస్తారేంవిట్రా సున్నప్పిడతల్లాగ ముందా కిటికీ ఎక్కించండి " దమాయించేడు కాంపౌండరు.

కిటికీ ఎత్తేరు కూలీలు.

నాగుపాములా బుసకొట్టేడు నాగయ్య. "చెప్తుంటే ఏంవిట్రా జబర్దస్తీ ఆఁ ఆఁ సరే నేను ఆ కిటికీకి అడ్డంగా మావేపు పెద్ద బల్లచెక్క పెట్టించేస్తాను."

"బల్ల అయితే పుచ్చిపోతుంది. కోటకట్టించేసుకో. అడ్డంవస్తే మాత్రం యిప్పుడు నేను గోరీ కట్టించేస్తాను."

"ఏంవైనాసరే ఆ కిటికీ పెట్టడానికి వీల్లేదు."

"చూడు నాగయ్యా. నువ్వు చేస్తున్నది ప్లీడరుగుమాస్తా పనికాని, క్రిమి కౌన్సిలరుగాదు. నాకు తెలిసినపాటి "లా" కూడా తెలీదు నీకు."

"పెద్ద పెద్ద జడ్జీలే నేనుచెప్పే "లా పాయింట్సు"కి ఆశ్చర్యపోతారు."

"అది వాళ్ల ఖర్మ. నేనేం జడ్జీనికాను వినుమరి. ఈ యిల్లు, యింటితో పాటు యీ గోడ, గోడతోపాటు కిటికీ కట్టి పాతికఏళ్లు పైనే అయింది. ఆ కిటికీ అడ్డు ఏవైనావుంటే ఆనాడే చెప్పవల్సింది. ఇప్పుడు నీకు అడ్డే అధికారంలేదు."

"అప్పుడంటే యీ ఇంటావిడ వెధవావిడ. మొగదిక్కులేనిది. అంచేత వాళ్ళు దమాయించేసేరుట. అప్పుడిక్కడ ఖాళీస్తలం ఉండేది కాబట్టి, పోన్లే పాపం అని ఊరుకుందిట."

"ఆవిడ వెధవరికానికీ, మొగదిక్కులేకపోవడానికీ మా బాధ్యతలేదు. అప్పటి ఖాళీస్తలం యిప్పుడు ఇల్లైతే అవచ్చుకాని కిటికీమాత్రం గోడపదు లేచి అడ్డు తప్పుకో."

"అలా అయితే యింట్లో దిగేవాళ్ళు మాంసం అవీ వండుకోరని యీవిడ్ని కాయితం రాసిమ్మను."

"ఏం వాల్‌పోస్టరుచేసి గోడకంటించుకుంటావా? ఇంట్లో దిగేవాళ్ళని యివి వండుకోవద్దు, అవి తినొద్దు అని ఆవిడ అంటే "అమ్మా! నువ్విచ్చేది ఇల్లా? గుడా? అందులో అర్చన చెయ్యమంటావా? అన్నం వండుకోమంటావా" అనడుగుతారు. నీకీ డొల్లు ఏంవీంవద్దు, ఈ యిల్లు పూర్తవగానే నేనే దిగుతాను. మాంసం, చేపలే కాదు. అడ్డొస్తే నిన్నుకూడా వండుకుతినేస్తాను. అంచేత తద్దినం పెట్టేవాడి తమ్ముడిలా గేస్‌కొట్టక తప్పుకోబాబూ" అంటూ గునపాం పట్టుకున్నాడు కాంపౌండరు.

''ఎలా పెడతారో నేనూ చూస్తాను.''

''చూస్తే మాకేం అభ్యంతరంలేదు. కాని పాపం ఒక్కసంగతి మర్చిపోకు. "అసలు మా కిటికీ 25 ఏళ్ళనుంచి ఉంది. నేను ఊళ్ళోలేనప్పుడు యితను కొత్తగా ఇల్లుకట్టి, నా కిటికీలోంచి వచ్చేగాలి, వెలుతురు వగైరాలకి అడ్డుతగుల్తున్నాడు కాబట్టి, కోర్టువారు దయచేసి వీడి ఇంటిని నా కిటికీకి అడ్డురానంతదూరం జరిపించ వలిసింది'' అనిగాని ఆవిడ ఒక్క కాయితం ముక్క తగిలిస్తే, నిన్నూ, నీ ఇంటినీ ఊరవతలకి మోసేస్తారు కోర్టువారు. జాగర్త.''

అమ్మో! ప్లీడరు గుమాస్తాలకంటె పైవాళ్ళకూడా రూల్సు తెలుస్తాయన్న మాట. వీళ్ళదగ్గర తురుపుముక్కలు చాలావున్నాయి అనుకున్నాడు గుమాస్తా.

''గబగబా కానీయండ్రా యిదేం నాటకవా? ఏవిఁటి అలా చూస్తున్నారు? 'ఊఁ. కానియ్యండి'' చక్రం మరిచిపోయిన విష్ణుమూర్తి గునపాం ఎత్తేడు.

''మా స్తలంలోకి రాకుండా మీ యిష్టమొచ్చినట్టేడవండి'' ఎగిరేడు గుమాస్తా కూలీలమీద.

''వాళ్లేం ఘటోత్కచులు అనుకున్నావేఁవిఁటి గాలిలో ఎగురుతూ పనిచెయ్యడానికి? ఇప్పుడేకాదు. వాళ్ళు యీ గోడకి సున్నం వేసినప్పుడల్లా నీ స్తలంలోకి వస్తారు. అడ్డుతగిలేవా? కుళ్ళబొడిచీసి సున్నంలో కలిపేసి గోడకి రాసేస్తారు. సాక్ష్యానికూడా మిగలవ్. తప్పుకోబాబు. అమ్మ, నాన్నకి తద్దినం పెట్టడానికైనా మిగులుండు. బతికుంటే ఎప్పటికైనా కిటికీ పేచీ కాకపోతే కోటా పేచీలే పెట్టుకోవచ్చును.'' కాంపౌండరు నచ్చచెప్పేడు యిప్పుడేకాదు యింకెప్పుడూ నోరెత్తవద్దని.

సరిగ్గా అప్పుడే వచ్చేడు రాజేశ్వర్రావు ''ఏవైంది'' అంటూ.

''ఏఁవిఁటోయ్ నాగయ్యా. ఏఁవిఁటి సంగతి? అసలు నువ్వు హాస్పిటల్లోనే వున్నావనుకున్నానే. ఇప్పుడే మీ పేషెంటుకి యింజెక్షను యిచ్చేను. మరేం ఫరవా లేదులే'' అంటూ భావగర్భితంగా నవ్వేడు రాజేశ్వర్రావు.

ప్రతిపక్ష రాజుగారు రంగంలోకి దిగుతారని ఎక్స్పెక్టు చెయ్యకుండా అనధికార యుద్ధం ప్రకటించిన సైనికుడిలా గాభరాపడ్డాడు నాగయ్య.

''అబ్బే. ఏంలేదండి. ఏదో కష్టసుఖాలు మాట్లాడుకుంటున్నాం పనిచేసుకోండర్రా. అలా నిల్చుంటారేం?'' అంటూ ''వస్తానండి డాక్టరుగారూ'' అని డాక్టరుకొక నమస్కారం. జానక్కి ఒక నమస్కారంపెట్టి వెళిపోయేడు.

అందర్నీ అంతసేపూ హడలగొట్టేసిన చారలపులి రింగ్మాస్టర్ని చూడగానే చెవులపిల్లి అయిపోయినట్లు, అంతవరకూ కురుక్షేత్రంచేసిన గుమాస్తా రాజేశ్వర్రావుని చూడగానే ఎందుకలా అయిపోయేడో జానక్కి అర్థంకాలేదు. ఆ ముక్కే ఆ సాయంత్రం అతన్ని అడిగింది "అదేవిఁటండీ? వాడలా మారీచుళ్లా మహాయుద్ధం చేస్తున్నవాడల్లా, మిమ్మల్ని చూడగానే ఎప్పుడు చచ్చేవంటే ఆర్నెల్లకింద అన్నట్టు అలా అయిపోయేడు'' అని.

నవ్వేడు రాజేశ్వర్రావు.

కర్ణుడికి అతని జన్మరహస్యం చెప్తున్న శ్రీకృష్ణుడిలా జాలిగా నవ్వేడు. నవ్వేక నాగయ్యే నోరుమూయించిన కధ ప్రారంభించేడు—"టి. బి. పేషెంటుకి టైఫాయిడ్ ట్రీట్‌మెంట్‌యిస్తే ఏమౌతుంది? రపీమని చస్తాడు. మేకని తినడానికి వచ్చిన పులితో "తప్పమ్మా. ఈ మేక యిదివరకునుంచీ మాదే. గంగిగోవు లాంటిది. పైగా దీనికి మూడు పిల్లలుకూడాను. పాపం తల్లిలేని పిల్లలైపోతాయి, ఇదిచస్తే. నీకు డబుల్ పాపంకూడాను." అని బోధచేస్తే ఏంచేస్తుంది? ముందు మనల్ని, తరవాత మేకనీ తినేస్తుంది "నువ్వు మిగిలిన బోధ నా కడుపులోంచే చెయ్యి. నాకు వినిపిస్తుంది. ఫరవాలేదు" అని. మరంచేత వాడితో "అఫ్ ఆల్ పీపుల్—ప్లీడరు గుమాస్తాతో ఆర్గుమెంటు చెప్పకూడదు. వాడినే అలా ఆర్గ్యూ చెయ్యనిచ్చి, మనవేం జెల్లకొట్టినట్లు జెడ్జిమెంటు చెప్పెయ్యాలి " అంటూ ఆగేడు.

"చెప్తాం కాని వాడు వినాలికదా?"

"ఎవడికోసం వింటాడు? వాడు, వాడి వకీలు కూడా వింటారు."

"అదే ఎలా విన్నాడూ అని?"

"మేడమ్. మీరు ఆడవాళ్లు. మీతో నేను యిలాంటి మాటలు ఆడకూడదు. కాని నేను ఆడేవరకు మీరు వదలరు. కనక ఆడేస్తాను. మీరూ డాక్టర్సు వైఫ్ కాబట్టి ఫరవాలేదనుకోండి. ఆ గుమాస్తాగాడు ఓ చిన్నసైజు రామచిలక. వాడికి అక్కడా అక్కడా చిలక్కొట్లున్నాయి. మన అదృష్టంకొద్దీ అందులో ఒకదానికి జబ్బుచేసింది. అంత సీరియస్‌కాదు కాని వీడి ప్రాణానికది చాలు. అదిప్పుడు మా నర్సింగ్‌హోమ్‌లోనే ఉంది."

జానకి జగన్నాధం అంత అమాయకురాలు కాకపోయినప్పటికీ, ఆశ్చర్య పోయింది యీ కధవిని. "అంటే వాడికి మీ అవసరంవుండీ మనందరం ఫ్రెండ్సు అని తెలిసీ అలా చేశేడా?"

"నన్ను పూర్తిగా చెప్పనివ్వండి. ఏదో ఆడదికదా, ఓసారి ఆడిద్దాం అనుకున్నాడు. పైగా వాడు నా పెద్దమనిషితనాన్నే నమ్మేడుకాని, నా రౌడీతనాన్ని ఊహించలేకపోయేడు. తీరా నేను రంగంలోకి రాగానే జెండా ఎత్తేసేడు. సీత మన పేషెంటైతే, రాముడూ, రావణాసురుడూ యిద్దరూ మనమాట వింటారు. ఇది ప్రపంచధర్మం. ఇంతకీ యింక వాడు మీ ఛాయలక్కూడా రాడు" అన్నాడు.

మొత్తాని కెలాగైతేనేం రెండ్రోజులయుద్ధం, రెండ్రోజుల కూలి వదిలి కిటికీ తతంగం పూర్తి అయింది.

20

జగన్నాధం యింటికి కుడివేపు నాగయ్య ఇల్లుంటే, ఎడమవైపు పెద్దనాయుడు గారిల్లుంది. నాయుడుగారితండ్రీ, జగన్నాధంతండ్రీ రమారమీ ఒక్కసారే కొన్నారు ఆ ఇళ్ళని. ఆ రెండిళ్ళమధ్య గోడ జగన్నాధానికి ఉత్తరం, నాయుడికి దక్షిణం.

ప్రతి ఇంటి దణక్షిణపుగోడ ఆ ఇంటివారే పెట్టించుకోవడం ఆ ఊరి ఆచారం. అవి మట్టిగోడలవడంవల్ల వర్షాకాలంలో పడిపోవడం, మళ్ళీ వేసవిలో పెట్టించడం కూడా మరో ఆచారం. ఆ గోడ ఎప్పుడుపెట్టినా, నాయుడుగారు దఫాకొక నాలుగంగుళాలు చొప్పున ఆ గోడని జగన్నాధం పెరటివేపు జరపబోవడం, జగన్నాధం తండ్రి బాణా కర్ర పట్టుకొని ఆ గోడ అరంగుళంకూడా జరగకుండా కాపలాకాయడం పూర్వం రోజుల్లో రివాజయిపోయింది.

జగన్నాధం తండ్రి మరోలోకానికి, జగన్నాధం గవర్నమెంటు ఉద్యోగానికీ వెళ్ళిపోవడంవల్ల మరింక బాణాకర్ర కాదుకదా చీపురుపుల్లైనా పట్టుకొని నిల్చునేవాళ్లు లేకపోవడంతో నాయుడుగారికి మరింక ఆ గోడ పెట్టవలసిన అవసరం కనిపించలేదు. పైగా తన ఇంటిని కొంచెం ఎక్స్‌పేండుచేస్తే మంచిదేమో అనిపించింది. అంచేత ముందున్న ఇల్లంతా అరడజను భాగాలుగా అద్దెకిచ్చేసి, తనకోసమని పెరట్లో ఒక వంటగది, పడగ్గది, ఏదో ఓ చిన్న స్టోర్రూముతో ఒక ఇంటిని కట్టుకున్నారు. ఆ ఇంటి వెడల్పు 5 గజాల్లో 2 గజాలు జగన్నాధం పెరట్లోను ఉంది. నాయుడు గారింట్లో బ్రాహ్మలు, శూద్రులు, ముస్లిములు అన్నిరకాలవాళ్లు "ఆహా! నేషనల్ యింటిగ్రేషన్ అంటే యిదే" అన్నట్టు కలిసిమెలిసి ఉంటారు. నాయుడిగారికి పాపం యీ ఇల్లేకాకుండా ఓ రెండెకరాల పొలం, రెండు ఎడ్లు, మూడు గేదెలు, పుట్టెడు చెప్పుడు ఉన్నాయి.

జగన్నాధం పెరడంతా "ఏటలా పాడుసేస్తన్నారు. గేదల్నికడితే ఆ స్తలమైనా శుభ్రంగా ఉంటాయి" అన్జెప్పి నాయుడుగారు తన గేదెల్ని జగన్నాధం పెరట్లోనే కట్టుకుంటున్నారు. గేదెలు అన్నం తినవు. టిఫినులుకూడా తినవు. గడ్డి తింటాయి. ఆ గేదెలక్కావల్సిన గడ్డిమేట్లు, కుడితిగోలేలు ఆ పెరట్లోనే ఉన్నాయి. పేడకుప్పలు కూడా అక్కడే ఉన్నాయి మరి. ఆ గేదెలూ, కుప్పలూ చూసిన జానక్కి కడుపు ఉడికిపోయి కబురుచేసింది నాయుడికి వెంటనే ఆ గేదెల్ని తీసేమనీ, రెండిళ్ళమధ్య గోడకూడా పెట్టించిమని.

"గోడ యిప్పట్లో తను పెట్టలేడు. అంత అర్జంటైతే జానకిపెట్టిస్తే తరవాత డబ్బుయిచ్చేస్తాడు. ఈ "ఎదవ డబ్బు"కోసం తనిల్లు వదిలి పారిపోడు. కాకపోతే ఆ గోడమీద చూరుదింపే హక్కుమాత్రం తనదే. ఇంక గేదెలు. పాపం. నోరులేని ప్రాణులు. అవి భూతాలు అయితే అవచ్చుకాని దెయ్యాలు మాత్రంకావు. వాటిని ఉన్నపళంగా పొమ్మంటే అవిమాత్రం ఎక్కడికిపోతాయి? అంచేత వాటికికాని, తనకి గాని యింకోపెరడు దొరికేవరకు యిక్కడే ఉంటాయి. అదీగాక ఎక్కడో పెరటి చివరున్న గేదెలు ఎవర్నిమాత్రం ఏంచేస్తాయి? పాలిస్తాయితప్ప. ఆ మాత్రం భూతదయ, కృతజ్ఞత లేకపోతే ఎలా?" ఇదీ అతని జవాబు.

నాయుడికి పాలిచ్చే గెదెలపట్ల తనకెందుకు కృతజ్ఞత ఉండాలో జానక్కి అర్థంకాలేదు. తనేదో కసాయి మనిషైనట్టు, అతను గాంధీగారైనట్టు మాటమాటకీ

యీ భూతదయయేవిటి? రాస్కెల్! చంపేసి పాతెయ్యాలి యిలాంటివాడ్ని. ఆ గేదెల్ని రాత్రికి రాత్రి పొరుగూరు సంతలో అమ్మించేస్తే రోగం ఒదిలిపోతుంది.

జానకి ఆలోచనల మధ్యలో ''మరండి. ఎల్లుండికొాక ఐదువేల ఇటిక ఏయిస్తే గోడలు లెగుస్తాయండి. రేపటితో పునాదులైపోతాయండి'' అంటూ ఎదురుగా నిల్చున్నాడు ఎప్రెంటిస్ మేస్త్రీ.

ఔను. అన్నట్టు గోడలకి యిటిక కావాలికదూ. ఒకవైపు పాత ఇల్లు రిపేరు చేయిస్తూనే, వాకిట్లో రెండు బాత్రూమ్‌లు విడివిడిగా కట్టించాలనుకుంది జానకి.

''ఇప్పుడు బాత్రూమ్‌లు లేకపోతే కొంప మునిగిపోదు. వీలైనంతవేగం అయిందనిపించి వచ్చి. ఇప్పటికే అయిదువేలు దాటింది'' అంటూ ఆవేళే ఉత్తరం రాశేడు జగన్నాథం. ఈ జగన్నాథానికేం తెలీదు. విడిగా బాత్రూములుంటే అద్దె ఎక్కువొస్తుంది. పనిలోపని చేయించేద్దాం అని జగన్నాథం పెర్మిషనుకోసం కూర్చోకుండా పునాదులు తవ్వించేసింది.

ఇంతకీ బాత్‌రూమ్‌లు పూర్తి అయినా అవకపోయినా తను కదలడానికి వీల్లేదు, వాళ్లు ఇల్లు ఖాళీ చెయ్యనంతవరకు.

మూడురోజులక్రితం ఇల్లు త్వరగా ఖాళీ చెయ్యమని జానకి ప్రకాశరావు భార్యని అడిగింది.

''మేమూ ఆ పనిమీదే ఉన్నావమ్మా. ఆయన రాత్రి, పగలు అనకుండా తిరుగుతున్నారు ఇళ్ళకోసం'' అందావిడ.

''ఇళ్ళకోసం రాత్రి పగలు తిరగడానికి అవేం దొంగలనుకున్నారేవిటి?'' అని మనసులో అనుకొని ''ఇంత ఊర్లో ఇళ్లేలేవా?'' అని పైకి అనకుండా ఉండలేకపోయింది, జానకి. ఇంకా యీవిడతో మాట్లాడితే బ్లడ్‌ప్రెషర్ హెచ్చి స్ట్రోక్‌వచ్చినా వస్తుంది.

''ఉండకేం. ముందుంటే వెనకుండదు. వెనకుంటే ముందుండదు'' సాగదీసింది ఆవిడ.

''కోడిగుడ్డుకూ్కడా ముందు, వెనక ఉంటాయి మనం అనుకుంటే'' అనేద్దామనుకుంది జానకి.

''ఈ రెండూ ఉంటే అద్దె జాస్తీ'' అని కలిపింది ప్రకాశరావు యుద్ధం గుండెల కూతురు.

ఆ పిల్ల పళ్ళన్నీ పీకేసి చేతిలోపెట్టి ఒక్కటొక్కటే ఆమెచేత తినిపించాలన్నంతకోపం వచ్చింది జానక్కి. ఒళ్లుమండి ''ఇల్లుకూడా నన్నే చూడమంటారా?'' అంది చూడమనరన్న ధైర్యంతో.

''తల్లీ తల్లీ. ఆ ఉపకారంచేస్తే పుట్టబోయీ పిల్లకి నీపేరే పెట్టుకుంటాం'' అంది ప్రకాశరావు భార్య.

ఏవిటీ? వీళ్ళకి ఇల్లు చూడాలా? తాజ్‌మహల్ కట్టించి యివ్వద్దూ? ఇస్తే

మాత్రం నిలుపుకోవద్దూ. స్మశానాల్లో ఉండవలసిన జాతి. అఘోరీజాతి. వీళ్ళు స్మశానంలో మకాంపెడితే దెయ్యాలు పారిపోతాయి. ఇలా ఆలోచిస్తున్న జానక్కి-తటుక్కున ఒక ఆలోచనవచ్చింది. వీళ్లు ఇల్లు చూసుకునే ప్రయత్నంలోలేరు. ఒకవేళ ఆ ప్రయత్నంచేసినా వీళ్ళని తెలిసినవాళ్ళెవరూ వీళ్ళకి పశువులపాక కూడా యివ్వరు. తనే వాళ్ళకి యిల్లు చూడకతప్పదు అనుకొని వాళ్ళకోసం ఇళ్ళవేట ప్రారంభించింది. మూడ్రోజులక్రితం ఓ వాటా చూపిస్తే "పిల్లా, పాపాతో ఉన్నాం. అంత చిన్న ఇల్లెలా సరిపోతుందీ?" అని సాగదీశేరు. ఒకవేళ సరిపెట్టుకున్నా "అంత అద్దె మేం ఎక్కడ యివ్వగలం? సంసారులవా? సన్యాసులవాఁ?" అన్నారు.

నిన్ననే మరో ఇల్లు చూపించిందీ. అది తనకీ నచ్చింది. అద్దెకూడా అందు బాటులోనే ఉంది. వాళ్ళకీ ఇల్లూ, అద్దె రెండూ నచ్చేయట. అమ్మయ్య అని జానకి నిట్టూర్చేలోపల "ఆ ఇంట్లో దెయ్యాలున్నాయట. అసలే పసిపిల్లల్తో ఉన్నాం" అన్నారు. ఇంకో ఇల్లుంది. కాని "మా ఇంటిని తాళంపెట్టి పాడుపెట్టేస్తాం. కాని వాళ్ళకి యివ్వం" అన్నారు ఆ ఇంటివాళ్లు. దిక్కుతోచడంలేదు జానక్కి.

"నా మాటవిని ఒకపనిచెయ్యి. ఇల్లు పైకప్పు విప్పించీ. మళ్ళీ వాళ్లు వెళ్ళే వరకూ నేయించకు. ఎండకి ఎలకల్లా మాడిచస్తారు. అప్పుడు చచ్చినట్లు ఖాళీ చేస్తారు" అని ఉచిత సలహా యిచ్చేడు ఒక ఉదారుడు.

సలహాకేం? బ్రహ్మాండంగావుంది.

కాని లోపలంతా బాగుచేయించేక యిప్పుడెవరైనా యిల్లు విప్పుతారా: పైగా ఇల్లు కట్టడానికేకాదు, విప్పడానికీ ఉండాలి డబ్బు. తీరా విప్పేక "ఈ దూలం పనికి రాదు. ఆ వాసం పుచ్చిపోయింది" అంటూ మేస్త్రీలు పీకి పారేస్తారు. దానికి అవబోయే ఖర్చు, ఇప్పటికి అయిన ఖర్చు కలిపితే ఒక చిన్నసైజు కొత్తయిల్లే కట్టుకోవచ్చును.

మరేఁవిఁటి ఉపాయం? ఏదో తట్టకపోతుందా అన్న ధైర్యంతోనే పనులు చేయిస్తోంది జానకి.

ఆవేళ సాయంత్రం రాజేశ్వర్రావు కాంపౌండరుచేత రెండువేల ఇటిక తెప్పిం చింది. కాని ఆ ఇటిక ఎక్కడ పెట్టడం? సాయంత్రం కూలీ లెక్కడినుంచి వస్తారు? ఏఁవిఁటో అంతా కొత్త పూజారత్వం!

"ఈపొద్దుకి రోడ్డువారని పోసేస్తావండి. రేపొద్దుటేళ కూలాళ్ళచేత లోపల ఒడేయించుకోండి" అంటూ ఆ బళ్ళవాళ్లు దభీమని ఇటికలన్నీ రోడ్డుమీద ఒంపేసి పోయేరు. రేపు మళ్ళీ కూలీలు ఎక్స్ట్రా కావాలి.

"ఇల్లు కట్టిచూడు" అన్నారు పూర్వులు.

"ఇల్లు రిపేరు చేయించి చూడు."

"అద్దెకిచ్చి ఇల్లు రిపేరుచేయించి చూడు."

"అద్దె రాబట్టి చూడు."

కొత్త సామెతలు బావుఁన్నాయి జానక్కి. బావులేనిది ఆమె అనుభవమే.

(సశేషం)

వి చి త్ర వి భూ తి యో గం

సమదృష్టిని చాటుటలో, తరుణీ నీ సరి ఎవరే?

* 'బంగారాన్నీ బూడిదనీ ఒకేలాచూస్తాను, అందుకే ఎరగను నేనెప్పుడూ కోపమన్నది'
అని ఉపన్యసిస్తున్న ఆ సంతోషిమా శిష్యురాలు ఎదుటి అద్దంలో ఏంచూసిందో, ఆగింది.
నగల బరువు దిగలాగుతున్నా, మెరుపు వేగంతో మొగుణ్ణి 'కార్నర్ చేసి' నిప్పులు కురిపించింది,
'నలుగుర్లో నగుబాటు చెయ్యాలనేగా నా మొహాన్ని పౌడర్ ఎక్కువయినా చల్లగా ఊరుకున్నదీ!'

సరుకు మార్చుమా, సర్కారోత్తమా!

* అందులో అర్థం లేకపోలేదు, ఆలోచించు, అన్నవారు ఎవరైతే నేం?
గుట్టల కొద్దీ విభూతి పంచేసుకుంటాం, తోమిన అంట్లే ఎన్ని జన్మలు తోముకుంటాం?
అదే రూపం అంతే ఖారం కాబట్టి మరేం ఆగదులే నీ మహేంద్రజాలం
పంచదారగానో, మైదాపిండిగానో, పోనీ పాండ్స్ పౌడర్ గానో మార్చి చూస్తే ఏం?

ఫలచ్యుతి

* ఎన్నెన్నో ఆకలినోళ్ళు ఎదుపుగా ఏడుస్తూంటే, అదెక్కడుందో, ఆ విశ్వశాంతి కోసం
అహ్మదాబాద్లో గత డిశెంబర్లో అగ్నినోట్లోపోశారు, అంతా రెండున్నర లక్షల 'తైలం'
యాగఫలం వెంటనే కలిగింది, జనవరి షష్టునే భగ్గుమంది 'ఎంపరర్ అశోకా' విమానం
అందులోని సుమారు రెండొందల బలగం వివరం ఈసరికి ఎరగం-అది వేరే విషయం!

మనిషయితే న్యూనత, మరణిస్తే దేవత!

* మాట పడిపోయి మంచాన్ని అతుక్కుపోయినా, ఒంటిశుభ్రం.ఒదలని ఓ పంతులుగారు
ఎంత మూలిగినా, నాలుగు రోజులకోసారయినా ఎవరూ స్నానం చేయించేవారుకారు.
అన్నీ అయిపోయాక ఆ చితాభస్మాన్ని పదిమంది కొడుకులూ తన్నుకు పంచేసుకున్నారు
దేశంలో అన్ని పవిత్ర నదుల్లో దాన్నికలిపిన ఆ పితృభక్తిని ఆదర్శంగా చెప్పుకోని వారు లేరు

గొంతుక యింకా దిగనేలేదు భస్మం, గుండెల్లో సంపూర్ణ విప్లవం!

* జబ్బులోపోటీగా ఆడేస్తూ కబాడీ, అన్ని అరుపుల్నీ చేసేస్తూ మిమిక్రీ
బాధ పడుతూంటే అస్త్మాతో మురారీ, భలే వైద్యం చేసింది జాలిగుండె బామ్మాజీ
'నోట్లో వేశానుగా సుగంధ విభూతీ, దీన్తో ఎక్కడిది అక్కడ అవాలి పరారీ'
నిజమే. ఆ శాల్తీకి వచ్చినంత ఎలర్జీ. గంటలోగానే తరలింది అక్కణ్నుంచి పల్లకీ!

స్నేహం కన్న తీయనిది

ద్విభాష్యం రాజేశ్వరరావు

విశ్వనాథం 'రాజుపాలెం' జంక్షన్‌లో బస్సు దిగేడు.

పై మీది వుత్తరీయం సవరించుకొని చుట్టూ కలయజూసాడు. ఎడంగా రోడ్డు అవతల రావి చెట్టు క్రింద విశ్రాంతి తీసుకొంటున్న నలుగురు రిక్షావాళ్ళు ఒక్కసారిగా లేచివచ్చి అతణ్ణి చుట్టుముట్టారు. అందులో ఒకడు చొరవగా 'ఎక్కడికి వెళ్ళాలి బాబూ!' అంటూ విశ్వనాథం చేతిలోని సంచి అందుకొన్నాడు.

"రాజుపాలెం వెళ్ళాలి" అన్నాడు విశ్వనాదం.

"ఎక్కండి బాబూ" అంటూ రిక్షా సీటు చేతిగుడ్డతో తుడిచి సరిచేసాడు. సంచీని ఒక వారగా సీటుమీద పెట్టాడు.

"ఎంతివ్వమంటావ్?"

"తమకు తెలియందేముంది? రెండు రూపాయలు!" అన్నాడు రిక్షావాడు.

"రూపాయన్నర ఇస్తాను!"

"కట్టలేం బాబూ!" అన్నాడు రిక్షావాడు. తనేకాదు, ఎవరూ రిక్షా కట్టరన్న ధ్వని సూచిస్తూ. విశ్వనాథం కొంతసేపు మాట్లాడలేదు.

మళ్ళీ రిక్షావాదే అన్నాడు—"తమలాంటి పెద్దవులు మాలాంటి పేదోళ్ళ కష్టం సూడాల!"

విశ్వనాదం దీర్ఘంగా నిట్టూర్చి 'సరే పద!' అంటూ రిక్షా ఎక్కి కూర్చున్నాడు.

రిక్షా 'జంక్షను' వదలి మట్టిరోడ్డు పట్టింది. విశ్వనాథం రిక్షాలో సర్దుకొని కూర్చున్నాడు. మనసులో రిక్షావాడి మాటలు మననం చేసుకొన్నాడు.

"అతని దృష్టిలో తనో ప్రభువు! తనెక్కింది రిక్షాకాదు, పల్లకీ కాబోలు!"

ఆలోచనలకు నవ్వు వచ్చింది.

'తనా' చదువుకొనే పిల్లల దృష్టిలో బతకలేని బడిపంతులు! భార్య కాంతమ్మ దృష్టిలో బతకటం చేతకాని బడిపంతులు! కూతురు లక్ష్మి దృష్టిలో తనకి ఎప్పటికీ పెళ్ళిచెయ్యలేని ఓద బడిపంతులు! అలాంటి తను-రిక్షావాడి కష్టం చూడాలి! తన కష్టం ఎవరు చూస్తున్నారు? ఏడాది పొడుగునా పాఠాలు చెప్పించి రావల్సిన 'ఎరియర్సు' ఇవ్వని స్కూలు కమిటీవారా? ఎంత జాగ్రత్తగా పాఠాలు చెప్పినా, సర్కారు వారి బహుమతులు పొందినా, ఇంకా ఎ టీచింగు నోట్సు సరిగా లేదని వంకలు పెట్టే హెడ్మాస్టరా? తమ పిల్లలకు ప్రైవేట్లు చెప్పించుకొని నెలాఖరున డబ్బులు ఎగవేసే పిల్లల తల్లిదండ్రులా? ఎవరు చూస్తున్నారు తన కష్టం? కాని, తను రిక్షావాడి కష్టం గమనించాలి.

దీర్ఘంగా నిట్టూర్పు వదలి చుట్టూ కలయ చూసాడు, విశ్వనాథం.

రోడ్డుకు ఇరువైపులా వున్న సర్వేచెట్లు, చిన్నచిన్న పొదలు, మెల్లగా వెనక్కు కదిలిపోతున్నాయి. ఎండ తీవ్రత రానురాను హెచ్చవుతోంది. కుడిప్రక్కగా ఎండిపోయిన కొండవాగు! ఎండకు వాగులోని పొడియిసుక తమాషాగా మెరుస్తోంది. వాగుకు అవతలి

వైపున దట్టమైన మామిడితోపు! ఇంకా వెనుక దూరంగా పచ్చని కొండలు. అంతా ఏజన్సీ ఏరియా? నిండా ప్రకృతి సంపద!

రిక్షా గతుకుల్లో పడుతూ లేస్తూ వెళ్తోంది! పెద్ద గోతిలో పడినపుడల్లా రిక్షా సీటు ముందుకు జారుతోంది. వెనక్కు సర్దుకొని కూర్చున్నాడు విశ్వనాథం. చేతిసంచి పడి పోకుండా ఒక మూలగా సర్దేశాడు.


రాజుపాలెంలో సుందర్రామయ్య వున్నాడు. సుందర్రామయ్యా, తను చిన్ననాటి స్నేహి తులు. వీధి అరుగుబడి నాటినుండి కలిసి అధ్యయనం చేసారు. ఒకే కంచంలో తిన్న రోజులు కూడా వున్నాయి. ఒకే మంచంమీద నిద్రపోయిన వతు పెరిగేరు. స్కూలుకు వెళ్ళినా, ఎగ్గొట్టి తోటల్లో తిరిగినా కలిసే చేసారు. ఒకనాడు 'ఈమని' వారితోటలో సువర్ణరేఖ మామిడి పళ్ళు తాను చెట్టెక్కి తెంపుతూవుంటే మిగిలిన పిల్లలు ఏరుకుంటు న్నారు. ఆ సమయంలో తోటకాపు వస్తే అందరూ పారిపోయేరు ఒక్క సుందర్రా మయ్య తప్ప' తామిద్దరూ కలిసి వాడిచేత తన్నులు తిని యింటికి తిరిగి వచ్చేరు. స్నేహా నికి ప్రాణమిచ్చే మనిషి సుందర్రామయ్య.

తాను స్కూలు ఫైనలు అయ్యాకా టీచరు ట్రైనింగ్ పూర్తిచేసి జీవితంలో బడిపంతు లుగా స్థిరపడిపోయేడు. ఈ ముప్పై రెండేళ్ళ టీచరుగిరీ తనకో చిన్న పెంకుటింటినీ, బేంకులో రెండువేలరూపాయల ఎకవుంటునూ, అనుక్షణం తన అసమర్థతను ఎత్తిచూపే భార్య కాంతమ్మనూ, వివాహానికి ఎదిగి గుండెలమీద కుంపటిలా తయారయిన లక్ష్మినీ మిగిల్చింది.

సుందర్రామయ్య చాలా తెలివైనవాడు. అందుకే స్కూలు ఫైనల్ తర్వాత టీచరు ట్రైనింగ్ అవలేదు. చదువు మానేసి వ్యాపారంలోకి దిగాడు. చిన్నచిన్న వ్యాపా రాలు చాలా చేసేడు. బొగ్గులకొట్టు లగా యితూ బట్టలకొట్టు వరకు అన్ని రకాల వ్యాపారాలు చూసేడు. కన్యాకుమారి మొదలు కటక్‌వరకూ అంతా కలయతిరిగేడు. వ్యాపా రానికి కావల్సిన జ్ఞానం చాలా సముపార్జించు కొన్నాడు. అతడు చేసిన ఏ వ్యాపారంలోనూ నష్టపోయినట్లు తను వినలేదు. వ్యాపారంలో కాస్త నిలదొక్కుకున్నాకా వివాహం చేసు కొన్నాడు. తన పెళ్ళికంటే మూడేళ్ళముందే అతని పెళ్ళి అయింది. తరువాత ఏడెనిమి దేళ్ళకు ఏలూరు వదిలి దూరంగా ఈ ఏజన్సీ ప్రాంతానికి వచ్చేసి కలప వ్యాపారం ప్రారం భించేడు. తరువాత చాలా సంవత్సరాలు తామిద్దరూ కలియలేదు. ఉత్తరాలు వ్రాసు కొనే అలవాటు ఇద్దరికీ శూన్యమే!

నాలుగేళ్ళ క్రితం తాను ఏదో పనిమీద విశాఖపట్నం వస్తే అక్కడ బస్టాండులో కని పించాడు సుందర్రామయ్య! ఖరీదయిన బట్టల్లో తళతళలాడిపోతున్నాడు. చేతి వేళ్ళకు మెరిసే వుంగరాలు! తాను రాజుపాలెంలో వున్నట్లూ, చుట్టూ అడవిలోని కలప అమ్మకం కాంట్రా క్టుకు తీసుకున్నట్టూ చెప్పేడు. వ్యాపారం వేల పరిధి దాటి లక్షల పరిధిలో పడినట్లు అతని మాటలవలన అర్థం అయింది. తనను గురించి వివరాలన్నీ చాలా ఆప్యాయంగా అడిగి తెలుసుకొన్నాడు. 'నీకు తీరికయి నప్పుడు రాజుపాలెం వచ్చి మా యింట్లో వారంరోజులు వుండి వెళ్ళు' అంటూ ఆహ్వా నించాడు. వాడి స్థితికి ఆనాడు చాలా గర్వించాడు తాను. అంతలోనే తను ఎక్కాల్సిన బస్సు వస్తే వాడిదగ్గర సెలవు తీసుకొన్నాడు.

ఆ తర్వాత ఈ మధ్యలో మళ్ళీ అతడి వివరాలు తెలియలేదు. సుమారు ఆరు నెలల క్రితం తమ చిన్ననాటి స్నేహితుడు ప్రకాశం ఏలూరు వచ్చాడు. అతడు మాటల సంద ర్భంలో 'సుందర్రామయ్యకి ఒక కొడు కున్నాడు. కుర్రాడు బాగానే వుంటాడు. మీ లక్ష్మికి మంచి ఈడుగా వుంటాడు. నీ కూతురి అందం ఏంతక్కువ కాదుగదా! పెళ్ళి చేసుకో మని అడగరాదూ!' అన్నాడు.



ఆ మాటల్ని అప్పట్లో తాను పెద్దగా పట్టించుకోలేదు. కాని కాంతమ్మ మటుకు ఆ మాటలు విని మహదానందం పొందింది. ఆ నాటినుండి ఈ సంబంధానికి ప్రయత్నించమని చెవిలో యిల్లు కట్టుకుని పోరు ప్రారంభించింది. కయ్యమయినా వియ్యమయినా సమానులతోనే సాధ్యమవుతుందని నమ్మేవాడు తను! కాని, భార్య మాటల్లో కూతురి సుఖాన్ని దృష్టిలో పెట్టుకొని ఆలోచిస్తే మటుకు స్వార్థం అడ్డు నిల్చింది.

'పోనీ సుందర్రామయ్యను ఈ విషయమై కదిపి చూస్తేనో '' అనిపించింది కొద్ది దినాల తర్వాత. రానురాను ఆ ఆశ బలవత్తరమై మదిలో నిలిచిపోయింది. కూతురుకి డబ్బున్న సంబంధం చేయాలనే కోరిక మొగ్గ తొడిగింది.

తన కూతురు లక్ష్మి చాలా అందంగా వుంటుంది. చిదిమి దీపంపెట్టుకోవచ్చు. తన ఆస్థిని చూసి కాకపోయినా లక్ష్మి అందాన్ని చూసి అయినా సుందర్రామయ్య తన కొడుక్కి చేసుకోవచ్చు. ఈ సంబంధం చేస్తే లక్ష్మి సుఖపడుతుంది. అసలు ఆమె తన యింట పుట్టవలసిన పిల్లకాదు. ఏ భాగ్యవంతుల ఇంటనో పుట్టి సర్వభోగాలు అనుభవించాల్సిన లక్ష్మీ కళ ఆమె ముఖంలోవుంది.

సుందర్రామయ్యను ఈ సంబంధానికి వప్పిస్తే తన జన్మ ధన్యమయినట్లే! తనవద్ద రెండువేల రూపాయలున్నాయి. మరో రెండు వేలు అప్పుచేస్తే వివాహం జరిపించవచ్చు. ప్రావిడెంటు ఫండులో అప్పు తీర్చి, పారెయ్యొచ్చును. ఈ పెళ్లితో తన బాధ్యత తీరిపోతుంది. స్వంత యింట్లో 'పెన్షన్' డబ్బులతో తనకూ భార్యకు రోజులు వెళ్ళక పోవు!

ఆలోచనల్లో మునిగిన విశ్వనాధానికి ఊళ్ళోకి చేరుకున్న సంగతే తెలియలేదు. 'ఎవరింటికి వెళ్ళాలిబాబూ!' రిక్షావాడి పిలుపులో ఈ లోకంలోకి వచ్చాడు. "సుందర్రామయ్యగారింటికి!''

రిక్షావాడు దిగి మెల్లగా గోతుల్లోంచి బండిని నడిపిస్తున్నాడు.

సుందర్రామయ్యకు జున్ను అంటే చాలా యిష్టం. భార్యతో తానీ విషయం చాలాసార్లు

మాటల సందర్భంలో చెప్పేడు. నిన్న వుదయం పక్కింటి వాళ్ళ గేదె ఈనింది. వాళ్ళ దగ్గర జున్ను పాలు తీసుకొని జున్ను వండి చిన్న కేరియర్‌లోపెట్టి యిచ్చింది భార్య. "మీ స్నేహితుడికి ఈ జున్ను యివ్వండి సంతోషిస్తాడు!" అంది.

జున్ను కేరియరు ఒలికిందేమోనని సంచీ సర్దిచూసేడు విశ్వనాథం.

శ్రీకృష్ణుని వద్దకు సంపదలకోసం బయలు దేరిన కుచేలుని స్థితి జ్ఞప్తికి వచ్చింది. కాక పోతే మిత్రునికి ఇవ్వబోయేవి అటుకులుకావు. అతనికి అతి ప్రియమైన జున్ను! అడగ బోయేవి సంపదలుకావు. అంతకుమించిన సంబంధం'

నవ్వుకున్నాడు తనలో తనే!!

రిక్షా ఓ పెంకుటింటిముందు ఆగింది.

"దిగండి బాబూ!" అన్నాడు రిక్షావాడు.

విశ్వనాథం రిక్షా దిగేడు. ఇల్లు చూసేసరికి అతనికి అనుమానం వచ్చింది.

"కలప వ్యాపారి సుందర్రామయ్యగారి ల్లేనా?" మరోమారు అడిగేడు.

"అవును బాబూ! ఇదే" అంటూ రిక్షా వాడు తనకు రావల్సిన డబ్బులు తీసుకొని వెళ్ళిపోయాడు.

మెల్లగా లోగిలి మెట్లెక్కి తలుపుతట్టేడు.

తలుపు తెరుచుకొంది.

ఎదురుగా సుందర్రామయ్యగారి భార్య శేషమ్మ! ఆమెను చూసి చాలా కాలమైనా గుర్తుపట్టగలిగేడు. ఆమెలో వార్ధక్యం నీడలు అప్పుడే బాగా పడుతున్నాయి. తల అక్కడక్కడ నెరిసిపోయింది. ఆవిడ తనవంక గుర్తుపట్టలేనట్లుగా చూస్తూ వుండిపోయింది.

"నేను విశ్వనాథాన్ని! ఎలూరునుండి వస్తున్నా" అన్నాడు.

"మీరా! రండి. చూపు సరిగా ఆనక గుర్తించలేకపోయాను." అంటూ లోనికి దారి తీసింది. 'కూర్చోండి' అంటూ కుర్చీ చూపించింది. వంటింట్లోకి వెళ్ళి గ్లాసుతో దాహం తీసుకువచ్చింది.

అంతలోనే సుందర్రామయ్య లోపలినుండి వచ్చాడు.

"ఎరా! ఇంత కాలానికి గుర్తువచ్చానన్న మాట" అంటూ ఆప్యాయంగా కౌగలించుకొన్నాడు విశ్వనాథాన్ని.

"వీడు తనని మరచిపోలేదు" అనుకొన్నాడు విశ్వనాథం.

కాని, వీడిలో ఈ మార్పేమిటి?

మెడలో తళతళలాడే గొలుసుతో తెల్లని ఆ పులిగోరు పతకం ఏది? చేతివేళ్ళకు ధగ ధగ మెరిసే రాళ్ళతో బంగారపు టుంగరాలేవి?

సుందర్రామయ్య యిలా అయిపోతూ దేమిటి?

ఐను నాలుగేళ్ళక్రితం చూసిన సుందర్రామయ్యకు హఠాత్తుగా పధ్నాలుగేళ్ళ వయసు పెరిగిందా?

కనులవెనుక ఆ పట్టుదల, నిశ్చలతపోయి, ఆ దీనత్వం ఎలా చోటుచేసుకొంది?

తన మనసులో ముద్రించుకొన్న సుందర్రామయ్య రూపానికి బదులు ఏదో కదలిపోయిన ఫొటోను చూసినట్టుంది విశ్వనాథానికి.


"అలా చూస్తున్నావేమిట్రా?"

"నీలో ఎంత మార్పు వచ్చిందా అని చూస్తున్నా!"

సుందర్రామయ్య చిన్నగా నవ్వేడు.

జీవితంలోని ఒడుదుడుకుల నన్నిటినీ జీర్ణించేసుకొని, ఎంతటి కష్టాన్నయినా స్వీకరించటానికి సిద్ధపడిన చిరునవ్వులా అనిపించింది విశ్వనాథానికి. తరువాత తన భార్య గురించి, లక్ష్మిని గురించీ వివరాలు అన్నీ అడిగేడు సుందర్రామయ్య. అతడి మాటల్లో తన ఎడల ఎంతో అనురాగం ధ్వనించింది.

శేషమ్మ వంటింట్లోంచి వచ్చి "మీరు మాటల్లో పడితే ఏమీ గుర్తుండదు. అన్నయ్య



గార్ని కాళ్ళు చేతులు కడుక్కోమనండి! భోజనం చేస్తారు" అంది.

విశ్వనాధం వూహించుకువచ్చిన దానికీ, ఈ యింట్లో పరిస్థితులకు ఎంతో తేడా కన్పిస్తోంది. ఇంట్లో నౌకర్లు ఎవరూ కనిపించటంలేదు. సుందర్రామయ్యే స్వయంగా నూతివద్దకు వచ్చి నీళ్ళు తోడేడు.

"ఆకాశంనుండి భగీరధుడు గంగనుక్రిందికి దింపేడు. ఇప్పుడు ఈ ఏజన్సీలో పాతాళం నుండి గంగను జుట్టు పట్టుకొని పైకి లాగాల్సి ఎస్తోంది." అంటూ బాల్చీ పైకి తీసాడు.

విశ్వనాధం కాళ్ళు కడుక్కొని భోజనానికి వుపక్రమించాడు. సుందర్రామయ్య పక్కన పీట వాల్చుకొని కూర్చొని కొసరికొసరి తిని పిస్తూ చిన్ననాటి కబుర్లు చెప్తున్నాడు. అతని ధోరణి ఏమీ మారలేదు.

"ఆవకాయ కలపకుండా వదిలేశావేం?" అన్నాడు.

"నీకు తెలుసుగా చిన్నతనంలోనూ కారం తక్కువే తినేవాణ్ని!" అన్నాడు విశ్వనాధం నవ్వుతూ.

"మీ గోదావరి జిల్లా ఆవకాయలా వుండదని భయపడుతున్నావు గాబోలు! శేషమ్మ ఆవకాయ పెట్టటంలో మంచి ఎక్స్‌పర్ట్! ఎంత విశాఖజిల్లాలో వున్నా ఆవకాయలో మటుకు ముందే వున్నాం. ఒకసారి తింటే మరి వదలవు! కాస్త కలుపు!" అంటూ బలవంతాన అన్నం కలిపించాడు.

శేషమ్మ మిత్రుల కబుర్లు వింటూ నవ్వుకొంటూ పక్కన నిలబడి విసురుతోంది.

విశ్వనాధం భుక్తాయాసంతో విస్తరి దగ్గర నుండి లేచాడు.

గదిలోకి వచ్చి తన సంచిలోని కేరియరు తీసి సుందర్రామయ్యకు అందించేడు.

"అందులో ఏముందో చూడు. మా ఆవిడ నీ కోసం చేసి పంపింది!" అంటూ.

ఆత్రంగా కేరియరు విప్పి అమితానందం పొందాడు.

"ఇంకా నా చిన్ననాటి ఇష్టాలు నువ్వు మరచిపోలేదన్నమాట," అన్నాడు. శేషమ్మను కేకేసి "చూడవోయ్! మా చెల్లాయి జున్ను పంపింది. ఏనాడయినా నా కిష్టమైనది నువ్వు

వేసాడు.

తర్వాత మిత్రులిద్దలూ కబుర్లలోకి దిగారు. క్రమంగా మిత్రుని మాటల్లో విశ్వనాధానికి సంగతులన్నీ అవగతమయ్యాయి.

సుమారు ఎనిమిదినెలల క్రితం అడవిలో అగ్నిప్రమాదం సంభవించి సుందర్రామయ్య కలప 'అడితీ' ధ్వంసం అయిపోయింది. అందులో సుమారు రెండు లక్షలవరకూ నష్టం వచ్చింది. దానితో అతడి జీవనగతే మారిపోయింది. అప్పులవాళ్ళు పైనబడటంతో బంగారం, ఇతర విలువైన సామానులు హరించుకు పోయాయి. ఆఖరికి అతడుండే మేడ కూడా అమ్మాల్సి వచ్చింది. ఈ కొద్ది వ్యవధిలోనే అతడి బతుకు బజారుపాలయ్యింది.

సుందర్రామయ్య యీ విషయాలన్నీ తాపీగా వివరించి చెప్పేడు.

"అంత ధైర్యమైన వాడు కనకనే ఈ దెబ్బను తట్టుకొన్నాడు. తనయితే ఈపాటికి గుండె ఆగి చచ్చిపోయి వుండేవాడు." అనుకొన్నాడు విశ్వనాధం.

"నీ కొడుకు ఎక్కడా కనబడ్డేం?"

ఈ సంగతి అడిగేసరికి సుందర్రామయ్య కళ్ళలో నీళ్ళు తిరగటం గమనించేడు.

"నా దగ్గరవుండి వ్యాపారం చూసుకొనేవాడు. ఈ గొడవలొచ్చాకా వుద్యోగంలో చేరాల్సి వచ్చింది. బీహారులో వాడి స్నేహితుడి దగ్గరకు వెళ్ళిపోయాడు. అక్కడ మూడొందలు జీతంమీద ఉద్యోగం చేస్తున్నాడు. ఇంటికో వందరూపాయలు పంపుతున్నాడు." అని కాసేపు ఆగి "మహారాజు బిడ్డలా పెంచేను. ఆఖరికిలా అయింది. కష్టాలన్నీ నావికావు వాడివే!" అన్నాడు. అతని కంఠం రుద్ధమైంది.

ఇక ఆ విషయం పొడిగించటం ఇష్టంలేక చిన్ననాటి విషయాలమీదకు మళ్ళించాడు విశ్వనాధం.

ఆ రాత్రి అక్కడే గడిపాడు. అయితే, ... మరుగున పడిపోయింది.

ఆ మర్నాడు వుదయం ప్రయాణానికి సిద్ధమయ్యాడు.

"మరి రెండు రోజులుండి వెళ్ళరాదూ?" అన్నాడు సుందర్రామయ్య. అవుసరమయితే నిజానికి మరో రెండు రోజులుండాలనే వచ్చాడు. కాని వుండటానికి మనసొప్పడం లేదు.

"అబ్బే! శెలవల్లేవు. మళ్ళీ రేపు వుదయం స్కూలుకి వెళ్ళాలి!" అన్నాడు.

"ఓసారి ఇలా వస్తారా?" అంటూ సుందర్రామయ్యను పిలిచింది శేషమ్మ.

అతడు లోనికి వెళ్ళాడు.

విశ్వనాధం సంచీ సర్దుకొంటూ వుండే వంటింట్లోంచి ఆ దంపతుల మాటలు మెల్లగా వినిపిస్తున్నాయి.

"మన అబ్బాయికి వాళ్ళ లక్ష్మిని పెళ్ళిచేసుకొంటే బాగుంటుందండీ! మీ స్నేహితుడికి చెప్పండి. ఆయన నాలుగురాళ్ళు వెనకేసే వుంటాడు" అంటోంది శేషమ్మ మెల్లగా.

"మన యింటికి వచ్చాడు కదా అని యిప్పుడే అడిగితే బాగుంటుందా? నేను మళ్ళీ నెలలో విజయవాడ వెళ్ళాలి. అప్పుడు ఏలూరు వెళ్ళి అడుగుతాను. విశ్వనాదం మంచివాడే! తప్పక సంబంధానికి వప్పుకొంటాడు" అంటున్నాడు సుందర్రామయ్య.

తరువాత దంపతు లిద్దరూ బయటకు వచ్చేరు. "మళ్ళీ నెలలో విజయవాడ రావాలి అపుడు మీ యింటి కొస్తాను." అన్నాడు.

"తప్పకుండా రావాలి!" అన్నాడు విశ్వనాధం.

వాళ్ళిద్దరి దగ్గర శెలవు తీసుకొని రిక్షా ఎక్కేడు. రిక్షా ముందుకు కదిలిపోయింది.

రిక్షాలో కూర్చున్న విశ్వనాధం మనసులో ఇప్పుడు ఒక్కటే ఆలోచన. 'సుందర్రామయ్య వచ్చి అడిగితే తన కూతుర్ని అతని కొడుక్కి చేసుకోనని ఎలా చెప్పాలా?' అని.

***

రాక్షసుడు

తమిరిశ జానకి

"నిద్ర రావట్లేదు. కథ చెప్పమ్మా."

"ఇంకో రోజు చెప్తాన్లేమ్మా! పడుక్కో. మంచిదానివి కదూ!"

"ఊఁ ఇప్పుడే చెప్పు." ఏడేళ్ళ రమ గునిసింది.

దానికి రవి కూడా వంత పాడాడు. "చెప్పమ్మా. కథ వింటూ నిద్రపోతాం."

"ఏం కథ చెప్పనూ? కాకి, నక్క బావ కథ చెప్పనా?"

"ఆ. చెప్పు చెప్పు" ఉత్సాహంగా తల్లి మొహంలోకి చూసింది రమ.

"వొద్దమ్మా ఎప్పుడూ అలాంటి కథ లేనా? ఏవైనా రాక్షసుల కథ చెప్పు " అడిగాడు రవి. వాడికి తొమ్మిదేళ్ళు. ఈ మధ్య స్నేహితుల దగ్గిర రాక్షసుల కథలు, డిష్యూం డిష్యూం కథలు వింటున్నాడు వాడు. ఆ కథలు ఎంతో నచ్చుతున్నాయి వాడికి. అటువంటి కథలు వినేటప్పుడు వాడిలో తెలియని ఆవేశం వచ్చి కళ్ళు పెద్దవి చేస్తాడు. ఆ రాక్షసుల్ని, దొంగల్ని తనే పిండిపిండి చేసెయ్యగల డన్నట్టు పోజుకూడా పెట్టేస్తాడు. పెద్దయ్యాక దొంగల్ని, రౌడీల్ని పట్టుకుని డిష్యూం డిష్యూంతో ఓడించి పారెయ్యాలన్న కోరి కుంది వాడిలో.

"రాక్షసుడి కథ కావాలా నీకు?" అడిగింది అరుంధతి.

"ఔనమ్మా! చెప్పు " రవి తల్లి చేతి కున్న గాజులు టింగుమనిపిస్తూ అడిగాడు.

"సరే! అయితే, వింటూ, నిద్రపోవాలి. తెల్సిందా?"

తెల్సిందన్నట్టుగా బుద్ధిగా తలలూపారు పిల్లలిద్దరూ.

"మరేమో ఒక పెద్ద అడవి వుందిట. ఆ అడవికి అవతల ఒక పెద్ద కొండ ఉందిట. ఆ కొండ గుహలో ఒక రాక్షసుడుండే వాడుట."

తల్లికి దగ్గరగా జరిగి, తల్లి కొంగు రెండు చేతుల్తోనూ గట్టిగా పట్టుకుంది రమ.

"ఆ రాక్షసుడు కొండకి దగ్గర్లో వున్న ఒక ఊరిమీద పడి, రోజుకో మనిషిని ఎత్తు కొచ్చి చంపి తినేస్తుండేవాడుట. ఒకరోజు వాడికో వింత కోరిక కలిగింది. మనుషులు తినే తిండి అప్పుడప్పుడు తింటే బావుండు ననిపించింది కానీ వాడికి ఎవరొండి పెడ తారు? అందుకని వాడేం చేశాడంటే నా అన్న వాళ్ళు లేకుండా ఒంటరిగా బతుకుతున్న ఒకమ్మాయి ఇంటికి వెళ్ళాడు అర్ధరాత్రి. ఆ అమ్మాయి కెవ్వుమంది వాడిని చూసి. నోరెత్తావంటే చంపేస్తాను. నేను చెప్పినట్టు చెయ్యి. నీ ఇంట్లోవున్న బియ్యం, పప్పులు, పచ్చళ్ళు తిండి సరకులన్నీ ఏవేం వున్నాయో అన్నీ ఇలా పట్రా. అవన్నీ మూటకట్టు అని ఆజ్ఞాపించాడు. ఆ అమ్మాయి ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని వాడు చెప్పినట్టే చేసింది. ఆ మూట ఒక భుజంమ్మీద, ఆ అమ్మాయిని ఒక భుజంమ్మీద ఎక్కించుకుని తన గుహకి తీసికెళ్ళిపోయాడు. "

ఒక్క నిమిషం చెప్పడం ఆపింది అరుంధతి.

"అయ్యో పాపం " జాలిగా మొహం పెట్టాడు రవి.

"ఆ అమ్మాయి పాపం ఎంతోసేపు ఏడ్చి వుంటుంది కదమ్మా " మరింత జాలిగా అడిగింది రమ.

"ఔనమ్మా..ఎంతో ఏడ్చింది ఆ అమ్మాయి తనని వదిలిపెట్టెయ్యమని . అయినా సరే ఆ రాక్షసుడికి దయ కలగలేదు."

"రాక్షసులకి దయ వుండదు కదమ్మా?"

"వుండదురా. కొందరు మనుషులు కూడా ఏమాత్రం దయలేని వాళ్ళుంటారు. అటువంటి వాళ్ళని అందుకే రాక్షసులని తిడతారు."

రవి కనుబొమ్మలు ఒక్కక్షణం ముడి పడ్డాయి.

ఏదో ఆలోచన వాడి బుఱ్ఱలో కదలాడింది.

మళ్లీ కథ చెప్పడం మొదలుపెట్టింది అరుంధతి.

"పాపం ఆ అమ్మాయి భయపడుతూ భయపడుతూనే ఆ రాక్షసుడికి వండిపెడుతూ వుండేది. ఎప్పుడో ఒకరోజు తనని చంపి తినేస్తాడని గుండెల్లో గుబులుగానే వుండేదామ్మాయికి. భగవంతుడిని మనసులో ప్రార్థించుకుంటూ రోజులు గడుపుతుండేది. ఒక రోజు రాక్షసుడు గుహకి వచ్చేసరికి ఆ అమ్మాయి ఏడుస్తూ కూర్చుని వుంది ఒక మూల. "నీ ఏడుపు చాలించు. ఇవాళ ఏవేం వండావు. నాకు త్వరగా వడ్డించు" అన్నాడా రాక్షసుడు.

అప్పుడామ్మాయి హడలిపోతూ లేచినిలబడి "పొద్దున్న నువ్వు బయటికి వెళ్ళేటప్పుడే చెప్పాను కదా సరుకులన్నీ అయిపోయాయని, వండడానికేమీ లేవు, సరుకులు తీసుకొస్తే వండుతానని" అంది.

అంతే కోపంలో ఆ రాక్షసుడి కళ్ళు మరింత ఎఱ్ఱనయ్యాయి. మరింత భీకరంగా చూశాడు.

"ఏవిటే కూశావు? వండలేదా? నీకెంత ధైర్యం? సరుకుల్లేవు వండలేదని ధైర్యంగా జవాబు చెప్తున్నావే? నిన్ను కరకరా నమిలినా పాపంలేదు" అంటూ చావబాదాడు.

ఆ అమ్మాయి ఏడ్చింది మొత్తుకుంది. 'నా తప్పేముంది. నేనేం చెయ్యగలను. నువ్వు సరుకులు తీసుకొచ్చి ఇయ్యందే నేనెలా వండగలను' అంటూ కాళ్ళమీద పడి కొట్టద్దని ప్రాధేయపడింది. రాక్షసుడికి కోపమే తప్ప పరిస్థితి కొంచెం కూడా అర్థంచేసుకునే జ్ఞానం లేదు ఆ కోపంలో ఆ అమ్మాయిని చిత్రహింస పెట్టాడు.

ఇంతకంటే ఒక్కసారే నా గొంతునులిమి చంపేస్తే నేను సంతోషిస్తాను అంటూ ఆ అమ్మాయి ఒకటే గోల.

"అమ్మా!"

రమ మధ్యలో అడ్డు తగిలింది.

"ఏవిటే రమా?"

"నాకు భయం వేస్తోందమ్మా ఇప్పుడింక చెప్పకమ్మా కథ"

"సరేనమ్మా చెప్పనులే ఇంక పడుకో చూశావా రవీ రాక్షసుడి కథచెప్ప మన్నావు నువ్వు. చెల్లాయి చూడు భయపడు తోంది పాపం!"

"నాకేం భయంలేదు అందుకని చెప్ప మన్నాను" నసిగాడు రవి.

"పోన్లెండి. నిద్రపొండి"

"మిగిలిన కథ రేపు నాకు చెప్తావా మరి?"

"అలాగే" హామీ ఇచ్చింది అరుంధతి.

మరి కాసేపట్లో పిల్లలిద్దరూ పక్కకి తిరిగి కళ్ళు మూసుకున్నారు.

కిటికీలోంచి బయటకి చూస్తూ కూర్చుంది అరుంధతి. బయటంతా చీకటి వీధి దీపాలు వెలగడం మానేసి చాలా రోజులైంది. పట్టించుకునే నాధుడేడీ?


ఆ చీకటితో తన జీవితం పోల్చుకుంటూ భారంగా నిట్టూర్చింది.

ఎదురింటి ముందు కారు ఆగింది.

లోపల్నుంచి నౌకరు పరిగెత్తుకుంటూ వచ్చి గేటు తీశాడు.

కారు మెత్తగా జారుతూ లోపలికి దూసుకు పోయింది.

తొమ్మిదైంది అనుకుంటూ గోడనున్న గడియారం వంక చూసింది అరుంధతి.



సరిగ్గా ప్రతి రోజూ తొమ్మిదింటికల్లా వస్తారు ఎదురింటి ఆఫీసరుగారు క్లబ్బునించి. ఆయన క్లబ్బునించి ఇంటికి వచ్చాడంటే తొమ్మిదైందన్న మాటే సరిగ్గా. ఆయన్ని చూసి, తప్పు తిరుగుతున్న గడియారాల్ని సరిచేసుకోవచ్చు. వాళ్ళకి పిల్లల్లేరు పెద్ద ఇల్లు, కారు, ఇంటి చుట్టూ పూలతోట. ఏదోఒక లోటు వుండితీరాలన్నట్టు పిల్లల్నివ్వ లేదు వాళ్ళకి దేవుడు.


ప్రతిరోజూ ఆఫీసునించి వచ్చాక ఒక అరగంటలో భార్యని తీసుకుని క్లబ్బుకెళ్ళిపోతాడాయన. భార్యనికూడా తీసికెళ్ళకపోతే అసలే పిల్లలు కూడా లేరు ఇంక ఆవిడకి పగలూ రాత్రీ ఒక్కర్తీ కూచుని తోచక పిచ్చెక్కిపోదూ? అన్నీ వుండి పిల్లలు లేరన్న దిగుల్తో బాధపడే ఆ ఆఫీసరుగార్ని తల్చుకుంటుంటే అరుంధతికి, డబ్బులేక అధిక సంతానంతో ఎన్నో అవస్థలు పడ్డ తండ్రి గుర్తొచ్చాడు. భగవంతుడి సృష్టి ఎంత విచిత్రమైంది అనిపించింది.

గతం కళ్ళముందు కదలాడింది.

రాఘవయ్యగారికి ఆయనకి నలభైమూడో ఏట కడగొట్టుదానిగా, సరిసంఖ్య ఉంటే బావుంటుందంటూ అయిదుగురి అక్కల తర్వాత పుట్టింది అరుంధతి.

రాఘవయ్యగారూ, భార్య అనసూయమ్మ కూడా లోలోపల ఏడ్చుకుంటూనే పెంచుకొచ్చారు అరుంధతిని. అందుకే తల్లి తండ్రుల్లో ఎవరిదగ్గిరా కూడా చనువులేదా పిల్లకి.

ఒక్కనాడూ ఒక్క కొత్త గౌనుకూడా



నోచుకోలేదు. ఔను మరి ముందు అయిదు గురక్కలున్నారాయె. వాళ్ళకి పొట్టి అయిపోయిన గౌన్లు, పరికిణీల్లోనే పెరిగి పెద్దదైంది. ఏడాది పిల్లగా ఉన్నప్పుడే పెద్దక్క పెళ్ళయి వెళ్ళిపోడంతో అసలు పెద్దక్క దగ్గిర చనువన్న మాటే లేదు. తర్వాతి అక్కయ్యల దగ్గిర కూడా భయమే. పెద్దదవుతున్నకొద్దీ పాత బట్టల్లోకూడా చెల్లెలు కుందనపు బొమ్మలా ఉండడం అక్కలందరికీ అసూయగానే వుండేది. అరుంధతికి కాస్త జ్ఞానం తెలిసేసరికి ముగ్గురక్కలకి పెళ్ళిళ్ళయి కాపరాలకి వెళ్ళారు. తర్వాత వరసగా ప్రతి ఏడూ కాన్పులకి వాళ్ళు రావటం పిల్లలు ఆ బాదరబందీలో తల్లి, తండ్రులిద్దరికీ కూడా అరుంధతిని గురించి పట్టించుకుందుకు ఓపిక, తీరుబడి కూడా వుండేవి కావు.

సంసారం గడవక, అప్పులు చెయ్యని నెల వుండేదికాదు రాఘవయ్యకి. పాత అప్పులు తీరకుండానే కొత్త అప్పులతో గుండెల్లో మంటలు మరింత రాజుకుంటూ వుండేవి.

అరుంధతి ఎప్పుడైనా ధైర్యంచేసి, ఆడుకునేందుకేదైనా బొమ్మ కొనిమ్మని అడిగితే "నోర్మూసుకోవే ముద్దా! నీ మొహానికదొకటే తక్కువైంది" అంటూ చీదరించుకునే తండ్రి అక్కయ్యలొచ్చినప్పుడల్లా వాళ్ళ పిల్లలకి అడక్కుండానే ఆటసామాను కొనివ్వడం ఎంతైనా ఆశ్చర్యం కలిగించేది అరుంధతికి. "ఇప్పుడెందుకండీ ఇవి కొన్నారూ?" అంటూ అల్లుడు, ఏదో మొహమాటానికి అనాలికదా అని అనగానే, ఆయన మొహం చాటంత అయ్యేది. "చిన్నప్పుడు ఆడుకోకపోతే పెద్దయ్యాక ఆడుకుంటారా?" అంటూ చిరిగిన కాలరు సవరించుకునేవాడు, అల్లుడి ఎదురుగా మనవలకి బొమ్మలు కొనిచ్చినందుకు. అప్పుచేసి కొన్నాడన్నది అది వేరే విషయం. ఇటువంటివన్నీ చిన్నతనంనించే బాగా ఆకళింపు చేసుకున్న అరుంధతికి తండ్రి అంటే చనువులేకపోడమే కాక, ఆయనమీద కోపాన్ని కూడా పెంచుకుంటూ వచ్చింది లోలోపల. ఎంత కోపం వచ్చినా, ఎంత ఏడుపొచ్చినా అన్నీ లోలోపల అణిచి పెట్టుకోడమే తప్ప పైకి ప్రదర్శిస్తే వీపు విమానం మోత మోగుతుందని తెల్సు. వెన్నెముక విరగ్గొట్టుకోడమెందుకని నోరెత్తేది కాదు.

అనారోగ్యంతో సంసారం ఈడ్చుకొస్తున్న అనసూయమ్మకు చెయ్యాసరాగా వుండేందుకు

ఆంధ్రప్రదేశ్ ఎక్కడుంది?

ఎక్కడుంది ఆంధ్రప్రదేశ్? వింధ్యకు అటూ, యిటూ? అక్కడ పెట్టుబడి మించి రాబడి వస్తుందిట!

అక్కడ నా పరిశ్రమ మూడు పువ్వులూ, ఆరు కాయలుగా విస్తరిస్తుందట!

అడిగిందే తడవుగా, ఏవేవో పారిశ్రామికాభివృద్ధి సంస్థలు ఆసరాగా వచ్చి, బాసటగా నిలిచాయి. నన్ని రాష్ట్రంలో పారిశ్రామిక వేత్తగా నిలిపాయి.

ఇక్కడ గత నాలుగేళ్ళలోనూ రమారమి రూ. 90 కోట్ల పెట్టుబడి ధనంతో 72 భారీ మధ్యతరహా పరిశ్రమలు నెలకొన్నాయి. మరో 300 పరిశ్రమలు ద్వారాలు తెరుచుకోనున్నాయి. వీటిలో రూ. 850 కోట్ల అంచనా వ్యయంతో 193 సరికొత్త పరిశ్రమలు రూపురేఖలు దిద్దుకొని 60 వేల మందికి ఉద్యోగ ఉపాధి కల్పించనున్నాయి.

స్వయం ఉపాధి కల్పనా రంగంలో యీ రాష్ట్రం గర్వించదగ్గ ఔన్నత్యం గడించింది. సుమారు 8 వేల మంది ఔత్సాహికులు రూ. 19 కోట్ల పెట్టుబడి ధనంతో చిన్ని, చిన్ని పరిశ్రమలు పెట్టుకొన్నారు. 33,500 మంది విద్యావంతులైన నిరుద్యోగులకు ఉపాధి కల్పించారు.

ఆంధ్రప్రదేశ్ - పారిశ్రామికాభివృద్ధి సంస్థ, చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధి సంస్థ, ఆర్థిక సహాయక సంస్థ, ప్రాతిపదిక అవసరాల కల్పనా సంస్థవంటి స్వతంత్ర ప్రతిపత్తిగల సంస్థలెన్నో రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి చేదోడు వాదోడుగా కృషి చేస్తున్నాయి.

సృజనాత్మక ప్రతిభా వ్యుత్పత్తులున్న ఔత్సాహికులను...యిదిగో యిక్కడున్నానని వేనోళ్ళ పిలుస్తూంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం!

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమాచార, పౌరసంబంధ శాఖ
డైరెక్టరుచే ప్రకటితము.

39/77-78

తో ధర్మప్రకారం అరుంధతి చదువాగిపోయింది. తనపైనున్న అక్కలిద్దరి పెళ్ళిళ్ళు కూడా అయిపోయాయి. తండ్రి రిటైరవడానికి మరి రెండేళ్ళు మాత్రం వుంది.

చదువాపేసిన అరుంధతి వరసగా నాలుగేళ్ళు ఇంటిపనుల్లో బాగా అనుభవం సంపాదించేసింది. మొదటి రెండేళ్లూ ఇంటి పనుల్లోనూ, ఆ తర్వాతి రెండేళ్ళూ, ఇంటిపనుల్తో పాటు పెళ్ళిచూపులకి కూచోవడంలో కూడా బాగా అనుభవం వచ్చేసింది. పెళ్ళిని గురించిన ఆలోచనలొక్కటే అరుంధతికి రిలీఫ్ నిచ్చేవి. తెల్లవారి లేచినది మొదలు తల్లి సేవ, తండ్రికి కావల్సినవి చూడటం, పనిచేసేదాన్ని పెట్టుకోకపోడంతో ఆ పన్లు, వంట వీటన్నిటితో అలసిన మనసు రాత్రిళ్ళు రెక్కలు కట్టుకుని విహరించేది పెళ్ళి చేసుకుని తనా ఇంట్లోంచి వెళ్ళిపోతే తనకోసం అంతా సుఖమే ఎదురుచూస్తోందనుకునేది పంచరంగుల కలల్తో పరవశమైపోయేది అందరూ తనవంక కన్నార్పకుండా చూస్తారని ఏనాడో కనిపెట్టింది. పద్దెనిమిదో ఏడు నడుస్తుండగా పక్క ఇంట్లోకి అద్దెకి వచ్చాడు ఆనందరావు. అడపా దడపా ఎవరూ చూడనప్పుడు తనని పలకరిస్తుంటే మొదట్లో సిగ్గుతోనూ, భయంతోనూ జవాబీయకపోయినా తర్వాత తర్వాత ధైర్యం చేసింది అరుంధతి. అతని అందం చూసి, దేవుడు తనకోసం పంపిన రాజకుమారుడితనే అనుకుంది. రాత్రి కళ్ళు మూసుకుంటే చాలు అతనే కళ్ళల్లో మెదిలి గిలిగింతలు, పులకింతలు కలిగేవి. కానీ ఒక్కటే లోటుగా అనిపించేవి. అతను చేస్తున్నది చాలా చిన్న ఉద్యోగం కానీ అంతలోనే తనకి తనే నచ్చచెప్పుకునేది ఎల్లకాలం అటువంటి ఉద్యోగమే చేస్తాడా? అదృష్టం వరించి, తనని పెళ్ళాడిన తర్వాత ముందుముందు పెద్ద ఉద్యోగస్తుడవకూడదనేముంది? ఈ ఆలోచనతో, అతన్ని తన ఊహల్లో తిరగనిచ్చేది మనస్ఫూర్తిగా. ఆ రోజుల్లోనే తల్లి కన్ను మూసింది.

కూతుళ్ళ పెళ్ళిళ్ళకి చేసిన అప్పులు తీర్చకుండానే, భార్య జబ్బుకోసం మళ్ళీ బోలెడు అప్పులు చేసిన రాఘవయ్యకి ఈ జన్మలో అరుంధతి పెళ్ళి చెయ్యలే ననిపించింది. అరుంధతి, ఆ పేద ఇంట్లో తప్ప బుట్టిన రాజకుమారిలా కనిపించేది ఆనందరావు కళ్ళకి.

ఒక శుభముహూర్తాన ఆనందరావు కోరిక

(వి) చిత్ర విజ్ఞానం



ఎవరీ కొమ్ములు తిరిగిన మనిషి?
ఇతడు "అలెగ్జాండర్ ది గ్రేట్."
శక్తికి ప్రతి రూపమైన
"అమ్మాన్" అనబడే కొమ్ములు
అలెగ్జాండర్ ధరించాడు.
నాలుగవ శతాబ్దపు ఒక నాణెంపై
అలెగ్జాండర్ తల యీ విధంగా
చిత్రించ బడివుంది!

గిరిజనుల నవజీవనం

గిరిజనాభివృద్ధికి పటిష్టమైన సంస్థలను ఏర్పాటు చేయడంలో ఆంధ్రప్రదేశ్ మార్గదర్శకమయింది. ఇంతవరకూ ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డు తెగల ఆర్థిక సహాయ సంస్థ, గిరిజన సహకార కార్పొరేషను, గిరిజనాభివృద్ధి సంస్థ, సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థల స్థాపన జరిగింది.


రాష్ట్రంలోని గిరిజనులకు ఆర్థికంగా ఒక నూతన శకం ప్రారంభమయింది. మూడవ ప్రణాళికా కాలంలో గిరిజనాభివృద్ధికోసం ప్రణాళికా కేటాయింపు 1.80 కోట్ల రూపాయలు మాత్రమే, వుండగా, ఐదవ ప్రణాళికలో ఈ మొత్తం 49.65 కోట్ల రూపాయలకు పెరిగింది.

వ్యవసాయం, చిన్నతరహా సేద్యపు నీటి వనరులు, పశుపోషణ, విద్యుచ్ఛక్తి, విద్యా రంగాలకు సంబంధించిన ప్రణాళికా పథకాలు చురుకుగా అమలుజరపడంతో ప్రగతి శక్తులు విజృంభించాయి. గిరిజనులను వారి పాత ప్రపంచం నుంచి వేరు పరచడానికి అవిరళ కృషి జరుగుతున్నది.

వారికి ఉజ్జ్వల భవిష్యత్తు ఉంది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమాచార, పౌరసంబంధ శాఖ
డైరెక్టరుచే ప్రకటితము.

37/77-78.



మీద అతనితో అతను తీసికెళ్ళిన ఊరు వెళ్ళిపోయింది అరుంధతి. తండ్రి ఉన్న పరిస్థితుల్ని బట్టి, తను చేస్తున్నపని సరియైనదే నని పించింది. తండ్రితో చెప్తే ఈ పెళ్ళి జరగడానికి వీల్లేదంటాడు. కారణం తమ కులాలు వేరు. అసలు పెళ్ళన్నా చెయ్యకుండా కూచోపెడతాడు కాని ఇటువంటి పెళ్ళికి చచ్చినా ఒప్పుకోడు. ఇటు తండ్రీ ఒప్పుకోడు అటు ఆనందరావు తల్లిదండ్రులూ ఈ కులాంతరపు పెళ్ళికి ఒప్పుకోరని తెల్సింది. అతనే చెప్పాడు. ఇంక అటువంటప్పుడు ఎవరికీ చెప్పకుండా పెళ్ళి చేసుకోడం తప్ప మరో మార్గం లేదని ఆనందరావన్న మాటని వ్యతిరేకింప లేకపోయింది అరుంధతి.

తను తీసుకున్న నిర్ణయంవల్ల తండ్రికి తన బరువు తప్పించి నట్టవుతుందని తృప్తి పడింది. అతనితో వెళ్ళిపోయింది. లోకుల పరిభాషలో లేచిపోయింది.

కులంకాని పిల్లతో లేచిపోయినందుకు ఆనందరావుని బంధువులే కాకుండా కన్నతల్లిదండ్రులు కూడా వెలివేశారు.

మొదట్లో బాగానేవున్నా రానురాను భర్తలో మార్పు కనిపెట్టింది అరుంధతి.

ఇరుగు పొరుగులమాటలు, స్నేహితుల వేళాకోళాలు ఆనందరావు మనసు మీద గట్టి దెబ్బ తీశాయి.

కులంకాని పిల్లని చేసుకుని, కన్న తల్లి తండ్రులకి దూరమై ఊళ్ళో వాళ్ళచేత మాటలు పడుతూ తను పొందిన సుఖ మేమిటన్న ప్రశ్న అతన్ని రోజు రోజుకీ క్రుంగ దీయడం మొదలు పెట్టింది. దానికంటే మరో పెద్ద ప్రశ్న అనుమానంతో కూడిన ప్రశ్న అతని మెదడుని పురుగులా తొలవసాగింది.

ఇంత అందమైన అరుంధతి మీద డబ్బుకి కటకట లాడిపోయే ఇంట్లో పుట్టిన ఇంత అందమైన అరుంధతి మీద తన కన్ను పడకముందు మరెవరికన్నా పడి ఉండకుండా ఉండి వుంటుందా? ధైర్యంగా, లోకాన్ని లెక్క చెయ్యకుండా తనతో ప్రేమాయణం సాగించినట్టే అదివరకు మరెంతమందితో సాగించిందో ఏమో? వాళ్ళెవరూ బుట్టలో పడకుండా జాగ్రత్తగా కథ నడిపించుకుని వెళ్ళిపోయి వుంటారు. తనుమాత్రం పడిపోయాడు

జ్యోతిషానికి భవిష్యత్తు తెలుసా?

తెలుసు. ఆంధ్రప్రదేశ్‌లో భవిష్యత్ కాలాన్ని చూడగల జ్యోతిష్కులున్నారు.

తొమ్మిది గదుల్లో దోబూచులాడే నవగ్రహాల వైనం తెలిసిన జ్యోతిశ్శాస్త్ర పండితులు మాత్రమే కాదు సుమండి!

సగటు మనిషి జీవితపు చీకటిగదుల్లో రేపటి వెలుగును నేడే చూపగల అర్థశాస్త్ర ప్రవీణులు.

సామాన్యుడి జీవితం మీద స్వతంత్ర భారత సంస్కృతి ముద్ర వేయగల ప్రణాళిక వ్యూహ రచయితలు.

"నా దేశం ఏ రంగంలో ప్రగతి సాధించినా, దాని ఫలితాలు భారతీయులందరికీ సమంగా దక్కాలి. అప్పుడే నేనా ప్రగతిని గుర్తిస్తాను." అన్నారు బాపూజీ. బాపూ కన్న కలలను నిజం చేస్తున్నాయి నేటి పంచవర్ష ప్రణాళికలు_ఐదవ పంచవర్ష ప్రణాళిక ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పాలిటి వరం. 1973_74లో ప్రణాళికా పెట్టుబడి రూ. 98 కోట్లు వుండేది. 1974_75లో రూ. 148 కోట్లకు చేరిన యీ వ్యయం 1975_76 నాటికల్లా రూ. 203 కోట్లకు పెరిగింది.

గత సంవత్సరం 1976_77 వార్షిక ప్రణాళిక పెట్టుబడి రూ. 298 కోట్లు. 1977_78 ప్రణాళికా కాలానికి రూ. 383 కోట్లకు పెంచారు.

1978_79లో యిది రూ. 450 కోట్లు ఉంటుందని భావిస్తున్నారు.

నాల్గవ పంచవర్ష ప్రణాళికా కాలం మొత్తం పెట్టుబడి రూ.499 కోట్లు మాత్రమే కాగా ఒక్క 1978_79 వార్షిక ప్రణాళిక పెట్టుబడి ఈ మొత్తానికి రమారమి సమానమన్నమాట. ఐదవ పంచవర్ష ప్రణాళికా కాలంలో మొత్తం పెట్టుబడి సుమారు రూ. 1480 కోట్లు వుంటుంది___ యిది నాల్గవ ప్రణాళిక పెట్టుబడికంటె మూడురెట్లు అధికం.

ప్రణాళికలు విజయవంతమైతే ప్రగతి భేరి ప్రతిమనిషి గుండెలో ప్రతిధ్వనిస్తుంది_తెలుగు తల్లి జడలో ప్రగతిపుష్పం ఫక్కున వికసిస్తుంది!

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమాచార పౌరసంబంధ శాఖ

38/77-78 డైరక్టరుచే ప్రకటితము

బుట్టలో ఈ అభిప్రాయం ఈ అనుమానం మెల్లి మెల్లిగా అతని మెదడుని పురుగులా తొలిచేస్తుంటే భార్యా, పిల్లలమీద విసుగులూ, చిరాకులూ, కోపాలూ ఎక్కువయ్యాయతనిలో. మనశ్శాంతి కరువైంది మధువుకి బానిసయ్యాడు. కొత్తలో స్నేహితుల బలవంతమ్మీద పుచ్చుకున్న పొరపాటు అలవాటుగా మారింది అలవాటు నిత్యావసరంగా మారడానికి కాస్తకాలం పట్టలేదు.

సుబ్బలక్ష్మి వాళ్ళ ఊరే రావడంతో పుండు మీద కారం చల్లినట్లయి భార్య మీద మండి పడటం మరింత ఎక్కువైంది వంకలేనమ్మ డొంకట్టు కేడ్చిందన్నట్టు రాను రాను భార్యని ప్రతిరోజూ వొంగదీసి బాదడానికి ఏ కారణమూ అవసరం లేదన్నట్టు వుండేది అతని ప్రవర్తన. భార్య, పెదవి విప్పితే తప్పు విప్పకపోతే తప్పు చెప్పినపని చెప్పినట్టు చేసుకు పోయినా తప్పే చెయ్యక పోయినా తప్పే తండ్రంటే భయపడిపోతూ బిక్క మొగాలేసుకుని బిక్కు బిక్కు మంటూ పిల్లలు ఓమూల కూచున్నా తప్పే కూచోక పరుగులెడుతూ వాళ్ళదోవన వాళ్ళాడుకున్నా తప్పే

అరుంధతిని పను చేసుకోక పోతే సుబ్బలక్ష్మి తన భార్య అయివుండే దన్న ఆలోచన నిత్యం కురుపు సలిపినట్టు సలపడం మొదలైంది సుబ్బలక్ష్మి వాళ్ళ ఊరు బదిలీ మీద వచ్చినప్పటినించీ

మేనమామ కూతురు సుబ్బలక్ష్మిని తనకిచ్చి చెయ్యాలని అటు పెద్దవాళ్ళూ ఇటు పెద్దవాళ్ళూ అనుకున్నదే కానీ తను చేసిన పనేమిటి వెట్టి పనికాక? సుబ్బలక్ష్మికి అరుంధతికున్నంత అందంలేక పోవచ్చు. కానీ అరుంధతికి లేని ఐశ్వర్యం సుబ్బలక్ష్మి వెనక వుంది మావయ్యకి ఒక్కతే కూతురు. సొంత ఇల్లు, ఆస్తి సుబ్బలక్ష్మికి కాక మరెవరికవుతుంది?

కూతురి పెళ్ళి కట్నం, కానుకలతో, గొప్ప ఆర్భాటంగా, మరెంతో ఆడంబరంగా చేసిందే కాక రికమెండేషన్లమీద అల్లుడికి పెద్ద ఉద్యోగం కూడా వేయించాడు మావయ్య అన్న విషయం ఆనోటా ఆనోటా తన చెవిని పడి తను చేస్తున్న ఉద్యోగం తనకొచ్చే జీతం తననే ఎక్కిరిస్తున్నట్టుగా అనిపించసాగింది.

ముందు చూపన్నది కొంచెం కూడా లేకుండా మోజులో పడి తను అరుంధతిని లేవదీసుకొచ్చి రిజిష్టరు మ్యారేజి చేసుకోడం పెద్ద పొరపాటుగా భావించుకుని అనవసరమైన పశ్చాత్తాపంతో, అక్కర్లేని బాధతో కుమిలి పోవడం అతని అలవాటై పోయింది.

రోడ్డు మీద నడుస్తుంటే అందరూ తననే వేలెత్తి చూపిస్తున్నారేమో నన్న శంక పీడించేది.

రాత్రయితే పేకాటలోనూ, మత్తులోనూ మునిగి తేలడం తెల్లారితే పెరుగుతున్న అప్పులు తల్చుకుని బెదిరిపోవడం చివరికి అన్ని విసుగులూ చూపించుకోడానికి భార్య అనే మరబొమ్మ ఒకటి తేరగావుంది.

ఫలితం ప్రతిరోజూ అరుంధతి కడుపునిండా తిండిలేకపోయినా, కదుంకట్టే దెబ్బలు మాత్రం రంచనుగా తింటోంది. కాస్త జ్ఞానం తెల్సిన పిల్లాడు రవి, తల్లి తినే తిట్లు దెబ్బలు చూసి గిలగిల్లాడి పోయేవాడు.

వాడికి తండ్రిమీద కోపం ఇంతా, అంతా కాదు.

తల్లి మీద జాలి చెప్పనలవికాదు.

"అమ్మా"

రవి పిలుపుకి ఉలిక్కిపడి ఆలోచనల్లోంచి తేరుకుంది అరుంధతి. తిరిగి చూసింది. రమ మంచి నిద్రలో వుంది. రవిమాత్రం తల్లివంకే చూస్తున్నాడు. కిటికీ దగ్గర్నించి లేచివచ్చి రవిదగ్గర కూర్చుంది.

"ఏం రవీ ఇంకా నిద్రపోలేదూ?"

గడియారం వంక చూసింది. పది దాటింది.

"ఉ ఊ. నిద్రరాల అమ్మా

మినీ కథ

అందని సిగ

"హెలో!"

"హెలో" నవ్వుతూ పలికింది సునీత.

సునీతని చూస్తే ఎవరికైనా హెలో అనా లన్పిస్తుంది.

మరి సుధీర్ కనిపించడంలో విశేషం విచిత్రం వింతల్లోన్లే.

"ఏంటిలా బయల్దేరారు?" అన్నాడు మాట కలుపుతూ.

"షాపింగ్ కని " అంది మర్యాదకి.

"ఐసీ ఐ గాట్ నో వర్క్ నౌ. హౌ ఎబౌట్ మేకింగ్ ఎ మూవ్ వాకింగ్ ఎవాక్" లీడ్ తీసుకుని ముందుకు నడిచాడు. వాకింగ్ ఎటాక్!

"బాగా చదువుతున్నారనుకుంటా!" మళ్ళీ తనే అడిగాడు.

"సో. సో."

షాప్‌లోకి నడిచాడు.

తను ఏవో ఫ్యాన్సీ సామాన్లు కొంటోంది.

సునీత సామాన్లవైపు సుదీర్ఘంగ చూస్తోంది.

సుధీర్ సునీత వైపు సుదీర్ఘంగ చూస్తు న్నాడు.

ఆమె దృక్కులు స్టెపిన్ స్టెపాట్!

అతడి చూపులు అప్ ఎండ్ డౌన్ ఆన్ ఎండ్ ఆన్!

బయటకు నడుస్తూంటే,

"ఇట్ సీమ్స్ యూ ఆర్ టూ ప్రెట్టీ టుడే."

"థాంక్స్."

"హవెబౌట్ హావింగే కప్ ఆఫ్ కాఫీ ఎండ్ ఎ సిప్ ఆఫ్ గాసిప్" ఏడింగ్ ఎస్ టు మైల్స్!

"నో థాంక్స్!"

"రియల్లీ యూ ఆర్ ఫెంటాస్టిక్ ఇన్ దిస్ శారీ!"

"థాంక్యూ థాంక్యూ! మీకేం పన్లేదా?"

"నో నో! ఒకె సీ యూ!"

"డామ్ డర్టీ డేమ్ నో. బిచ్! తనే అంద మైన దాన్ననుకుంటుంది. వ్వాట్ డస్ షి గాట్ ఎక్సెప్ట్ నథింగ్ నథింగ్ "

—మెడికో శ్యామ్

మరేమో నువ్విందాక చెప్పిన కథలో ఆ అమ్మాయి రాక్షసుడినించి తప్పించుకు పారి పోతుందా? లేకపోతే వాడి చేతుల్లో చచ్చి పోతుందా? " రేపటివరకూ తెల్సుకోకుండా ఆగలేని ఆతృత వాడిది.

తను చెప్పిన పిచ్చికథ వాడి మనసుని అంతగా ఆలోచనతో ఇబ్బంది పెట్టినందుక నొచ్చుకుంది అరుంధతి.

ఏదో ఒకటి ఇప్పుడు వాడికి జవాబు చెప్పాలి.

చచ్చిపోతుందని చెప్తే ఆ చిన్నారి మనసు విలవిల్లాడిపోతుందేమో? అదే ఆలోచిస్తూ . ఇంక నిద్రపోతావో లేదో కూడా వెళ్ళి పిల్లాడు.

తప్పించుకుని పారిపోయి సుఖంగా వుందంటే తృప్తిగా వుంటుంది వాడి మనసుకి.

అప్రయత్నంగా వెంటనే అనేసింది అరుంధతి "ఆ రాక్షసుడి గుహలోంచి తప్పించుకుని పారిపోయి సుఖంగా బ్రతుకు తుందామ్మాయి. నీ సందేహం తీరిందిగా. ఇంక పడుకో "

రవి కళ్ళల్లో మెరుపు అరుంధతి కళ్ళ పడలేదు ఆ చీకట్లో-అంతలో వీధి తలుపు చప్పుడైంది.

"అదుగో నాన్నగారు వచ్చేశారు " అంటూనే లేచి వెళ్ళి తలుపు తీసింది.

తూలిపోతూ లోపల అడుగుపెట్టాడు ఆనందరావు.

భర్త ఎక్కడ కింద పడిపోతాడోనని చటుక్కున పట్టుకుంది. పుటుగుని విదిలించి కొట్టినట్టుగా ఆ చేతిని విదిలించాడు ఆనంద రావు.

"ఎంతసేపు తలుపుకొట్టినా తియ్యవేం? ఏం రాచకార్యాలు వెలగబెడుతున్నావు?"

భర్త ఒక్కసారి తలుపు కొట్టగానే అతను తలుపు కొట్టే తీరు తెల్సు గనక భర్తే వచ్చాడని త్వరగా వెళ్ళి వెంటనే తలుపు తీసినాగానీ అతనలా అనడం బాధే అని పించింది. చాలా నెమ్మదిగా, భయపడుతూనే సమాధానం చెప్పింది "వెంటనే తీశానండీ. ఆలస్యం చెయ్యలేదు."

"ఎదురు సమాధానం కూడానా?" క్షణం కూడా ఆలస్యం చెయ్యకుండా లాగి చెంప కాయ కొట్టాడు ఆనందరావు.

మంచంమీంచి లేచిపోయి తలుపు వక్కన నిలబడి గుండె లచేతుల్లో పెట్టుకుని చూస్తున్న రవి తన చెంప తడుముకున్నాడు. మరోసారి తండ్రి కుడిచేయి తల్లి వీపుని గట్టిగా ముద్దాడటంతో రవి కళ్ళు నీళ్ళ కడవ లయ్యాయి.

భయంతోనూ, బెదురుతోనూ పైకి తన్ను కొస్తున్న ఏడుపుని మింగేస్తూ వెళ్ళి బల్లిలా మంచాన్ని అంటి పెట్టుకుపోయాడు.

* * *

మర్నాడు తండ్రి ఇంట్లోలేని సమయంలో తల్లిదగ్గిర కొచ్చి మెల్లిగా పిలిచాడు రవి. "అమ్మా!"

వాడి చేతుల్లో రెండు సంచులున్నాయి. ఒకదాన్లో వాడి పుస్తకాలు, రెండోదాన్లో చెల్లెలి పుస్తకాలూ వున్నాయి.

"ఏమిట్రా రవీ"

"పదమ్మా. వెళ్ళిపోదాం."

"ఎక్కడికిరా?" నిప్పు తెచ్చి పెట్టు కుంటూ అడిగింది అరుంధతి.

"రాముడే ఏర్వాతి జన్మలో కృష్ణుడిగా పుట్టాడని నువ్వోసారి కథ చెప్పావు కదమ్మా!"

"ఔనూ "

"నాకు తెల్సిపోయిందమ్మా నువ్వు నిన్న కథ చెప్పావు చూడు రాక్షసుడి కథ "

"ఆ చెప్పానూ "

"ఆ రాక్షసుడే ఈ జన్మలో మన నాన్న గారిలా పుట్టాడమ్మా "

"రవీ!" అప్రయత్నంగా తన చేత్తో వాడి నోరు మూసింది అరుంధతి. ఆ చేతిని మెల్లిగా తీసేస్తూ తను చెప్పదల్చుకున్నది మళ్ళీ చెప్పాడు రవి. "ఔనమ్మా. అంతే అయ్యుంటుంది. నిన్నెప్పుడూ కొడతారుకదా మరి. సరుకులు అయిపోయాయని తెచ్చిపెట్ట మని నువ్వెన్నిసార్లు చెప్పినాకూడా తేకుండానే తిరిగొచ్చి, అన్నంలోకి ఇది చెయ్యలేదే అది చెయ్యలేదే అంటూ కొడుతుంటారు కదమ్మా నిన్ను? ఆ కథలో అమ్మాయి రాక్షసుడినుంచి తప్పించుకుని పారిపోయిందని చెప్పావుగా! అలాగే మనం ఈ ఇంట్లోంచి పారిపోదాం అమ్మా! ఇవిగో నా పుస్తకాలు, చెల్లాయి పుస్తకాలు పట్టుకొస్తున్నాను. తొందరగా నాన్నగారొచ్చే లోపల వెళ్ళిపోదాం పద ఇంకో చోటికెక్కడికైనా. నేను తొందర తొందరగా అన్ని క్లాసులూ ప్యాసయిపోయి, పెద్దయి పోయి, పెద్ద ఉద్యోగంలో చేరి నిన్నూ, చెల్లాయినీ చూసుకుంటాను చక్కగా. పదమ్మా. ఈ ఇంట్లో వుండద్దు. నాన్నగారు నిన్ను రోజూ కొడుతుంటే నా కేడు పొస్తోంది "

"బాబూ! రవీ!" కొడుకుని దగ్గరికి తీసు కుంది అరుంధతి. కన్నీరు కార్చడం తప్ప వాడికేమీ సమాధానం ఇవ్వలేకపోయింది. ఆ కన్నీటి తెరల్లో కాంతికిరణంలా రవి మెరి శాడు.

రవికి మాత్రం తల్లి కన్నీటి వెనక 'నాన్న' రూపంలో వున్న ఒక పెద్ద రాక్షసుడు కని పించాడు. □

పెళ్లిపిలుపు

గోవిందరాజు సీతాదేవి

శరత్ శ్రీకాంత్ నవల చదువుతూ కాలాన్నీ పరిసరాలనీ మర్చిపోయిననాకు 'పోస్ట్' అన్న కేక ఆలశ్యంగా విన్పించింది. పుస్తకం మూసి లేచి బైటకి వచ్చేసరికి ఓ కవరూ మరో శుభలేఖా వరండాలోకి విసిరి పోష్టుమేను పక్కవాళ్ళింట్లోకి వెళ్ళటం కన్పించింది. వంగి రెండూ తీసుకుని చూశాను. రెండింటిమీద దస్తూరీ అన్నయ్యదే. ఆతురతగా శుభలేఖ తీసి చూశాను. వధువు చి॥ సౌ॥ సుశీల, వరుడు చి॥ సోమసుందర్రావు. కింద అన్నయ్యా వదినల పేర్లు. అన్నయ్య నాలుగో కూతురి పెళ్ళికి పిలుపు అన్నమాట. క్షణం మనస్సు ఆనందంతో స్పందించింది. సుశీల బీకాం పాస్అయి నాలుగేళ్ళు దాటింది. యిటు వుద్యోగంకోసం అటు వరుడికోసమూ చూస్తూన్నాడు అన్నయ్య. రెండింటిలో ఒక్కటీ కుదరలేదుగానీ సుశీలకి పాతికేళ్ళు దాటాయి.

అన్నయ్య పాతకాలంవాడు. యెవరు యెంత చెప్పినా విన్పించుకోకుండా నలుగురు ఆడపిల్లలకి తండ్రి అయ్యాడు. 'నారుపోసిన దేవుడు నీరుపోయడా' అన్న మూఢనమ్మకం అన్నయ్యది. ఓ కంపెనీలో అతిసామాన్యమైన వుద్యోగం చేస్తూనే పైముగ్గురు ఆడపిల్లలకీ పెళ్ళిళ్ళు చేసేశాడు. కానీ నాలుగో అమ్మాయి పెళ్ళి విషయం వచ్చేసరికి ఆర్థికస్థితి అంతంత మాత్రంగానే వుంది. ఆపైన సమాజంలో మార్పులూ అతివేగంగా మారిపోతున్నాయి. కాలేజీ చదువు వుంటే దాన్ని చూసైనా యెవరన్నా త్వరగా ముందుకు వస్తారు అన్న ఆశతో సుశీల చదువు అయి డిగ్రీ తీసుకునేవరకూ నిమ్మకి నీరెత్తినట్లు వున్నాడు. ఆ తర్వాత ప్రయత్నిస్తే ఒక్కటీ కల్సిరాలేదు.

ప్రతి వుత్తరంలోనూ యేదో సంబంధం చూశాననీ సుశీలని చూసి వెళ్ళారనీ బహుశా యీ సంబంధం అవవచ్చుననీ యిలా అయితే త్వరలో లగ్నం పెట్టుకుని నీకు పెళ్ళిపిలుపు పంపిస్తాననీ రాసేవాడు. అలా రాస్తూ పెళ్ళికి నాలుగురోజులు ముందే మీ దంపతులు యిద్దరూ వచ్చి మాకు ఆసరాగా నిలవాలని మరీమరీ రాసేవాడు.

'అలాగే వస్తాం. నీ పిలుపుకోసం యెదురు చూస్తూన్నాం' అని జవాబు రాసేది తను.


అన్నయ్య సంబరపడిపోతూ జవాబు రాసేవాడు.

"నీవు వచ్చి మా పక్కన నిలిస్తే చాలా ధైర్యంగా వుంటుందమ్మా. పెళ్ళివారికి యే లోపమూ జరక్కుండా చూసుకుంటావు కనుక నాకు నిశ్చింత. సుశీలని చూసి వెళ్ళినవాళ్ళు మరో పదిరోజుల్లో యే సంగతీ తెలియజేస్తాం అన్నారు. కనుక ఎలానూ యిది కుదిరేలావుందని మీ వదినని మెల్లగా పెళ్ళిపని ఒక్కోటీ మొదలుపెట్టుకో అని చెప్పాను. త్వరలోనే నీకు రాస్తాను. యిలా వుండేవి అన్నయ్య ఉత్తరాలు. అలా రాసిన వుత్తరం తర్వాత మరో నెలవరకూ జాబుకోసం చూసేదాన్ని. కానీ వచ్చేదికాదు. ఆ తర్వాత వచ్చిన జాబులో మరో సంబంధం వివరాలు వుండేవి.

'యిదైనా కుదిరితే బాగుండు' అనుకునేదాన్ని. అన్నయ్య వుత్తరం కోసం చూసేదాన్ని. పోస్ట్‌మేన్ వచ్చేవాడు. యేవో వుత్తరాలు యిచ్చేవాడు. కానీ అది నే యెదురుచూసే

పెళ్ళిపిలుపు మాత్రం కాదు. పిల్లలు ప్రతిరోజూ స్కూలునించి రాగానే 'అమ్మా మామయ్య వుత్తరం రాశాడా! మనం పెళ్ళికి వెడుతున్నామా' యిలా లక్ష ప్రశ్నలువేసి వేధించే వాళ్ళు. వీళ్ళ ప్రశ్నలు విసుగు కలిగిస్తూన్నా సహనం తెచ్చుకుంటూ చెప్పేదాన్ని. 'వస్తుంది. తప్పక వస్తుంది వదిన పెళ్ళిపిలుపు! ఆ పిలుపు వస్తే నేనే చెప్తాను. మీరు అడగవద్దు' అన్నాను. నా అకారణ కోపానికి విస్తుపోతూ ఒకరి ముఖాలు ఒకరు చూసుకుని 'సరేలే' అన్నట్లు చూసి పుస్తకాల సంచీలు ఓ పక్కనవిసిరి టిఫినుతిని ఆటలకి పరుగెత్తేవాళ్ల శశీ నీరజా. వీళ్ళిద్దరూ యింకా హైస్కూల్లోకే రాలేదు. యెప్పటికి పెద్దవాళ్ళుకాను. చదువులు యెప్పటికి పూర్తికాను. యిదే ఆలోచిస్తూ వుండేదాన్ని. వీళ్ళ పెళ్ళికి యిప్పుడు అన్నయ్య పడే అశాంతి నేనూ పడాలా! యిలా అనుకున్నప్పుడు మాత్రం భయం భయంగా అనిపిస్తుంది. శ్రీవారికి ఆలోచనలు రావు. నేచెప్పినా ఆయన అంతా విని తేలిగ్గా నవ్వేస్తారు—

"నీ ముఖం పదిహేనుయేళ్ళ తర్వాత సమాజంలో యెన్ని మార్పులు వస్తాయో!" అని. సమాజంలో యెన్ని కొత్తమార్పులైనా రావచ్చు. కానీ ఆడపిల్ల పెళ్లి తలిదండ్రులకి అగ్నిపరీక్షలా కాకుండా, తేలిగ్గా అయేంత మంచిమార్పు వస్తుందన్న నమ్మకం నాకు లేదు. ఆ సూచనలు కనుచూపుమేర కన్పించటం లేదు అన్పిస్తూంది నాకు.



సుశీలకి పెళ్ళి ఖాయం కావటం లేదని అన్నయ్యా వదినా దిగులు పెట్టుకున్నారు. వచ్చి చూసిన ప్రతివరుడూ 'కట్నం చాలద'నో 'వుద్యోగంలేని చదువువల్ల ప్రయోజనం ఏం వుంది' అనో 'అమ్మాయి రంగు చామనఛాయ అనో' 'యాక్టివ్‌గా లేదు అనో' యిలా చాలా రకాల మాటలు అని వెనక్కి వెళ్ళిన

వీరుల సంఖ్య చూసి సుశీల తనకీ జన్మలో పెళ్ళి కాదేమో అని దిగులుపడి ఆరోగ్యం పాడుచేసుకుని చిక్కి సగం అయింది. తన వ్యధ నంతా ఓసారి వుత్తరంలో నింపి నాకు పంపింది.

అత్తయ్యా

మరో పెళ్ళికొడుకు పత్తాలేకుండా పారిపోయాడు. నాకు యీ పెళ్ళిచూపులంటే విసుగొస్తోంది. ఇదివరలో నా వుద్యోగంకోసం నాన్న చేసిన ప్రయత్నం ఫలించి ఏ చిన్న వుద్యోగమన్నా వస్తే బాగుండు హాయిగా బ్రతకవచ్చు అని అన్పిస్తోంది.


అత్తయ్యా భగవంతుడు తప్ప మరే అండా లేని మాలాంటి వాళ్ళని యెందుకిలా పరీక్షిస్తాడాయన. ఈ జన్మలో నిన్ను మరేం కోరను, చిన్న వుద్యోగం వచ్చేలా చెయ్యి దేవుడా అని యెంత ప్రార్థిస్తున్నా ఆ దేవుడికి కరుణ కల్గటంలేదు. నా బాధని యెవరికి చెప్పుకోను. నిజం చెప్పాలంటే హైస్కూలు చదువులలో ఆపినా పెళ్ళి అంటూ అయింది కనుక అక్కయ్యలు ముగ్గురూ అదృష్టవంతులే అన్పిస్తుంది. చదువు కావాలి కావాలి అని ఆరాటపడి నిరంతర కృషిచేసి డిగ్రీ తెచ్చుకున్నాను. దీనివల్ల నాకు ఒరిగింది ఏమిటి. ఏ యస్సెల్సీ అబ్బాయినో చూసి తేలిగ్గా పెళ్ళిచేసి వదిలించుకునే అవకాశంకూడా నాన్నకు లేదు. డిగ్రీ లేకున్నా వుద్యోగంవుంటే చాలు నాన్నా. నాకేం అభ్యంతరంలేదు. ఆ సంబంధాలు అయినా సరే చూడు అని నాన్నకి చెప్పాను. ఆయనకి కళ్ళల్లో నీళ్ళుతిరిగాయి నా మాటలకి. అదీ చూశాను. వాళ్ళూ యెనిమిదీ పదీవేలు కట్నంగా కావాలని అంటూన్నారట. నాకింక పెళ్ళి యెలా అవుతుంది! నాన్నకి శాంతి యెప్పటికి లభిస్తుంది! అత్తయ్యా యింకా కొన్నాళ్ళిలాగే వుంటే పిచ్చిపడుతుందేమో అని భయంగా వుంది. నాయీ బాధని నీకు చెప్పటంలో వుద్దేశ్యం కాస్త బరువుతగ్గి శాంతి పడాలని మాత్రమే. అత్తయ్యా నన్ను అర్థం చేసుకుంటావు కదూ!

ఇలా రాసింది సుశీల. యీ వుత్తరాల్లోని అక్షరం అక్షరం నాకు గుర్తువుంది. సుశీలే కాదు ఆ వయస్సులో ఆ పరిస్థితిలోవున్న యే ఆడపిల్ల ఆలోచనలైనా అలాగే వుండి తీరతాయి. యిందుకే సుశీలకి ధైర్యంచెప్తూ వెంటనే వుత్తరం రాశాను. నా వుత్తరం తనకి ధైర్యాన్ని ఓదార్పుని యిచ్చింది అంటూ జవాబు రాసింది. యిలా సుశీలకీ నాకూ వుత్తరప్రత్యుత్తరాలు జరుగుతూనే వున్నాయి. సుశీల మొదట మొదట కుటుంబ విషయాలతోనే వుత్తరాన్ని నింపేసేది. వాటికి జవాబు యివ్వకుండా నే చదివిన పుస్తకాల గురించీ వెళ్ళిన మీటింగ్స్ గురించీ ఆ మీటింగ్‌లో వక్తలు వెలిబుచ్చిన అభిప్రాయాల గురించీ సాంఘిక సమస్యల గురించీ రాస్తూ కొన్ని పుస్తకాల పేర్లు రాసి అవి లైబ్రరీలో దొరుకుతాయిగనుక తెప్పించుకుని చదివి వాటిని గురించి నీ అభిప్రాయం రాయమనీ రాశాను.

“అత్తయ్యా యీ సమయంలో ఆ పుస్తకాలు చదివినా నా తలలోకి యెక్కుతాయంటావా!” అని రాసింది.

“ఫర్లేదు. చదవటానికి ప్రయత్నించు” అని వెంటనే రాశాను. సుశీల వారానికి రెండుసార్లు రాసే వుత్తరాలు తగ్గి ఒకటి అయింది. ఆ ఒకదానిలో రాసినదైనా ఆలోచనల్లో కొత్త మార్పువచ్చినట్లు అన్పించింది. యిలా యిద్దరం స్నేహితుల్లా అయాం. మా యిద్దరి స్నేహానికీ వయస్సు అడ్డంరాలేదు. సహజంగా స్నేహం అంటే సమవయస్కులకే పరిమితం. కానీ యీ అడ్డంకిని నేనే దాటుకుని సుశీలకి సన్నిహితంగా వెళ్ళానో లేక తనే వయస్సులో తేడా అనే అడ్డుగోడని పడగొట్టుకుని నా మనస్సులో ప్రత్యేక స్థానాన్ని సంపాదించిందో! అని ఆలోచిస్తే యిప్పటికీ అంతుబట్టదు.

శ్రీవారితో యెప్పుడు షాపింగ్‌కి వెళ్ళినా అక్కడున్న సామానులని ఆసక్తిగా చూస్తాను. సుశీల పెళ్ళికి ప్రజెంటేషన్‌గా ఏది యిస్తే బాగుంటుందో అని. ఒకటి రెండు



చాలా నచ్చాయి కూడా. యిప్పుడే కొనేసి వుంచేస్తే! అన్న ఆలోచన వచ్చింది. శ్రీవారికి చెప్పాను. ఆయన నవ్వేశారు.

"ఇంకా పెళ్ళిపిలుపు రాందే! అప్పుడే తొందరేమిటోయ్" అన్నారు.

"ఆ పిలుపు వచ్చినప్పుడు నాకు నచ్చినవి లేకుంటే!"

శ్రీవారు నా ప్రశ్నకి క్షణం ఆలోచించారు.

"యింతకీ యిప్పుడు నువు కొనాలన్న వస్తువేది."

"అదిగో! బుద్ధదేవుడు ఓ శ్రీమంతురాలి యింటిముందు నిల్చుని 'భవతీ భిక్షాందేహి' అన్నట్లున్న నిర్మల్ పెయింటింగ్ భలేవుంది చూడండి" చేతిలోకి తీసుకుని చూపాను.

ఆయన ఆ చిత్రంలోకి తదేకంగా చూశారు. ఖరీదు అడిగి పాక్ చెయ్యమని చెప్పారు. నా సంతోషం చెప్పనలవికాదు. పాకెట్ తీసుకుని హుషారుగా యింటికి వచ్చాను. వచ్చిన వెంటనే బట్టలైనా మార్చుకోకుండా ఆయన, వరండాలోనించి లోపలికి వచ్చేచోట మేకు కొట్టి బుద్ధుడి ఫోటో తగిలిస్తూంటే చెప్పలేనంత కోపం వచ్చింది.

"యిదేం పని. మనకోసమా యిది కొన్నది. నేను ముందే చెప్పానుగా" గట్టిగా అన్నాను. ఆయన అదేం విన్పించుకునే స్థితిలో లేరు.

"అనూ యిలా యిక్కడికి వచ్చి చూడు. అరె. చూడు అంటే" అని రెక్కపట్టి లాగి మరీ చూపిస్తూ "అచ్చంగా అలనాటి సిద్ధార్థుడు నీయింటి ప్రాంగణంలో నిల్చి భిక్ష అడుగుతున్నాడా అన్న అనుభూతి కల్గటం లేదూ?"

ముఖం చిట్లించాను. కానీ శ్రీవారి మాటలు చెవులో ప్రతిధ్వనిస్తూన్నాయి. మనస్సులోని కోపం కరిగిపోతూవుంది. బుద్ధదేవుడు నాలాంటి అతిసామాన్యురాలి యింటిముందు నిల్చి 'భిక్ష' అడగటమా? ఒకవేళ అలా జరిగితే! అదెంత అదృష్టం యీ భావంతో మనస్సు పరవశించింది. యిది క్షణం మాత్రమే. నా మనస్సుమీద నాకే కోపం వచ్చింది. యీ వెధవ మనస్సు యెప్పుడూ

యింతే! జరగటం అసంభవం అని తెల్సినా అప్పుడప్పుడూ యిలా యేవేవో జరిగితే, యెంత బాగుండు! అన్పిస్తూ వుంటుంది. ఇదో బలహీనత కాబోలు అన్పించి అప్పటి కప్పుడే మనస్సుని కంట్రోల్‌లోకి తెచ్చేసుకున్నాను. "యీ ఫోటో గోడకి తగిలించినా రేపు అదే షాపుకు వెళ్లి అలాంటిదే ఒకటి తెచ్చి సుశీలకోసం దాచివుంచుతాను' అన్నాను. శ్రీవారు చికాకుగా చూశారు. ఆ తర్వాత అన్నారు.

"అనూ అసలు యే సందర్భంలో యే ప్రజంటేషన్ యివ్వాలో నిర్ణయించటం కూడా ఒక 'ఆర్ట్' అంటాను. ఒక్కసారి ఆలోచించి చూడు. సుశీలకి పెళ్ళి అంటూ పిలుపు వచ్చిందే అనుకో యీ విరాగిగా మారిన బుద్ధదేవుడినా వధూవరులకి ప్రజంట్ చేయటం ఏం " రెట్టించిన తర్వాతగానీ శ్రీవారి అసలు అభిప్రాయం అర్థంకాలేదు. అరెరె నా నిర్ణయంలో పొరబాటు ఒప్పుకున్నాను. తర్వాత తననే అడిగాను. "సలహా చెప్పండి ఏం కొందాం?"

ఆయన నవ్వారు.

"ఎందుకు నవ్వుతూన్నారు" చిరుకోపంతో అడిగాను.

"ఆ పెళ్ళి పిలుపంటూ రానీ!" ఆలోచిద్దాం.

"కాదు. ముందే ఆలోచించి వుంచుకోవాలి."

"అయితే ఒక పని చెయ్యి. నీవు కొనాలనుకున్న వస్తువులు డైరీలో నోట్ చేసుకో. పెళ్ళి పిలుపు రాగానే ఆ లిస్ట్ ఓసారి చూసుకో. అప్పుడు యేది కొత్తగా తృప్తిగా అన్పిస్తే అది కొనేసెయ్, ఏం. సరేనా?"


'చాలాబాగుంది అయిడియా' అనుకుని అందమైన వస్తువులు కన్పించినప్పుడల్లా నోట్ చేసేస్తున్నాను. యీ లిస్టులో శరత్ సాహిత్యం సెట్‌నుంచి బుక్స్ పెట్టుకునే అద్దాల బీరువా రాధాకృష్ణుల నిర్మల్ పెయింటింగ్ యిలా చాలా చోటుచేసుకున్నాయి. యెన్నో రోజులుగా యెదురుచూసిన సుశీల పెళ్ళిపిలుపు యివాళ రానే వచ్చింది. యింక ప్రయాణం ఏర్పాటు చూసుకోవాలి. డైరీచూసి శ్రీవారిని సంప్రదించి ప్రజంటేషన్ కొనేసేయాలి. అయిదారు సంవత్సరాలు అయింది ఆంధ్రదేశం చూసి. శ్రీవారి వుద్యోగరీత్యా దూరంగా వుండక తప్పలేదు. తెలుగుదేశం వెడతాం. కొన్నాళ్ళపాటు అక్కడ వుండి ఆత్మీయులనందరినీ చూస్తాను అన్న వూహ రాగానే మనస్సు సంతోషంతో గంతులు వేస్తోంది.

శ్రీవారు ఆఫీసునించీ పిల్లలు స్కూలు నించీ యెప్పుడు వస్తారా, యీ వార్త చెప్తానా అని యెదురు చూస్తూ వున్నాను. శ్రీకాంత్ నవల యిప్పటికి పదిహేనుసార్లు చదివినా మళ్ళీ చదివినా కొత్తగానే అన్పిస్తూంటుంది. మళ్ళీ పుస్తకం చేతిలోకి తీసుకున్నాను కానీ మనస్సు నవలమీదకి వెళ్ళటంలేదు. అన్నయ్యా వదినా సుశీలా దగ్గరకి యెగిరిపోతోంది.

* * *

"శలవు లేదు. పెళ్ళిటైముకి వస్తాను" అంటూ నన్నూ పిల్లలనిద్దరినీ రైలెక్కించారు శ్రీవారు. ఆనందంగా అన్నయ్య యింట్లో అడుగుపెడుతూండగా వదిన కాళ్ళు కడుక్కోమని నీళ్ళు తెచ్చింది. సుశీల పరుగున వచ్చి కౌగలించుకుంది. ఎండలో ఎక్కడికో వెళ్ళిన అన్నయ్య చెమటలు కక్కుతూ తిరిగి వచ్చాడు. అరవైయ్యేళ్ళు దాటిన అన్నయ్య వుద్యోగం నుంచి రిటైర్ అయినా బాధ్యతల నుంచి రిటైర్ కాలేదు. అన్నయ్యా వదినా యిప్పటికే అలసిపోయినట్లున్నారు. అన్నయ్య వాత్సల్యంగా పల్కరించాడు. బావమరిది రాలేదేం అని అడిగాడు. పిల్లలని దగ్గరకు తీసుకున్నాడు. భోజనాలు అయిన తర్వాత తీరుబడిగా కూర్చుని కబుర్లు ప్రారంభించాం.

"అనూ! సుశీలకి పెళ్ళిసంబంధం ఖాయం కాలేదని ఆరాటపడ్డాను. అవదేమోనని భయపడ్డాను. ఇప్పుడు కుదిరిన సంబంధం



మంచిదే. అబ్బాయి బాగున్నాడు. రైల్వేలో వుద్యోగం చేస్తున్నాడు. సుశీలకి యీడైన వాడు.'' తృప్తినిండిన ముఖంతో చెప్పింది వదిన.

''కట్నం యెంత'' కుతూహలంగా అడిగాను.

''ఎనిమిదివేల అయిదువందలు! ముందే యిచ్చేశాం. యిస్తేకాని కుదరదు అన్నారు.''

''ఏమిటీ యెనిమిదివేల అయిదువందలా! యింత డబ్బు యివ్వగల స్తోమతు అన్నయ్యకి యెక్కడినుంచి వచ్చింది!'' ఆశ్చర్యంగానే అడిగాను. అన్నయ్య బట్టతల సవరించుకుంటూ పేలవంగా నవ్వాడు.

''మన శక్తితో మగపెళ్ళివారికి పనియేం వుందమ్మా'' అన్నాడు. యింకేం మాట్లాడలేక పోయాను. శ్రీవారు రైలెక్కించి వెయ్యి రూపాయలు యిచ్చి మీ అన్నయ్యకి యివ్వు. పాపం రిటైర్ అయి యిబ్బందుల్లో వున్నాడు అన్నారు. అవి భద్రంగాతీసి అన్నయ్య చేతిలో పెట్టబోయాను.

''ఏమిటమ్మా అదీ'' అన్నాడు మొహమాటపడిపోతూ.

''చంద్రుడికో నూలుపోగు అన్నట్లు సుశీల పెళ్ళికి ఏ ఖర్చుకిందైనా వుంటుంది యిది తీసుకో అన్నయ్యా.''

అన్నయ్యా వదినల కళ్ళల్లో నీళ్ళు వుబికాయి.

''ఆడపిల్లవి. నీకు మేంపెట్టాలిగానీ నువ్వు యివ్వటం యేమిటి!'' వదిన వారించబోయింది.

''అలా అనకు. అసలు నాకేగనుక సుశీలకి యీడైన కొడుకు వుండివుంటే యిలా పరాయి సంబంధాలు వెతుక్కోనిచ్చేదాన్నా అనేసరికి అన్నయ్య చిన్నగా నవ్వేశాడు.

వందరూపాయిల పదినోట్లూ అన్నయ్య చేతికి బలవంతంగా యిచ్చాను. పెళ్ళి పనులు చాలావరకూ అయిపోయినాయి. మిగిలినవి చకచకా పూర్తిచేయించాను. సుశీలని పెళ్ళికూతుర్నిచేశాం. పెళ్ళికూతురు అలంకరణలో సుశీల అందంగా కన్పిస్తోంది. పెళ్ళికి బంధువులు అందరూ వచ్చారు. యిల్లంతా ఒకటే

(వి) చిత్ర విజ్ఞానం



ముఖభావాల్లో మనిషికీ జంతువులకూ
చాలా తేడాలున్నాయి!
బొమ్మలో చింపాంజీ
నవ్వుతూ కనిపిస్తోంది. నిజానికి
అది నవ్వుకాదు! ఏ వస్తువునైనా
పరికించి చూస్తున్నప్పుడు
చింపాంజీ ముఖభావన యీ విధంగా
వుంటుంది !!

సందడి. పెళ్ళిరోజు రానేవచ్చింది. మగపెళ్ళి వారూ వచ్చారు. పెళ్ళి పందిరిలో పీటలమీద పెళ్ళికొడుకు కూర్చున్నాడు. పురోహితుడు మంత్రాలు చదువుతున్నాడు. సుశీల గౌరీపూజ చేస్తోంది. సన్నాయి మోగుతోంది. పెళ్ళివారికి కావలసిన సౌకర్యాలని చూస్తూ వూపిరిసల్పని పనిలో వుండికూడా శ్రీవారి రాకకోసం వెయ్యి కళ్ళతో యెదురుచూస్తూన్నాను. రైలు వచ్చే వేళ దాటిపోయింది. యింకా రాలేదేమిటీ! సెలవు దొరకలేదా! రైలు తప్పిపోయిందా! వుహూ. వస్తానంటే సమయానికి టంఛనుగా వచ్చితీర్తారు. వచ్చి కొత్త పెళ్ళికొడులా రీవిగా నిల్చుని—

"రైలు అర్ధగంట లేటోయ్!" అంటారు. నా వూహే యిదంతా. నాలో నాకే నవ్వు వచ్చింది.

"అమ్మా నాన్నారొచ్చానేరూ " అని పిల్లలకేక.

"అనూ అన్నయ్య పిలుస్తున్నాడు. పెళ్ళి కూతురిని మేనమామ పెళ్ళిపందిరిలోకి తీసుకు వెళ్ళాలట నువు దగ్గరుండవే." యిలా అని మరోకేక. చేసేపని వదిలి త్వరగా సుశీల దగ్గరకి వెళ్ళాను. సుశీల పెళ్ళిపందిరిలో పీటల మీద కూర్చున్న తలిదండ్రుల మధ్యన కుడి కాలుపెట్టి కూర్చోబోయింది.

"ఆగండి ఆగండి యీ పెళ్ళి జరగ టానికి వీల్లేదు." అంటూ హడావుడిగా నలుగురు పెళ్ళిపందిరిలోకి వచ్చారు. ఓ యిరవై య్యేళ్ళ అమ్మాయీ ఆమె తల్లిదండ్రులూ అన్నగారు యిద్దరూ. సన్నాయి ఆగిపోయింది. పురోహితుడి మంత్రాలూ ఆగిపోయాయి. అంతవరకూ యెంతో సందడిగా వున్న పెళ్ళి పందిరి చీమ చిటుక్కుమన్నా విన్పించేంత నిశ్శబ్దంగా అయింది. కాసేపు బిగ్గరగా మాటలు కేకలు తిట్లు. పెళ్ళిపందిరిలో పెనుతుఫాను వీచినట్లు అయింది. అమ్మాయితో వచ్చిన అన్న గారు ఆవేశంగా పెళ్ళిపీటల దగ్గరకి వచ్చాడు. పెళ్ళికొడుకుని రెక్కలుపట్టుకుని లేవనెత్తి చెంపలు ఛెళ్ఛెళ్మనిపించాడు. అతనూ ఎదురు తిరిగాడు. యిదంతా యేమిటో అర్థంకాక నిర్ఘాంతపోయిన కొందరు ఆ యిద్దరినీ విడి పించి అసలు విషయం చెప్పమన్నారు. వాళ్ళు చెప్పిన విషయం క్లుప్తంగా యిది.

ఈ పెళ్ళికొడుకు వుద్యోగరీత్యావున్న ఒక వూళ్ళో ఆ పిల్లని ప్రేమించానని వ్యవహారం నడిపి తలిదండ్రులకి తెల్సి పెళ్ళిచేసుకోమని బలవంతంచేస్తే వాళ్ళని తప్పించుకోలేక తనకి యెవరూ లేరని బొంకి రిజిష్టర్ మ్యారేజ్ చేసు కుని కొన్నాళ్ళు అత్తవారింట్లో యిల్లరికం అల్లుడిగా వుండి ఆపైన మరోవూరు ట్రాన్స్ఫర్ చేయించుకున్నాడట. పెళ్ళాన్ని తీసుకువెళ్ళ మని అంటే యిదిగో అదిగో అనేసి కాల


యాపన చేస్తూ యిక్కడ మళ్ళీ ఎనిమిదివేలు కట్నం పుచ్చుకుని పెళ్ళికొడుకై పీటలమీద కూర్చున్నాడు. అలా పెళ్ళి జరిగిందని స్వంత తలిదండ్రులకు కూడా తెలియదుట. యితను మరో పెళ్ళి చేసుకోబోతున్నాడన్న వార్త ఆలశ్యంగా తెల్సి పరుగున వచ్చారు వాళ్ళు. ఆ పిల్ల ధైర్యంగా వెళ్ళి చెయిపట్టుకుని గుంజి అడిగింది.

"ఎన్నిసార్లు పెళ్ళిచేసుకుంటావ్? నన్నేం చేస్తావ్?" అని. అతను తలవంచుకున్నాడు. యింక సాక్ష్యం ఏంకావాలి. అన్నయ్యా వదినా పీటలకి అతుక్కుపోయినట్లు కూర్చుండిపోయారు. సుశీలకి స్పృహ తప్పిపోయింది. నా పరిస్థితీ అలానే వుంది. కానీ నన్ను నేను సంబాళించుకుంటూ సుశీలని- లోపలికి చేర్చాను. పెళ్ళిపందిరిలో గందరగోళం విని పిస్తోనే వుంది. శ్రీవారు అన్నయ్యవైపు నిల్చి మాట్లాడుతూన్నారు.

జరిగినదానికి మీ సంజాయిషీ యేమిటి! గద్దించి అడుగుతూన్నారు. పెళ్ళికొడుకు తండ్రికానీ తల్లికానీ మాట్లాడలేకపోతున్నారు. శ్రీవారికి ఆవేశం ముంచుకువచ్చింది. పెళ్ళికొడుకు దగ్గరగా నడిచారు. జుట్టుపట్టుకుని విస్సురుగా తలపైకి యెత్తారు.

"ఇవాళ యిందరిమధ్య యింత అవమానం భరించిన పెళ్ళికూతురూ ఆమె తల్లిదండ్రులూ నీకు యే శిక్ష విధిస్తే సరిపోతుంది! చెప్పు! నీ స్వార్ధంతో అమాయకులైన వాళ్ళని మోసగించాలని చూడటం యెంతపెద్ద నేరం! చెప్పు. నీకు ఏ శిక్ష విధించాలి! ఏంచేసి ప్రతీకారం తీర్చుకోవాలి! చెప్పు. చదువుకున్న గాడిదా! నువ్వు చేసిన పనికి మగజాతికే తలవంపులు కల్గింది. వెళ్ళు వెళ్ళి సుశీల తలిదండ్రుల కాళ్లు పట్టుకుని తప్పు అయిందని క్షమాపణ అడుగు." మెడపట్టి అన్నయ్య వైపుగా తోశారు.

అతను తప్పించుకు పారిపోవాలని చూస్తూన్నాడు. కానీ ధైర్యం చాలటంలేదు. అతని తండ్రి దగ్గరకి వచ్చి కొడుకుని పట్టుకుని



అన్నయ్య కాళ్ళదగ్గరకి తోస్తూంటే అన్నయ్య భరించలేకపోయాడు.

"చూడు శ్రీనాధ్! యితను యిలా క్షమాపణ అడిగినంత మాత్రాన పోయిన నా పరువు తిరిగిరాదు. దయచేసి వాళ్ళ నందర్నీ త్వరగా పంపేసెయ్యి." అంటూ మెల్లగాలేచి లోపలికి వెళ్ళిపోయాడు. శ్రీవారు యింకేం అనకుండా అందరినీ పంపేశారు.

పెళ్ళికొడుకు తండ్రి శ్రీవారి దగ్గరగా వచ్చి చేతులు పట్టుకున్నాడు.

"చూడు బాబూ! నువ్వు ఆయన బావ మరిదివిట కదూ! నే చెప్పేది కాస్త విను. వాళ్ళు యిచ్చిన కట్నం డబ్బు న్యాయంగా నే యిచ్చి వెళ్ళిపోవాలి. కానీ అది అంతా ఖర్చు అయిపోయింది. నేను త్వరలోనే ఆ పైకం పంపేలా చూస్తాను. యింకేం చెప్పలేను." ఆయన తలవంచుకుని వెళ్ళిపోయాడు. అర్ధ గంటలో కళకళలాడిన పెళ్ళిపందిరి ఖాళీ అయిపోయింది. స్పృహ తెల్సిన తర్వాత సుశీల కళ్ళనుంచి జలజలా కన్నీళ్ళు రాలాయి. దగ్గర కూర్చుని సముదాయించి ధైర్యం చెప్పాను.

"చూడమ్మా యిలాంటి పరిస్థితి యే ఆడపిల్లకీ రాకూడనిది. దురదృష్టంవల్ల నీకు వచ్చింది. అయితే యిలాంటప్పుడు స్థైర్యంగా నిలబడగలగాలి. జీవితం అంటేనే సమస్యల మయం. దిగులుపడకు. శాంతంగా వుండటానికి ప్రయత్నించు. భగవంతుడు దయామయుడు. కనుకనే యీ పెళ్ళి కాకుండా తప్పించాడు. ఔనా! యిప్పుడు చెప్పు. ఎంత అదృష్టవంతురాలివో!"

సుశీలా అన్నయ్యా వదినా రెండు రోజుల తర్వాత కాస్త కోలుకున్నారు. శ్రీవారు ఎక్కడెక్కడో తిరిగి యెవరో స్నేహితులని కల్సుకుని సుశీలకి ఓ చిన్న వుద్యోగం తెప్పించారు. ప్రస్తుతం జీతం తక్కువే అయినా తర్వాత మరోటి చూసుకోవచ్చు అని తృప్తిపడింది సుశీల. శ్రీవారి సెలవు అయిపోవటంతో నేనూ పిల్లలూకూడా బయలుదేరక తప్పలేదు. సుశీల పెళ్ళికి ప్రజంట్ తెచ్చిన ప్యాకెట్ విప్పనేలేదు. అసలు ఏం తెచ్చారో చూడనే లేదు. పాకెట్ విప్పబోతూంటే వారించారు.

"సుశీలపెళ్ళి ఎన్ని సంవత్సరాలకి అయినా యిది అప్పుడే తెరవాలి. ఆ అమ్మాయికి యివ్వాలి."

"అలాగే. కానీ ఏమిటి తెచ్చారో చెప్ప కూడదూ!" అడిగాను.


"ఉహూ!" తల అడ్డంగా వూపి ప్యాకెట్ పెట్టె అడుగున పెట్టేశారు. సుశీల రైల్వే స్టేషనుకి వచ్చింది.

"అత్తయ్యా! నేనింక పెళ్ళికోసం ఎదురు చూడను. యీ వుద్యోగం చేసుకుంటూ హాయిగా వుంటాను" అంది.

"అలా అనకు. జీవితంలో తిండీ బట్టా ఎంత అవసరమో అలానే పెళ్ళికూడా. అయితే నువ్వు యెదురు చూడకున్నా ఆ పెళ్ళి రోజనేది వచ్చితీరుతుంది. అప్పుడు నాకు పెళ్ళిపిలుపు అందుతుంది. ఆ పిలుపుకోసం నే యెన్నాళ్ళయినా యెదురుచూస్తూ వుంటాను" అంటూండగానే రైలు కదిలింది. కదిలే రైలు వెంట సుశీల నడుస్తూ వుంది.

"ఇంక యింటికి వెళ్ళమ్మా సుశీలా" అంటూన్నారు శ్రీవారు.

"అలాగే వుంటాను మామయ్యగారూ! అత్తయ్యా శలీ నీరజా వుంటాను." సుశీల వెనకబడిపోయింది. రైలు ముందుకు పరుగెత్తుతోంది. శ్రీవారు యేదో దీర్ఘంగా ఆలోచిస్తూన్నారు. నేనుమాత్రం మళ్ళీ సుశీల పెళ్ళి పిలుపుకోసం ఎదురు చూస్తూన్నాను. దేశంకాని దేశమే అయినా యిక్కడెవరన్నా ఓ పెళ్ళికొడుకు దొరికితే బాగుండు అన్పిస్తోంది. బహుశా శ్రీవారి ఆలోచనా యిదేనేమో! ☐



నాయుని కృష్ణమూర్తి

లక్షన్నొకటో రాముని కథ

చలి ఎముకల్ని కొరికేస్తోంది.

మట్టి కుంపటిలో చితుకులు కాలిపోయి సన్నగా మొదలైన పొగ, పొగకోసమే కుంపటి రాజేసినట్లు పైకివస్తూ పక్కన కూర్చోనీకుండా చేస్తోంది.

లక్ష్మణుడు గొంతుకూర్చునే రెండడుగులు వెనక్కువేసి కళ్ళు తుడుచుకుంటూ "ఒరే రామిగా! ఆదెక్కడయినా నాలుగు చితుకులు ఏరుకురారా!" అన్నాడు పక్కన కూర్చుని కునికిపాట్లు పడుతున్న పన్నెండేళ్ళ కొడుకు రామునితో.

నిద్రమత్తు వదలని రాముడు తూలుతూ పైకిలేచి యింకా తెల్లవారని ఆ చీకట్లో కానుగ చెట్టు పక్కనున్న ముళ్ళ కంచెవైపు కదిలాడు.

లక్ష్మణునికి భయంగా వుంది. ఆ భయం లోపల కుక్కిమంచంమీద మెలికలు తిరుగుతున్న సీతాలక్ష్మి 'అమ్మో' అని కేకపెట్టినప్పుడల్లా ఎక్కువౌతోంది.

రాముడు చితుకులు ఏరుకొచ్చాడు. వాడి కిప్పుడు నిద్రమత్తులేదు. పొదుపుగా వాడా లన్నట్లు ఎత్తుకొచ్చిన వాటిల్లో కొన్ని మాత్రం కుంపటిలోవేసి ఊదసాగాడు.

మంట ఎక్కువయింది.

సీతాలక్ష్మి అరుపులు ఎక్కువయ్యాయి. "నన్ను చంపేయండ్రోయ్ దేవుడోయ్" ఏడు స్తోంది.

రాముడుగాని, లక్ష్మణుడుగాని సీతాలక్ష్మి అరుపులు విన్నా ఏమీ మాట్లాడలేదు. కుంపటి ముందు చలికాచుకోవడమే జీవితమన్నట్లు తదేకంగా మంటవైపు చూస్తూన్నారు.

అయిదు నిమిషాలు గడిచిపోయాయి. సీతా లక్ష్మికి అరుపుల్తో శోషవచ్చినట్టుంది. కిక్కురు మనకుండా వుంది.

రాముడు చాలా సేపు ఆలోచించి "తెల్లారే లోపల పిన్నమ్మ చస్తుందంటావా నాన్నా" అన్నాడు.

లక్ష్మణుడు యథాలాపంగా తల అటూ యిటూ ఆడించి జేబులోంచి తాపీగా బీడీ ముక్కను తీసుకుని కుంపటిలో వెలిగించి ఒక గుక్కతాగి "ఏమో! చెప్పడం చానాకష్టం. బతికితే బతకొచ్చు. చచ్చినా చావొచ్చు" అని ఏమనుకున్నాడో ఏమో గయ్యిమని పైకిలేచి "నాకొడకా! నీ పింతల్లి ఎప్పుడు చస్తుందా అని కాచుకూచున్నావా దొంగ ముండాకొడకా! అజ్జ స్తే నీకూ నాకూ గంజినీళ్ళు పోసే దిక్కె వర్రా నాయాలా" అన్నాడు.

అని మళ్ళీ నింపాదిగా కుంపటిముందు జరిగి కూర్చున్నాడు.

రాముడు యింకా ఆలోచిస్తూనే అన్నాడు "ఎందుకోగాని అది సచ్చిపోతుందనే అనిపిస్తా వుంది. నువ్వు సెప్పవుగాని మనసులో పిన్నమ్మపోతే అర్థరూపాయి నూకల్తో మనిద్ద రికీ రోజు ఎళ్ళిపోతుంది గదా అని అను కుంటూ వుంటావు. లేకపోతే రూపాయెట్టి రాత్రి సారాయి తాగి పిగలెయ్యకుండా ఆచారి దగ్గర యిన్ని మందు నీళ్ళు తీసుకొచ్చి దాని గొంతులో పోసుందేవాడివి."

కొడుకు తనమీద యింతటి స్వల్పమైన నిందవేసి దానికి సీతాలక్ష్మి ప్రాణాలకీ ముడి పెట్టడం లక్ష్మణునికి నచ్చలేదు. "ఒరే! కుర్ర సన్నాసీ! నీకు తెలవదు. అదంటే నాకు ప్రాణంరా? ఈ క్షణంలో యమధర్మరాజు యీ కుంపటిముందుకొచ్చి ఒరే! లచ్మనా! నీ పేనం తీసకెళ్ళమంటావా? నీ పెళ్ళాం పేనం తీసు కెళ్ళమంటావా అంటే మహాప్రభో! నా పేనమే తీసుకెళ్ళు అని ధైర్యంగా చెప్పేస్తాను" అన్నాడు.

రామునికి సందేహాలు వుండనే వున్నాయి. "అసలా ఊసెత్తకుండా రూపాయి చేతిలో పెట్టి మాయమైపోతే ..."

లక్ష్మణుని కళ్ళు మెరిశాయి. ఊహలో నైనా రూపాయి చేతికి రావడం వానికి ఆనం దంగానే వుంది.

"అదెట్టుకుని నువ్వు సారాయి తాగడాని కెళ్తావా? మందునీళ్ళు పోయిస్తావా?"

" ..పేనాలు యిస్తానని చెప్పానుగదరా!"

"రూపాయిల్తో సమ్మంధంలేని ప్రాణాల ఊసెత్తకు. రూపాయి అయితే ఏం జేస్తావు అంట ."

లక్ష్మణుడు మాటమార్చాడు. "తెల్లారి పోతోంది. ఆచారి నిద్ర లేసింటాడా?"

"ఆడి దగ్గరికి దబ్బుల్లేకుండా మందుకెళ్ళ మంటే నేను చచ్చినా వెళ్ళను. మొగాన తుపుక్కుమని ఉంచేసినా ఉంచేయ గలు."


లక్ష్మణుని చేతిలో బీడీ ఎప్పుడో ఆరి పోయింది. కుంపట్లోకి దాన్ని గిరవాటేసి "సీతాలచ్మి పోతే చానా కష్టంరా!" అన్నాడు.

"మాయమ్మ సచ్చినప్పుడు కూడా నువ్విట్టాగే అన్నావు. దాని కర్మకాండలు సేసీ సెయ్యకుండానే యీ యమ్మను తెచ్చి ఉంచేసు కోలా!"

లక్ష్మణుడు ఆలోచనలో పడ్డాడు.

తెల్లవారింది.

కుంపటిలో ,చితుకులు అయిపోయాయి. నిప్పు ఆరిపోయింది. నిండుకున్న బూడిద తెల్లారగట్ల వీచే చల్లని గాలికి పైకి తుంపరలా ఎగురుతోంది.



సీతాలక్ష్మి నిద్రలోనే చచ్చిపోయింది.

* * *

"పుణ్యాత్మురాలు సచ్చి సొర్గానికి చేరుకొంది." ఇరుగూ పొరుగూ సానుభూతి చూపించారు. మోకాళ్ళ మీద తలవాల్చి కూర్చున్న లక్ష్మణుడు వంచినతల పైకెత్త లేదు. పెళ్లాం చచ్చిపోతే మొగుడు అయినవాడు ఏడ్వాలి అన్న తెలిసిన సత్యం తనకు తెలీకుండా ఎక్కడో మనసులో దాగివుండడం వల్ల అప్రయత్నంగా రెండు కన్నీటి బొట్లు విడిచి ఇంటి గుమ్మంముందు తడిక పక్కన గోడకానుకుని కూర్చుని ఏదో తెలీని దిగులు ఆవరించి వేడెక్కిన మెదడును అదుపులో తెచ్చుకోడానికి బీడీ ముట్టించిన లక్ష్మణుడు చాలా సేపటివరకు పక్కకు కదల్లేదు.

రామునికి ఏడుపులూ, పొడబొబ్బలూ అంటే చాలా అసహ్యం. అవి వింటుంటే వాడికి ఒంటిమీద తేళ్ళూ, జెర్రులూ ప్రాకినట్లుంటుంది. లక్ష్మణుని వాలకం చూసి తన పింతల్లి హరీమందన్న నిర్ధారణకొచ్చి నిస్తేజంగా కూర్చునివున్న లక్ష్మణుని పక్కన రాతి మీదవున్న బీడీకట్టలోంచి నాలుగు బీడీలు అతి నేర్పుగా సంగ్రహించి సీతాలక్ష్మిని పూడ్చిపెట్టడానికి రెండు బారల పొద్దయినా పడుతుందని అంతవరకూ చెరువు కట్టమీద తిరిగిరావడమే మంచిదనుకుని బయలుదేరాడు.

సీతంరాజు, చంద్రిగాడు, ముసలయ్య, ద్రోణప్ప అందరూ లక్ష్మణున్ని తమ శాయశక్తులా ఓదార్చారు.

"నువ్విలా దిగులుపడి కూర్చుంటే లాభం లేదు. కుర్రసన్నాసి ఆ రాముడు గుండెలు బాదుకొనేస్తాడు. అయినా ఎంతమంది చావు చూళ్ళేదు నువ్వు? పుట్టింతర్వాత మనిషికి గిట్టకుండా తప్పుతుందా?" అని వేదాంతం చెప్పారు.

లక్ష్మణుడు ఇలాంటి నీతుల్ని యిదివరకూ చాలామార్లు విన్నాడు. ఇప్పుడు వాడి బాధంతా చచ్చిన సీతాలక్ష్మి కోసంకాదు. ఇప్పుడా శవాన్ని ఎలా పూడ్చిపెట్టాలా అని. దానికయ్యే ఖర్చుకోసం ఏంచెయ్యాలా అని? విషమ సమస్యలా వాడి మనస్సును పీడిస్తోంది. కనీసం తనకీ సంకటాన్ని తొలగించటానికైనా సీతాలక్ష్మి బ్రతికివుంటే బాగుండుననిపించింది.

బ్రతకడమంటే తెల్లారి రాముని మాటలు గుర్తుకొచ్చాయి. రాత్రి పీకలదాకా తాగడానికి

ఖర్చుపెట్టిన రూపాయి గుర్తుకొచ్చింది. ఆ రూపాయి సంపాదించుకొచ్చిన తీరు గుర్తు కొచ్చింది.

లక్ష్మి బాధ చూళ్ళేక కనీసం రూపాయైనా సంపాదించి దాన్ని ఆచారికిచ్చి మందు నీళ్ళు పోయిద్దాము అని రూపాయిని సంపాదించడానికి నిజంగా కపటంలేని ఆలోచనలతోనే బయలుదేరాడు లక్ష్మణుడు.

ఇప్పుడో రూపాయి యిస్తే న్యాత్రోజులు కూలిచేసి పెడతాను బాబూ అని అడగగలిగిన వాళ్ళందర్నీ అడిగాడు లక్ష్మణుడు. 'తాగుబోతునాకొడకా' నీ మాట ఎవరు నమ్మారు?' అని అందరూ అన్నవాళ్ళేకాని లక్ష్మణుని మీద జాలిపడ్డ వాళ్లెవరూ లేరు.

జారిపోతున్న నిక్కరుని మాటిమాటికీ పైకి ఎగలాక్కుంటూ తండ్రి వెనకంబడి నడుస్తున్న రాముడు సలహా అందించాడు "పెదబాబుగార్ని అడక్కూడదూ?'' అని. పెదబాబంటే ప్రకాశరావు. ఆ వూళ్ళోని నాలుగు వందల గడపలకూ మకుటంలేని మహారాజు. ఆ బాబు డబ్బు యిస్తాడంటే లక్ష్మణునికి నమ్మకం కుదరలేదు.

అయినా ప్రయత్నించి చూద్దామని పెదబాబు యింటి ముందుకి నడిచాడు. ఆ సమయంలో లక్ష్మణుని నవగ్రహాలూ అనుకూలస్థితిలో వున్నాయి. ఎక్కడికో బయటికి బయలుదేరి వెళ్ళబోతున్న పెదబాబు లక్ష్మణుని చూసి ఒకక్షణం ఆగాడు.

"పెళ్లాం చావుబ్రతుల్లో వుంది బాబూ! మందు పోయించాలి'' ఏడుపును దిగమ్రింగుకుంటూ అన్నాడు లక్ష్మణుడు.

మారుమాట్లాడకుండా జేబులోంచి ఒక రూపాయి బిళ్ళనుతీసి దోసిలిపట్టిన లక్ష్మణుని చేతిమీదుగా క్రిందపడేటట్లు విసిరిన పెదబాబు పక్కకు తప్పుకుని వెళ్ళిపోయాడు.

లక్ష్మణుడు తెగ సంతోషపడిపోయాడు. ఎగిరిపోయే సీతాలక్ష్మి ప్రాణాలు నిలిచిపోయి నట్లే సంబరపడిపోయాడు.

పరుగెత్తినంత వేగంగా ఆచారి యింటికి బయలుదేరాడు. రామునిక్కూడా సంతోషంగానే వుంది. మందుపోయిస్తే వికృతంగా ఏడ్చే సీతాలక్ష్మి ఏడుపులు ఆగిపోతాయి కదా అని వాడి ఆనందం.

అలా సదుద్దేశంతోనే బయలుదేరిన ఆ తండ్రీ కొడుకులు ఆచారి యింటికి పది గజాల దూరంలో ఆగిపోయారు.

తండ్రి ఆగటంవల్ల కొడుకు ఆగాడు.

లక్ష్మణుడు ఆగింది - రూపాయి బిళ్ళతో బొమ్మబొరుసు వెయ్యడానికి. తండ్రి అర్ధాంతరంగా రోడ్డుమీద ఆగిపోవడానికి కారణమేమిటా అని బుర్రబద్దలు కొట్టుకున్న రాముని కి సంగతి అర్ధమయింది.

రోడ్డుకు ఎడంవైపున ప్రభుత్వ సారాయి దుకాణం వుంది. కుడివేపు పదిగజాల కవతల ఆచారి యిల్లుంది.

పెళ్లాం రోగాని కన్జెప్పి తీసుకొచ్చిన రూపాయితో మందు కొట్టెయ్యడమంటే లక్ష్మణునికి బాధగానే వుంది. అదీ రాముని ముందు ఆ పని చేయాలంటే వాడి మనసు ఒప్పుకోలేదు.

ఎటూ తేల్చుకోలేని లక్ష్మణుడు రోడ్డు పక్కన ఫర్లాంగు రాతిమీద కూర్చున్నాడు. రాముడు పక్కన కంకరరాళ్ళ కుప్పమీద కూర్చొన్నాడు.

లక్ష్మణుని దైలమా రామునికి తెలుసు. "ఈడు రూపాయెట్టి మందెట్టుకెళ్ళేది లేదు. ఇట్టాగే కాస్సేపు కూచుని నన్నెక్కడికో వెళ్ళి రమ్మని పాకలోకి దూరేస్తాడు.'' రాముడు ఆ కార్యక్రమంకోసం ఎదురుచూస్తూన్నాడు.


"రాసిపెట్టింది రాసిపెట్టినట్లు జరుగుతుంది. ఏమంటావురా రాముడూ?'' లక్ష్మణుడు అడిగాడు.

"అవును.''

"ఇయ్యాళ చావాలని రాసుంటే ఆ బ్రహ్మదేవుడు దిగొచ్చినా మనిషి బతికి బట్టకట్టడు''

"నిజమే!''

"నువ్వింటికెళ్ళి దానికెట్టుందో చూడు.. నేనిప్పుడే వస్తాను.''



సందు మలుపు తిరిగిన రాముడు కాస్సే పోగి మళ్ళీ వెనక్కి తిరిగాడు. లక్ష్మణుడు సారాపాకలో వున్నాడు.

రాముడు పెదాలు తడుపుకున్నాడు. నెల రోజుల క్రితమెప్పుడో అయాచితంగా తన చేతి కొచ్చిన అర్ధరూపాయి బిళ్ళతో అర్ధగ్లాసు త్రాగి నప్పటి రుచిని తలచుకుని పెదవుల్ని నాలుకతో తడుపుకున్నాడు.

* * *

"ఆ పని చేసుండకూడదు." ఇంకోమారు అనుకున్నాడు లక్ష్మణుడు.

"ఏరా అట్లాగే కూర్చుండిపోయావు. కాటికి తీసుకెళ్ళవా ఎమిటి?" సీతంరాజు వచ్చి పక్కన కూర్చుని బీడీముట్టిస్తూ అన్నాడు.

నిస్తేజంగా వున్న కళ్ళను పైకెత్తాడు లక్ష్మణుడు. "దమ్మిడీలేదు. ఎట్లాగా అని బుర్ర పన్జెయ్యడంలేదు."

"చావొచ్చినా బిడ్డపుట్టినా మనలాంటోళ్ళకి ఏదో ఒకటి తెగనమ్ముకోకుండా తప్పుతుందా! దేన్నైనా చూసి కార్యం జరిపించు"అన్నాడు.

"నీకు తెలవందేమిటి మావా? మట్టి బోకులు తప్ప యింట్లో ఏమున్నాయ్."

"గిత్త నమ్మేయకూడదూ? అదుండి నిన్నేం ఉద్ధరిస్తుంది?"

లక్ష్మణునికి స్వయంగా యింతవరకూ రాని యీ ఆలోచన నచ్చింది. "ఉన్నపళంగా ఎవరు కొంటారు మావా? మనమై తీసుకోమంటే పదికిస్తావా? పాతిక్కిస్తావా? అంటారు."

"ఇప్పుడు ఖర్చుకి ఎంత కావల్సి వుంటుంది?"

లక్ష్మణుడు అయోమయంగా సీతంరాజు వంక చూశాడు.

"చచ్చింది నాకు తోడబుట్టువుతో సమానం. నాకెందుకో యీ కార్యానికి నీకు సాయం పడాలనిపిస్తోంది. నువ్వు సరేనంటే యిప్పటికి సరిపడా యిభయ్యిస్తాను. ఇంకో నెలనాళ్ళకు ఓ పాతికిస్తాను."

లక్ష్మణుని దగ్గర సీతంరాజు సరే అని పించాడు.

ఈ మాటల్తో ప్రమేయమేమీలేని గిత్త లక్ష్మణుని యింటి ముందునుంచి సీతంరాజు పెరటికి మారింది.

అయిదు పదిరూపాయల నోట్లు లక్ష్మణుని బనీను జేబులో గరగరమన్నాయి.

లక్ష్మణునికి భయం వేసింది.

నిన్నటి రూపాయి గుర్తుకొచ్చింది.

అది తగలేసి తాగిన సారాయి గుర్తు కొచ్చింది.

లక్ష్మణుడు తనకు తెలిసిన లెక్కల జ్ఞానంతో యాభై రూపాయలకు మొత్తం ఎంత పరిమాణం కలిగిన సారాయి వస్తుందో అని ఆలోచించాడు.

లక్ష్మణునికి మళ్ళీ భయం వేసింది.

చెరువుగట్టుమీదినుంచి రాముణ్ణి పిలిపించి డబ్బు ఇచ్చి అంగడినుండి కావలసిన సరుకులు తీసుకురమ్మన్నాడు.

లక్ష్మణునిలో భయం అంతరించి హృదయం తేలికపడింది.

రామునిలో భయం మొదలయింది.

*　　*　　*

రాముడు వీధిలో హుందాగా నడుస్తున్నాడు.

మహారాజులా గంభీరంగా అడుగులు వేస్తున్నాడు.

ఎదురొస్తున్న పెదవాలు వాడి కంట్లో పడలేదు.

సారాపాక ముందు కొచ్చేసరికి నిన్నటి లక్ష్మణునిలా రాముడుకూడా అప్రయత్నంగా ఆగిపోయాడు.

వాడి పెదవులమీదికి సన్నటి చిరునవ్వు పొడుచుకొచ్చింది. నిన్న లక్ష్మణుడు కూర్చున్న ఫర్లాంగు రాతిమీదే కూర్చుని సారాపాకలోకి నిర్నిమేషంగా చూడసాగాడు.

లక్ష్మణుడు చెప్పిన కర్మ సిద్ధాంతం గుర్తొచ్చింది.

రాసిపెట్టింది రాసిపెట్టినట్లు జరుగుతుందని నిన్నయితే ఒప్పుకున్నాడు గానీ యీ రోజు మళ్ళీ వాడికి అదే అనుమానమొచ్చింది.

అలా అనుమానం రావడం బహుశా యీ ఫర్లాంగు రాతిమీద కూర్చోవడంవల్ల జరుగుతోందేమోనని పక్కన కంకరరాళ్ళ కుప్ప మీద తన తండ్రిని ఊహించుకుని "రాసిపెట్టింది రాసిపెట్టినట్లు జరుగుతుంది. అవును కదా లక్ష్మణా?" అన్నాడు.

లక్ష్మణుడు "ఔను" అని సమాధానమిచ్చినట్లు ఊహించుకున్నాడు రాముడు.

"పిచ్చి ముండాకొడుకా!" అని రాముడు కంకరరాళ్ళ కుప్పమీద ఊహించుకున్న లక్ష్మణునిమీద ఒకమారు, సారాయిపాకవైపు తిరిగి అటువైపు ఒకమారు తుపుక్కుమని ఉమ్మి చేతులు కట్టుకుని తల ఎగరవేస్తూ ముందుకు నడిచాడు.

రామునిలో యిప్పుడు భయంలేదు. నిన్న మా నాయననాకొడుకు చేసిన తప్పును నేను మళ్ళీ చేయడానికి అవకాశమున్నా నేను చేయలేదు. నేను ఆడికంటే చాలా మంచోణ్ణి అనుకుంటూ ముందుకు నడిచాడు.

పూర్తిగా ముందుకు నడవలేకపోయాడు రాముడు.

వద్దనుకుంటూనే పక్కదోవకు తిరిగాడు. కారణం ఆ దోవలో ముందు కామేశ్వరి వయ్యారంగా నడుస్తూపోతోంది.

"ఒసేయ్" గట్టిగా పిలవలేక నెమ్మదిగానే పిలిచాడు రాముడు.

ఆ వూళ్ళో మీసం వచ్చి నిక్కరు సరిగ్గా కట్టడం చేతనైన మగాళ్ళనుంచి అరవయ్యేళ్లు వచ్చినా కక్కుర్తి చావని వాళ్ళవరకూ అందరికీ కామేశ్వరి యెవరో తెలుసు.

అద్దంముక్కలో తనకు అందమైన మీసం అప్పుడప్పుడే రావడం పసికట్టిన రాముడు ఒకరోజు మామిడితోపు దగ్గర ఎవరూలేకుండా చూసి కామేశ్వరిని నిలేశాడు.

"పక్కకు జరగవయ్యా!" అంది కామేశ్వరి పెడరసంగా.

"ఉహూఁ!" కళ్ళతోనే కామేశ్వరిని తినేసేలా చూశాడు రాముడు. మొండిధైర్యంతో అలా తెగించాడుగాని రాముని గుండె నిముషానికి లక్షమార్లన్నంత వేగంగా కొట్టుకుంటోంది.

"ఎంతవుద్దో తెలుసా? అయిదు రూపాయలు—అదే యిదే కామేశ్వరి పట్నం వెళ్తే పదిరూపాయలు. ఏమయ్యో? అయిదు రూపాయలు పదిరూపాయిలు అంటే ఏంటో నీకర్థమయిందా? ఇప్పుడు జరుగు పక్కకు. తొందరగా పోవాలి."

నీరసించిన రాముడు పక్కకు జరిగాడు.

"జేబులో అణాకానీ లేని నాయాళ్ళంతా పయిట పట్టుకొని నిలేసేవాళ్ళే!" కామేశ్వరి

గొణుక్కుంటూ వెళ్ళిపోయింది.

రాముని శరీరం ఉడికిపోయింది.

ఇప్పుడు కామేశ్వరిని చూడగానే రామునికి ఆ రోజుటి సంగతి మళ్ళీ గుర్తుకొచ్చింది. శరీరం మళ్ళీ ఉడికింది.

గొంతు హెచ్చించి మళ్ళీ పిలిచాడు రాముడు 'ఒసేయ్' అని.

కామేశ్వరి ఆగింది.

రాముడు షర్టు చిరుగునూ కాలర్‌నూ సర్దుకుని "ఏంటి? ఆరోజు ఏంటన్నావూ?" అన్నాడు ఉపోద్ఘాతం ఏమీ లేకుండానే.

కామేశ్వరి బిత్తరపోయింది. శివమెత్తినట్టున్న రాముడు నడిరోడ్డులో ఏం అఘాయిత్యం చేస్తాడో ఏమో అనుకుని "ఏంటయ్యా మంచి వూపులో వున్నట్టున్నావే!" అంది.

"నీ ఎదవ్వేషాలు తర్వాతగాని, ఆ రోజు ఏమన్నావు? ఎంతవుద్దన్నావు?" అన్నాడు.

కామేశ్వరి వయ్యారాలు పోయింది. "దేనికెంతేవిఁటి?" నంగిలా అంది.

"పట్నంకెళ్తే పది రూపాయలా? ఒసే కామేసిరీ! ఈ రాముడంటే అల్లాటప్పా ఓడని కదూ నీ ఉద్దేశం? అలా ఎప్పుడూ అనుకోమాక. మనిసన్న తర్వాత డబ్బులుండేటయమూ వుంటుంది లేని టయమూ వుంటుంది. అర్థం చేసుకోవాల. జేబులో అణాకానీ లేని నా యాళ్ళంతా పయిటపట్టుకుని నిలేసే నాయాళ్ళే అన్నావు కదూ? ఇదిగో యిటు చూడు. కనిపిస్తున్నాయా? ఏంటివి? పది రూపాయలు. ఎన్ని? అయిదు. మొత్తం ఎన్ని రూపాయలు? యాభై రూపాయిలు. కామేశ్వరీ? ఇలాంటి డబ్బు రాముదెన్నో మార్లు కళ్ళజూశాడే!"

"అయితే యిప్పుడేటంటావు? ఇక్కడికిక్కడ "ఆగిపోయింది.

రాముడు తుపుక్కున ఉమ్మేశాడు. గబగబా తన చేతిలోని నోట్లను కామేశ్వరి చేతిలో కుక్కి "వాడూ డబ్బుకోసం గడ్డితినే నీలాంటి పెళ్ళాం, మందులుకోసం తెచ్చిన్రూపాయెట్టి మందు కొట్టేసే ఆ లక్ష్మనున్లాంటోడు కాదే యీ రాముడు. ఈడు నికార్సయినోడూ" అని రివ్వున వెనక్కుతిరిగి గబగబా నడవసాగాడు.

క్షణంసేపు మతిభ్రమించినట్లయిన కామేశ్వరి కిసుక్కుమని ఓ నవ్వు నవ్వుకుని ముందుకెళ్ళిపోయింది.

రోడ్డుమీది కొచ్చిన రాముడు ఫర్లాంగు రాతిమీద మళ్ళీ కూర్చున్నాడు.

ఇప్పుడు మళ్ళీ వాడికి ఎటెళ్ళాలో దిక్కుతోచటంలేదు.

కాస్సేపు జుట్టుపీక్కుని కంకర రాళ్ళమీద మళ్ళీ లక్ష్మణున్ని ఊహించుకుని "లక్ష్మణా! నేజ్జేసింది రైటేనంటావా?" అన్నాడు.

"ఓరి నా కొడకా! ఆ యాభై రూపాయలూ నువ్వా లంజకిచ్చేస్తే మీ పింతల్లిని పూడ్చి పెట్టేది ఎట్లాగురా?" అన్నాడు ఊహా లక్ష్మణుడు.

రాముడు మళ్ళీ జుట్టు పీక్కుని కాండ్రించి ఉమ్మడానికి ఎవరూ తోచకపోవడంతో తన నీడమీద తానే ఉమ్మకుని తిరిగి చూడకుండా పట్నానికి బయలుదేరి వెళ్ళిపోయాడు.

* * *

లక్ష్మణునికి ఆశ్చర్యంగా వుంది.

ఇంట్లో పీనుగను పెట్టుకుని రాముడు డబ్బెత్తుకుని పారిపోయాడంటే కాదన్న పాపాత్ముడు లేడు. తమంతకు తామే ఒకటీ అరా చందాలు పోగుచేసి జరపాల్సిన కర్మకాండ నంతా ఏ లోటూ లేకుండా జరిపించివేశారు.

* * *

నాల్రోజులపాటు తిండీ తిప్పలు లేకుండా తిరిగిన రాముడు మళ్ళీ యింటికి వచ్చాడు. లక్ష్మణుదేమీ మాట్లాడలేదు. బిక్కుబిక్కుమనుకుంటూ రాముడు అప్పుడో మాట యిప్పుడో మాటగా రెండు రోజుల్లో తాను డబ్బును ఏమేంచేసిందీ పూర్తిగా లక్ష్మణునికి చెప్పేశాడు.

సంగతి పూర్తిగా విన్న తర్వాత లక్ష్మణుడు అనుకున్నాడు. "అసలు డబ్బెట్టుకుని నేను పారిపోయున్నా కర్మకాండ జరిగిపోయుండేది. పైగా యీ సన్నాసి నాయాల్లా కాకుండా పీకల్దాకా తాగేసి కామేశ్వరికి ఎంతిచ్చినా యిచ్చిందానికి పదింతలుగా రాబట్టుకొనివుండేవాణ్ణి." □

కతికితే అతకదంటారు!

ఎందుకని?

"గుడ్ యీవినింగ్ తాతయ్యా!" పరుగున వచ్చింది స్రవంతి.

"ఓహో స్రవంతా? గుడ్ యీవినింగ్ మై బేబీ! ఏమిటీ? యీవేళ చాలా చాలా ముస్తాబయి వచ్చావు? ఏమన్నా విశేషం వుందా తల్లీ!"

స్రవంతిని పరామర్శించాడు తాతయ్య.

"ఓ లేకేం? చాలా విశేషాలున్నాయి తాతయ్యా!. నువ్వు నన్నేకాదు - నా ఫ్రెండ్సు చాలామందిని కూడా ఆలోచింపజేస్తున్నావు. పోయినసారి కలిసినపుడు మనం చర్చించిన విషయాన్ని గురించి మా ఫ్రెండ్సుతో చెప్పాను. అందరూ భలే ఆశ్చర్యపోయారనుకో "స్రవంతీ! నువ్వు అప్పుడప్పుడు తాతయ్యను కలుస్తూ వుండు. ఆ విశేషాలన్నీ మాకు అందజేస్తూ వుండు — వీలయినంతవరకు మేమూ వచ్చి తాతయ్యను కలుస్తాం అని గూడా అన్నారు."

స్రవంతి గుక్క తిప్పుకోకుండా చెప్పింది.

"అబ్బ ఆగవమ్మా స్రవంతీ! నువ్విలా ఫుల్‌స్టాపులూ, కామాలూ లేకుండా పొగిడేస్తున్నావా అసలే వయసయిపోయిన వాడిని నేను భరించలేనమ్మా అది సరేగాని, అసలు విషయం చెప్పలేదు నువ్వు" అన్నాడు తాతయ్య.

"ఓ అదా! ఈ రోజు పెళ్ళి చూపులు తాతయ్యా " నెమ్మదిగా అంది స్రవంతి.

"ఏమిటీ పెళ్ళిచూపులా? నీకే?" తాతయ్య నిటారుగా కూర్చుంటూ అడిగాడు.

పక పక నవ్వింది స్రవంతి.

"తాతయ్యా .. తాతయ్యా . భలే వాడివే నువ్వు. నాకేమిటీ! పెళ్ళిచూపులేమిటీ? అది గూడా—నీకు తెలియకుండా ఎలా? అవును నీకు మా ఫ్రెండు వాళ్ళక్కయ్య సుధ తెలియదూ?"

"ఎవరూ ఆ అమెరికా అమ్మాయా?" అడిగాడు తాతయ్య నిదానంగా—

స్రవంతికి నవ్వు వచ్చింది. సుధకి వెస్టరన్ పద్ధతులమీద మోజు మెండు. ఇంగ్లీషు మాట్లాడేటప్పుడు ఎదుటివాళ్ళకి శబ్దం తప్ప భావం అవగాహన కాకూడదనే వాదం సుధది. ఆ ఉచ్చారణగూడా అంతు బట్టని రకమే! అందుకే తాతయ్య ఎప్పుడూ ఆ అమ్మాయిని అమెరికా అమ్మాయి అని ఆటలు పట్టిస్తుంటాడు.

"నీ జ్ఞాపకశక్తికి హేట్సాఫ్ తాతయ్యా . అవును అదే—దానిని చూడడానికి ఎవరో వచ్చారు—మా ఫ్రెండు బలవంతంచేసి నన్ను ముస్తాబు చేయించి మరీ తీసుకెళ్ళింది. అదీ కథ."

"అలాగా! చాలా సంతోషమమ్మా' ఇంతకూ ఎలా జరిగాయి పెళ్ళిచూపులు?"

తాతయ్య పొగాకు కాడ బయటకు తీశాడు.

"పెళ్ళిచూపులకేం? బాగానే జరిగాయి తాతయ్యా అది సరేగాని నాకొక పెద్ద సందేహం కలిగింది తాతయ్యా అందుకే వున్నపళాన వచ్చేశాను."

అంది స్రవంతి తాతయ్యకు కొంచెం దగ్గరగా జరుగుతూ.

"నాకు మంచి శిష్యురాలివే దొరికావు స్రవంతీ! ఇంతకూ ఏమిటీ నీ సందేహం?" అన్నాడు తాతయ్య చుట్టకొసలను కొరికి పారేస్తూ.

"పెళ్ళిచూపుల తతంగం ముగిసింది. సుధ నాన్నగారు భోజనం చెయ్యమన్నారు వాళ్ళని. వాళ్లు ఒప్పుకోలేదు. "కతికితే అతకదు"

అని చెప్పి ఆ పెళ్ళి కాస్తా అయిందంటే యెన్నిసార్లయినా భోజనం చేద్దాం అన్నారు. ఇదేమన్నా బావుందా తాతయ్యా! దీనికి ఏదన్నా కారణం వుందా. నువ్వే చెప్పు?" అంది స్రవంతి—తాతయ్య యేం చెబుతాడోనన్న కుతూహలంతో.

"స్రవూ! బావుండడం, బావుండకపోవడం వారివారి యిష్టాయిష్టాల మీద ఆధారపడే విషయం. భోజనం చేసినాగూడా అన్నీ సవ్యంగా జరిగిన సందర్భాలు తెలుసు నాకు. అలాగే పెళ్ళిచూపుల్లో కతకనంతమాత్రాన సంబంధాలు అతుకుతాయనుకోవడం కొంచెం అవివేకమే అవుతుంది.

ఎటొచ్చీ కారణముంది చూశావూ—దాన్ని గురించి మనం ఆలోచించాలి.


ఇప్పుడంటే సరేగాని, వెనుకటిరోజుల్లో యివాళ్టిలాగా హోటళ్లు, బసలూ లేవు తల్లీ. కొంచెం పరిశీలిస్తే యివాళ్టికీ హోటళ్లు లేని వూళ్లు ఎన్నోవున్నాయి.

ఒకరి యింటికి పిల్లను చూడ్డానికి ఎవరైనా వెళ్ళారనుకో. అక్కడ యేమీ తినగూడదు అన్నారు మన పెద్దలు. ఆ విధంగా పొరుగూరికి వెళ్ళిన పెద్దవారు యింకెవరి యింటికో వెళ్ళడం తప్పనిసరి అవుతుంది. తిండి తినడం తప్పనిసరి కనుక, పిల్లవారింట్లో తినగూడదు కనుక, మరో యింటికి వెళ్ళడం జరుగుతుంది. అక్కడ కాసేపు పిచ్చాపాటి జరిగాక, అసలు విషయం బయటపడక తప్పదు—ఆపైన ఆ వూరివాళ్లు కనక, అక్కడ అమ్మాయిని గురించి పెళ్ళివాళ్లు వాకబు చేయడమూ తప్పదు.

మరోవంక, పెళ్ళివాళ్ళ వివరాలు తెలివిగా రాబట్టుకొని, వాళ్లు పిల్లవారికి అందజేయడమూ కద్దు.

ఇలా ఒకరికొకరు ప్రత్యక్షంగా చెప్పుకోలేని, చెప్పని ఎన్నో ముఖ్యవిషయాలు బయటపడతాయి. మన పూర్వీకులు యీ పద్ధతిని యిందుకోసం ఆచరించి వుంటారని నా వుద్దేశ్యం."

(వి) చిత్ర విజ్ఞానం



"జేమ్స్ బాండ్"గా నటించి ప్రసిద్ధిగాంచిన సీన్ కానరీకి, జ్యోతి మాస పత్రికకీ దగ్గరి సంబంధం వుంది.
సీన్ కానరీ 25-8-1943 న పుట్టాడు.
అంటే "న్యూమరాలజీ" ప్రకారం అతని "బర్త్‌డే" నంబరు, 6 అదే లెక్కన జ్యోతి నంబరు కూడా 6"!

అన్నాడు తాతయ్య చుట్ట వెలిగిస్తూ.

"వండర్‌ఫుల్ తాతయ్యా నువ్వు చెప్పింది బాగా కరెక్టు అని తొస్తుంది నాకు."

అంటూ లేచింది స్రవంతి.

"ఏమిటమ్మా! లేచావు? అంత అర్జంటుగా వెళ్ళాలా?"

"అర్జంటేమీలేదు తాతయ్యా—కాని ఆ పెళ్ళివాళ్ళు భోజనం చేయలేదని సుధ వాళ్లు ఒకటే బాధపడిపోతున్నారు. ముందు పెళ్ళివాళ్ళను వూరడించాలి. ఈ సంగతి చెబితే వాళ్ళ మనసులు తేలికపడతాయి గూడా!"

అంటూ రివ్వున పరుగెత్తింది స్రవంతి!

—ఆలపాటి

రుక్మిణీ కల్యాణం

"అబ్బాయి అందగాడు—బాగా చదువుకున్న వాడు"

" సంస్కారం అదీ ఉన్నవాడు - నేను కాదనటంలేదు. కానీ మన అమ్మాయి జాతకంతో ఆ అబ్బాయి జాతకం ఏమాత్రం సరిపడటంలేదు. ఏం చేయమంటావ్?" విసుగా అన్నాడు విశ్వనాధం, సోమిదేవి పదహారో సారి గొణగటం విన్నాక.

భయపడుతూనే, నెమ్మదిగా అంది సోమిదేవి- "మిగతావన్నీ సలక్షణంగా వున్నప్పుడు, జాతకం ఒక్కటే కలవకపోతే ఏమండీ—రుక్మిణికి అప్పుడే ఇరవైనాలుగో సంవత్సరం వచ్చింది-ఇంకా దానికి పెళ్ళవకపోతే ఈ పల్లెటూళ్లో నలుగురూ ఏమంటారు-దాని తర్వాత దానికి, దమయంతికి, అప్పుడే ఇరవై రెండేళ్లు- ఇక దానికి పెళ్ళి ఎప్పుడు అయేటట్టు!"

విశ్వనాధం చటుక్కున తల ఎత్తాడు. "ఎప్పుడు రాసిపెట్టివుంటే అప్పుడే అవుతుంది. ఇన్నాళ్ళూ రుక్మిణికి పెళ్ళికాకపోవటం అన్నది మన ప్రయత్నలోపం వల్లకాదు-భగవత్సంకల్పం లేకపోవటంవల్ల. నేను ఆరేళ్ళ నుంచీ, కాళ్ళకి బలపాలు కట్టుకుని నెల్లూరు దగ్గరనుంచి శ్రీకాకుళం దాకా తిరుగుతునే వున్నానా? ఏమయింది? దానికి రాసిపెట్టిన వాడెక్కడున్నాడో యింకా భగవంతుడు మనకు చూపించలేదు. అంటే దాని పెళ్ళికి యింకా సమయం ఆసన్నమవలేదన్నమాట. కక్కొచ్చినా కల్యాణమొచ్చినా ఆగదు. ఆ శివుడి ఆజ్ఞ అవనీ-ఆ పెళ్ళికొడుకే మనింటికి వస్తాడు."

"ఆ వస్తాడు-వస్తాడు. జాతకం కలవలేదని బంగారంలాంటి గుంటూరు సంబంధం వదులుకున్నారు. గోత్రం కలిసిందని అన్ని విధాలా బాగున్న గుడివాడ సంబంధం కాదనుకున్నాం. ఋషులు కలిశారని రాజమండ్రీ సంబంధానికి నీళ్ళు వదిలాం. ఆ అబ్బాయివాళ్ళ అమ్మమ్మకి బొల్లి వుందని విశాఖపట్టణం సంబంధం కాదన్నాం. ఆ అబ్బాయివాళ్ళ మేనత్త కిరస్తానీవాడితో లేచిపోయిందని ఒంగోలు సంబంధం కాదన్నాం—"

"అయితే ఏమంటావ్—నీకున్న బాధ, బాధ్యతా నాకు లేదంటావా- ఏదో కారణం లేకుండా నే నే సంబంధమూ త్రిప్పికొట్టలేదు- దాని సుఖమే నా సుఖం- ఇలాంటి పిచ్చి ఆలోచనలు మనసులో పెట్టుకోకు, ఆరోగ్యానికి మంచిదికాదు!" విసురుగా అంటూ, ఉత్తరీయం భుజాన వేసుకుని, గ్రామచావడి వేపు నడిచాడు విశ్వనాధం.

సోమిదేవి పైట చెంగుతో కళ్లు తుడుచుకుంది.

మధ్య గదిలో ఉయ్యాల బల్లమీద కూర్చున్న రుక్మిణి అంతా విని, ఒక్కసారి నిట్టూర్చింది. నిట్టూర్పటం అయిపోయాక—చేతిలోవున్న 'రుక్మిణీ కల్యాణం'-ఏడొందల అరవైనాలుగోసారి చదవటం ప్రారంభించింది.

అప్పుడే తల స్నానంచేసి వచ్చిన దమయంతి, విరబోసుకున్న తడివెంట్రుకలను తుడుచుకుంటూ అన్నది—

"అక్కయ్యా—'రుక్మిణీ కల్యాణం' చదివితే తొందరగా పెళ్ళవుతుందని, నాన్న, అమ్మా, మన పురోహితుడూ, అందరూ చెబుతారు కదా- నువ్వు ఎన్నో సంవత్సరాలనుంచీ చదువుతున్నా నీకు యింకా పెళ్ళికావటంలేదేమిటే?"

దమయంతి అమాయకంగానే అడిగినా,

సత్యం మందపాటి


రుక్మిణికి ఉక్రోషం వచ్చింది—

"నేను ఈ పుస్తకం చదివేది—తొందరగా పెళ్ళవటానికి కాదు, యింట్లో వేరే యింకే పుస్తకాలు లేక-తెలిసిందా-ఇక నోరు మూసుకుని వెళ్ళి నీ పని చూసుకో" కోపంగా అని మూతి ముడుచుకున్నది రుక్మిణి—

"సరేలే అమ్మా-నీకు పెళ్ళి కావటంలేదని ఆ కోపం నా మీద చూపిస్తే ఎలా " సణుక్కుంటూ వెళ్ళిపోయింది దమయంతి.


దమయంతి వెళ్ళిన తర్వాత దీర్ఘంగా ఆలోచిస్తూ కూర్చుంది రుక్మిణి.

నిజంగానే వేరే పుస్తకాలు లేకనే తను యిన్నిసార్లు 'రుక్మిణీ కల్యాణం' చదువుతున్నదా? తను



చెప్పింది అబద్ధం అని తన మనసుకి తెలుసు- వేరే పుస్తకాలు లేకేం— 'ద్రౌపదీ వస్త్రాపహరణం', 'సుమతీ శతకం' యిలా చాలా వున్నాయి. కానీ యీ పుస్తకమంత బాగుండవు అవి. నాన్న తననేమో ఎక్కువ చదివించలేదు. అయిదో క్లాసు అవగానే, 'ఆడపిల్లలకు చదువేమిటి—రేపో—ఎల్లుండో ఒక అయ్య దగ్గరకు పోవలసిన పిల్ల' అని చదువు ఆపించేశాడు ఆ పల్లెటూళ్ళో వేరే హైస్కూలు లేదు కనుక, అమ్మకూడా పంపటానికి ఇష్టపడలేదు. ఏదో 'రుక్మిణీ కల్యాణం' చదవగలిగితే చాలదా అనికూడా అన్నది. అంతే.

అప్పటినుంచి ఇప్పటిదాకా తను 'రుక్మిణీ కల్యాణం' మాత్రమే చదువుతున్నది. అయిదారేళ్ళనుంచీ ఎన్నో సంబంధాలు చూస్తున్నాడు నాన్న. కాలం, కర్మం కలసిరాక, ఇంతవరకూ ఏదీ కుదరలేదు. కొన్ని గోత్రాలు కలసి, వేరే గోత్రాలయినా ఋషులుకలసి, జాతకాలు కలవక, ఇద్దరూ జ్యేష్ఠులే అయి—ఇలా ఏదో ఒక కారణాన ఏదీ కుదరటంలేదు.



ఒకటీ, రెండూ అన్నీ కలసినా, అమ్మాయికి చదువు లేదనీ, పల్లెటూరిపిల్ల అనీ, తప్పి పోయాయి. నాన్న కట్నం యెంతయినా ఇవ్వ టానికి సిద్ధంగా వున్నాడు. అయినా ఏమో

ఎప్పటికో ఆలోచనలను బలవంతాన ఆపుకుని పుస్తకాన్ని తెరచి, లీలామానుష విగ్రహావర్ణన చదువుతూ, తన్మయత్వంతో కళ్లు మూసుకుంది రుక్మిణి.

* * *

"బాబాయి — నువ్వేమయినా అను— అమ్మాయిని ఇలా ఇన్నాళ్ళు వుంచటం మాత్రం నాకు నచ్చలేదు" దశరథరామయ్య అంటున్నాడు.

గ్రామచావడిలో కూర్చుని, చుట్ట త్రాగు తున్న విశ్వనాథం—"ప్ ప్" మని రెండు సార్లు పీల్చి, పొగ వదలి నెమ్మదిగా అన్నాడు—


"ఒక పని చేయరా రాముడూ—రుక్మిణి పెళ్ళి విషయం అంతా నీకే వదిలేస్తాను. మంచి సంప్రదాయం, అందం, ఆస్తీ, అన్నీ వున్న చక్కటి సంబంధం చూచి, చెప్పు. ఆ మూడు ముళ్ళూ త్వరలో వేయించేద్దాం!"

"అంత బాధ్యత నామీద పెట్టకు బాబాయ్. మీరంతా పెద్దవాళ్లు. నేను ఏదో నాకు తోచింది అన్నాను. నీకు తెలియని మంచి చెడులు మాకేం తెలుస్తాయి. అయినా అడిగావు కనక చెబుతున్నాను. తెనాలిలో పూర్ణచంద్రరావ్ గారని వున్నారు. మనవాళ్ళే—బాగా డబ్బు అదీ వున్నవాడు—వారి పెద్ద అబ్బాయి— డాక్టరు చదివాడు-ఎర్రగా, బుర్రగా వుంటాడు. అమ్మాయి తప్పక సుఖపడుతుంది—ఏమం టావ్ కనుక్కుందామా?" అడిగాడు దశరథ రామయ్య.

"శుభం! కనుక్కో—రేపు సప్తమి కూడాను. చాలామంచిది. రేపే కనుక్కొచ్చి చెప్పు—" అన్నాడు విశ్వనాథం ఉత్సా హంగా.

"తప్పకుండాను—నీకామాత్రం సహాయం చేయలేకపోతానా?" అన్నాడు దశరథరామయ్య లేస్తూ.

మర్నాడు సాయంత్రం విశ్వనాథం, దశరథ రామయ్య రాకకోసం ఎదురుచూస్తూ, వాకిట్లో



అరుగుమీద పడక్కుర్చీ వేసుకుని కూర్చు న్నాడు. మాటి మాటికీ రోడ్డువేపు చూస్తు న్నాడు.

సోమిదేవి ఇంటిపనిలో వున్నా, ఖాళీ దొరికినప్పుడల్లా వాకిట్లోకి తొంగిచూసి, లోప లికి పోతున్నది.

దమయంతి పెరట్లో సన్నజాజి పందిరి క్రింద కూర్చున్నది కూనిరాగాలు తీస్తూ.

పల్లెటూళ్ళలో సాయంత్రం ప్రకృతి సౌంద ర్యాలు చూడాలని వున్నా ఆడవారు రోడ్లమీద తిరగరు. తిరిగితే నలుగురూ నానా విధాల అను కుంటారు. కానీ రుక్మిణి ఆ రోజు అలా షికారుగా వెళ్ళాలనుకుంది. అందుకే చేతిలో 'చెంబు' పట్టుకుని 'అలా' పొలాల గట్టుకుని బయల్దేరింది.

సాయంత్రం కాస్తా రాత్రిలా మారి పోయింది.

అయినా విశ్వనాథం, పడక్కుర్చీలోనించి లేవలేదు.

సోమిదేవి వచ్చి ఆయన దగ్గరగా, చాప మీద కూర్చున్నది మాట్లాడకుండా.

ఆవిడ వెనకగా దమయంతి కూర్చుని జడ లోని సన్నజాజుల మాలను సర్దుకుంటున్నది. రుక్మిణి మాత్రం, ఉయ్యాల బల్లమీద పడుకుని ఏదో ఆలోచిస్తున్నది.

అప్పుడే వచ్చాడు దశరథరామయ్య.

రాగానే 'హుష్' మంటూ నులకమంచం మీద కూర్చుని, భుజానవున్న ఉత్తరీయం, వళ్ళో వేసుకున్నాడు.

సోమిదేవి ఇచ్చిన చల్లటినీళ్ళు గడగడా త్రాగి, "తెనాలి వెళ్లొచ్చాను బాబాయ్" అన్నాడు.

"ఏమయింది?" అన్నాడు విశ్వనాథం— ఎంతో కుతూహలంగా.

"పిల్లవాడ్ని చూశాను. చాల బాగున్నాడు. అందగాడి క్రిందే లెఖ్క—డాక్టరు. బాగా నే సంపాదిస్తున్నాడు కూడాను. మంచి సంప్ర దాయం అన్నీ వున్నవాళ్ళను "

"అది సరేలేవయ్యా, అవన్నీ ముందే తెలి సిన విషయాలేకదా—మన అమ్మాయిని చూట్టానికి ఎప్పుడు వస్తామన్నారు. అది చెప్పు ముందు?" అసహనంతో అడిగాడు

విశ్వనాధం.

"వాళ్ళేం వస్తారు బాబాయి — అతనికి ఉద్యోగంచేసే భార్య కావాలిట. డాక్టర్ చదివిన దయితే వేరే ఏం అభ్యంతరాలూ లేవుట. ఆర్ధికంగా స్త్రీ తన కాళ్ళమీద నిలబడగలగాలి అన్నాడు. ఇక మన రుక్మిణి గురించి నేను ఏమీ చెప్పకుండానే వచ్చేశాను. రోజులు మారుతున్నాయి బాబాయ్—మనమూ మారాలి. ఇప్పుడు చూడు, రుక్మిణికి చదువు లేకపోవటం వల్ల బంగారంలాంటి సంబంధం తప్పిపోయింది!"

ఊగుతున్న ఉయ్యాలబల్ల ఆగిపోయింది. కానీ రుక్మిణి మనసులో ఉవ్వెత్తున లేస్తున్న ఆలోచనలు మాత్రం ఆగలేదు.

ఆ రోజు కూడా తూర్పునే తెల్లవారింది. కాకుల కలకలారావంతోనే లేచాడు విశ్వనాధం.

"ఏమండీ—మన రుక్మిణి కనబడటం లేదండీ" అంటున్నది భార్య కంగారుగా.

విశ్వనాధం నిద్రమత్తు వదిలిపోయింది. గబగబ అన్ని గదుల్లోనూ, వాకిట్లోనూ, పెరట్లోనూ చూశాడు. ఎక్కడా కనపడలేదు.

దమయంతి మాత్రం నిశ్చింతగా నిద్రపోతున్నది.

అప్పుడే చూశాడు రుక్మిణి మంచంమీద వున్న 'రుక్మిణీ కల్యాణం' పుస్తకాన్ని. దాంట్లో ఏదో కాగితం బయటకు కనబడేటట్టుగా పెట్టి వుంది. తీసి చూశాడు.


అవును అది రుక్మిణి వ్రాసిందే.

నాన్నగారికి,

మీ పాతకాలపు భావాలతో నన్ను చదివించకపోవటమే కాదు, కనీసం లోకజ్ఞానం కూడా లేకుండా పెంచారు. అంతేకాక జాతకాలనీ, గోత్రాలనీ మీ మూఢ నమ్మకాలతో ఇంతవరకు నాకు పెళ్ళికూడ చేయలేదు. వేరే ఏ వ్యాపకమూ లేని ఆడపిల్ల ఎన్నేళ్ళని ఇంట్లో అలా 'రుక్మిణీ కల్యాణ్యం' చదువుకుంటూ కూర్చోగలదు? 'రుక్మిణీ కల్యాణం'లో వున్న సందేశం మొన్న చటుక్కున స్ఫురించింది. అందుకే నేను వెళ్ళిపోతున్నాను. 'లేచిపోయింది' అంటారేమో మీరు. మునసబుగారి అబ్బాయి కృష్ణతో పట్నం వెళ్ళిపోతున్నాను—అక్కడే పెళ్ళికూడా చేసుకుంటాం. కక్కు వచ్చినా కల్యాణం వచ్చినా ఆగదన్నారు మీరు. కక్కులదాకా వస్తే, కల్యాణం ఆగకూడదు. అందుకే కల్యాణంకోసం తొందరపడి, వెళ్లిపోతున్నాం. కృష్ణ నన్ను బాగానే పోషించగలడు. నాకు దారి చూపి ధైర్యాన్నిచ్చిన 'రుక్మిణీ కల్యాణం' పుస్తకం నాతోపాటే తీసుకువెడదామనుకున్నాను. కానీ రేపు దమయంతికి కూడా బహుశా ఆ పుస్తకమే మళ్ళీ మార్గం చూపించాల్సి వస్తుందేమో! అందుకే వదిలేస్తున్నాను—దయచేసి ఆ పుస్తకం దమయంతికి ఇవ్వండి. మీకూ, అమ్మకూ నమస్కారాలతో— మీ

రుక్మిణి □

(వి)చిత్ర విజ్ఞానం



ఇంత సుదీర్ఘంగా ఆలోచించే
ఈ పసివాడు
ఎవడై వుంటాడు ?
ఇతడు ప్రపంచ ప్రసిద్ధి కెక్కిన
చదరంగ ఆటగాడు
బాబీ ఫిషర్! ఇది అతని
పదిహేనో ఏట తీసిన ఫోటో.



"రారా యువార్ వెల్కం. ఇదే నా ఇల్లు. అద్దెకొంప. దీని పేరు భయంకర నివాసం. పాత్రల పరిచయం చెయ్యొద్దూ? కమాన్" వాసు లోపలికి నడిచాడు, తూలుతూ.

బజార్లో అనుకోకుండా వాసు కనిపించాడు. గుర్రమెక్కేడని బజార్లో వాడ్ని చూస్తునే అనుకున్నాను. రెండురోజుల పని మీద ఈ ఊరొచ్చాను.

"ఒరే సత్యం" వాసు గట్టిగా పిలిచాడు.

ఏడేళ్ళ అబ్బాయి వచ్చాడు మెల్లిగా. అచ్చు వాసు పోలికే. వాడి వెనుకనే ఒక అమ్మాయి ఓ చిన్న అబ్బాయి వచ్చారు. ఇంకా వెనుక, గుమ్మానికి ఆనుకుని. చూస్తున్నట్లు చీర.

"వీడేరా మా సత్యం. ఒకటో రకం. అసాధ్యుడు. ఈ గూట్లో ఇంత చిల్లరపెట్టు. మరో గంటకి లెక్క సరిగా ఉండదు. తీసేవురా అంటే 'వూహుఁ' అంటాడు. అమాయకుడిలా మొహంపెట్టి ఇలాంటి పని నేనెప్పుడూ చెయ్యలేదు నాన్నా అంటాడు. వాడ్ని సోదా చెయ్యి? నీ డబ్బులు."
గలగలా నవ్వాడు వాసు.

"ఒసే శాంతీ ఇలా రావే. ఇడుగో వీడు నీ మామ. రావే-ఫరవాలేదు. ఇదేరా మా ఇంటి లక్ష్మి. చూడు. ఇదీ దీని బొక్కి పళ్ళానూ. దీనికున్నంత స్వార్థం మరెక్కడా

చూడవు. నీ వాచీ తీసి, అమ్మడూ ఇది నీదే అని సరదాకే అను. అది మళ్ళీ నీ వాచీ నీకు తిరిగి ఇవ్వదు."

నాకు నవ్వొచ్చింది. కులాసాగా నవ్వుకున్నాను. అప్పటికి మూడోవాడు తండ్రి దగ్గరగా వచ్చాడు—"ఇడుగో వీడు మూడోవాడు అండ్ లాస్టు. పేరు శంకరుడు. ఏదిరా భీముడూ నోరు తెరూ! తెరవమ్మా! తెరుస్తావా చంపేమన్నావా?" కోపంగా చూసి అన్నాడు—"మళ్ళీ మట్టి తింటున్నావా?"

"లేదు నాన్నా!"

"చెప్పు వెధవా! చీరేస్తాను."

బిక్కమొహంవేశాడు శంకర్.

"ఈ వెధవ సంగతి ఇలా ఉంది. వీళ్లురా నా సంతానం. వీళ్ళమీద నాకు నమ్మకం లేదు. వీళ్ళంతా దొంగ వెధవలు! దేవతా కమాన్! రా ఇలారా దగ్గరగా. మరేం పరవాలేదు. వీడు రాజు. అసలుపేరుకూడా అంతే. తల్చుకుంటే మనలాంటి సంసారాల్ని ఓ పదింటిని సునాయాసంగా భరించగలడు."

'దేవత' మెల్లిగా వచ్చింది. ఆమె కళ్లు అశ్రుపూరితా లయ్యాయి. నేను మౌనంగా నిల్చున్నాను. ఇటువంటి డ్రమెటిక్ సీక్వెన్సెస్ నా జన్మలో ఎప్పుడూ జరిగి ఉండలేదు. అలాగని వాసుని ఆపలేను—వాడు మామూలు స్థితిలో లేడు కనుక. ఏం చేయాలో తోచని పరిస్థితిలో తలవంచుకున్నాను. వాడ్ని బజార్లో కలుసుకోడమే తప్పయింది. అసలు ఈ ఊరు రావడమే పెద్ద తప్పు అయిందేమో అనుకున్నాను. నాకు కొంచెం దూరంలో చీర గాలికి రెపరెప లాడుతోంది.

"ఇడుగో వీడేనే రాజు. అమలాపురం. పనిమీద ఈ ఊరొచ్చాడుట. ఒరే రాజూ ఇది నా మిసెస్. పేరు అవంతి. బావుందా? మనసుకూడా యెంతో బాగుంటుంది."

నమస్కారం చేశాను అవంతికి.

వాసు మెల్లిగా నడుస్తూ అవంతి దగ్గరకు చేరుకున్నాడు. అవంతి ఎదురుగా మునిగాళ్ళ మీద కూర్చొని, ఆమె కళ్ళల్లోకి చూశాడు. అవంతి కళ్ళల్లో నీరు కమ్ముకుంటూంది. మునిగాళ్ళమీదే కూర్చుని, నిల్చున్న ఆమె చుట్టూ చేతులువేసి, తన తల ఆమెమీద ఆన్చుతూ, గొణుక్కుంటున్నట్లుగా అన్నాడు—"ఇదేరా నా దేవత. దీన్ని చూసే నేను బతుకుతున్నాను."


వాసు అలానే కూర్చున్నాడు. అవంతి వారించలేదు అతన్ని. మొహం కప్పుకుని ఏడుస్తోంది. ముగ్గురు పిల్లలూ, నన్నూ నా వాచీని, బాగ్‌నూ మార్చిమార్చి చూస్తున్నారు. రోజూ మార్పులేని ఈ తతంగం వాళ్ళని అంత ఆశ్చర్యపరిచి ఉండదు.

నేనూ, వాసూ ఒకే బడిలో చదువుకున్నాం. వాసులో చురుకుపాలు యెక్కువ. అన్నింటిలోనూ మంచి మార్కులు సంపాదించుకునేవాడు. అలాంటి వాసుకి ఇటువంటి జీవితం ఊహించుకోలేదేనాడూనూ. జీవితంలో చాలా పైకి వస్తాడనుకునేవాడ్ని. ఒకప్పుడు బాగా బతికిన కుటుంబమే వాసుది.

చుట్టూ చూశాను. గోడలకి వెల్లవేసి ఎన్నాళ్ళయిందో? గోడలమీద అక్కడక్కడా నల్లి రక్తంచారలు. దండెంమీద గబ్బిలాల్లా మాసిపోయిన బట్టలు—ఎదురుగా పాతకాలపు పందిరి మంచం. దానిమీద మాసిపోయి ఎత్తు పల్లాలతో చింకి పరుపు—రోతగా ఉంది, వాతావరణం.

చప్పుడయింది. వాసు నేలమీద పడి ఉన్నాడు. మత్తు బాగా ఆవరించి ఉంటుంది. అయోమయంగా చూశాను. అవంతి వాసుని లేపి మంచంమీద పడుకోబెట్టే ప్రయత్నం చేస్తోంది. ఈ వాతావరణంలో అనుకోకుండా దిగినందుకు నన్ను నేనే తిట్టుకున్నాను.

ఆ మత్తులోనే అన్నాడు వాసు "రాజు నా బెస్టు ఫ్రెండ్. ధనికుడు. ఎలాంటి లోటు రాకుండా పంచభక్ష్య పరమాన్నాలతో భోజనం పెట్టెయ్. ఏమాత్రం తక్కువయినా భరించను. ఒరే రాజూ, నువ్వు మా ఇంట్లో గెస్టువి. నిన్ను ఆనందపరచడమే మా ప్రధాన ఉద్దేశం. అంచేత " ఇంక మాట్లాడలేక



పోయాడు వాసు. మత్తు పూర్తిగా ఆవరించింది. పందిరి మంచంమీద ఒళ్ళు తెలీకుండా పడుకున్నాడు.

అవంతి అతన్ని చూసి, చీదరింపుతో కోపంగా నిట్టూర్చింది. వంటింట్లోకి వెళ్ళి "సత్యం" పిల్చింది. సత్యం నన్ను చూసి నవ్వుతూ లోపలికి వెళ్ళాడు. అవంతి సత్యం చెవిలో ఏదో చెప్పి ఉంటుంది. ఏదో పట్టుకొని దాచేస్తూ, నాకు చూపెట్టకుండా నన్ను దాటేశాడు.

కొంతసేపు అలాగే నిల్చున్నాను. బోరు కొడుతోంది.

"అమ్మ మిమ్మల్ని స్నానం చెయ్యమంటోంది" శాంతి కాబోలు అంటోంది.

"లేదు పాపా, నేను వెళ్ళిపోతున్నానని అమ్మతో చెప్పు. నాకు చాలా పనులున్నాయి" వెళ్ళింది వెళ్లినట్టే తిరిగి వచ్చింది శాంతి. ఆమె వెనుకనే వంటింట్లోంచి అవంతి గొంతుక వినిపించింది. "లేచి స్నానం చెయ్యండి."

మరి యెదురు చెప్పలేకపోయాను. లేని పనుల్ని ఉన్నాయని చెప్పి అర్జంటుగా తప్పుకునే తెలివితేటలు నాకు లేవు. స్నానం చేస్తుంటే, సత్యం వచ్చినట్లుంది, మాటలు వినిపించాయి.

"అమ్మా వాళ్లింట్లో నిండుకున్నాయట."

"ష్. మెల్లిగా."

ఓ క్షణం మాటలు వినిపించలేదు.

అవంతి చిన్నగా యింకేదో అడుగుతోంది.

"ఊహూఁ. అక్కడకూడా లేవనేశారు."

పరిస్థితి కొంతవరకూ ఊహించుకున్నాను. వాసు బీదరికాన్ని వూహించుకున్నాను కానీ, మరీ ఇంత కటిక దరిద్రాన్ని ఊహించలేదు. ఈ ఇంట్లో ఇలా దొరికిపోయినందుకు నాకు లోలోపల కోపం ముంచుకొచ్చింది. వాసు మీద మరీ కోపం వచ్చింది.

అవంతి పోపుల డబ్బాలు సర్దుతూన్న చప్పుడు వినిపించింది.

"ఉన్నాయా?" సత్యం ప్రశ్న.

"చూస్తున్నాన్రా."

తర్వాత అవంతి చిన్నగా అంటోంది. "చూడు సత్యం! ఈ డబ్బులు ఇస్తున్నాను. పావుశేరు బియ్యం తీసుకురా" పరిగెడుతున్న

సత్యంను ఆపి గద్గద స్వరంతో అంటోంది. "సత్యం! ఈ డబ్బుల్లో కమీషను తీసుకోకూ? దీంతో, పూర్తిగా బియ్యమే కొను. నీకు రేపు ఇస్తాను సరేనా? మన షావుకారు కొట్టులో తేకు. ఈ డబ్బులు తీసుకుని మన కాతాకి జమ కట్టుకుంటాడు. చిన్నబజారు వెళ్లి అక్కడ్నించీ తీసుకురా."

-- సత్యం వెళ్ళిపోయిన తర్వాత ఆ చీకట్లో స్నానం అయిందనిపించి, బయటపడ్డాను. గదిలోకి వచ్చి బట్టలు మార్చుకున్నాను. అప్పటికి శాంతీ, శంకర్ గుమ్మందగ్గరే నిద్రపోతున్నారు. ఎనిమిది గంటలు గాలిలో వినవస్తున్నాయ్. ఓ చిన్నదీపం శాయశక్తులా మాసిపోయిన ఆ చిన్నగదిని వెలుగుతో నింపడానికి ప్రయత్నిస్తోంది. పందిరి మంచంమీద వాసు గుర్రుపెడుతున్నాడు. విరిగిన కుర్చీలో కూర్చున్నాను. అక్కడ కనబడిన పాత పుస్తకం ఒకటి తీసి కొంతసేపు చదువుకున్నాను.

సత్యం వచ్చాడు. వంటింట్లోకి వెళ్ళి, చిన్నగా అడుగుతున్నాడు.

"మేంకూడా అన్నం తింటాం అమ్మా."

అవంతి మాటలు వినిపించలేదు.

"ఏమీ?" అంటున్నాడు సత్యం. తర్వాత వంటగదిలోంచి బయటకు వచ్చి పందిరి మంచంమీద పడుక్కున్నాడు. వాడి కళ్లు నిశితంగా పరిశీలించడం గమనిస్తూనే ఉన్నాను. కొంతసేపటికి వాడూ నిద్రపోయాడు.

పుస్తకం పట్టుకున్నానేకాని ఆలోచనల తరంగాలు ఉవ్వెత్తున లేచి పడుతున్నాయ్. మనసంతా ఆవేదన అలుముకుంది.

"భోజనానికి లేస్తారా?" అవంతి పిలుపు వినబడింది.

"ఇదుగో వస్తున్నాను. శ్రమ ఇస్తున్నాను. ఈ రాస్కెల్ నేనెంత చెప్పినా వినకుండా తీసుకొచ్చాడు. మీరు చాలా కష్టం కలిగిస్తున్నాను."

"శ్రమ తీసుకునే అతిధ్యం మేమీ ఇవ్వటం లేదు" వడ్డిస్తూ అంది అవంతి. "కూరలేం చేయలేదు."

ఏం అనాలో తోచలేదు నాకు.

"అమ్మా నాకో?" శాంతి ఎప్పుడొచ్చిందో వచ్చి నాకు యెదురుగా నిల్చుంది. "అన్నం పెట్టు మరీ" అంటోంది.

"శాంతీ చూడమ్మా, అన్నయ్యా, తమ్ముడూ యెలా పడుకున్నారో? అయినా నువ్వు అప్పుడే తినేశావుగా" నవ్వుతూ మందలింపుగా అంది "దొంగా! అప్పుడే తినేసి లేదంటూంది."

"పో. నేనెప్పుడు తిన్నానే? ఉదయంకూడా నాకు పెట్టలేదుకానీ? ఉదయం మరమరాలు ఇవ్వలే నువ్వు?"

"పదమ్మా. అలా అనకు. నీకు తర్వాత పెడతాలే పద" గద్గదంగా అంది.

"నాకు ఆకలి వేస్తోందే అమ్మా!"

అవంతి ఏడుపుని ఆపుకోలేకపోయింది. మొహం కప్పుకుంటూ వంటింట్లోనుండి బయటకు వచ్చేసింది.

నేను ఒక్క ముద్దకూడా నోట్లో వేసుకోలేకపోయాను.

శాంతి ఏడుస్తోంది. శాంతిని పిలిచి, ఆ కంచం శాంతిముందు పెట్టి అన్నాను. "తిను శాంతీ. మరి, అన్నయ్యా తమ్ముడూ కూడా తినలేదా?"

శాంతి ఆవురావురుమని తింటూ నావేపు చూడకుండానే తల అడ్డంగా తిప్పింది.


"మరి అమ్మ?"

"అమ్మకూడా" నోట్లో అన్నం నిండుగా ఉండడంతో ముద్దగా అంది.

"మీ నాన్న డబ్బులు తేలేదా?"

సమాధానం చెప్పకుండా తింటోంది— శాంతి.

చెయ్యి కడుక్కొని ఇవతలి గదిలోకి వచ్చాను. అవంతి గోడమూల ఒరిగి ఏడుపుని ఆపుకునే ప్రయత్నం చేస్తోంది.



సూట్‌కేసులో ఉన్న డబ్బు తీసుకుని "ఇప్పుడే వస్తా"నని చెబుతూ బయటపడ్డాను. బజారుకి వెళ్ళి నెలరోజులకు కావలసిన గ్రాసం రిక్షాలో వేయించుకుని వచ్చాను.

అవంతి ఇంకా అక్కడే అలాగే కూర్చుని ఉంది.

సామానంతా రిక్షావాడి సాయంతో లోపల పెట్టించాను. "మీరు లేవాలి. లేచి అందరికీ వండండి."

అవంతి వెక్కి వెక్కి ఏడుస్తోంది.

"నాకు ఆకలి వేస్తోంది. మీరు వండుతే తింటాను."

అవంతి లేచింది. నావేపు నిరసనగా చూసింది. పందిరిమంచంకేసి కోపంగా చూసింది. వంటింట్లోకి నడిచింది.


పిల్లలు భోజనం చేసి మళ్ళీ పడుకున్నారు.

ఆమె యెందుకో మనసులో యేడుస్తున్నదని గ్రహించాను. బహుశా నేను చేసిన ఈ సహాయానికి ఆమె మనసు సిగ్గుతో బాధపడుతోందేమో!

"మీరలా బాధపడకూడదు. మనిషిని మనిషి తప్ప ఇంకెవరు ఆదుకోగలరు చెప్పండి?" అని చెప్పాలనిపించింది. సిగ్గుతో, అభిమానంతో కుంగిపోతున్న మనుషులకు సానుభూతి మాటలు అంతగా రుచించవు. ఇష్టపడరు కూడా. భోజనం చేస్తున్నప్పుడు ఆమె మాటి మాటికీ కళ్ళంట నీళ్ళు పెట్టుకోడం కూడా నాకు అంత ఇష్టంలేకపోయింది.

పదకొండు గంటలయింది. అవంతి నాకు డాబామీద పక్క వేసింది. నేలనే పరుపు వేసి, తెల్లటి లుంగీపంచ దుప్పటిగా పరిచింది. చంద్రుడు అప్పుడే పైకి వచ్చాడు. వాతావరణంలో చల్లదనం చోటు చేసుకుంటోంది. నక్షత్రాలు మినుకు మినుకుమంటున్నాయి. గాలి తెరలు తెరలుగా వీస్తోంది. పడుకొన్నాను. అవంతి క్రింద వంటఇంట్లో సామాను సర్దుతున్న చప్పుడు వినిపిస్తోంది. సుందరి జ్ఞాపకానికొచ్చింది. సుందరికి ఇలాంటి రాత్రులంటే చాలా ఇష్టం.

(వి)చిత్ర విజ్ఞానం



గాలిబ్ గీతాలను పాడని వారూ
వినని వారూ చాల అరుదు
గాలిబ్ గజల్స్ అనేక భాషలలోకి
అనువదించబడ్డాయి. ఒక అమెరికన్ కవి
గాలిబ్ గీతాలను ఆంగ్లంలో అనువ
దించడమే కాకుండా, గాలిబ్
చిత్రాన్నికూడ గీశాడు!

అలికిడయింది. ప్రక్కకు తిరిగి చూసాను.

అవంతి!

ఈ సమయంలో

అరగంటక్రితం అవంతికి ఇప్పటి అవంతికి చాలా భేదముంది. ఇలాంటి సమయంలో ఈ విధంగా అవంతి రావడం చూస్తే వాసు యేమనుకుంటాడు? వణికిపోయాను. లేచి కూర్చున్నాను

అవంతి నా ఎదురుగా కూర్చుంది. సర్దుకుని దూరంగా జరిగాను.

"భోంచేశారా?" ఏదో ఒకటి మాట్లాడాలని అడిగాను.

అవంతి ఏడుస్తోంది. వెక్కి వెక్కి మోకాళ్ళమీద తల ఆన్చి ఏడుస్తోంది.

"ఎందుకు చెప్పండి?" అడిగాను.

అవంతి కళ్ళల్లో అదే నిరసన భావం.

"ఎందుకు? ఏమయిందని?" మళ్ళీ అడిగాను.

స్నేహితుని భార్య నాకు చెల్లెలు వరసే. ఆ ఆత్మీయతను పురస్కరించుకుని దగ్గరగా, జరిగి భుజంమీద చెయ్యివేస్తూ చనువుగా అడిగాను "ఎందుకని చెప్పండి అవంతీ!"

వణుకుతున్న కంఠంతో, నాకు దూరంగా జరుగుతూ అంది.

"నేను అలాంటి దాన్ని కాదు రాజు గారూ!"

హతాసుడ్నయ్యాను.

"నేను నా పూర్తి ఇష్టతతో ఈ పనికి ఒప్పుకోలేదు. ఆయనే ఆయన బలవంతం మీద తప్పనిసరయింది."

ఆశ్చర్యపోయాను. దరిద్రం మనిషిచేత యెన్ని పనులు చేయిస్తుంది? వాసు ఆతిధ్యంలో అంతరార్ధం బోధపడిన తర్వాత ఒక్కక్షణం కూడా ఆ ఇంట్లో ఉండలేకపోయాను.

ఆ వీధి మలుపు తిరుగుతుంటే నా వెనుక చాలా దూరంలో డాబామీద, కృతజ్ఞతా భావంతో చూస్తున్న రెండు కళ్ళల్లోని కన్నీటిని ఆ చీకటిలో స్పష్టంగా చూశానని పించింది. □

★ పెళ్ళయ్యాక చూడు ★

బొమ్మ

పదేళ్ళప్పుడు చిట్టి పక్కింటి మాష్టారబ్బాయి దగ్గర ఓ బొమ్మని చూసింది. అలాంటి బొమ్మ తనక్కూడా కావాలని మారాం చేసింది ఇంట్లో.

చిట్టి వాళ్ళనాన్న వెంటనే పదిరూపాయలు పెట్టి అలాంటి బొమ్మని కొనిచ్చాడు చిట్టికి.

చిట్టికి ఆ బొమ్మే ప్రపంచం.

దానికి చిన్నచిన్న బూట్లు, షర్టూ పాంటూ తొడిగి చూసుకు చూసుకు మురిసిపోయేది చిట్టి.

ఆ బొమ్మ చిట్టి చెప్పినట్లు వినేది.

కీ ఇస్తే చాలు మెట్టూ పల్టీలు కొట్టేది.

చిట్టి ఆనందంతో చప్పట్లు కొట్టేది.

*　　*　　*

చిట్టికి ఈడొచ్చింది.

చిట్టి అడక్కుండానే వాళ్ళ నాన్న పదివేల రూపాయలు పెట్టి ఖరీదైన బొమ్మను కొనిచ్చాడు చిట్టికి.

కానీ—

చిట్టి ఆ బొమ్మతో ఆడుకోదు. ఆ బొమ్మే కావాలన్నప్పుడల్లా ఇష్టం వచ్చినట్టు చిట్టితో ఆడుకొంటుంది.

ఆ బొమ్మ చిట్టి చెప్పినట్టు వినదు-తాను చెప్పినట్టే చిట్టి వినాలంటుంది.

అవును ఆ బొమ్మకి ప్రాణం వుంది'

మనసు లేదు''

ఇంటికి దీపం

కళ్ళలో కాంతి—మనసులో కోరికలతో అత్తింట అడుగు పెట్టింది చిట్టి.

మా ఇంటి మహాలక్ష్మివన్నారు చిట్టిని వాళ్ళ అత్తమామలు.

చిట్టి ముఖంలో వెలుగురేఖలు తళుక్కు-మనేవి.

మా ఇంటి దీపానివి అనేవాడు భర్త.

చిట్టి ఆనందంతో పరవశించిపోయేది.

గువ్వలా భర్త కౌగిటిలో ఇమిడిపోయేది.

*　　*　　*

చిట్టికిప్పుడు ముప్ఫయ్యేళ్ళు. ఇద్దరుపిల్లల తల్లి.

కళ్ళలో కాంతిలేదు—చీకటే తప్ప.

ఆమె మనసులో కోరికలు లేవు—కలతలే తప్ప.

"మా ఇంటి దీపానివి" అని భర్త తనని ఎప్పుడేనా అంటే చిట్టి ముఖంలో ఓ విషాద రేఖ కనిపిస్తుంది.

"అవును దీపం అవసరం రాత్రే. రాత్రంతా వాడుకొన్న దీపాన్ని పగలు యే మూలకో నెట్టేస్తారు. విద్యుద్దీపాన్నయితే స్విచ్చి నొక్కి ఆర్పేస్తారు. నా బ్రతుకూ అంతే—" అనుకొంటుంది.

శిల్పం

"చిట్టీ నువ్వు నవ్వుతుంటే ముత్యాల వర్షం కురుస్తున్నట్టుంది-నిజం"—

చిట్టి తన నవ్వు ముఖానికి చేతిని అడ్డం పెట్టుకొని భర్తకేసి కొంటెగా చూసేది.

"చిట్టీ నువ్వు నడుస్తుంటే ఖజురహో శిల్పం ప్రాణం పోసుకొని నా ఎదుట నాట్యం చేస్తున్నట్టుంది-తెలుసా!"

చిట్టి నడకలో మరింత హొయలు నింపుకొని అక్కణ్ణించి కదిలి వెళ్ళిపోయింది కవ్వింపు ధోరణిలో.

*　　*　　*

ఏళ్ళు గడిచిపోయాయి.

బ్రతుకులో సారం పేదరికపు బాధల గాడ్పులకి ఇగిరిపోక తప్పలేదు.

చిట్టి ఇప్పుడు మనసునిండా హాయిగా నవ్వదు. నవ్వినా "ఏమిటా పోకిరీ నవ్వులు?" అంటాడు భర్త.

చిట్టి ఇప్పుడు ఖజురహో శిల్పం కదిలి వచ్చినట్టు నడవదు. నడిచినా "ఏమిటా హంస నడకలు-" అని చిరాకుపడతాడు భర్త.

 ★ పి. శ్రీనివాసశాస్త్రి ★

వెంటాడుతున్న

శూన్యం

వెంటాడే రిక్తహస్తాల పాలిన ముఖాలమీద
ఉదయాస్తమయాలు ఒకే రూపంలో
క్షేమంలేని వెలుగునీడల నిస్పత్తువలో.
అరిగిన పదబంధాలలో నిప్పుపుట్టదు
ఖాళీ సీసాల్లోకి ఖజానాలు దిగవు
దొర్లి దొర్లి పడేటన పగలడమే తప్ప!

విలువలు—సిద్ధాంతాలు ఎత్తుగడల పేరిట
జీవిత విలాసాలకి
ఎన్నికల విజయాలకి దాసోహం అంటునపుడు
పురోగమన—తిరోగమన తిరునాళ్ళలో
అన్ని కంఠాలు
ప్రజాస్వామ్యం—స్వేచ్ఛ అంటూ ఉద్ఘోషిస్తుంటే—;
దేశాన్ని సొంతం రాతి గోడలతో—
చుట్టుముట్టిన వ్యవస్థలో
"రామరాజ్యం" వెలిసిందని
రామాయణ బూతు పురాణాలను
కిరాయికవులు వల్లెవేసినపుడు
ఎక్కడ సామాన్యుడికి రక్షణ?

రాళ్ళు చెక్కే చేతులు
చెమటలు కక్కే కాళ్ళు
ఎండకు ఆరేసుకుంటున్న బతుకులు
కులాల కొత్తవేషాల బాబాల ఊరేగింపుల యెదుట
"బట్టల్లేని రూపాలు బాంచ (బానిస) రూపులై

తిండిలేని రూపాలు కోతి రూపాలై "
సజీవ సమాధులపై మండుతున్న దేవుళ్ళు.
భక్తిరసపు కాలక్షేప నిక్షేపరాయుళ్ళు
కళ్ళుమూసుకొని గుర్తించదలచిన నిజాలు.

రోడ్డు పక్కగోడలమీద
వేలాడే ఖాళీ గిన్నెలమీద
సూర్యుడు ఈనాటికీ మొలవలేదు.
నడిబజారున నల్లమందు మత్తులో
దినమొలల్తో పడుకున్న విగ్రహాలముందు
అసహ్యంగా దీనంగా
మన సభ్యతనే మానభంగంచేస్తూ
ముందుకి చాచుకుంటున్న మాతృహస్తాలు.

చీకటి గుహల్లోకి మురికిదేవతలు
ఆరాటంగా అరసీసా గుడంబాకోసం
మసకవెలుతురు సంగీతాల్లోకి
పరిశుభ్రమైన దానవులు
నెమ్మదిగా నిమ్మకు నీరెత్తినట్టుగా
సీసా బీరుకోసం, క్వార్టర్ బ్రాందీకోసం.

కొండచిలువలాంటి చలిరాత్రి
మరోసారి కొంచెం చలించింది.
వెంటాడే శూన్యాన్ని
నోరుతెరచి మరోసారి విసిరింది.
ఇన్నికోట్ల హస్తాల శూన్యాల మధ్య
విస్తరించిన దోపిడి రక్తపుకోరలు
అలుముకుంటున్న అరుణారుణరేఖల
కాకలుతీరుతున్న సజీవ ఆయుధాలమధ్య.

—నిఖిలేశ్వర్

ఫౌల్



"ఫౌల్" గ్రౌండంతా పెద్ద కేకలు మోగిపోయినయ్.

చిన్నా, పెద్దా, ముసలీ ముతకా అందరూ ఏకమయిపోయి ముక్తకంఠంతో అరుస్తున్నారు.

"ఫౌల్!"

ఆటగాళ్లు ఖంగారుపడిపోయారు. రిఫరీ బెదరిపోయాడు. అయినా ఆట ఆగలేదు.

జనం మరింత రెచ్చిపోయారు.

"ఫౌల్—రిఫరీ! ఆ పదకొండో నంబరుని బయటకు లాగెయ్ " కోపం నిండిన కేకలు.

విజిల్స్—అరుపులు.

రిఫరీ ఖంగారుగా చూస్తున్నాడు, జనం వంక.

జనమంతా చేతు లూపుతూ అరుస్తున్నారు. పైకి ఎగురుతున్నారు. లోపలకు దూకేట్లుకూడా కనిపిస్తున్నారు.

"ఒరే—రిఫరీ—నీకే చెప్పేది "

కాగితపు బాణాలు, చిల్లి పెంకులు ఎగిరి వస్తున్నాయ్ ఆటస్థలంలోకి.

రిఫరీకి యేమి చేయడానికీ తోచటంలేదు.

తనూ చూశాడు. పదకొండో నంబరు ఫౌలాడాడు. కానీ ఆరోజు ఫుట్‌బాల్ మాచ్ ఫైనల్స్ కావడంవల్ల మొదట్నుంచీ ఇరుపక్షాల వారూ ఫౌల్స్ చేస్తూనే వున్నారు. అన్నిటినీ పట్టించుకొంటూ కూర్చుంటే ఆట ఎంతమాత్రం సాగదు. ఆ విషయం తెలిసే చిన్న చిన్న తప్పుల్ని క్షమించేస్తున్నాడు తను. కాని మరి ఈ జనం హఠాత్తుగా కొంత మంది జనం లేచి గ్రౌండ్ లోపలకు చొచ్చుకు వచ్చేయసాగారు.

రిఫరీకి పై ప్రాణాలు పైనే పోయాయ్.

ఆ దండయాత్ర తన మీదకే—

తను ఇప్పుడు తప్పించుకొని పారిపోతే వాళ్ళందరి చేతుల్లోనూ శవమయిపోవాల్సిందే-

గట్టిగా లాంగ్ విజిల్ వేశాడు రిఫరీ—

ఆట ఆగిపోయింది.

గుఱ్ఱంశెట్టి సాయి

జనం. గ్రౌండంతా జనం. భూలోకంలోని జనమంతా అక్కడే ఉన్నట్లు కనబడుతోంది ఆ సందోహం. అన్ని వేపుల్నుంచీ అన్ని వేపుఁకూ కేకలు వేస్తూ భయం గొలిపేలా పరిగెత్తుతున్నారు రిఫరీవేపు.

రిఫరీ తను కూడా వేగంగానే గేటువేపు పరుగెత్తి బయట మార్కెట్లో నడుస్తోన్న జనంలో కలిసిపోయాడు.

ఆ ఊరివాళ్ళ సంగతి తనకు బాగా తెలుసు. ఇలాగే ఫౌల్స్ ఎలా చేశారని నలుగురు రిఫరీలను చితకతన్నారు. అయిదోవాడి మొఖం గుర్తుపట్టకుండా చేశారు. అందుకే తను వెంటనే అక్కడినుంచి పరుగెత్తేశాడు. ఫుట్‌బాల్ గ్రౌండ్‌లోని జనం క్రమంగా ఆ రోడ్డంతా నిండిపోతున్నారు. ఏ క్షణంలో నయినా ఎవ్వరయినా తనని గుర్తుపట్టేయవచ్చు. రిఫరీ రోడ్డు ప్రక్కనే వున్న మునిసిపల్ పార్క్ వేపు చూశాడు. లోపలేదో సభ జరుగుతోంది. తను ఆ సభలోకెళ్ళి నిల్చుంటే ఈ గొడవనుంచీ తప్పించుకోవచ్చు. పార్కులోకి వేగంగా పరుగెత్తి నిలబడ్డాడు రిఫరీ——

మరుక్షణం ఆ జనప్రవాహమంతా కూడా పార్కువేపు తిరిగింది.

అక్కడ మైకులో ఎవరిదో ఉపన్యాసం వినపడుతోంది.

"సోదరులారా! విశాల ఆంధ్రప్రదేశ్‌లోనే మనకు భవిష్యత్తుంది. తెలుగు వారందరూ అయికమత్యంగా వుంటేనే ఎన్నో ప్రయోజనాలు సాధించవచ్చు ."

రిఫరీ ఆ ఉపన్యాసం ఇస్తోన్న పెద్దమనిషిని జాగ్రత్తగా చూశేడు. అతను ఆ వూరి ప్రజాప్రతినిధి. ప్రజలకు సేవచేయడానికయి అవతరించిన భగవత్ స్వరూపుడు. ప్రత్యేక రాష్ట్రంకోసం నిరాహార దీక్షలుచేసి ఉద్యమాలు నడిపిన మహానుభావుడు. ఇప్పుడు శికార్డు మార్చేసి తెలుగువారి అయికమత్యాన్ని ప్రబోధిస్తున్నాడు. ఆంధ్రదేశం ఒకటిగా వుంటేనే భవిష్యత్తుంటుందంటున్నాడు.

ఆ ఉపన్యాసం శ్రద్ధంగా వింటున్న జనం వేపు చూశాడు రిఫరీ. వాళ్ళన్జూస్తే అతనికి కోపం వచ్చింది. తిక్కరేగింది. రప్పున జనంవేపు తిరిగాడు.

"ఒరే నాయన్లారా, పిచ్చి ప్రజల్లారా! సరదా కాడుకొనే ఫుట్‌బాల్ మాచ్‌లో తప్పుల్ని సహించలేని మీరు ఇక్కడ ఇంతమంది ఎదుట ఆ ప్రజాప్రతినిధి చేస్తోన్న ఫౌల్‌ని ఎలా సహిస్తున్నారు? ప్రత్యేక రాష్ట్రం కావాలనీ, తెలుగుదేశం రెండుగా చీలాలనీ-అప్పుడే తెలుగువారికి భవిష్యత్తు వుంటుందనీ ఉద్యమాలు నిర్వహించి, మీలో వందలాది మందిని పోలీసు కాల్పులకు గురిచేసి, కొన్ని కుటుంబాలనే సర్వనాశనం చేసిన ఆ దగాకోరుని మీరు ఇంకా ఎందుకు ఉపేక్షిస్తున్నారు? వాడు చేసే దారుణాలను, ప్రజల ప్రాణాలతో చెలగాటాలాడే కిరాతకాలను మీరింకా గుర్తించలేదా? గుర్తిస్తే మరివాడు చేస్తోన్న కిరాతకాలకు 'ఫౌల్' అని అరవరేం? వాడిని బయటకులాగి తన్నరేం? మరోసారి స్టేజి ఎక్కొద్దని బుద్ధి చెప్పరేం? వాడలా రంగులుమార్చి తిరుగుతోంటే సహిస్తారేం? వాణ్ణే మళ్ళీ మళ్ళీ ఎలక్షన్లో ఎన్నుకొంటారేం?

ఇక్కడ మీ నిశిత పరిశీలన ఏమయింది? కోపతాపా లేమయినాయ్? మీ ఉద్రేకం ఏమైపోయింది? . ."

ఆ ప్రాంతం ఓ క్షణం నిశ్శబ్దం అయిపోయింది. అంతా తెల్లబోయి చూశారతని వేపు.

"వాడే రిఫరీ-పట్టుకోండి..."అరచారెవరో. మరుక్షణం ఆ ప్రాంతమంతా గగ్గోలయిపోయింది. జనమంతా ఒకరిమీద ఒకరు పడి రిఫరీ వేపుకి దూకారు.

రిఫరీకి స్పృహ వచ్చింది.

ఉద్రేకంలో, కోపంలో - తను మర్చిపోయి మళ్ళీ జనానికి దొరికిపోయేడు. వెంటనే నేల మీదకి జరిగిపోయి కాళ్ళ సందునుంచీ దూరి జనంలోనుంచి బయటికొచ్చి పరుగెత్తసాగేడు.

"అడుగో . బయటకు పారిపోతున్నాడు."

అరచారెవరో, మరుక్షణంలో అక్కడి జనమంతా గట్టిగా కేకలు పెట్టుకొంటూ అతని వెంబడిపడ్డారు. రిఫరీ కాలిబలంకొద్దీ పరుగెత్తి ఆ పక్కనేవున్న సినిమా థియేటర్ ముందు గుంపుల్లో కలసిపోయాడు. కొత్త సినిమా కావటంవల్ల చాలా రద్దీగా వుందక్కడ. మరికొద్ది క్షణాల్లో పార్కులో జనమంతా వచ్చి నిండిపోయారక్కడ. అందరి కళ్ళూ రిఫరీకోసమే గాలిస్తున్నాయ్. ఆ జనాన్నిచూసి సినిమా హాలువాడు తెగ ఆనందపడి అన్ని క్లాసులకూ నాలుగు టిక్కెట్లకంటె ఎక్కువ అమ్మద్దని బుకింగ్ క్లర్క్‌కి ఆర్డర్స్ జారీచేసి మిగతా టికెట్లన్నీ బ్లాకువాళ్ళతో అమ్మించడం మొదలు పెట్టాడు.

ఎవరికండీ—తొంభై పైసల టికెట్—రెండ్రూపాయలు.


ఆ—ఎవరికండీ—రూపాయిన్నర టిక్కెట్టు రెండున్నర.

రెండున్నర టికెట్—నాలుగు.

మూడూముప్ఫై టికెట్—ఆర్రూపాయలు.

రిఫరీకి వళ్ళు మండిపోయింది. ఇప్పుడే కాదు. తనెప్పుడొచ్చినా ఈ హాలులో ఇంతే:

"ఇక్కడ టికెట్లన్నీ బ్లాకులోనే అమ్ముతారు. బుకింగ్ విండోలో అమ్మరు. మరి ఫుట్‌బాల్ మాచ్‌లో ఆ చిన్న తప్పుని వప్పుకోలేని మీరు ఈ టిక్కెట్ల 'ఫౌల్'ని ఎలా వప్పుకొంటున్నారు. 'ఫౌల్' అని అరవకుండా ఎందు కూరుకొంటున్నారు? కేక లెందుకు వేయటం లేదు? ఆ బ్లాక్ చేసే వాడిమీద, వాడిని పోషిస్తున్న సినిమాహాలు వాడిమీదా, వారిని ప్రోత్సాహిస్తున్న పోలీసులమీదా రాళ్ళూ చిల్లి పెంకులూ ఎందుకు విసరటం లేదు? ఫుట్‌బాల్ మాచ్‌లో 'ఫౌల్' అయితే దాని మూలాన నష్టం జరిగేది ఆ ఇరుపక్షాల్లో ఒకరికే. అయినాగాని మీరు అది మీ కే జరిగిందన్నంత కోపంతో ప్రతీకారం తీర్చుకోవా లనుకొన్నారు. మరిక్కడ, ఈ సినిమా హాలుముందు అన్యాయం మీకే జరుగుతోంది.



మిమ్మల్ని దోచుకోడానికే ఆ బ్లాకువాళ్ళు ప్రయత్నిస్తున్నారు.

అయినాగాని మీరు కిక్కురు మనడంలేదు. టికెట్లు దొరికిందే చాలని సంతోషిస్తున్నారు. ఇలా రెండు విధాల ప్రవర్తించడానికి మీలో రక్త మాంసాలు లేవూ? మీకు సిగ్గూ శరమూ లేవూ?"

కోపంగా అరచాడు రిఫరీ.

మరుక్షణంలో ఆ ప్రాంతమంతా గగ్గోలయి పోయింది. అంతా మళ్ళీ రిఫరీ వేపుకి పరుగెత్త సాగేరు. రిఫరీ త్వరగా అక్కడినుంచి బయటపడి కొద్దిదూరంలో మెయిన్ రోడ్డు మీద కొచ్చేశాడు.

ఆ రోడ్డు పూర్తిగా మూసివేయ బడివుంది అవతలి వేపు సిమెంటు రోడ్డు. వేస్తుండడం చేత అంతా కూలీలతో నిండిపోయివుంది. కంట్రాక్టరు కార్లోకూచుని ఇసుకని సిమెంట్‌లా కనిపింప జేయడానికి తంటాలు పడుతున్నాడు.

రిఫరీ అక్కడ ఆగిపోయేడు. జనం కేకలు వేసుకొంటూ అతనిమీద పడ్డేరు.


"కొట్టండి నాయాల్ని. ఫౌల్ జరుగుతే చూస్తూ ఊరుకొన్నాడు. రాస్కెల్..."

"ఆగండి." అరచాడు రిఫరీ.

అంతా నిశ్శబ్దమయిపోయింది.

"నిజమే, నేను ఫుట్‌బాల్ ఆటలో ఫౌల్‌ని సహించాను. చూసీ చూడనట్లు ఊరుకొన్నాను. కానీ మీరేం చేస్తున్నారు. అంతకంటె పెద్ద ఫౌల్స్‌నే చూసీచూడనట్లు ఊరుకొంటున్నారు. అంతకంటె పెద్ద అన్యాయాలనే సహించేస్తున్నారు. ఆ అన్యాయం జరుగుతోంది మీకే అయినామీక్కానట్లు నటించి వెళ్ళిపోతున్నారు. ఆ మీటింగ్‌లో జరిగిన ఫౌల్ మీకు తెలీదూ? సినిమా హాల్‌ముందు జరుగుతున్న అన్యాయం మీక్కాదూ? ఈ కంట్రాక్టరు వేస్తున్న రోడ్డు ఖర్చుమీది కాదూ? ఇసుకనే సిమెంట్ అంటూంటే మీరు చూసీ చూడనట్లు ఊరుకోడం లేదూ? రేషన్ షాపులోనుంచి బ్లాక్ మార్కెట్టుకి రెక్కలు కట్టుకొని ఎగిరి

(వి)చిత్ర విజ్ఞానం



ఇరవైయవ శతాబ్దాన్ని కంప్యూటర్ యుగం అని చెప్పవచ్చు. కంప్యూటర్ల చేత అన్ని పనులూ చేయిస్తున్నారు మన శాస్త్రజ్ఞులు. ఈమధ్య కంప్యూటరు కళ అంటూ ఒకటి ప్రారంభమైంది. కంప్యూటర్ల చేత బొమ్మలు గీయిస్తున్నారు. ఈ బొమ్మలో కనబడే పిల్లులూ కుక్కలూ కార్లూ మేడలూ కంప్యూటర్లు గీసినవే!!

పోతున్న పంచదార మీ 'కోటా' కాదూ? తెలుగు దేశంలో తెలుగు వారంతా ఒకటి కాదనేందుకు నిష్పత్తుల నిదర్శనం కనిపించటం లేదూ? ఈ అన్యాయం జరుగుతోంది నీ క్కాదూ? ఈ నిష్పత్తుల నేర్పరచిన పెద్ద మనుషులు, ప్రజానాయకులు ఇప్పుడు అదేమీ ఎరగనట్లు "మా తెలుగు తల్లికి మల్లెపూదండ" అని పాటలు పాడటం వినిపించటం లేదూ? ఇది అసమంజసంగా మీకనిపించటంలేదూ? ఎంప్లాయ్‌మెంటు ఎక్స్చేంజీల్లోనూ, రిజిస్ట్రేషన్ చేసే ఆఫీసుల్లోనూ, మున్సిపల్ ఆఫీసుల్లోనూ, ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లోనూ పేరుకు పోయి, కుళ్ళిపోతున్న అవినీతి, లంచ గొండి తనం మీరు చవిచూడలేదూ? ఆ అక్రమాలకు గురయిపోతుంది మీరు కాదూ? డైరీఫారం పాలల్లోనే నీళ్ళు కలవడం మీకు తెలీదూ? సూపర్ బజార్ దూకాల్లోనే మోసం గురించిన వార్తలు మీరు పేపర్లో చదవలేదూ? మీరు తినే ఆహారంలో కల్తీ జరుగుతుంటే సహించటం లేదూ? నాలుగుద్యోగా లున్నాయని ప్రకటనలు వేసి అయిదు రూపాయలు అప్లికేషన్ ఫారా నికి, పాతిక రూపాయలు ఎంట్రెన్స్ ఫీజులనీ వసూలుచేసి కోట్ల రూపాయలు నిధులు సమ కూర్చుకొంటున్న బాంకులూ, ఇతర సంస్థలూ మీకు తెలీదూ?

ఈ దారుణాలకి ఆహుతి అవుతుంది మీరు కాదూ? జాతీయం చేయబడినా బాంకుల్లో జరుగుతున్న ఫౌల్స్ మీరు గమనించలేదూ? హెరిడిటరీ ఉద్యోగాల గారడీ మీరు చూళ్ళేదూ? డిపాజిట్ల పేరిట హౌసింగ్ బోర్డులూ, హుండాలూ, కోపరేటివ్ సంస్థలూ పోగు జేసు కొనే ధనరాసులు మీవికావూ? దానిమీద వారు సంపాదించుకొనే వడ్డీ మీదికాదూ? ఆ ఫౌల్స్ జరుగుతుంది మీకేగా మరి అక్కడ ఫౌల్ అని కేకలు వేయరేం? రాళ్ళు, కర్రలూ తీసు కొని వెంబడి పడరేం? మీకు దొరికింది ఏమీ చేయలేని రిఫరీయేనా? "

జనం ఇంక సహించ లేకపోయారు.

"వీడి స్పీచి వింటూంటే తెల్లారిపోతుంది. తన్నండి "

అరచా రెవరో.

మరుక్షణంలో అంతా రిఫరీ మీద విరుచుకు పడిపోయారు.

రిఫరీ గట్టిగా శక్తికొద్దీ అరచాడు.

"ఇది అన్యాయం ఫౌల్ "

ఫౌల్..

ఫౌల్

మహిళాజ్యోతి

భారతమహిళలపై బాపూజీ ప్రభావం

మల్లాది వెంకటసుబ్బమ్మ

"శాసనాలలో ఆచారాలలో స్త్రీపురుష సమాన హక్కులులేనప్పుడు ఆడ మగ పుట్టుకలు సమానం కానంతవరకు భారతదేశంలో అర భాగం పక్షవాత కృశీభూతమైనట్లే. స్త్రీని అణగద్రొక్కుట అహింసాసూత్రాన్ని అణగ ద్రొక్కుటే. స్త్రీల హక్కుల విషయంలో నేను రాజీపడను" అంటూ స్త్రీజాతిని వెన్ను తట్టి లేపిన మాననీయుడు, మానవతావాది, మహాత్మాగాంధీ.


స్త్రీ జనోద్ధరణకై రామ్ మోహనరాయ్, ఎం. ఎన్. రాయ్, కందుకూరి, గురజాడ శరత్ బాబులతో సమాన స్థాయిలో పోరాడిన దయాశీలి బాపూజీ. బలహీన వర్గాలకు, హరిజనులకు, స్త్రీలకు ఆర్థిక సాంఘిక రాజకీయాలలో సమాన ప్రాతినిధ్య మివ్వనిదే దేశానికి ప్రగతి లేదని వాదించిన ధీరోదాత్తుడు బాపూజీయే. మూఢాచారాలకు, సాంఘికదౌష్ట్యానికి, భర్తల పెత్తందారీ తనానికి బలౌతున్న భారతస్త్రీల తరపున పోరాడిన యుగపురుషుడు. అబలలకు అన్యాయం జరుగుతోందని గుర్తించి తన నిర్మాణ కార్యక్రమాల్లో స్త్రీజనోద్ధరణ ముఖ్యభాగంగా పేర్కొని పత్రికలలో ఉపాన్యాసాలలో స్త్రీలదుస్థితి వర్ణిస్తూ వారి హక్కులకై శాయశక్తులాపురుషులపై, సమాజంపై, చట్టాలపై ధ్వజమెత్తి మహిళావికాశానికి తోడ్పడ్డ విశ్వమానవుడు, అహింసా సూత్రాన్ని ఆచరణలో చూపిన విశధర్మ సంస్థాపకుడు గాంధీ.


శాసన నిర్మాణం ఆచార వ్యవహారాలను, ధర్మశాస్త్రాలను పూర్తిగా పురుషులేసృష్టించారని బాపుజీ అభిప్రాయం. మనువాదులు పురుషాధిపత్యం చూపుతూ స్త్రీలను బానిసలుగా, వ్యక్తిత్వంలేని ఆటబొమ్మలుగా చిత్రించి అణగద్రొక్కారనుటలో సందేహం లేదు. తరతరాలుగా ఈ భావాలు నరనరాన జీర్ణించిన స్త్రీలు స్వతంత్రులుగా ఉండగలమని, ఉండవలెనని ఎరుగని పూర్వపు బానిసలవలె వున్నారని మహాత్ముని భావం. సాంఘిక నియమాలు, చట్టాలు పరస్పర సహకారంతోను, సంప్రదింపులద్వారా నిర్మించినప్పుడే స్త్రీలకు న్యాయం జరుగుతుంది. ఈనాడమల్లో వున్నవి స్త్రీల విధులే హెచ్చుభాగం; హక్కు లత్యల్పం. అందుచే స్త్రీలను మిత్రులుగా, సహధర్మలుగా చూడక తాము ప్రభువులుగా అధికారులుగా చలాయిస్తున్నారు పురుషులు.

మహిళావికాసానికి మహాత్ముని సందేశంలో—అవిద్యవల్లనే స్త్రీలు అజ్ఞానంతో తమ హక్కులను నిరాకరిస్తున్నారని, విద్యావంతులైతే సాంఘిక, ఆర్థిక, రాజకీయాలలో తమ పాత్రను సమర్థవంతంగా నెరవేర్చగలరని ముమ్మందుగా వారికి విద్య నేర్పమని కార్యకర్తల కాదేశమిచ్చాను. స్త్రీలు అజ్ఞానాంధకారంవల్లనే తమ వెండి బంగారు ఆభరణాలు చూచి మురిసిపోతున్నారు. తమ సంకెళ్ళను ఆభరణాలనుకొను బందీలకు విముక్తి కల్గించుట బహు కష్టమని బాధపడ్డారు బాపూజీ. సేవవల్ల అలంకారం హృదయం నుండి సువాసన రావాలి కాని ఆభరణాలవల్ల


మీ అందానికే తగిన
మిల మిల మెరిసే చీరెలు:
కంచి, ధర్మవరం, బెంగుళూరు, బెనారస్, ఆరణి పట్టుచీరెలు!!
వేలకొలది రకములు
గ్యారంటీ వెండి,
జరీతో తయారైనవి
లభించును.
లక్ష్మి జనరల్ స్టోర్స్
గవర్నరుపేట, విజయవాడ-2
గ్రామ్స్: శిల్పా, ఫోన్: 73467, 77052

అలంకారం సెంటుపల్ల సువాసన రాదన్నారు. వ్యక్తిత్వం గల ఆమెను భర్తకు దానమిచ్చుట కెవ్వరికీ అధికారం లేదని కన్యాదానంపై తీవ్ర నిరసన తెల్పారు. లజ్జాకరమైన వరశుల్క విధానాన్ని నిరసిస్తూ కట్నం పుచ్చుకున్న వ్యక్తిని సంఘబహిష్కారం చెయ్యమని యువజన సంఘాల కాదేశమిచ్చారు. మానాన్ని పోగొట్టుకున్న కాందిశీక స్త్రీలను వివాహమాడమని యువకుల కుద్బోధించిన దయాశీలి. విడాకుల విషయం ప్రస్తావిస్తూ పరస్పర అభిమానం, ఆప్యాయత లేని వార్ని బలవంతపర్చుట తగదని నైతిక విచ్ఛేదం కంటే వివాహ విచ్ఛేదమే మేలని యంగిండియాలో వ్రాశారు గాంధీజీ. అజ్ఞానదశలోని వివాహం వివాహమే కాదని బాల వితంతువులను వివాహమాడమని సంస్కరణాభిలాషులకు ప్రబోధించిరి. భాగస్వామియెడ ప్రేమానురాగాలు లేని నిర్బంధ వైధవ్యం అపవిత్రమన్నారు. వారి కిష్టమైతే స్త్రీ పునర్వివాహమాడవచ్చని సలహా ఇచ్చారు. పర్దా విషయంలో అంతరంలో లేని పాతివ్రత్యం తెర వెనుక వుంటే వస్తుందా! పురుషుల శీలం గురించి అడిగే హక్కు స్త్రీలకు లేనప్పుడామె శీలం విషయంలో వారికంత ఆదుర్దా ఏలకో అని ఆశ్చర్యపడ్డారు. "నీవు గృహదేవతవు, మాతృదేవతవు, శాంతమూర్తివి, ఓర్పు సహనాలు నీ భూషణా"లని కల్లబొల్లి కబుర్లతో ఆమెచే వెట్టిచాకిరీ చేయించుకొనుట హేయమని యంగిండియాలో వ్రాశారు. స్త్రీ పురుషులిద్దరూ సమాన మానసిక ధార్మిక శక్తులతో జన్మించారు ఎవరి హోదా తగ్గినా రెండోవారు దెబ్బ తింటారు. ఒకరు లేనిచో రెండోవారి వ్యక్తిత్వం అసంపూర్ణమని స్త్రీపురుష సమానత్వంపై నొక్కిచూపారు.


billyboy
SUITINGS
AARBEELON
SILK MILLS
BOMBAY-400 068
Distributors:
K LALSAREEWALA
Ghadial Galley
BOMBAY-400 002



సంప్రదాయాలూ, మూఢాచారాలు, అవిద్య అజ్ఞానాలతో కొట్టుమిట్టాడు స్త్రీజాతిని మేల్కొలుపుటకై జీవితాంతం కృషిచేశారు. ఒకరిలో లేని గుణాన్ని రెండోవారు పూరించుటకే ప్రకృతి లింగభేదం సృష్టించిందని హరిజన పత్రికలో వ్రాశారు. పురుషుడు స్వామి అయితే స్త్రీ స్వామిని కావాలికాని యజమాని, సేవకులనే భావం అపవిత్రమన్నారు. విద్యా ఉద్యోగాలలో, వ్యక్తిహోదాలో ఏ పరిధిలో హెచ్చుతగ్గు లుండరాదని గట్టిగా వాదిస్తూ స్త్రీ స్వభావంలో స్వతస్సిద్ధంగా పాతుకున్న లోపాలను సరిదిద్దుటే నిజమైన స్త్రీజనోద్ధరణ అన్నారు గాంధీజీ.

బాపూజీ ప్రబోధాలకు ఉత్తేజితులై ఉద్వేగంతో, ఉత్సాహంతో వేలాది స్త్రీలు ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నారు. జైళ్ళకెళ్ళారు. కల్లు పాకలవద్ద పికెటింగులుచేసి లాఠీదెబ్బలు తిన్నారు. తమ నగలను పార్టీ నిధులకై బాపూజీకి సమర్పించారు. స్త్రీ జాతిలో కొంత జాగృతి వికాశం కల్గిందప్పుడు.

40 సం॥నాటి బాపూజీ ప్రబోధం ఈనాటికైనా ఫలించిందా? అనేది ప్రశ్నగానే మిగిలిపోయింది. కారణం స్త్రీయూ, పురుషుడూ, సమాజమూ అంటే అందరూనూ. మహాత్ముల జయంతులు, వర్ధంతులు జరుపుతాం. వారి విగ్రహాలు ప్రతిష్టిస్తాం; వ్యక్తిత్వాన్ని కించపరుస్తాం. పైకవచానికి బ్రహ్మరథం పడతాం. వారి సందేశాలు విస్మరిస్తాం. వ్యక్తుల మనస్తత్వం మారనంతకాలం, సంప్రదాయ భావాలు, మూఢాచారాలు పోనంతకాలం, భావ విప్లవం రానంతకాలం వ్యక్తివికాసం పెరుగదు. సమస్యను హేతువాద దృష్టితో, శాస్త్రీయ దృక్పథంతో, తాత్విక చింతనతో ఆలోచించాలి. ముందుగా మానసిక స్వేచ్ఛ కావాలి. బంధ విముక్తికి ధైర్యం ఎంతైనా అవసరం. ఆత్మవిశ్వాసం లేకపోతే సాహసం కొరవడుతుంది. స్త్రీజనోద్ధరణకై స్త్రీలు ప్రధానంగా తమ పైననే ఆధారపడాలి. కాకపోతే స్త్రీల దుస్థితిని అవగాహన చేసుకొని, సానుభూతితో సహకరించే పురుషుల తోడ్పాటు ఏనాటికైనా అవసరమే. సమాజాన్ని ఏ ఒక్క వర్గమూ మార్చలేదు కదా! స్వేచ్ఛాపిపాసులైన స్త్రీ పురుషులు తమ చర్యలద్వారా, కార్యక్రమాల ద్వారా, తమ సంఖ్యను పెంచుకొంటూ సమాజాన్ని ప్రభావితం చేసుకొంటూ చివరకు సమాజాన్ని పూర్తిగా మార్చగల్గుతారు.

ఈనాటి సమాజానికి, దేశానికి మహిళల తోడ్పాటు యెంతైనా అవసరం వుంది. మహిళాభ్యుదయమే దేశానికి గీటురాయి; సమాజ స్థాయికి నిదర్శనం. స్త్రీలు వంట ఇంటికి, పడకటింటికే పరిమితంకాక సమాజాభివృద్ధికి తోడ్పడాలి. ముస్ముందుగా తమ నుద్ధరించుకోవాలి. ఇది ప్రథమ కర్తవ్యం. మహాత్మాగాంధీలాంటి ఉత్తమపురుషుల ప్రవచనాలు స్త్రీజాతికి యెనలేని అండగా వున్నై. గాంధీజీ అడుగుజాడల్లో నడవగల్గాలి ప్రగతిశీలురైన మహిళలు. దానికై సర్వులూ తోడ్పడాలి సహకరించాలి. □

'అమ్మ'—ఎంత మధురమైనదీ మాట! విలువ కట్టలేని, అనుభూతుల నందించే ఆ పిలుపు ఎంత గొప్పది! 'అమ్మ' కావాలన్న కోరిక దహించి వేస్తుండగా నిస్సారంగా, నిస్తేజంగా జీవిస్తున్న మహిళలెంతమందో ఉన్నారు! 'అమ్మ' అని అని పించుకొనే మార్గం—కేవలం పిల్లలు లేనంత మాత్రాన మూసుకు పోతుందా? మనసుంటే మార్గమే ఉండదా?

తల్లి మనసు

ఐ. వి. యస్. అచ్యుతవల్లి

మండు ఎండాకాలం. మధ్యాహ్నం పన్నెండు గంటలు దాటింది. వరండాకువున్న మేష్‌కి వట్టి వేళ్ళ తడకలుకట్టి గంటకు కడవలతో నీళ్లు తెచ్చి తడుపుతున్నది పనిమనిషి. మా మేడకు చుట్టూ చాలా విశాలమయిన ఆవరణ వుంది. పెద్ద పెద్ద వేపచెట్లు, కాడ మల్లిచెట్లు, మామిడి చెట్లువుండి ఎంత ఎండాకాలమయినా చల్లని నీడతోవుంటుంది. నాలుగేళ్ళ క్రితందాకా ఆవరణ అంతా ఎండిన ఆకులతో పూలతో దుమ్ము రేగిపోయి వుండేది. ఇప్పుడు ఆవరణ చుట్టూ బార్బ్‌డ్ వైర్ కట్టించి బటాణీ పూల తీగెలు దట్టంగా అల్లుకునేట్లు చేసేడు మాలి. పిల్లలు ఆడుకుందుకు జారుడు బండ. అక్కడక్కడ మామిడి కొమ్మలకు చిన్న చిన్న ఉయ్యాలలు వున్నాయి. అక్కడక్కడ అల్లిబిల్లిగా అల్లుకున్న కాశీరత్నం, శంఖు పూల తీగెల మధ్య చిన్న చిన్న రేకులతో కట్టిన గదులున్నాయి. అంతటి ఎండ సమయంలోనూ ఆ గదుల్లో చిన్ని చిన్ని మాటలు అల్లరి చేసే పాటలు బుల్లి బుల్లి ఏడుపులు వినవస్తున్నాయి. పదిగంటలకు ఆయన వెళ్ళిపోతే తిరిగి రాత్రి పది పదకొండు గంటలదాక నిశ్శబ్దంగా వుండేది మా ఇల్లు. అల్లరి చేసేందుకు మా ఇంట్లో పిల్లలు లేరు. అయితే పిల్లలేనందుకు అది ఒక కొరతగా నేను నీరజ కన్పించేదాకా భావించలేదు. నాకు ఏమయినా లేసులు అల్లుకొనటం లేక ఏదయినా చదువుకొనుట రేడియో పాటలు వింటూ ఇంకా తోచకపోతే, మాట్నీ సినిమాలకు వెళ్ళటం ఇల్లా గడిచిపోయేవి రోజులు. పిల్లలంటే నాకు ఇష్టమే. కాని ఇరవయినాలుగంటలూ వాళ్ళతో వేగ లేనేమో అనే భయంతో పెళ్లి అయి పదిహేనేళ్ళకూ పిల్లలు కలగకపోయినా నేను ఎవర్ని దత్తు తీసుకునే ప్రయత్నం చేయలేదు. ఆయన ఏమయినా ఫీలయ్యేవారో లేదో నా ముందు మటుకు ఆ బాధ ఏదీ వ్యక్తం చేసేవారుకాదు. మా జీవితం పిల్లలు లేరనే బాధ తోచకుండా, వడివడిగా ఆనందగానే గడిచిపోయేది. నీరజ కన్పించే దాకా ఇప్పటికి నాలుగేళ్లు అయి వుంటుంది. ఇల్లానే బాగా ఎండగావుంది. పన్నెండు దాటింది. ఆరోజూ రేడియోలో పాటలు వింటూ వరండాలో పచార్లుచేస్తున్నాను. అనుకోకుండా రోడ్డు మీదకు చూసేను. ఉలిక్కి పడ్డాను. అంత ఎండలోనూ జనం

గుమి గూడారు. అందరూ కలగా పులగంగా ఏవేవో అంటున్నారు. ఆ మాటలు నా చెవులదాకా రాలేదు. అస్పష్టమయిన మర్మర ధ్వని మటుకే నా చెవులదాకా వస్తున్నది. మా రోడ్డు అంత ట్రాఫిక్ ఎక్కువగా గలదికాదు. అంచేత యాక్సిడెంటుకి అవకాశంలేదు. ఎవరో వడదెబ్బ కొట్టో, లేక మూర్ఛరోగో అయి వుంటారు. పెదమ్మ అప్పుడే రోడ్డు మీదకు వెళ్లి వార్త సేకరించి వడివడిగా లోపలికి పరుగెట్టుకుని వస్తోంది. నేను వద్దన్నా వూళ్లో విశేషాలు దాని నోటమ్మట నేను వినక తప్పదు. గబగబా మేడదిగి క్రింది హాలుకి వచ్చేను. "ఏమిటే ఆ జనం!" అని నేను ఇంకా అడగలేదు. అడగక్కర్లేదు కూడా.

"ఎవరో ఆడదాయిని జనం బాదేస్తున్నారమ్మగోరూ!" అంది. ఇంత ఎండలో మిట్ట మధ్యాహ్నం నలుగురూ పోగయితన్న గలిగేటంతటి అకృత్యం ఒక ఆడమనిషి ఏంచేసి వుంటుంది? మా వీధి అంతా సంపన్నులూ హోదాల్లోవున్న ఉద్యోగస్థులూ వుండే ఇళ్ళతో వుంది. అలగా జనం మచ్చుకైనా కనపడరు. మా ఇళ్ళల్లో పనిచేసే వాళ్లుకూడా ఎంతో నీటుగా శుభ్రంగావుంటారు. అంతా సంస్కారవంతులు! త్రాగుడయినా వ్యభిచారమయినా, ఏదో "గెట్ టు గెదర్" పేరుతో అతి హుందాతనంతో సాగుతుంది. కాని వీధిని పడికొట్టుకుని తిట్టుకునే స్థాయిలో జరగదు.

"మనిషి నాజూగ్గా శలాగ్గా వున్నదండి. పిచ్చిదో ఏటో! అన్ని దెబ్బలు తింటున్న గుడ్లప్పగించి చూట్టం తప్ప కంటెంట ఒక్క చుక్క బొట్టు అయినా రాల్తలేదండి." పెడమ్మ కధ మొదలెట్టింది. నాకు చూడాలని పించింది. అక్కడ అంతా కాయగూరలు అమ్ముకునే వాళ్లు రిక్షవాళ్ళూ వున్నారు. కాకుల్లో నెమలి పిట్టలా నేను వెళ్ళవచ్చా! సోషల్ స్టేటస్ అడ్డు వస్తోంది. కాని నాజూగ్గా చలాగ్గా వున్న ఆడదాన్ని చూడాలనే తహ తహ సోషల్ స్టేటస్‌ని బలవంతంగా క్రూరాతి క్రూరంగా వెనక్కి నెట్టివేసింది కాళ్లు రోడ్డు మీదకే నడిచాయి. మనసు కాళ్ళతో సహకరించక పోయినా. కాళ్ళు వాటంతటవే నడిచాయి. పెడమ్మ ఏమాట కామాటే చెప్పుకోవాలి నా హుందా తనాన్ని నిలబెట్టింది.

"అమ్మగారు వత్తున్నారు. దా రెట్టండి దా రెట్టండి." అంటూ "రాజా వెడలె" లా నాకు ముందు పరుగెట్టింది.

"అంత లా బాదెయ్యకండి పిచ్చిముండలా వుంది." అంటున్నారు ఒకరు.

"దొరికితే పిచ్చి, మూగ నటించటం ఈ ముండలకి మామూలే! పోలీసు స్టేషన్‌లో పడెయ్యాలి!" ఇంకొకరు అంటున్నారు.

"ఇంతకీ ఏం చేసిం దాయమ్మి!" అంటున్నారు ఒకరు.

"కిళ్లీ కొట్టుకాడ ఏవో పళ్లు కొనుక్కుంటుంటే నాలుగేళ్ళ పిల్లని చంక నెత్తుకుని పరుగెత్తి పోయిందిట! ఆ పిల్ల ఏడుస్తోంటే అప్పుడు ఆ తల్లి చూసుకుని ఏడుస్తూ పరిగెత్తిందిట!"

"పిల్లకి చెవులకి బంగారం ఏమన్న వుందా!"

"తల్లికే లేవు. నల్ల పూసలూ బొందూ పిల్లకేం వుంటుంది బంగారం!"

ఈ మాటలతో నాలోని అభిజాత్యం పటాపంచ లయిపోయింది. ముక్కు ముఖం తెలియని పసిపిల్లని ఎత్తుకుపోయి అయినా లాలించాలనేంత తీవ్రవేదనకు గురి అయిన తల్లి మనసుని చూడాలనే ఆసక్తి చంపుకో లేకపోయేను. దొంగ. పిచ్చిది. పిల్లని ఎత్తుకు వెళ్లి ముష్టి వాళ్ళని చేస్తుంది. అని వ్యాఖ్యానాలు చేస్తున్న చలించకుండా, నడి రోడ్డుమీద పెనంలా కాలుతున్న రోడ్డుమీద కుప్ప కూలిపోయి చక్రాల్లాంటి కళ్ళతో జనంకేసి బెదురుగా చూస్తున్న స్త్రీ మూర్తిని చూసేను. నిజంగా ఎల్లా చూడగగ్గలాను? చూసి ఎల్లా నిలబడ గలిగేను? నాలో వయస్సు పెరుగుతున్న కొద్ది మానవత్వం, ప్రేమ, ఆర్ద్రత మొదలైన సున్నిత భావాలు ఆర్చుకుపోయేయికాబోల్ను! వర్షాకాలం ఎంతగా వర్షాలుకురిసి నేల నేలంతా

తడిసి పచ్చని పచ్చిక బయళ్ళని తయారు చేసినా శీతకాలం వచ్చేసరికి ఆ తడి అంతా క్రమ క్రమంగా పీల్చుకుపోయి ధూళీ దుమ్ము ఎల్లా సెగలుగా ఎండాకాలం పొగలుగా మారి పోతాయి. అల్లానే బాల్యంలోని స్నేహం అభిమానం వాత్సల్యం, ప్రేమ మున్నగు అతి తీయని అనుభూతులు, వయస్సులు పెరిగే కొద్దీ, అహంకారం, ఆడంబరం, కామం, మొదలయిన వికారాలవల్ల వాట్ల వాట్ల స్వచ్ఛత కోల్పోతాయి. నలుగురిలో దోషిగా హీనంగా వున్న ఆ మనిషిని నేను నా చిన్ననాటి స్నేహితురాలు నీరజగా గుర్తించాను. ఆడంబరం ముసుగు చీల్చుకుని ఆర్ద్రత ప్రకాశించింది.

"ఆగండి." అన్నాను. ఎవరో నీరజను రెక్క పుచ్చుకుని లాగబోయేరు. నేను ఆగమని గట్టిగా అనేసరికి నాకేసి వింతమృగాన్ని చూసి నట్లు చూసి దాని రెక్కవదరేసారు. నేను దగ్గిరగా వెళ్ళేను.

"నీరూ నీరూ!" రెండు భుజాలూ పుచ్చుకుని కుదిపాను. అతిలోక దృశ్యాలను చూస్తున్నట్లున్న చూపులు నన్ను గుర్తించలేదు. నెమ్మదిగా ప్రక్కనున్న ఇంకో ఆడమనిషి సాయంతో నీరజని లేవతీసి తీసుకువచ్చి నా కార్లో వెనక సీట్లో కూర్చో బెట్టాను. ఫామిలీ డాక్టర్‌గారి ఇంటికి తీసుకు వెళ్ళాను. నేను కలగ జేసుకున్నాక జనం ప్లేటు ఫిరాయించేరు. నానా మాటలూ అంటూ తిట్టి కొట్టుతున్న ఆ జనం నీరజను ఒక ఉన్నతవర్గం మహిళ అండకు రాంగానే.

"అయినింటి ఆడ పిడ్డలావుంది" పాపం అని ఒకరు.

"పాపం ఆ యీడు పిల్ల వుండి సచ్చిపోనా దేమో!" అని ఇంకొకడు.

"ఎంత పచ్చగా వుందో! బంగారు తీగలా గుంది. నిండా ముప్పైయి ఏళ్లు వున్నాయో లేదో" అని ఇంకొకరు.

"ఎన్ని తిట్టినా పెదవి విప్పలేదు. ఎంతలం కొట్టినా చేయి విదల్చలేదు. అల్లా జాలిగా చూస్తూంది." అని వేరొకరు సానుభూతి చూప సాగారు. నీరజ దూషణభూషణ లకతీతమయిన మానసిక అవస్థలో వున్నదని నాకు తెలిసింది. డాక్టర్ లక్కీగా ఇంట్లోనే వున్నారు. పరీక్షించి.

"చాలా వీక్‌గావుంది. మెంటల్‌గా చాలా వర్రీ అవుతోంది. రెండు రోజులు ఇక్కడ వుణ్నియ్యి. ఆమెని తరుచు మాట్లాడించి డిస్టర్బ్ చేయకూడదు." అన్నారు. రెండు రోజులు నేను వెళ్లినా నీరజ ట్రౌజీగానే వుంటూ వచ్చింది నాలుగు రోజులు గడిచాక మా ఇంటికి తీసుకు వచ్చేను. సూరమ్మ మాఇంట్లో చిన్నప్పట్నించి వంట పనీ పై పనీ చూసు కునేది. బాగా పాతకాలం మనిషి; మా వారికి దూరపు బంధుత్వం వుంది. నీరజకు తలకు నీళ్లు పోసింది పెద్ద ఉసిరికాయల రసం మాడుకు మర్దించి మరీస్నానం చేయించింది. నా చీర జాకెట్టూ ఇచ్చాను. జాకెట్టు వదు లయింది. నీరజ జుట్టు ఉంగరాలు తిరిగే పొట్టిజుట్టు. జుట్టుమొదట్లో రబ్బరు బాండ్ బిగించితేజుట్టంతా గుత్తిగా వుండి చాలా గుజ్జుగా ముద్దుగా వుంటుంది.ఫాన్‌గాలికి జుట్టు వీపంతా పరుచుకుంది. చేతులు వదులయిన బ్లవుజు లోంచి నిస్సత్తువుగా వేలాడుతున్నాయి. నీరజ వళ్ళంతా గీరుకుపోయింది. వాళ్లు రోడ్డుమీద ఈడ్చి రెక్కలు పుచ్చుకులాగీ నానా బాధలూ పెట్టటంతో జాకెట్టుకూడా విప్పుకోలేక బాదతో విలవిల లాడిపోయింది. పచ్చని పిక్కలమీద ఆకు పచ్చగా కముకు మచ్చలుతేలాయి. ఆయన ఆఫీసుకు వెళ్ళినాక భోజనం ప్లేటు పట్టుకుని నీరజ నుంచిన గదిలోకి వెళ్ళాను. నాలుగురోజుల మానసిక విశ్రాంతి బలానికి మందులూ వేళ పట్టున భోజనంతో కొంచెం జీవకళ వచ్చినట్లు తోచింది నాకు. సూరమ్మను బయటకు వెళ్ళమన్నాను. ఈజీచైర్‌లో జారబడి పెద్ద కిటికీలోంచి పెరట్లోకి చూస్తూంది. భోజనం ప్లేటు టీపాయ్ మీదపెట్టి భుజంమీద చేయివేసి.

"నీరూ నీరూ " అన్నాను.

"ఊఁ." అంది. నా గొంతు రుద్ధమయింది. తన పేరు నీరజ అని గుర్తు వుందన్నమాట! తనని "నీరూ నీరూ" అని పిలుస్తారనికూడా తెలుసన్నమాట.

"నేను జ్ఞాపకం లేనా! మా ఆడపడచు పెళ్ళికి వచ్చినప్పుడు మీ యింటికి రాలా! రెండేళ్ళవలేదు ఇంకా!" అన్నాను.

ఆ నీలాల కళ్ళు నన్ను పరిశీలనగా చూసేయి. దీర్ఘంగా ఆలోచనగా గాఢంగా చూసిన వెనుక ఆ కళ్ళల్లో వెలుగు, సంతోషం సంతృప్తి క్రమక్రమంగా చోటు చేసుకొన్నాయి.

"నువ్వు పార్వతివి కదూ!" అంది. స్నేహితులంతా "నీరూ పారూ" "ఏరూ పారూ" అంటూ అల్లరి చేసేవారు మమ్మల్ని.

"అమ్మయ్య గుర్తుపట్టావు ఇన్నాళ్ళకి!" అన్నాను సంతోషంగా.

"ఇన్నాళ్ళూ! అవునూ. నేను యెలా వచ్చాను ఇక్కడికి?" అంది ఆలోచనగా. ముఖం కమిలిపోయింది. "సరే. ముందు భోజనం చెయ్యి. వసే, నీకిష్టమని మెంతి వంకాయకూర వండాను. చూడు యెలా కుదిరిందో!" అంటూ భోజనం ప్లేటు ముందుకు తోసి.

బయటకు వచ్చి డాక్టరుగారికి ఫోనుచేశాను. మనిషి శారీరకంగా బలహీనత ఆట్టేలేదు కనుక గతం గురించి గుర్తుకు తేవటంలో పెద్ద ప్రమాదం వుండదన్నారు డాక్టరుగారు. నీరజ గదిలోకి వచ్చేను. నింపాదిగా భోజనం చేస్తోంది. ఎదురుగ్గా కూర్చున్నాను. భోజనం ముగించాక వక్కపొడి ఇచ్చేను. సూరమ్మ ప్లేటు, మంచినీళ్ళగ్లాసూ పట్టుకుపోయింది బయటకు. "నీరూ ఏమిటిలా అయిపోయేవు? ఎక్కడ విశాఖపట్నం, ఎక్కడ హైద్రాబాదు! యెల్లా వచ్చేవు? వచ్చేప్పుడు నాకో టెలిగ్రాం ఇయ్యలేకపోయేవా? నేను ఇక్కడ బ్రతికే వున్నట్లు తెలియదా!" అన్నాను. నీరు కళ్ళు నీటి కడవలయ్యాయి.

"పారూ నా కథ నేను చెప్పలేను. నీ పరిస్థితికూడా నాదానిలాగానే వున్నది" అంది సంకోచంగా.

"ఫరవాలేదు. అదేమిటో చెప్పు! నా కర్థం కాలేదు " అన్నాను.

"పారూ! నీకూ పిల్లలు లేరు. నాకూ లేరు. ఇద్దరి పరిస్థితి ఒకటి కాదా!"

"అయితే!". "అదే చెబుతున్నాను. నా కథ చెప్పితే నువ్వు బాధపడుతావు."

"ఎందుకు బాధ?"

"పిల్లలు లేకపోతే బంధువుల్లో యెంత హీనంగా చూడబడతారో నీకు అనుభవంలోకి రాలేదా?"

"నీరూ! నాకు పిల్లలు లేకపోయినా మా వాళ్ళెవరూ నన్ను హీనంగా చూస్తున్నట్లు తోచదు—కారణం మావారి డబ్బు అనుకుంటాను. పుట్టింట్లోనూ, అత్తింట్లోనూ కూడా మేము వెళ్ళితే అడుగులకు మడుగులు ఒత్తుతూ వుంటారు. నాకు అంచేత పిల్లలు లేకపోవటం ఒక న్యూనత కలిగించే విషయంలా తోచదు" అన్నాను.

నీరజ విచారంగా నవ్వింది.

"పారూ! నీవు అదృష్టవంతురాలివి. ప్రేమ పూరితమయిన భర్త ఒడిలో నీ లోపాన్ని నువ్వు మర్చిపోగలుగుతున్నావు. మీ వాళ్లు సంస్కారవంతులయి వుంటారు. స్త్రీ తల్లి కాలేకపోవటానికి అనేక కారణాలుంటాయి. శారీరకమయినవి. మానసికమయినవి. ఒకరి లోపాలని నలుగురిముందు బహిర్గతపరచి అవమానపరిచేవాళ్లు మనుష్యులు కాదు. పిశాచాలు అయివుంటారు. అలాంటి పిశాచాలు మావాళ్లు" అంది నీరూ కన్నీళ్ళతో.

"ఈ రోజుల్లోకూడా అలాంటి మూర్ఖులున్నారంటావా?" అన్నాను.

"పరమ మూర్ఖులు అనుకో. పైవాళ్ళ సంగతి వదిలేయి. మావారు కూడా రానురానూ మారిపోయేరు. పెళ్ళి అయిన కొత్తలో మా

ఇద్దరిలో అందమయిన అమ్మాయిలని కనా లని కుతూహలంగా వుండేది.

"నీరూ! మన పాప అచ్చు నీ లా నే వుండాలి" అనేవారు ఆయన. సిరిసంపదలున్న ఇంటిలో అందమయిన ఆడపిల్లలుగా పుట్టటం కంటే అదృష్టం మరేమీ వుండదు. నాలో నేనే నా గొడ్రాలితనానికి బాధపడుతూంటే "నీరూ! మనకి పిల్లలు లేరని దిగులుపడకు. నాకు నువ్వూ నీకు నేనూ. ఈ లోకంలో ప్రతి చిన్నపిల్ల చిరునవ్వు మనకోసమే అని వూహించుకో!" అంటూ సముదాయించేవారు ఆయన ఓదార్పులో మనస్సు కొంత ఊరట చెందేది. క్రమక్రమంగా మా చుట్టు పక్కల ఇళ్ళల్లో ఏ ఫంక్షన్ వచ్చినా నాకు తెలియచేసే వారుకాదు. చిన్నపిల్లలని సరదాకు యెత్తుకున్నా నంటే తర్వాత వాళ్ల దగ్గినా తుమ్మినా "దాని చేతికెందుకిచ్చావే! అది ఇంక బతికి బట్టకట్టి నప్పటిమాట!" అంటూ వెనకాతలా గొణు క్కునేవారు. ఒకొకప్పుడు నాకు తెలిసేలానే అంటుండేవారు. ఆయనతో చెప్పితే కొత్తలో ఓదార్చేవారు. "అనవసరంగా అన్ని మాటలూ పట్టించుకోకు. నీరూ! సంతోషంగా వుండు" అనేవారు. ఈమధ్య ఈమధ్య విసుక్కోవటం మొదలుపెట్టారు. వున్నదేదో అనుభవించక యెవరో యేదో అన్నారని యేడుస్తూ కూర్చో వటం అలవాటయిపోతోంది నీకు. వున్న మాటంటే ఏడుపెందుకు? వుట్టి గొడ్డుకి అరుపు లెక్కువట! అంటూ విసుక్కోవటం మొదలుపెట్టారు. ఇంట్లోనా నాతో ఎవ్వరూ కలుపుగోరుతనంగా వుండరు. లేవగానే నేను యెక్కడ కనపడ్తానో అని భయపడుతూ వుంటారు. వాళ్ళ పిల్లల్ని నా దగ్గరకు రానీయరు.

"ఎవళ్ళ పిల్లలంటే వాళ్ళకు అభిమానం వుండదా! ఎవళ్ళ జాగ్రత్తలో వాళ్లుంటారు. అన్నిటికీ యేదో చెప్పుకు వస్తూవుంటావు" అన్నారు ఒకరోజు.

"పోనీ మనం ఒక పిల్లను పెంచుకుందా మండీ!" అన్నాను.

"నీకు పిల్లలు కలగరనే భయం వుంది. అంచేత పెంపకం పంపకం అంటున్నావు. నా కా భయం మటుకులేదు. అంచేత పెంపకం అనవసరం" అన్నారు.

"అంటే మీ ఉద్దేశ్యం ఏమిటి!" అన్నాను.

"చాలా చదువుకున్నదానివి. విడమరచి చెప్పాలా!" అన్నారు.

"అంటే మీకు మీకు ఇంకొకరివల్ల సంతానం కలుగుతుందని నమ్మకం వుందా?"

"నా నమ్మకమే కాదు. డాక్టరు సలహా కూడా తీసుకొన్నాను. నీకేదో ద్రోహం జరిగి పోతున్నదనే బెంగ మనసులోకి రానీయకు. మొక్కలన్నీ పూయవు. పూసిన పూలన్నీ పరిమళభరితాలు కావు. నీకున్న ప్రత్యేకత నీకున్నది. అందం తెలివితేటలు డబ్బు, విద్య వున్నాయి. సంతానహీనత ఒక అవలక్షణం కాదు. కాని మన భవిష్యత్తుకి సంతానం అవ సరం. ఎవర్నో అన్ని తెలుసున్నవాళ్ళని చివరి దశలో దత్తు తీసుకోవటం కంటే నాకున్న అవకాశాన్ని నేను వినియోగించుకోవటమే మంచిది అని తోస్తోంది నాకు."

"మీరేనా యీ మాట లంటూంటా!" అన్నాను.

"నేనుకాక ఇంకెవరికి అవసరముంటాయి? ఈ మాటలు అనేందుకు?"

"నన్నేం చెయ్యమన్నారు! అయితే!"

"ఏం చెయ్యక్కర్లేదు. ఏడుపులూ మొత్తు కోళ్ళూ పెట్టకుండా వుంటే చాలు."

"అంతకన్న మనం ఇద్దరం కలిసి చిన్న పాపాయిని పెంచుకొంటే బాగుండదాండీ! నాకుమటుకు పిల్లలని లాలించాలని వుండదా!"

"ఇద్దరం కలిసే పెంచుదాం. నాకు పుట్టిన పిల్లలు నీ పిల్లలు కారా! తల్లితండ్రి పరాయి వాళ్ళయిన పిల్లలని పెంచటంకంటే తండ్రి నీకు తెలుసున్నతను అయితే మరీ మంచిది

కాదా! నీ అభిరుచి ప్రకారమే పెంచుదువు కాని ”

“ఆవిడమటుకు తన పిల్లలని నన్ను చూడనిస్తుందా? అక్కలు, పదినలూ తోటికోడళ్ళూ ఆడపడుచులూ వాళ్ళకే పనికిరానిదాన్ని సవతికి పనికివస్తానా! తన పిల్లల్ని నన్ను కన్నెత్తి చూడనిస్తుందా! ఎందుకీ ఉబలాటం! మీవాళ్లు వద్దు నావాళ్ళూ వద్దు. తల్లితండ్రిలేని అనాధు లెందరో వున్నారు యీ దేశంలో. వాళ్ళలో ఒకళ్ళకయినా ఇంత నీడనిచ్చి జీవితంలో పైకి రావటానికి చేయూతనిస్తే పెద్ద కాలంలో ఆ కృతజ్ఞతాభారంతోనయినా మనకి సాయితాగా వుంటారు. పదిహేనేళ్లు మీతో సంసారం చేసేను. ఇంక ఇప్పుడు నన్ను విడిచిపెట్టి, పిల్లలు లేరనే వంకన, పెళ్ళి కొడుకయి కూర్చోవటం మీకు ధర్మం కాదు” అన్నాను.

“ఒకరికి ధర్మంగా న్యాయంగా తోచినది ఇంకొకరిపట్ల అధర్మంగా అన్యాయంగా వుండటం సహజం. దానికి ఎవర్ని నిందించుకునీ ప్రయోజనం వుండదు. నీకు కావల్సివస్తే నీవు విడిగా అనాధనే పెంచుతావో సనాధనే పెంచుతావో పెంచుకో. నేనుమటుకు నాకు తోచినది నేను చేస్తాను” అన్నారు.

“అయితే అతను మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడా!” అన్నాను.

“ఏమో! నేను కొంత డబ్బు నగలూ తీసుకుని బయలుదేరేను. ఎల్లాగా సవతిని తీసుకురావటం ఖాయం అంటున్నారు. ఇంక ఆ ఇంట్లో నాకేమి విలువ వుంటుంది! ఇక్కడ ఎవరైనా కలుసుకుని అనాధపిల్లల శరణాలయంలో ఆయాగా జేరుదామని బయలుదేరాను.”

“మీ వాళ్ళింటికి వెళ్ళలేక పోయేవా!”

“భర్త చూడకపోతే అత్తింట, తల్లి లేకపోతే పుట్టింట ఉండకూడదని మా అమ్మగారు అంటూందేవారు. ఇంక ఆ రెండు ఇళ్ళూ నాకు దూరమయినట్లే కదా! అంచేతే ఏదయినా

ఉద్యోగం వెతుక్కోవాలనే వచ్చేను - మరి నా సూటుకేస్ - బట్టలూ అవీ ఎల్లా ఎప్పుడు పోయాయో, నాకు జ్ఞాపకం రావటం లేదు. నిరాధారగా నీకు దొరికేను.''

''ఏమీ ఆలోచించకు నీరూ! కొన్ని రోజులు మా ఇంట్లో వుండు. నిమ్మదిమీద ఏదయినా కంపెనీలో ఉద్యోగం చూసుకుందువుగాని. ఎప్పటికయినా మీవారు నీ మంచితనం గ్రహించక పోరు.''

''ఆయన నా మంచితనం, ప్రేమా గ్రహించాలనే తపన ఆయన మరో పెళ్ళి తలంపు తెచ్చిన రోజునే కర్పూరంలా హరించిపోయింది. పారూ! నా వల్ల తన జీవితం సంసార జీవితం పాడయినట్లు మాట్లాడుతున్నప్పుడు ఎంత తాళి కట్టిన భర్త అయినా ఆడది గౌరవించలేదు. కష్టమయిన నష్టమయిన, ఇద్దరూ ఆ లాభనష్టాలను సమంగా పంచుకోగలిగితేనే పరస్పర గౌరవప్రేమాదరాలు నిలుస్తాయి. కేవలం సంతానం కలగలేదన్న నెపంతోఇంకో స్త్రీకి నా జీవితాన్ని పంచమంటున్నారు కదా! అదే ఆయనకేసంపారము చేయటానికి పనికిరాని అవిటితనము వుంటే తను ఇంకో పురుషుడితో జీవితాన్ని పంచుకుంటారా? మీ స్థానం మీకు వుంటుంది. కేవలం పిల్లలకోసమే ఇంకో భర్త అని నేను అంటే ఈ సమాజంకాని ఈ భర్త కాని గౌరవిస్తారా! అసలు మనలోనే ఎంత వద్దని వదిలించుకుందామన్నా వదుల్చుకోలేని పాత వాసనలు బంకమట్టిలా అతుక్కుపోయేయి. స్వతహాగా ఏ ఆడదయినా తన జీవితంకన్న ముఖ్యంగా ఎంచుకొనేది శీలం. అది మన నరనరాల్లా ప్రాకిపోయింది. అందుకనే ఈనాటికీ మగవాళ్ళు ఏదో వంకన మోజు తీరిన స్త్రీలని వదిలించుకోవాలని చూస్తున్నారు'' అంది నీరజ.

నీరజ-శ్యామదాసు ఇద్దరూ అందమయిన వాళ్ళు.విద్యావంతులు. సంస్కారవంతులు. ధనవంతులు. ఇంత చిన్న కారణంగా విడిపోవటమా! సంతానం భార్యాభర్తలని ఒకే గూటికి అంటిపెట్టుకునేటంతటి బలమయిన బంధమా. నాకుకూడా ఎక్కడో అంతరాంతరాల్లో సన్నని బాధ మొదలయింది. జీవితం పొడుగునా అడుగు అడుగుకూ భయపడిపోయి నిలబెట్టుకోవాల్సినదా వివాహ బంధం! చలిజ్వరం వెన్నెముకగుండా ప్రాకినట్లు వణుకువచ్చింది.

వారం పది రోజులకు నీరజ బాగా లేచి కులాసగా తిరగసాగింది.

"నీరజకు ఏదన్నా ఉద్యోగం కావాలిట'' అన్నాను ఆయనతో. నీరజ సంగతులు కొంచెం కొంచెం ఆయనకు తెలిసాయి.

"ఉద్యోగమా! ఎందుకు!'' అన్నారు.

"దానికి మనశ్శాంతి కావాలి. ఏదో ఒక వ్యాపకం లేకపోతే అది బ్రతకలేని పరిస్థితిలో వుంది'' అన్నాను.

"పూర్తిగా విడిపోయినట్లేనా!'' అన్నారు.

''విడిపోయినా విడిపోక పోయినా అది ఇప్పట్లో అతనితో సంబంధబాంధవ్యం పెట్టుకోదల్చుకోలేదు."

''అయితే ఒక పని చెయ్యవచ్చును. ఆమెకీ పసిపిల్లల సరదా అనుకుంటానుకనూ!''

"సరదా ఏమిటి! ప్రాణం పెట్టుంది. అందుకనే అనాధ శరణాలయాలవంటివి దేనిలోనైన చిన్న ఆయాగా జేరుతానంటోంది. అసలు ఒక పిల్లను పెంచుకుందామనుకుందిట. దాని భర్త అందుకు ఆటంకం చెప్పేసరికి వూరుకుండిపోయిందిట.''

పిల్లల్ని పెంచుకోవటం అంటే మాటలు కాదు. వాళ్ళని అతి గారాబంచేస్తే విద్యాబుద్ధులు అంటవు. తమ మాతృప్రేమని అంతా పసివాళ్ళమీద ఒక్కుమ్మడిగా ఒలకబోస్తే ఆ పసివాళ్ళు ఉక్కిరిబిక్కిరి అయిపోతారు. తర్వాత అదంతా పెద్ద బాధ్యతతో కూడుకున్న పని. బంధువుల్లో దత్తు తీసుకుంటే భర్త వెంపు వాళ్ళయితే భార్యకు శ్రద్ధ వుండదు. భార్య వెంపు వాళ్ళయితే భర్తకు శ్రద్ద వుండదు. ఇంక అనాధలయితే వాళ్ల పెరిగి పెళ్ళిళ్లు అవీ చేయబోయేసరికి అది వక ప్రాబ్లం అవుతుంది. పెంచుకొన్నది మగపిల్లవాడు అయితే వాడు పెద్ద చదువులు చదివి వూహించలేనంత హోదా సంపాదించితే కాని మన కుటుంబాలలో పిల్లలని ఇవ్వటానికి ముందుకురారు. ఆడపిల్లయితే

పిల్లకి పెళ్ళిచేయటమే గగనం అవుతుంది."

"బాగుంది. మీ వివరణ అంతా నాకెందుకు? నేనేమన్నా పెంచుకుందామంటున్నానా ఏం!"

నవ్వారు తను. "పిచ్చిదానా నీకు మటుకు పిల్లలులేని మన ఇల్లు బోసిపోయినట్లు తోచదా! లోటు అందరికీ వకటే! అందుకే నీకూ,నీరజకూ కూడా, బాధ్యతలు లేకుండా పసిపిల్లల సరదా తీరే ఉపాయం ఒకటి చెబుతాను. ఆలోచించండి మన పేటలో చాలామంది మధ్యతరగతి ఉద్యోగస్థులున్నారు. వాళ్లు ఎక్కువ డబ్బుపోసి ఎవరికి వారు పిల్లల్ని చూసుకుందుకు ఆయాలని పెట్టుకునే స్తోమతు లేనివాళ్లు. పిల్లలని చూసుకొనే వాళ్లంటే ఆ తల్లులుకూడా ఏవో చిన్నచిన్న పనులు చూసుకొని కుటుంబాదాయం పెంచుకునేదానికి కృషి చేసుకొంటారు. మీకు పిల్లల సరదా తీరుతుంది. ఆ తల్లులకీ కాస్త వెసులుబాటు చిక్కుతుంది. అందుచేత మన తోటలో మీరిద్దరూ కలిసి చిల్డ్రన్ కేర్ హోం ఒకటి ఏర్పాటు చేయండి. ఉదయం తొమ్మిది నించి సాయంకాలం ఆరుగంటలదాకా, మీరు పిల్లల్ని ఆడించుతూ కథలు కబుర్లు చెబుతూ పాలూ పళ్లూ తినిపించుతూ సరదాగా గడుపుకోవచ్చును. పిల్లలు పాడుచేస్తే శుభ్రపరచటానికి ఒకరిద్దరు పనివాళ్ళని మనమే పెట్టవచ్చును. మీ సరదా తీరుతుంది. అది ఒకళ్ళకి ఉపకారమూ అవుతుంది" అన్నారు. నీరజ ఎంతో సంబరపడింది. నిజంగా మా పారూ అదృష్టవంతురాలు. అన్నగారూ! దానిలోని తల్లి మనస్సుని గ్రహించకల్గారు. మీకు మేము ఋణపడి వుంటాం!" అంది.

"నిజమేనండీ!" అన్నాను నేను.

"దానికి మీరు నాకు కాదు. శ్యామదాసు గారికి కృతజ్ఞతలు చెప్పుకోవాలి. శ్యామదాసు గారు ఒక పిల్లని పెంచుకుందుకు ముందుకు వస్తే మీరు కేవలం ఆ పిల్లయొక్క భవిష్యత్తుకే మీ జీవితం ధారపోసేవారు. మీరు ఇల్లా కనబడకపోతే, ఈ విధమయిన ఆవేదన మా పారుకి కూడా వుండవచ్చునన్న ఆలోచన నాకూ తోచేది కాదు. ఒక మంచిపనికి ఆలోచన వచ్చింది కనుక శ్యామదాసుగారికి తల్లులందరూ ఋణపడి వుంటారు. ఇంకో విశేషం చూసారా! ఒక పిల్లని పెంచుకుంటే కొన్నాళ్ళకు అది పెద్దదయిపోతుంది. ఇల్లాంటి సంస్థని నడిపేమంటె మనం ఓపిక వున్నన్ని రోజులూ, పువ్వుల్లాంటి పసిపిల్లలతోనే కాలం గడపవచ్చును. నిత్యం ఆ పసివాళ్ళ, పసిడి పలుకులతో మనం సంతాన హీనుల మన్న ఆలోచనే రాకుండా కాలం గడపవచ్చును."

"ధన్యోస్మి స్వామీ. ధన్యోస్మి!" అన్నాను నాటకీయంగా. నీరజ నేనూ, చెరిసగం డబ్బు వేసి తోటలో గదులు కట్టించాము. మాలీ, శేషమ్మ, సూరమ్మ, అప్పుడప్పుడు పైడమ్మ కూడా మాకు సాయంవస్తూ వుంటారు. పది మంది పిల్లలతో మొదలయిన మా సంస్థలో ఇప్పుడు యాభయ్ అరవయ్ మంది పిల్లల దాకా పెరిగిపోయేరు. మా స్నేహితురాలు దూరపు చుట్టం అయిన ఒక లేడీ డాక్టరును అప్పుడప్పుడు వచ్చి పిల్లల్ని చూసిపొమ్మని చెప్పేము.


ఆయన అప్పుడప్పుడు అంటూ వుంటారు. నిజంగా నీరజ చాలా హాయిగా వుంటోంది. "చూసావా! నీరజ ఎంత సంతోషంగా వుంటోందో! తన తల్లి ప్రేమను ఎంతమంది పిల్లలకు పంచుతోందో!" అని.

"అవునవును. ఆడది భర్తప్రేమను పంచలేదు కాని తల్లి ప్రేమను ఎంతమంది పిల్లలకయినా పంచకలదు. ఇల్లాంటి ఆడదానికి ప్రేమ స్వరూపిణి. సహనశీల అని బిరుదులు తగిలిస్తారు కదా!" అన్నాను.

"భర్త ప్రేమను పంచితే సతీసుమతి, శర్మిష్ఠా సతి అవుతారుకదుటోయ్!" అంటారు తను నన్ను వూరించుతూ.

"ఆ బిరుదులు ఈ తరం ఆడవాళ్లు కోరుకోవటం లేదని మా నీరజ నిరూపించింది కద" అన్నాను అతిసున్నితమయిన సమస్యకు అతి ప్రయోజనకారి అయిన పరిష్కారము చూపెట్టినవార్ని తలుచుకుని గర్వించకుండా వుండలేను. మరి! స్త్రీలో భార్యనే కాకుండా తల్లినికూడా చూడకలిగే పురుషుణ్ని స్త్రీ ఆరాధించకుండా వుండగలదా? □

కొత్త సీరియల్ ప్రారంభం



మల్లాది వెంకటకృష్ణమూర్తి

1

నిరాశని మించిన తృప్తే లేదు.

2

ఆ విషయంలోకూడా చిత్తుగా ఓడిపోయాడు! ఘోరంగా మోసపోయాడు!!

చిన్నతనం నుంచీ అనేక విషయాలలో ఎదురుదెబ్బలు తిని, తనకంటూ కావాలని కోరుకునే ఏ ఒక్కటీ మిగలకుండా, తన జీవితం ఓ అంతులేని సంఘర్షణగా మారినా ఓర్చుకున్న అతనికి ఆ విషయంలోకూడా పరాజయం ఎదురయింది.

ఎండమావి లాంటి సుఖంకోసం వెదుకుతున్న బాటసారిలా కాలం వెళ్ళబుచ్చుతున్న అతనికి తనమీద తనకే, జాలి అసహ్యం వేసాయి.

తన భార్య తనని మోసం చేసింది!

ఎందుకు? ఎందుకు?? ఎందుకిలా చేసింది???

భార్యచేత వంచింపబడ్డ వ్యక్తి ఏమవుతాడు?

ఏమయినా అవచ్చు.

భార్యనుంచి విడిపోయి దూరంగా బ్రతకవచ్చు. తిరిగి వివాహం చేసుకోవచ్చుకూడా.

కోపం పట్టలేక భార్యని హత్య చేయచ్చు.

లేదా తనని తానే (ఆత్మ) హత్య చేసుకోవచ్చు.

మానసికంగా బలహీనుడయితే పిచ్చి వాడుగా మారచ్చు.

భార్యమీద ప్రేమ చావక, విడిచి వుండలేకపోతే తాగుబోతుగా మారచ్చు.

భార్యని మానసికంగా, శారీరకంగా హింసిస్తూ పైశాచిక తృప్తిని పొందచ్చు.

అయినా కసి తీరకపోతే తిరుగుబోతుగా మారి తన శీలాన్నికూడా కోల్పోవచ్చు.

లేదా భార్యని క్షమిస్తూ, ఏమీ జరగనట్లే ఆమెతో కాపురం కొనసాగించచ్చు.

ఇంకో స్త్రీని వివాహంచేసుకుని చెడిపోయిన భార్యతో కలసి రెండు కాపురాలు సాగించచ్చు.

ఒకసారి తన భార్య పాపంచేసిందనీ, కాలుజారిందనీ తెలిసిన భర్త ఏమయినా చేయచ్చు.

ఏమయినా అవచ్చు.

సాధారణంగా అలాంటి దురదృష్టవంతులయిన భర్తలకి మిగిలే అవకాశాలివే. ఇంతకుమించి ఏంచేయగలరు?

ఏం అవగలరు?

సత్యమూర్తి మాత్రం పరిష్కారంగా తనకు తోచిన మరో మార్గం ఎన్నుకున్నాడు.

చాలా విచిత్రమయిన, అసాధారణమయిన మార్గం అది. అది అతనికి తృప్తినిస్తుందా?

3

సత్యమూర్తి ఓసారి గోడకున్న తలుపులేని అలమారలో, మధ్య అరలో వున్న నల్లటి హేండ్‌బాగ్ వంక చూసాడు.

తన భార్య హేండ్‌బాగ్ అది.

"వడ్డించనా?"

వంటగదిలోంచి అడిగింది ప్రియంవద భర్తని.

అప్పుడే స్నానంచేసి, నడుంచుట్టూ పౌడి టవల్ కట్టుకుని వచ్చిన సత్యమూర్తి బట్టల పెట్టెవైపు నడుస్తూ చెప్పాడు గట్టిగా.

"వడ్డించు."

బట్టలపెట్టె తెరచి లోపలనుంచి పైజామా, లాల్చీలని బయటకితీసాడు. పెట్టె మూసెయ్యగానే కలరావుండల వాసన తగ్గిపోయింది.

ఆ ఇస్త్రీ లాల్చీ, పైజామాలు తొడుక్కున్నాడు. వంటగదిలో భార్య పీట వేయడం, కంచం పెట్టడం, గిన్నెలు సర్దటం వినిపిస్తోంది.

. భార్య హేండ్‌బేగ్ ప్రక్కన అలమారలోవున్న అద్దం ముందుకు నడిచాడు. కొన్నిక్షణాలు అద్దంలో తన మొహాన్ని పరిశీలనగా చూసుకున్నాడు. చకచకా తల దువ్వుకున్నాడు. తర్వాత తటపటాయిస్తూ భార్య హేండ్‌బాగ్ చేతిలోకి తీసుకుని దానివంక ఆలోచనగా చూస్తూండిపోయాడు.

"రండి"

లోపలనుంచి మళ్ళీ భార్య పిలుపు వినబడటంతో హేండ్‌బేగ్‌ని యధాస్థానంలో వుంచి వంట గదిలోకి వెళ్ళాడు.

పీటమీద కూర్చున్నాడు.

"తినండి. ఏమిటలా చూస్తున్నారు?" నవ్వుతూ అడిగింది ప్రియంవద తన

మొహంలోకి పరిశీలనగా చూస్తున్న సత్య మూర్తితో.

ప్రియంవద వూర్వసికాదు. ప్రియంవద తిలోత్తమ కాదు. ప్రియంవద అంతకన్నా రంభకాదు. ప్రియంవద ప్రియంవదే.

కాని ప్రియంవద ఆ అప్సరసలలాగా అందమయింది.

ప్రియంవద సౌందర్యవతి.

"ఇవాళ మీ కిష్టమని బంగాళాదుంపల వేపుడు, ఆవమజ్జిగ చేసాను."

"థాంక్స్."

"ఛీ-మన మధ్య థాంక్సేమిటి? కలుపు కోండి."

సత్యమూర్తి వంచిన తల ఎత్తకుండా బంగాళాదుంపల వేపుడు కూరని నెయ్యి వేసిన అన్నంలో కలుపుకుని తినసాగాడు.

తింటూ తన ఎదురుగా కూర్చున్న ప్రియంవదని గురించే ఆలోచిస్తున్నాడు.

భర్తవంక ఆదరంగా చూస్తూ అడిగింది ప్రియంవద.

"ఇవాళ మీ పుట్టిన రోజని తెలుసా?"

"నిన్నటిదాకా గుర్తుంది."

ప్రియంవద భర్త గడ్డాన్ని కుడిచేత్తో పట్టుకుని తలని పైకిలేపి చెప్పింది.

"సాయింత్రం త్వరగా వచ్చేస్తే ఎటయినా సరదాగా వెళదాం."

"అలాగే."

భార్య కళ్ళలోకి ఏదో వెదుకుతున్నట్లుగా చూసాడు మళ్ళీ సత్యమూర్తి.

"ఏమిటి మళ్ళీ అలా చూస్తున్నారు? నే చెప్పింది వినపడిందా?" అడిగింది ప్రియంవద.

"వస్తాను."

కొన్నిక్షణాల తర్వాత చెప్పింది ప్రియంవద.

"నేను బజారుకెళ్ళి ఏమయినా తెస్తాను. రాత్రి పడుకోబోయేముందు స్వీట్ తినచ్చు మనం."

సత్యమూర్తి తలయెత్తి మళ్ళీ భార్య కళ్ళలోకి చూడాలన్న కోరికని అతి ప్రయత్నంమీద చంపుకుని చెప్పాడు.

"నీ ఇష్టం."

"ఏమిటివాళ?" ప్రియంవద భర్త తలని మళ్ళీ పైకెత్తి అడిగింది.

నిశ్శబ్దంగా చూస్తూండిపోయాడు సత్య మూర్తి.

"ఏమిటి? నా కళ్ళనా చూస్తున్నారు!" అడిగింది.

"కాదు. కన్నీరు పుట్టే చోటుని."

"అంటే?"

"నాకలా అంటేనే బావుంటుంది. నీ కళ్ళనే చూస్తున్నాను."

బాబు ఏడుపు వినిపించింది.


"లేచినట్లున్నాడు."

గబగబా లేచి వంట గదిలోంచి పడక గదిలోకి వెళ్ళింది ప్రియంవద.

ఇరవై మూడేళ్ళు ప్రియంవదకి. అయినా చూట్టానికి పద్దెనిమిదేళ్ళదానిలా కనిపిస్తుంది. తెల్లటి దేహచ్ఛాయ. కోల మొహం. గుండ్రటి చిన్న నోరు. నల్లగా కొద్దిగా తడితో మెరిసే కళ్లు. పల్చటి బుగ్గలు. నవ్వినప్పుడు అందంగా పడే చిన్న సొట్టలు.

మెళ్ళో నల్లపూసలు, మంగళసూత్రం కాళ్ళకి మట్టెలు లేకపోతే ప్రియంవదకి పెళ్ళయిందని ఎవరూ అనుకోరు. అంత నాజూకుగా వుంటుంది.

(వి)చిత్ర విజ్ఞానం



నాలుగువేల రూపాయలకే
యింత చక్కటి కారంటే
ఆశ్చర్యంగా లేదూ? ఇది లండన్
లోని రూట్స్ కంపెనీవారి పేరుమోసిన
"సింగర్ గాజల్" మోడల్ కారు!
ఇంతటి చౌక ధర 1958 వ సంవత్సరం
నాటిది మరి! అప్పటికి మన దేశంలో
అదే ధరకు మామూలు సెకండ్ హాండు
కార్లు కూడా దొరికేవి కావు!!

బాబుని ఎత్తుకుని వంటగదిలోకి వచ్చింది.

"ఏం తెస్తావ్?" అడిగాడు సత్యమూర్తి.

"ఏదో ఒకటి. మీకెందుకు ఆ వివరం?" సౌమ్యంగా చెప్పలేదు ప్రియంవద.

సత్యమూర్తికి అలవాటే. ఎప్పుడయినా ఇలాంటి ప్రశ్నలు వేస్తే సమాధానం చెప్పదు. ఎదురు ప్రశ్నలువేస్తుంది కోపంగా.

ఒకోసారి మళ్ళీ రెట్టించి అడగడు. కొన్ని క్షణాలు మనసులోనే మధనపడతాడు. ఒకోసారి కోపంగా అడుగుతాడు.

"అంత చెప్పకూడనంత రహస్యమా అది? ఎందుకలా ప్రతి చిన్న విషయం దాస్తావు?"

"కోపం వచ్చిందా?"

నవ్వుతూ అడుగుతుంది భర్త జుట్టులోనికి వేళ్ళని పోనించి నిమురుతూ. కాని సమాధానం చెప్పదు.

"మీకు తెలుసుగా నాకు అలాంటి ప్రశ్నలు వినడం చిరాకని" అంటుంది.

"పళ్ళ కొట్టుకా?" అడిగాడు.

"రాత్రిదాకా ఆగి చూడండి."

సమాధానం చెప్పలేదు ప్రియంవద.

భర్త కోపంగా అన్నం తినడం గమనించింది. భర్త తలని చేత్తో నిమురుతూ అన్నది లాలనగా.

"కోపం వచ్చిందా చెప్పలేదని?"

సత్యమూర్తి జవాబు చెప్పలేదు.

"ఈ రోజయినా కంచంలో కడుక్కోండి."

"వద్దు. నాకు బావుండదలా."

సత్యమూర్తి లేచి స్నానాల గదిలోకి వెళ్లాడు చేతిని కడుక్కోటానికి. బయటకి రాగానే ప్రియంవద తన చీరచెంగుని అందించింది. చేతిని తుడుచుకుంటూ భార్య నుదుటి వంక చూసాడు సత్యమూర్తి.

తెల్లటి నుదుటి మీద ఎర్రటి బొట్టు గుండ్రంగా దిద్ది వుంది. నల్లటి కాటుక కంటి కొసలనుంచి సన్నగా దిద్దివుంది అందంగా.

ప్రియంవద పీట మీద కూర్చుని



జేబులో వేసుకున్నాడు.

జిప్ మళ్ళీ మూసేసి హేండ్‌బేగ్‌ని యథాస్థానంలో వుంచాడు.

దువ్వెన అందుకుని మరోసారి క్రాపు దువ్వుకుంటూంటే ప్రియంవద వచ్చింది బాబుతో.

"డూప్లికేట్ తీసుకెళ్ళనా? ఆలస్యం అవుతుందా నువ్వు తిరిగి వచ్చేందుకు?" అద్దంలో కనబడుతున్న భార్య ప్రతిబింబాన్ని చూసి అడిగాడు సత్యమూర్తి.

"అక్కరలేదు. ఎంతా! ఓ గంటలో వచ్చేస్తాను."

"నువ్వూ వస్తున్నావా?" అడిగాడు.

బాబుకి పాలు పట్టసాగింది.

సత్యమూర్తి ముందు గదిలోకి వచ్చాడు. కొన్ని క్షణాలు ఆలోచనగా ఎదురుగా వున్న నీలరంగు గోడవంక చూస్తూండి పోయాడు.

చటుక్కున అలమార దగ్గరకి వెళ్ళి భార్య హేండ్ బాగ్ అందుకున్నాడు. జిప్ లాగి లోపల వస్తువులని చేత్తో తడిమి చూసాడు.

స్పర్శతో తనకి కావలసిన రెండు వస్తువులని గుర్తించి వాటిని బయటకి తీసాడు.

ఒకటి కాటుక పెట్టుకునే స్టెయిన్‌లెస్ స్టీల్ భరిణ. రెండోది ఎర్ర రంగు బొట్టు పెన్సిల్. సత్యమూర్తి మనస్సు బాధతో కలుక్కుమంది. ఆ రెండింటినీ తన

"అవును. ఒక్క క్షణం."

ప్రియంవద అద్దం ముందుకు వచ్చి తన రూపాన్ని చూసుకుంది. చేతి వేళ్ళతో జుట్టుని సర్దుకుంది అక్కడక్కడ.

హేండ్‌బేగ్‌ని అందుకుని, దానికున్న పక్క అరలోంచి చేతిరుమాలుని తీసి బుగ్గలని అద్దుకుంది దాంతో. పమిటని సవరించుకుంది.

"నాకు టైం అవుతోంది" విసుగ్గా అన్నాడు సత్యమూర్తి.

"పదండి"

చెప్పులు తొడుక్కుని బయటకివచ్చారు ఇద్దరూ. వీధి తలుపులు దగ్గరకి లాగి, గొళ్ళెంపెట్టి తాళం వేసింది ప్రియంవద.

వీధి మెట్లు దిగి నడవసాగారు ఇద్దరూ. సందు చివర ఇద్దరూ విడి

పోయారు. సత్యమూర్తి పబ్లిక్ లైబ్రరీ వైపు నడవసాగాడు గబగబా.

లైబ్రరీ చేరుకుని క్రితం రాత్రి తిరిగి ఇవ్వబడ్డ పుస్తకాలు ఒక్కొక్కటీ రేక్ లలో వాటి వాటి ప్రదేశాలలో వుంచ సాగాడు రొటీన్‌గా.

మనసులో ఎలాంటి ఆలోచనల్లూ లేకుండా వుండగలిగే సమయం సత్యమూర్తికి ఆ కాస్సేపే. పుస్తకాలని వాటి వాటి చోట్లలో వుంచే పని సత్యమూర్తి అందుకే తనే చేస్తాడు. అరగంట తర్వాత తనే టేబిల్ దగ్గరకి వచ్చి కూర్చున్నాడు.

డ్రాయర్ తాళం తీసి లోపలనుంచి డేట్ స్టాంపు తీసి తేదీని మార్చాడు. స్టాంప్ పేడ్, తుమ్మజిగురు సీసా, రసీదు బుక్ మొదలయినవి తీసాడు బయటకి.

డ్రాయర్‌లో రెండు రోజుల క్రితం తనుంచిన ఆ కవరు కంటపడగానే వులిక్కిపడ్డాడు సత్యమూర్తి.

దానివంక చూసాడు. మనసంతా బాధ కమ్మేసింది ఒక్కసారిగా.

దాన్నందుకుని తెరచి లోపలనుంచి కాగితాన్ని బయటకి తీసి మళ్ళీ చదివాడు ఆ వుత్తరాన్ని.

ఇంగ్లీష్‌లో టైప్ చేసివుంది ఆ వుత్తరం. క్రింద సంతకం లేదు. తారీకు లేదు. ఊరు పేరు లేదు. తనకు వ్రాయ బడినట్లుగా కూడా లేదది. తన భార్య ప్రియంవద పేరు లేకపోతే అది తనకి వ్రాయబడలేదనే అనుకుని వుండేవాడు.

—నేను మీ లైబ్రరీకి తరచు వచ్చే మెంబర్‌ని. మీకు జరుగుతున్న ఓ తీవ్ర మయిన నష్టం గురించి నాకు స్పష్టంగా తెలుసు కాబట్టి చెప్పకుండా వుండలేక పోతున్నాను. స్వయంగా కలుసుకుని చెప్పే విషయం కాదు కాబట్టి ఈ ఆకాశ రామన్న వుత్తరం వ్రాయాల్సి వస్తోంది.

మీ భార్య ప్రియంవద మిమ్మల్ని మోసం చేస్తోంది. అతని పేరు సుగుణ రావు. ఎలక్ట్రికల్ ఇంజనీర్. మారేడ్ పల్లిలో వుంటాడు.

ఈ విషయం మీకు తెలియచేయాలా, వద్దా అని చాలా కాలంగా మీమాంసలో పడ్డాను. చివరికి ఎలాగయినా మీకు తెలిసేదే. కాబట్టి ముందరే తెలియజేయటం మంచిదని వ్రాస్తున్నాను. మీరు లైబ్రరీలో వున్న కాలంలో మీ భార్య ఇంట్లో వుండటం లేదు—

సత్యమూర్తి మనసు బాధతో విల విల్లాడింది అది మళ్ళీ చదవగానే.

*　　*　　*

రెండు రోజుల క్రితం మధ్యాహ్నం రెండున్నరకి తన కెవరో ఫోన్ చేసారు. తన పేరు సత్యమూర్తేనా అని అడిగారు. అవునని నిర్ధారణ చేసుకున్నాక చెప్పారు ఇంగ్లీష్‌లో క్లుప్తంగా.

"ఇంగ్లీష్ లిటరేచర్ వున్న రేక్‌లో 7113 నంబర్‌గల పుస్తకంలో మీకు వుత్తరం వుంది. వెంటనే తీసుకోండి."

అవతలివాళ్ళు ఫోన్ పెట్టేసిన రెండు నిమిషాలకిగాని సత్యమూర్తి బుర్రలోకి ఇంకలేదు ఆ ఫోన్‌కాల్ తాలూకు తాత్పర్యం.

అర్థం అయ్యాక ఆ రేక్ దగ్గరకి నడిచాడు ఆ వింత ఫోన్‌కాల్‌కి కొద్దిగా అబ్బురపడుతూ.

ఆ పుస్తకం పేరు 'ది పెయింటెడ్ వెయిల్'. సోమర్‌సెట్‌మామ్ వ్రాసిన

నవల అది. భర్తకి ద్రోహం చేసిన ఓ భార్యకి సంబంధించిన నవల అది. సత్యమూర్తి ఆ నవల చదివాడు ఇదివరలో.

పుస్తకం రేక్‌లోంచి అందుకుని తెరచి చూసాడు. లోపల ఓ కవరు వుంది. అతికించబడ్డ ఆ కవరు మీద తన పేరు టైప్ చేయబడి వుంది.

చింపి చదివాడు అక్కడి కక్కడే.

పూర్తిగా చదివాక కళ్లు చీకట్లు కమ్మినట్లూ, ఛెరణాకోలతో ఎవరో బాదినట్లూ, బ్లేడ్‌తో బుగ్గమీద కోసినట్లుగా ఫీల్ అయ్యాడు.

రెండు నిముషాలసేపు ఆ రేక్‌ని ఆనుకుని నిలబడ్డాడు అలాగే. మనసు మొద్దుబారిపోయింది. ఏ ఆలోచనా రాలేదు మనసులోకి.

రెండు నిముషాల తర్వాత గుండె స్పందించే వేగం తగ్గి క్రమంగా నార్మల్‌కి వచ్చింది. మొహం నిండా, అరచేతులనిండా పట్టిన చెమటని తుడుచుకుని నిర్మానుష్యంగా వున్న రేక్‌ల మధ్యనించి తన సీటు దగ్గరకి వచ్చి కూర్చున్నాడు.

మళ్ళీ ఇంకోసారి చదివాడు ఆ వుత్తరాన్ని. మళ్ళీ చదివాడు. మళ్ళీ మళ్ళీ చదివాడు. ఆ వుత్తరం సారాంశం శరీరంలో నరనరానికీ పాకుతున్నకొద్దీ, ఆ నరాలన్నీ ఒకదానికొకటి గట్టిగా పెనవేసుకుని తన వంటిని నలిపేస్తున్నట్లుగా భావన కలిగింది.

సత్యమూర్తి కళ్ళ ముందు ప్రియంవద రూపం మెదిలింది.

అడల్టరీ!

వ్యభిచారం!!

ప్రియంవద, తన ప్రియంవద, పరపురుషుడి కోసం వెళుతోందా?!!

నమ్మలేకపోతున్నాడు.

నమ్మకుండా వుండలేకపోతున్నాడు.

నమ్ముతున్నాడు. మరుక్షణం నమ్మడం లేదు.

కాని

ఏమో!

(ఇలాంటి విషయాలు తెలుసుకునే ఆఖరు వ్యక్తి ఎప్పుడూ భర్తే.)

నిజమేనేమో!

కాని ప్రియంవద? తనకు తెలుసుగా ప్రియంవద. దాదాపు రెండు సంవత్సరాలనుంచి తనకు తెలుసు. తామిద్దరూ కలసి జీవిస్తున్నారు. ఒకరి స్వభావాలు, ఒకరి మనస్తత్వాలు మరొకరికి తెలుసు. ఎలా నమ్మడం?

ప్రియంవద మనసులో ఏం వుందో తనెప్పుడయినా అందులోకి దూరి చూడగలిగాడా?

అబద్ధం ఎందుకు పుట్టిస్తారు?

అసలు ఎవరతను?

గొంతు సరిగా వినలేదు. తనకి పరిచయస్థుడా? బంధువా? స్నేహితుడా? కొత్తవాడా? శత్రువా? తనని ఏడిపించడానికి, మనసు కలవరపెట్టడానికి ఇది సృష్టించారా?

అదే నిజమయితే తను అదృష్టవంతుడు. కానిపక్షంలో

కానిపక్షంలో నిజం తెలుసుకోవాలి తను. ప్రియంవద ఆ సుగుణరావుతో తిరుగుతోందన్న సంగతి రూఢి చేసుకోవాలి తను.

ఎలా?

అడగగలడా?

ఎవరిని?

సుగుణరావునా? ప్రియంవదనా?

ఏమని?

ఏమని అడగగలడు?

ఇంకోసారి చదివాడా వుత్తరాన్ని సత్యమూర్తి. మనసు త్రాసులో ఒకసారి ఇటువైపు, ఒకసారి అటువైపు మొగ్గ తోంది.

బయటకివెళ్ళి టీ తాగివచ్చి మళ్ళీ కూర్చున్నాడు సీట్‌లో.

తనకి అందింపబడ్డ ఆ సమాచారం తాలూకు, భావప్రకంపనలు క్రమ క్రమంగా తగ్గి సర్దుకున్నాయి గంట తర్వాత.

మామూలు మనిషయి ఆవేశానికి లోనుకాకుండా ఆలోచించసాగాడు.

ఇది నిజం అయిన పక్షంలో ఎలా తను తెలుసుకోవడం?

వెంటనే ఇంటికివెళ్తే?

మూడున్నరకి పర్మిషన్ తీసుకుని ఇంటికి చేరుకున్నాడు సత్యమూర్తి లోకల్ లైబ్రరీ అథారటీనుంచి.

దూరంనుంచే గుండె గుబగుబలాడ సాగింది.

ఇల్లు తాళం పెట్టివుంటుందా? తీసి వుంటుందా?

తృప్తిగా నిట్టూర్చాడు ఇంటి తలుపులు తీసివుండటం చూసాక. అబద్ధం అయి వుంటుంది అది.

ప్రియంవద ఆశ్చర్యంగా చూసింది భర్తవంక.

"అప్పుడే వచ్చేసారే?" అడిగింది.

ఏంచెప్పాలో తెలియలేదు సత్యమూర్తికి.

"పాలకోసం బయటకివెళ్ళి ఇప్పుడే వచ్చాను. కాఫీ కలుతానుండండి" అన్నది ప్రియంవద.

సత్యమూర్తి, ప్రియంవద బయటకి వెళ్ళొచ్చిన బట్టలు విడిచి, ఇంట్లో వుండే టప్పుడు కట్టుకునే నూలుచీర కట్టుకుని స్టవ్ ముట్టించేదాకా ఆలోచిస్తూండి పోయాడు.

కాఫీతాగి మళ్ళీ లైబ్రరీకి వెళ్ళి పోయాడు కొన్ని కాగితాలు తీసుకుని.

లైబ్రరీకి వచ్చినా మనసంతా చిరాకుగా వుంది. పనిమీద ఆట్టే వుత్సాహం చూపించలేకపోయాడు. తనలో చెలరేగే భావాల్ని అతిప్రయత్నంమీద ప్రియంవద పసికట్టకుండా జాగ్రత్తపడుతూ వస్తు న్నాడు.

తనలోని మార్పుని గుర్తించినా, ప్రియంవద గుర్తించనట్లే ప్రవర్తించ గల నేర్పరి.

* * *

పదకొండున్నరదాకా లైబ్రరీలోనే కూర్చుని మరోసారి చదివాడు సోమర్‌ సెట్‌మామ్ నవల 'ది పెయింటెడ్ వెయిల్'. పుస్తకంలో చివర సత్యమూర్తి సంతకంవుంది.

ఆ లైబ్రరీలోని చాలా పుస్తకాలు చదివాడు తీరిక సమయాల్లో. తను ఒక సారి చదివిన పుస్తకం చివర తన సంతకం పెడతాడు సత్యమూర్తి అది చదివిన గుర్తుగా.

పుస్తకం పూర్తిచేసి లేచాడు. లైబ్రేరి యన్ గదికివెళ్ళి అరగంట పర్మిషన్ అడిగాడు.

తర్వాత బయటకివచ్చి, ఓ కప్పు టీ తాగి ఇంటివైపు నడవసాగాడు నెమ్మదిగా. ప్రియంవద ఇంట్లో వుండాలి. ఈపాటికి తిరిగివచ్చేయాలి బజారునుంచి.

మనసంతా గజిబిజిగావుంది సత్యమూర్తికి.

ఉదయం ఇద్దరూ కలిసేవెళ్లారు. గంటలో తిరిగి వచ్చేస్తానన్నది. రెండు గంటలు దాటింది. ఈపాటికి వచ్చేయాలి. ఇంట్లో వుండాలి నిజంగా బజారుకి స్వీట్స్‌కొనితీసుకురావడానికే వెళ్లివుంటే.

ఇంటి సందు మలుపుతిరిగాడు.

వేపచెట్టువున్న ఇల్లుదాటి తన ఇంటి ముందుకు వెళ్లాడు.

తాళంకప్ప వేలాడుతోంది!

సత్యమూర్తి కాసేపు దానివంక చూస్తూండిపోయాడు. మొహంమీద కత్తివాటుకు నెత్తురుచుక్క లేనంతగా పాలిపోయి తెల్లబడిపోయింది.

వెనక్కి తిరిగాడు.

పదడుగులువేసి ఆగిపోయాడు మళ్ళీ. లైబ్రరీకి వెళ్ళ బుద్ధికాలేదు.

మళ్ళీ వెనక్కి తిరిగివచ్చి ఇంటి గుమ్మంమీద చతికిలబడి కళ్లు మూసుకున్నాడు. ఆలోచనలని మనసులోంచి నెట్టాలని ఎంత ప్రయత్నించినా చేత కావటంలేదు. వివిధ రకాల ఆలోచనలు మనసునిండా మేఘాల్లా కమ్ముకొస్తున్నాయి.

ఎవరతను?

అతనికెలా తెలిసింది? తనకెందుకు తెలియచేసాడు? అతనుకూడా ప్రియంవద కోసం ప్రయత్నంచేసి విఫలమయితే

మనసో కోతి. ఎన్నడూ రాని ఆలోచనలు వస్తున్నాయి తనకి.

ఇంక అక్కడ కూర్చో బుద్ధికాలేదు. లేచి సందు చివరవున్న కిళ్ళీకొట్టువైపు అడుగులువేసాడు. దినపత్రిక కొని మళ్ళీ చదవసాగాడు దాన్ని.

పావుగంట తర్వాత అనిపించింది సత్యమూర్తికి, ఇంకాసేపు తనలా నిల్చునివుంటే కిళ్ళీకొట్టువాడికి తను అలా వేచివుండటం అనుమానం కలిగిస్తుందని, వింతగా వుంటుందని.

ఇంటికివచ్చి మళ్ళీ బయటకి వెళ్ళిందా? గంటలో తిరిగివచ్చేస్తానని ఎందుకు అబద్ధం ఆడి

తన ఇంటిముందు ఓ రిక్షా ఆగడం గమనించి సత్యమూర్తి గబగబా ఇంటివైపు అడుగులువేసాడు. రిక్షాలోంచి చంకలో బాబుని ఎత్తుకుని దిగుతున్న ప్రియంవద భర్తవంక చూసి నవ్వింది.

''వీడిని ఎత్తుకోండి ఒకసారి. నిద్రపోయాడు దారిలో.''


యాంత్రికంగా అందుకున్నాడు సత్యమూర్తి. హేండ్‌బాగ్‌తెరచి రిక్షావాడికి చిల్లరడబ్బు ఇచ్చి ఇంటి తాళంతీసి లోపలకి వెళ్ళింది ప్రియంవద. వెనకే సత్యమూర్తి నిశ్శబ్దంగా లోపలకి వెళ్లాడు.

ప్రియంవద బట్టలు మార్చుకోడానికి పడకగదిలోకి వెళ్ళింది.

కుర్చీలో కూర్చున్నాడు సత్యమూర్తి. మనసులో అగ్నిపర్వతాలు ప్రేలుతున్నా బయటకి చాలా మామూలుగా కనబడేందుకు ప్రయత్నిస్తున్నాడు. ఎదురుదెబ్బలు జీవితంలో అలవాటే.

రిక్షాదిగి బాబుని అందించేటప్పుడు

(వి)చిత్ర విజ్ఞానం



అవతలిది ఏనుగూ—ఇవతలిది గాడిదా!!
అమెరికాలో రెండే రెండు పార్టీలు!!
రిపబ్లికన్ పార్టీ గుర్తు ఏనుగు.
డెమాక్రటిక్ పార్టీ గుర్తు గాడిద.
గాడిద ఏనుగు నోడించటంతో కార్టర్
అమెరికాకు అధ్యక్షుడయ్యాడు!!

ప్రియంవద మొహంవంక చూసాడు సత్యమూర్తి.

మొహాన ఎర్రటి బొట్టులేదు!

కళ్ళకి కాటుకలేదు!!

మొహంనిండా అప్పుడే రాసుకున్నంత తెల్లగా పౌడర్ కనబడింది!!!

కేవలం బజారుకెళ్ళి సరకులు తీసుకు వచ్చినట్లయితే బొట్టు చెరిగిపోవాల్సిన అవసరంలేదు. కళ్ళకి కాటిక పోవాల్సిన అవసరంలేదు.

హేండ్‌బేగ్‌లో ఆ రెండూ వుండి వుంటే బహూశ మళ్ళీ వాటిని దిద్దుకుని వుండేది. బయటకి వెళ్ళేమనిషి హేండ్ బేగ్‌లో వాటిని వుంచుకుని తీసుకెళ్లాల్సిన అవసరం ఎందుకు?

తనావిషయం ఎన్నడూ ఆలోచించలేదు—అవసరంరాలేదు కాబట్టి.

ప్రియంవద బట్టలు మార్చుకుని వచ్చింది పడకగదిలోంచి.

నిద్రపోతున్న బాబుని తీసికెళ్ళింది పడకగదిలోకి. బాబుని పడుకోబెట్టి వచ్చింది కొన్ని క్షణాలలో.

భర్త ప్రక్కన కుర్చీ కోడుమీద కూర్చుని, భర్త భుజాలచుట్టూ చేతులు వేసి, బుగ్గమీద ముద్దు పెట్టుకుంది నవ్వుతూ.

"రాజాగారు ఎందుకొచ్చారో ఇప్పుడు?" అడిగింది మళ్ళీ ముద్దు పెట్టుకుని.

సత్యమూర్తి తనలోని బాధని, నిస్సహాయతని అణచుకోడానికి విపరీతంగా ప్రయత్నంచేస్తున్నాడు. మాట్లాడలేకపోతున్నాడు.

"శెలవుపెట్టారా?" అడిగింది.

"లేదు."

"ఏదయినా మర్చిపోయారా?"

"లేదు"

"కాఫీ తెస్తానుండండి"

ప్రియంవద కాఫీ కలిపి తీసుకు వచ్చింది అయిదు నిముషాలలో. కాఫీతాగి మళ్ళీ లైబ్రరీకి బయలుదేరాడు సత్యమూర్తి, దహించుకు పోతున్నమనసుతో.

4

ఆ రోజు సాయంత్రం సత్యమూర్తి ఇంటికి మామూలుగానే వచ్చాడు చీకటి పడ్డాక.

ప్రియంవద సత్యమూర్తి చొక్కా తనే విప్పుతూ చెప్పింది.

"వేణ్ణీళ్లు పెట్టాను. తలంటిపోస్తాను. ఉదయం టైంలేకపోయింది."

సత్యమూర్తి మౌనంగా వుండి పోయాడు. మంచంమీద ఆడుకుంటున్న బాబు ప్రక్కన కూర్చున్నాడు.

పావుగంట తర్వాత టవల్ అందించి చెప్పింది ప్రియంవద.

"రండి"

సత్యమూర్తి యాంత్రికంగా టవల్ కట్టుకుని స్నానాల గదిలోకి వెళ్లాడు. పీటమీద కూర్చున్నాడు.

కుంకుడుకాయ రసంతో భర్తకి తలంటిపోస్తూ, కబుర్లుచెప్తూ, మధ్య మధ్యలో భర్త పెదవులని ముద్దుపెట్టు కుంటూ ఇరవై నిముషాలసేపు స్నానం చేయించింది.

తర్వాత లోపలకి తీసుకెళ్ళి పడ క్కుర్చీలో పడుకోబెట్టింది. సత్యమూర్తి మనసులో బాధ కొద్ది కొద్దిగా తగ్గుతోంది ప్రియంవద తనంటే చూపించే ఆప్యా యతకి, ఇష్టానికి.

కుంపటిలో నిప్పులువేసి తీసుకొచ్చి సాంబ్రాణీవేసి ఆ పొగని భర్త తడి తలకి తగిలేలా ఏర్పాటుచేసింది.

పౌడర్ భర్త వంటికి అద్ది బట్టలు తనే తొడిగింది ప్రియంవద.

తర్వాత తను భర్తపక్కన పడు కుంది. ముభావంగావున్న భర్తని తన వైపు తిప్పుకుని అతని ఛాతీమీదవున్న జుట్టుని పళ్ళతో మృదువుగా కొరుకు తూండి పోయింది కొద్దిసేపు.

"రాజూ. ఇవాళ నీ పుట్టినరోజు" అన్నది కొన్ని నిముషాల తర్వాత.

సత్యమూర్తి తన రెండు చేతులనీ భార్య వీపుమీద వేసాడు.

ప్రియంవద తన కుడిచేత్తో భర్త భుజాన్ని మృదువుగా రాస్తూండిపోయింది మౌనంగా.

"నామీద కోపం దేనికి రాజూ?" అడిగింది హఠాత్తుగా.

"నాకా? లేదే?" తడబడ్డాడు సత్య మూర్తి.

"మరెందుకలా వున్నావ్?"

"ఎలా వున్నాను?"

"ఇవాళ మనం హేపీగా వుండాలి. సంవత్సరాని కొక్కసారే వస్తుంది పుట్టినరోజు- తెలుసా?"

సత్యమూర్తి భార్యని గట్టిగా అదుము కున్నాడు, తనమీదకి లాక్కుని.

ప్రియంవద తన్మయత్వంతో కళ్లుమూసు కుంది. సత్యమూర్తి పాదాలకితడిగావున్న ప్రియంవద కుచ్చెళ్ళు తగులుతున్నాయి.

"ఆలస్యం అయిందేం?" అడిగాడు సత్యమూర్తి ప్రియంవదని ఇంకా గట్టిగా అదుముకుంటూ.

సమాధానం లేదు.

ఇంకాస్త గట్టిగా ప్రియంవద భర్తని చుట్టుకుపోయింది.

"రాజూ" అన్నది లాలనగా సత్య మూర్తి జుట్టుని వేళ్ళతో తడుముతూ.

తర్వాత భర్తని మాట్లాడనివ్వలేదు ప్రియంవద.

బాబు ఏడుపు వినపడింది గట్టిగా.

చటుక్కున ప్రియంవద భర్త చేతుల్లోంచి విడిపించుకుని బాబుదగ్గరకి వెళ్ళింది.

చిరాకుగా అన్నాడు సత్యమూర్తి.

"వీడొకడు మధ్యలో."

"దేనికి మీకు బాబును చూస్తే అంత అసూయ?" అడిగింది ప్రియంవద భర్త పక్కన కూర్చుంటూ.

"నీకు వాడంటేనే ఇష్టం నాకన్నా."

"బాబు ఏడిస్తే అలా వదిలేయాలా ఏడవనివ్వమని?" నవ్వుతూ అడిగింది.

"అవును."

"మీకు ఆకలేస్తే అన్నం పెట్టమని అడగరా మీరు? అలాగే వాడూ అడుగుతాడు. మాటలు రావు కాబట్టి ఏడుస్తాడు ఆకలేస్తోందని."

ఓ చేత్తో బాబుకు పాలు పడుతూ, మరో చేత్తో భర్త ఛాతీమీద జుట్టుని మృదువుగా దువ్వసాగింది ప్రియంవద.

భార్య మొహం వంక చూశాడు సత్యమూర్తి. నుదుటి మీద బొట్టు చెరిగి పోయింది తను దగ్గరికి తీసుకోవటంవల్ల.

సత్యమూర్తి కళ్ళల్లో కదులాడిన బాధని గమనించింది ప్రియంవద.

"రాజూ! దేనికి? ఇవ్వాళ నీ పుట్టిన రోజు. బాధ పడకు" అన్నది లాలనగా.

కొన్ని క్షణాలాగి అడిగింది చిలిపిగా నవ్వుతూ.

"నువ్వు చిన్నబాబువి ఇవాళ. అవునా!"

సత్యమూర్తి చిన్నగా నవ్వాడు.

భర్త బుగ్గని గిల్లి అన్నది.

"నిన్నివాళ చిన్నబాబుని చేస్తాను. నీ బాధ పోగొడతాను. మన బాబుకన్నా చిన్నబాబుని చేస్తాను ఇవాళ నిన్ను."

సత్యమూర్తి తలని తన ఒళ్ళోకి లాక్కుంది ప్రియంవద ఎంతో ఆప్యాయంగా.

సత్యమూర్తికి ప్రియంవద ఆ క్షణంలో తన మొదటి భార్య శ్రీవల్లిలా అనిపించింది. శ్రీవల్లి గుర్తుకు రావడంతో మనస్సంతా వికలమయి పోయింది వెంటనే.

అతి ప్రయత్నం మీద కళ్ళల్లో నీళ్లు తిరక్కుండా ఆపుకోగలిగాడు.,

ప్రియంవద భర్త మొహాన్ని ఆప్యాయంగా ముద్దు పెట్టుకుంది.

"ఏరా. నువ్వు మనబాబుకన్నా చిన్న పిల్లాడివి కదూ?" అడిగింది సత్యమూర్తిని.

సత్యమూర్తి బాధగా కళ్ళు మూసుకున్నాడు. చెవుల్లో శ్రీవల్లి కాలి పాదాల కుండే వెండి గజ్జెల చప్పుడు, బస్ స్టార్టయి దూరంగా పోతున్న చప్పుడు వినిపించాయి.

శ్రీవల్లి మొహం గుర్తుకు వచ్చింది. తన కూతురు—ఏడాదిన్నర కూతురు గుర్తుకు వచ్చింది.

"రాజూ! ఇవాళ అనవసరంగా బాధ పడకు నీవు. ఇవాళ నీ పుట్టిన రోజుగా! నేను నీకు ఇవాళ భార్య ప్రేమే కాదు, తల్లి ప్రేమ కూడా ఎలా వుంటుందో గుర్తు చేస్తాను" అన్నది ప్రియంవద.

సత్యమూర్తికి చాలా చాలా సంవత్సరాల క్రితం తన జీవితంలో శ్రీవల్లి సాన్నిధ్యంలో గడిపిన పుట్టినరోజు, ఆ మర్నాడు తన అక్కగారింటికి బయలు దేరడం మనసులో మెదిలాయి.

ప్రియంవద భర్త మొహాన్ని ఎంతో సున్నితంగా, ఎంతో లాలనగా తన ఛాతీకి అదుముకుంది, చేత్తో అతని జుట్టుని సవరిస్తూ.

5

"ఏదో గమ్మత్తు చూపిస్తానన్నావు?" అడిగాడు సత్యమూర్తి శ్రీవల్లిని.

"మీ పుట్టిన రోజుకి బహుమతిగా ఓ అద్భుత దృశ్యం తయారు చేశాను."

"ఏమిటబ్బా అది?" ఆలోచనగా అడుగుతున్నట్లు నటిస్తూ అడిగాడు శ్రీవల్లిని.

"రండి."

చెయ్యి పట్టుకుని వంట గదిలోంచి బయట ఖాళీస్థలంలోకి తీసుకెళ్ళింది. కాంపౌండ్ గోడ పక్కన ఓమూల చిన్న మడివేసి వుంది.

"చూడండి."

గర్వంగా చూపించింది శ్రీవల్లి ఆ మడి వంక.

నల్లటి మట్టి. నాలుగడుగుల పొడవు, రెండడుగుల వెడల్పు గల ఆ మడికి చిన్న గట్టు కట్టివుంది. ఆ గట్టుమీద నాచుమొక్కలు పాతి వున్నాయి. ఆ నాచు మొక్కలకి ఎర్రటి చిన్న చిన్న పువ్వులు పూసి అందంగా ఆ మడికి డిజైన్‌లా అమరి వున్నాయి.

ఆ డిజైన్‌లోపల పేర్లువ్రాసివున్నయి. సత్యమూర్తి పేరు, శ్రీవల్లి పేరు, వారి కూతురిపేరు వ్రాసివున్నాయి.

మామూలుగా వ్రాసి లేవు.

వాళ్ళ పేర్లు చిన్న చిన్న మొక్కలతో వ్రాసివున్నాయి.

కొత్తిమీర మొక్కలవి.

ముందర పేర్లువ్రాసి, ఆ వ్రాసిన పేరమీద ధనియాలు పాతిపెట్టి, రోజూ నీళ్ళుపోయడంవల్ల, ధనియాలోలంచి మొలుచుకువచ్చిన కొత్తిమీర మొక్కలన్నీ కలసి అక్షరాలుగా స్పష్టంగా కనిపిస్తున్నాయి వత్తుగా.

సత్యమూర్తి ఆ పేర్లవంక చూసాడు కొద్దిగా ఆశ్చర్యంగా, సంతోషంగా.

సత్యమూర్తి + శ్రీవల్లి = సత్యవల్లి అన్న అక్షరాలు కనబడేలాగా పెరిగాయి కొత్తిమీర మొక్కలు ఆ మడిలో.

"పదిరోజులనుండి పెంచుతున్నాను వీటిని. మీరు ఈరోజుదాకా వీటిని చూడ కూడదని అనుకున్నాను. ఇటువైపురారు కాబట్టి చూడలేదు. బాగుందికదా?" అడిగింది శ్రీవల్లి.

"చాలా బావుంది"

"మన పెళ్ళయాక వచ్చిన మూడో పుట్టినరోజు మీది. ఇవాళ లైబ్రరీకి వెళతానంటే వప్పుకోను."

"వెళ్ళను. నిన్ననే శెలవ్ చీటీ ఇచ్చాను."

"తలంటిపోసుకుని ఏదయినా గుడికి వెళ్ళి, ఇంటికివచ్చి భోజనంచేసి మేట్నీకి సినిమాకు వెళదాం."

"నీ ఇష్టం."

మరోసారి ఆ అక్షరాలవంక చూసాడు సత్యమూర్తి. అప్పుడే వుదయించిన సూర్యుడి లేత కిరణాలుపడి పచ్చటి కొత్తిమీర ఆకులు మెరుస్తున్నాయి.

"చిన్నప్పుడు మా ఇంట్లో ఇలా మా పేర్లు వ్రాసుకునేవాళ్ళం. అప్పుడే అనుకునేదాన్ని పెద్దయ్యాక నా పేరు, భర్తపేరు కలసి రాయాలని. కిందటి సంవత్సరం గుర్తుంది కాని పాపకి ఇంకా పేరు పెట్టలేదు కాబట్టి వ్రాయలేదు."

(సశేషము)

పలురంగాలలో ఆంధ్ర ప్రముఖులు

శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో జన్మించిన శ్రీ వజ్రపు రఘునాధరావు గుప్త చిన్న తనం నుంచే చదువులో చురుకుతనం కలిగినవారు. బి.ఎస్‌సి., డిగ్రీ (ఆంధ్రా యూనివర్శిటీ 'ఫస్ట్' రాంక్) తర్వాత మద్రాసు యూనివర్శిటీలో కెమికల్ ఇంజనీరింగ్ చేశారీయన. ఎరువుల కర్మాగారాలలో ఇంజనీరుగా అపారానుభవం సంపాదించిన ఈయన ప్రస్తుతం మద్రాసు ఫెర్టిలైజర్స్ లిమిటెడ్‌కి ప్లాంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. అంతకుముందు ఫెర్టిలైజర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో కొన్నాళ్ళు, ఐ.ఐ.టి. (ఖరగ్‌పూర్)లో కెమికల్ ఇంజనీరుగా కొన్నాళ్ళు పనిచేశారీయన శ్రీ గుప్తకు మాతృభాష తెలుగుగాక ఇంకా ఇంగ్లీషు, హిందీ, తమిళం, ఒరియా, బెంగాలీ భాషలలో కూడా మంచి ప్రవేశంవుంది.

భారతదేశంలోనేగాక, యూరోప్, హాలండ్, జర్మనీ, అమెరికా, ఫ్రాన్స్, జపాన్, హాంగ్ కాంగ్, సింగపూర్ మొదలైన ప్రదేశాలలో విస్తారంగా పర్యటించారీయన "యాత్రలవల్ల కొత్త పరిచయాలు లభిస్తాయి. మనకు తెలియని ఎన్నో ఆచారాలు, పద్ధతులు, రకరకాల వ్యక్తుల మనస్తత్వాలు అర్థం చేసుకొనే అవకాశం లభిస్తుంది. నిజంగా యాత్రలు ఒక రకమైన ఎడ్యుకేషన్ లాంటివి" అంటారీయన. పారిశ్రామిక పరంగా తక్కువమంది పని వారితో సమర్థవంతమైన పనిని నిర్వహిస్తూ, పనివారికి చక్కటి సౌకర్యాలు కలుగ జేయడం మంచిదని అభిప్రాయ పడుతున్నారీయన.

"గ్రామాలలో మంచి సౌకర్యాలు (రవాణా, కమ్యూనికేషన్లు, వైద్య సౌకర్యాలు, విద్యా సౌకర్యాలు మొ॥) ఏర్పరచ గలిగినప్పుడు పట్టణాలపై ఒత్తిడి తగ్గే అవకాశముంది" అన్నారీయన అధిక సంఖ్యలో పల్లెలనుంచీ పట్టణాలకు తరలి వస్తున్న యువకుల గురించీ, శ్రామికుల గురించి చర్చిస్తూ. "చిన్న తరహా పరిశ్రమలు గ్రామాలలో అభివృద్ధి చేయడంవల్ల నిరుద్యోగ సమస్యతోపాటు, పట్టణాలపై వత్తిడి సమస్యకూడా పరిష్కా[illegible]" అని ఈయన భావిస్తున్నారు.




శ్రీ గుప్త

సాటి ఆంధ్రులగురించి తన అభిప్రాయంగా "మన వారికి తెలివికీ, శక్తికీ లోటులేదు. అయితే అవసరమైనంత (ముఖ్యంగా ఉద్యోగాల విషయంలో) సీరియస్‌నెస్ లేనందువల్ల, వారు చూపిస్తున్న ఉదాసీన భావంవల్ల ఎన్నో అవకాశాలు పోగొట్టు కొంటున్నారని నా అభిప్రాయం" అన్నారీయన.

జీవితంలో నిజమైన బాధ్యతలు చేపట్టటానికి సమాయత్తమయే యువకులకు తన సలహాగా "ఖచ్చితమైన గమ్యం నిర్ణయించుకోండి. దూరదృష్టితో మీ గమ్యాన్నెన్నుకోండి. ఆ గమ్యం చేరేందుకు చేయవలసిన కృషిలో ఏమాత్రం అశ్రద్ధ చూపించవద్దు. సాహసంతో పాటు సద్దుకు పోగలిగిన గుణాన్నికూడా కలిగివుండటం మీ విజయ యాత్రను సులభం చేస్తుంది" అని చెప్పారీయన.

యువకులుగావున్న దశలో ఒకే రకమైన పనిలో ఒకే సంస్థలో వుండటంకన్న, కొత్త సంస్థ, కొత్తరకం పని, కొత్త సమస్యలు వీటన్నిటినీ సమకూర్చుకొని ఉత్సాహంతో వాటిని పరిష్కరించుకొంటూ పోగలగటం మంచిది అంటారీయన. అలా అంటున్నప్పుడు యాభై సంవత్సరాల శ్రీ గుప్త కంటిలో కనిపించిన మెరుపు వయసు పాతికదాటిందా అనిపించేలావుంది.

శ్రీశ్రీ నిర్వహించు పదబంధ ప్రహేళిక



ఆధారాలు

మే '78

అడ్డం

1. అనంతరపు
4. పెద్దసైజు భూతం
7. పొట్టి చెట్టు
8. అచ్చ తెలుగు గ్రహం
10. తలపైనా, కోటలోనా
11. ఇచ్ఛ
13. 8లో ఒకటి
14. చే—
15. 4, లేక 8, లేక 10.
16. లేనిది
18. ల్
21. దీవించకు
22. ఇది పోతన కవికి ఇష్టం
24. భారతంలో దుష్టులు.
25. ఇవికాని సినిమా పత్రికలు లేవు.

నిలువు

1. శిరచ్ఛేదం?
2. వంక
3. కన్నప్ప
4. పరిహరించినా అపరిమితం.
5. ఈ కారం చమత్కారం.
6. ఊరి పేరు.
9. లక్షణం (కవులకి నియంతలకీ)
10. చెట్టబట్టినది.
12. 3000
15. రాగం లాగడం
17. రాలేని నర్తకి చేసేవి.
19. కత్తి
20. ఉదాహరణకు ద్వయ
22. తొడుక్కోవలె
23. ఈతం ఇప్పటి కర్మకాదు.

ఏప్రిల్ పదబంధ ప్రహేళికకు సమాధానం :

అడ్డం: 1. కావ్యారంభం 4. మదాలస 7. భగవద్గీత 8. లేకా 10. పని 11. అమళ్ళా 13. ఏరిని 14. బాసాడి 15. గాంధారి 16. కాణాచి 18. డీలు 21. యవ 22. అలకాపురం 24. కిరణాలు 25. లకుముకి.

నిలువు: 1. కాకాలేల 2. రంభ 3. భంగము 4. మద్గీతి 5. దాత 6. సన్యాసిని 9. కామ క్రోధాలు 10. పరిత్రాణాయ 12. వసారా 15. గాండీవికి 17. చివరికి 19. వెలలు 20. విపుల 22. అణా 23. రంకు.

నిబంధనలు గమనించండి!

పదబంధ ప్రహేళిక కొట్టివేతలు, దిద్దుబాట్లూ లేకుండా పూర్తిచేసి మే 1 తేదిలోపు మాకు చేరునట్లు పంపండి. తెల్లకాగితంమీద గళ్ళుగీసి పూర్తిచేసి పంపిన ఎంట్రీలు చెల్లవు. ఎంట్రీలు పంపువారు వారి పూర్తి చిరునామా ఎంట్రీపైనే రాసి పంపాలి. ఆల్ కరెక్ట్ ఎంట్రీకి రు. 50/- బహుమతి. ఒకటికి మించి ఆల్ కరెక్ట్ ఎంట్రీ వొచ్చినపుడు బహుమతి సొమ్ము విజేతలకు సమానంగా పంచబడుతుంది. ఆల్ కరెక్ట్ ఎంట్రీ ఒకటీ రాకపోతే బహుమతి సొమ్ము పైనెల బహుమతి సొమ్ముకు కలిపి అందజేయబడుతుంది.

ఏప్రిల్ పదబంధ ప్రహేళిక విజేతలు ·

నల్గొండనుంచి 1. ఆర్. శ్రీమన్నారాయణ శర్మ, 2. ఎన్. కె. రామారావు; హైదరాబాదు నుంచి 3. జె. విద్యాసాగర్, 4. వై. పి. పార్థసారధి, 5. ఎస్. ప్రశాంతి, 6. కె. పద్మావతి, 7. ఎమ్. భాస్కరరావు, 8. టి. తాతారావు, 9. డి. విజయలక్ష్మి, 10. పి. పద్మావతి, 11. టి. శివకుమార్, 12. టి. జానకి, 13. డి. బాబ్జీ, 14. ఆర్. బి. శాస్త్రి; 15. వి. వెంకట రాజు (కాకినాడ), 16. డి. సుబ్బారావు (రాజమండ్రి), 17. బి.బి.ఆర్. కృష్ణమూర్తి (శ్రీకాకుళం) 18. సి. హెచ్. రంగారావు (అలగడప), 19. టి. వేణుగోపాల్ (బరంపురం), 20. పి. వెంకట రత్నం (గుంటూరు), 21. కె. ఎస్. ఎస్. కుమార్ (రాజమండ్రి), 22. వి. గోపాలకృష్ణ (మద్రాసు), 23. జి. వి. రమణమూర్తి (విశాఖపట్టణం). వీరందరికీ మే నెల జ్యోతి కాపీ పంపిస్తున్నాము.

బోగణి

సినిమా




'విచిత్ర జీవితం'లో వాణిశ్రీ




'ప్రేమ-పగ'లో బాలయ్య, సావిత్రి



'మంచి బాబాయ్'లో [illegible]



'అమరదీపం' రజతోత్సవ వేడుకలలో అక్కినేనినుంచి షీల్డు అందుకుంటున్న కృష్ణంరాజు



చాలాకాలంగా లక్ష్మీఫిలింస్ హైదరాబాదుశాఖ అధిపతిగా ఉన్న శ్రీహరికృష్ణ, శ్రీలక్ష్మీచిత్ర పేరిట సొంత డిస్ట్రిబ్యూషన్ సంస్థను స్థాపించారు. ఆ సంస్థ ప్రారంభోత్సవ సమయంలో లక్ష్మీఫిలింస్ అధినేత

[illegible]




'కాలాంతకులు'లో శోభన్ బాబు, జయసుధ



'చెప్పింది చేస్తా'లో కృష్ణ



'నవి-నీమలు'లో ఒక దృశ్యం



దర్శకనిర్మాత ఏ. విశ్వేశ్వరరావు 'తీర్పు' చిత్రం తర్వాత ఆ చిత్రాన్ని కొనసాగిస్తూ తొలి తెలుగు సీరియల్ చిత్రంగా నిర్మించిన 'మార్పు'లో బోసుబాబు, రూప.



'ఖైదీ నెం 77'లో దీప, మురళీమోహన్



'జగన్మోహిని'లో జయమాలిని, నర్సింహరాజు



[illegible]'లో మురళీమోహన్, ప్రభ

సినిమా తయారైంది!

మద్రాసు పాండీబజార్లో ఒక హోటల్ సినిమా పరిశ్రమకు చెందిన ఎంతోమంది వ్యక్తుల కలయికకు వేదిక. ఆ హోటల్లో ఒక టేబిల్ చుట్టూ కూర్చుని ఉన్నారు అయిదు గురు సినిమా జీవులు. ఒకాయన (కాబోయే) దర్శకుడు. మరొకాయన (కాబోయే) రచయిత. ఇంకొక వ్యక్తి హీరో (కావాలనుకొంటున్న వాడు). మరిద్దరు ప్రొడ్యూసర్లు(!).

దర్శకుడు కొనసాగించాడు సంభాషణ " మనం వారం రోజులపాటు ధవళేశ్వరం ఆనకట్టదగ్గర షూట్ చేసేసి ఆ పిమ్మట రాజ-మండ్రిగాని, గోదావరిగాని స్టేషన్లో కొంత, రిచ్‌నెస్‌కోసం పంచవటిలో కొంత చిత్రం తీద్దాము. అక్కడంతా మనకు తెలిసినవాళ్లే. ఖర్చులు చాలా కలిసొస్తాయి"

ప్రొడ్యూసర్లలో ఒకాయన కళ్లు మెరిశాయి సిగిరెట్టంటించాడు. చార్మినార్ (వెధవది చార్మినార్ అలవాటయితే మరొకటి పీల్చాలని పించదండీ' అంటాడాయన)

దర్శకుడినుంచి చిత్రనిర్మాణ పథక వివరణ రచయిత అందుకొన్నాడు "మనం ముందను కొన్న నాలుగు సీన్లు చాలండీ బొమ్మ వంద రోజులు దాటడానికి. హీరోగారి బట్టలుమాత్రం ఖరీదైనవే అనిపించాలి. నాకు తెలిసిన షాపు ఉంది మెరిసిపోతుంటాయి బట్టలు. మీటరు పదికి మించి ఉండదు. తెరమీద చూస్తే వందకు తక్కువనిపించదు''

రెండో నిర్మాత కళ్లు మిలమిలలాడాయి. సిగిరెట్‌కోసం జేబు తడుముకొని అక్కడ లేకపోవడంతో టేబిల్ మీదున్న మొ. ని. చార్మినార్ పెట్టె అందుకొన్నాడు.

హీరో మౌనంగా ఉన్నాడు. కొంచెంగా నలిగిన పాంటును సరిచేసుకొన్నాడు. కొద్దిగా చెదిరిన తలను సర్దుకొనే నెపంతో మరి కొంత చెడుపుకొన్నాడు.

బడ్జెట్లో-బాక్సాఫీసు బద్దలుకొట్టే ఒక సంచ లన చిత్రానికి పథకం తయారౌతోందక్కడ. ఆ పథకానికి కుడుకుదనం వచ్చేందుకు రెండుసార్లు టీలు తాగారందరూ. ఉన్నవరకు సిగిరెట్లూ కాల్చారు. చివరకు ఒకలక్ష ఇరవై వేలమూడు వందల రూపాయల డబ్బైయారు పైసలకు 'ఫస్ట్ ప్రింట్' తయారైపోయేలా తయారయింది పథకం.

అందరు ఒకరినొకరు తృప్తిగా చూసు కొన్నారు, బిల్లొచ్చింది. మొత్తం ఒకరూపాయి అరవై పైసలు. బిల్లుని నెమ్మదిగా హీరో వైపు జరిపాడు దర్శకుడు. హీరో కొంచెం ఇంగారుగా చూసి, "గురువుగారూ మనియార్డరు రాలేదు'' అన్నాడు.

దర్శకునితో సహా అందరూ తెల్లమొఖాలు వేశారు. నెమ్మదిగా తేరుకొని అందరి దగ్గర డబ్బులు కలిపి బిల్లు చెల్లించారు. ఎవరిళ్ళకు వాళ్లు నడుచుకొంటూ, పక్కనే పోతున్న టాక్సీలనూ, ఆటోలనూ, రిక్షాలనూ, సిటీ బస్సు లనూ 'న్యూసెన్స్' అని తిట్టుకొంటూ వెళ్లి పోయారు.

—యస్వీనారాయణ

ఉత్తరాలు

(భార్యలనుంచి భర్తలకు)

డాక్టరుగారి భార్య

డాక్టరుగార్కి, మదనపల్లి.

దయచేసి ప్రిస్క్రిప్షనుకాగితాలమీద భార్యకు ఉత్తరాలు రాసే దురలవాటు మానుకోండి. సుగంధ పరిమళాలు వెదజిమ్మే ప్రేమలేఖల కెలాగూ నేను నోచుకోలేదు. కనీసం సర్కారు వారి ఇన్‌లాండు లెటరయినా వాడండి. ఆ ప్రిస్క్రిప్షను కాగితంమీద ఉత్తరం చదువుతూంటే నేను రోగినేమో నన్నంత ఇబ్బంది ఫీలవుతున్నాను. మీరు ఎప్పుడు వస్తారు? నన్ను ఆరోగ్యం కాపాడుకోవటానికి రోజుకో ఏపిల్ తినమన్నారు. రోజుకో ఏపిలు తింటే డాక్టర్ని దూరంగా ఉంచవచ్చన్న సూక్తి మీరు వినలేదా? కనుక అది పాటించి మీకు దూరంగా ఉండలేను. మీ రైటింగు అర్థంకాక మన



కంపౌండరుకిస్తే ఏవో రెండు టానిక్ సీసాలు, టాబ్లెట్లూ డిస్పెన్సరీనుంచి పంపించాడు.

మీ దృష్టిలో రోగిష్టిఅయిన
మీ భార్య
ఎల్కోసిస్ లాంటి సుహాసిన్

ప్రొఫెసరుగారి భార్య

అయ్యా! యూనివర్సిటీ కాంపెస్.

[illegible] ఇంక మారుట కష్టసాధ్యమా! రోజుకీ మీకు పరాకెక్కువై పోతోందే కాని తగ్గటంలేదు. ఉత్తరంలో నన్ను అహల్యా అంటూ సంబోధించావు. నా పేరు అనసూయ. మీ రెండవ భార్యను. అహల్య మీ మొదటి భార్య. జననం 1933 మరణం 1975. ఓ హిస్టరీ ప్రొఫెసరుగారూ అలెగ్జాండరు, అశోకుడితో పాటు అహల్య ఇంక గుర్తుండనక్కరలేదు. అనసూయ గుర్తుంటే చాలు. ఇంట్లో కుడి కాలి ఎర్రబూటూ, ఎడమకాలి నల్లబూటూ ఉన్నాయి. వీటిగురించైనా ఇంటికి త్వరగారండి. పోనీ అహల్య అని రాసినా నాకనుకుని సరి పెట్టుకుని చదువుదామంటే ఆ దిక్కుమాలిన ఉత్తరం నిండా పానిపట్టు యుద్ధము, రెండవ పులకేశి, ఇబ్రహింలోడీ ఇదీ అదీ అంటూ ఏమేమిటో రాశారు. మీ అమ్మగారు చెప్తూంటారు. మీ నాన్నగారు కూడా ఇలాగే ఉండేవారని. నా పుట్టినరోజు 28 సెప్టెంబరు 1977 (క్రీస్తు మరణానంతరం). కనుక ఆ రోజుకి విచ్చేస్తారని ఆశిస్తున్నా.

మీ
అనసూయ

ఇంజనీరుగారి భార్య

రావ్ డియర్, నాగార్జునసాగర్ డాం,

మీరు ఉన్నప్పుడు జీవితం మెకానికల్‌గా ఉండేది. ఇప్పుడు మనసుకి ప్రశాంతిగా ఉంది. ఇక్కడ ఉదయం టెంపరేచర్ 35 డిగ్రీ సెలిసియస్, రాత్రిపూట 20 డిగ్రీలు. మొన్న శుక్రవారం రాత్రి 8 మిల్లీమీటర్ల వర్షం పడింది. మీరు కారుని ఆ రోజున రోడ్డువారనే సరళరేఖ మార్గంలో తీసుకువెళ్ళారని ఆశిస్తున్నాను (టర్నింగ్స్ మినహా). మీ అబ్బాయి రేడియో, ఫేను ఇవన్నీ విప్పేసి తిరిగి బిగిస్తున్నాడు. మీ అమ్మాయి పెరటి గార్డెనులో వృత్తాలు, స్క్వేర్లు మొదలైన షేపులలో మొక్కలు వేయిస్తోంది. మీ ఉత్తరం రెయిను పోస్పుడు సిమెంటు కాంక్రీటంత బలం చేకూరు



నా స్తుందికు. చూశారా మీ తర్ఫీదులో నేను ఎలా వాగేస్తున్నానో.

మీరు లేక పిల్లలు డీలా పడిపోయారు. మీరుంటే వాళ్ళకు కబుర్లూ, పాఠాలు చెపుతూ యెన్నో అనేవారు. ఏసుక్రీస్తు గురించి మాట్లాడుతూ క్రీస్తుకి వేసిన బోల్టు సైజెంత అన్నారు. భారతంలో భీముడి గద వెయిటెంత, ఏ ఎల్లాయ్‌తో చేశారు అని మీలోమీరే ప్రశ్నించుకునేవారు. అలాగే కర్ణుడి రథచక్రం వ్యాసార్థం, రాముడు వారిధికోసం వేసిన రాళ్ళ డెన్సిటీ, ఏడు తాడిచెట్ల ఖండన సమయంలో రాముని బాణ గమన వేగం ఏమేమిటో పిచ్చి పిచ్చిగా పచ్చి పచ్చిగా పైత్యంగా మాట్లాడేవారు. ఆ మాటలు లోపించడంవల్ల కొంచెం వెలితిగానే ఉంది. కనుక వెంటనే రండి.

మీ

కావేరి

అంపైర్ భార్య

డియర్ రాజాశాండో, అమృతసర్,

క్షేమంగా చేరా. ఇంటి తగాదాల్లో అంపైర్‌గా వ్యవహరించనని నాకు మాటివ్వాలి. నువ్వు ఆటస్థలంలోనే అంపైర్‌వి. ఇంట్లోమట్టుకు కాదు. మీ అమ్మగారు నేనూ దెబ్బలాడుకుంటుంటే పిజిల్ పుచ్చుపని మా మధ్య కెగిరి విజిల్ ఊది ఫౌల్ ఇదీ అదీ అనడం సబబు కాదు. ఏమిటి అనుకుంటున్నావ్? ఆడవాళ్ళం మేము ఏదో తగూలాడుకుంటాం. మగవాడెవడేనా అది చూసి చల్లగా బయటికి జారుకుంటాడు, ప్రతి విషయంలోనూ నన్ను కొట్టిపారేసే మీ అమ్మగారు ఈ విషయంలో పూర్తిగా నాతో ఏకీభవించారు. దెబ్బలాడుకోడం తరువాత ముచ్చటలాడుకోడం మాకు పరిపాటే. తరువాత మేమిద్దరం కలిసిపోవడం నువు చూడలేదా. దయచేసి ఇంకెప్పుడు మా



మధ్యని జొరబడనని నాకు నువ్వు మాటివ్వాలి.

ఇట్లు

నీ బాలి

లాయరుగారి భార్య

ముద్దాయి భర్తగారికి, కాకినాడ,

ఇది నా హృదయపు ఆజ్ఞానుసారము జారీ చేసిన నోటీసు.

సదరు భర్త అయిన సూర్యారావుగారు ది సోమవారం 25 జూలై 1977 సం॥న బెంగు



ళూరు వెడుతూ వాగ్వివాదములో అక్షరములా

మూడువందల రూపాయల ఏలువగల బెంగుళూరు పట్టుచీర తెచ్చెదనని వాగ్దానమిచ్చి యుంటిరి గాన తదనంతరమున మీరు అచ్చట నుండి వ్రాసిన ఉత్తరములలో వాటి ప్రసక్తి లేదు. ఒకవేళ అటువంటి సంఘటన జరగ లేదని బుకాయిద్దామనుకుంటున్నారేమో! మీ భార్యగా మీ సాహచర్యంలో, ఆ సుముహూర్తాన మీరు ఆడిన మాటలు మన టేపురికార్డరు ద్వారా టేపు చేయడమైనది. అవి అవసర మయిన కోర్టులో దాఖలు పరచగలను.

మీరు వెడుతూ నన్నూ, మా తల్లిదండ్రులనూ దుర్భాషలాడి వెళ్ళారు. అందుకు నష్ట పరిహారంగా చీరతోబాటు 22 క్యారట్ల రెండు బంగారు గాజులుకూడా జతపర్చనిచో మీరు రామారావుపేటలో గల 24-17-74 గృహ ప్రాంగణమువ కాలిడలేరు.

ఇట్లు
మీ భాగస్వామి
షీలా

తెలుగుమాష్టారి భార్య

అగ్రహారం,

భవదీయులైన పతిదేవులకు ప్రణామంబు లాచరించి తమ ప్రియ సతి వ్రాయు ప్రణయ లేఖ.

మీ లేఖ కాళిదాసు మేఘసందేశంబునుం బోలియున్నది. తదీయ లేఖలో పొగడచెట్టును వర్ణించి యుంటిరి. కాని మన గృహప్రాంగ ణంబున అట్టి వృక్షరాజమ్ము గానరాకున్నది. మీరు లేని లోటు కనపడకనే కన్పించు చున్నది. ప్రసక్తాను ప్రసక్తంబుగా 'భువన వంద్యను రుక్మిణి బొగడుచుందు, కట కటా యారకూట కటకంబు రుచించు నో కాక యెక్కడన్, గోవులలోపల గపిల బహుక్షీర, జరాసంధుడు రాజులచేత గప్పంబు గొనియె,



రామకృష్ణులు సాందీపునికో వేదంబులు జదివె మొదలగు సమాస పదజాలమ్ములు అను నిత్యము పారాయణ సల్పి, మదీయ కర్ణాంత రంబులలో తుమ్మెదవలె రొద సల్పెడివారు. అట్టి శ్రవణానందకరంబగు పల్కులను వినెడి భాగ్యము గతి తప్పుట గాంచి మదీయ మనం బించుక చింతిలుచున్నది.

త్వదీయాంక తలాశ్రయంబునకు, గాఢోప గూహనంబునకు నా మనము కుతకుత యుడుకు చున్నది. అక్కటా చంద్రుడు యెంత దయ మాలినవాడు విరహిణి నగు నన్ను వేధించుట న్యాయమా?

తమ పాదదాసి,
అభిసారిక,
సుమలత.

[గమనిక: అన్ని ఉత్తరాలకు వ్యంగ్య చిత్రాలు గీయవలసివున్నా ప్రొఫెసరుగారి విషయంలో మేమూ 'ఆబ్సెంట్ మైండెడ్' ఐపోయాము. —ఎడిటర్]

Edited&Published by V. Leelavathy Raghavaiah, at 17B Rajaram Colony Kodambakkam,Madras-600024,& Printed by D.Hanumantha Rao,at Kranti Press, 12, Francis Joseph Street, Madras-600001.